www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ సిటీ*

బుధవారం | 7-2-2018 | పేజీలు: 20 + 16 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 208 |

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి ఉ. 8.45 తదుపరి అష్టమి; నక్షత్రం: స్వాతి మ. 12.16 తదుపరి విశాఖ; వర్జ్యం: సా. 6.21-8.05; దుర్ముహూర్తం: మ. 12.07-12.53; అమృతఘడియలు: తె. 4.46-6.31; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.10

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం


ఈ ఊరును అమ్ముకుంటాం!



మాకు అనుమతినివ్వండి

రాష్ట్ర సర్కారుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ లేఖ

అది హైదరాబాద్ నగర శివార్లలోని శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామం. గ్రామ జనాభా మూడు వేల వరకు ఉంటుంది. ఈ ఊరిని అమ్ముకుంటామని, అందుకు అనుమతించాలంటూ ఒక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నుంచి ఇటీవల రాష్ట్ర సర్కారుకు లేఖ వచ్చింది. ఊరు మొత్తాన్నీ అమ్ముకోవడం ఏమిటని ఆరా తీస్తే, భారీ భూ కుంభకోణం బయటపడింది. కొందరు ఘనులు కొత్వాల్‌గూడను తాకట్టు పెట్టి రూ.332 కోట్లు నొక్కేశారు! ఊరిని తాకట్టు పెట్టిన వాళ్లెవరికీ తెలంగాణతో సంబంధం లేదు! వాళ్ల కంపెనీ గోవాది అయితే.. వాళ్లంతా ఢిల్లీ, గోవా, మహారాష్ట్రకు చెందినవాళ్లు! తెలంగాణలో ఓ సబ్ రిజిస్ట్రార్‌ను, మరో వ్యక్తిని అడ్డం పెట్టుకుని ఘరానా మోసానికి తెర తీశారు. కొత్వాల్‌గూడలోని గ్రామ కంఠం సహా గ్రామంలోని 1,820 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను తనఖా పెట్టేశారు. ఇంతకీ.. ఇక్కడ మోసపోయింది ఎవరో తెలుసా!? కేంద్ర వాణిజ్య శాఖలోని ప్రభుత్వరంగ సంస్థ పీఈసీ లిమిటెడ్! 2014లో ఎన్నికల హడావుడి తారస్థాయిలో ఉన్నప్పుడు జరిగిన దందా ఇది!



కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పీఈసీ లిమిటెడ్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖ.

రుణం కోసం భారీ భూ కుంభకోణం

కొత్వాల్‌గూడ గ్రామమంతా తాకట్టు

గోవాకు చెందిన పైసీస్ మాయాజాలం

- 1,820 ఎకరాల ప్రభుత్వ భూమితో దందా
- గుడ్డిగా 332 కోట్ల రుణమిచ్చిన పీఈసీ
- ఇది కేంద్ర వాణిజ్య శాఖలోని విభాగం
- వడ్డీతో కలిసి రూ.650 కోట్లకుపైనే
- భూములు అమ్మేందుకు సిద్ధమైన పీఈసీ
- అభ్యంతరాలు తెలపాలని రాష్ట్రానికి లేఖ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

గోవా కేంద్రంగా పనిచేసే పైసీస్ ఎగ్జిమ్ ఇండియా లిమిటెడ్ 2009 నవంబరులో లక్ష రూపాయల పెట్టుబడితో మైనింగ్, లాజిస్టిక్స్, స్టీల్ మాన్యుఫ్యాక్చరింగ్, ట్రేడింగ్ వ్యాపారాన్ని ప్రారంభించింది. ప్రవీణ్‌కుమార్ శ్యామ్‌లాల్ రాథోడ్, శంతన్ శర్మ, సౌమిత్ రంజన్,

మిగతా 11వ పేజీలో...



12

సుప్రీం చెత్తబుట్ట కాదు

- మేం చెత్త ఏరే వాళ్లం కాదు
- మీరు చేసిన చట్టాలనే రాష్ట్రాలు పట్టించుకోవట్లేదు
- అలాంటప్పుడు వాటిని ఉపసంహరించుకోండి
- కేంద్రానికి సుప్రీం తలంటు



14

మాల్దీవుల సుప్రీం సీజే అరెస్టు

- మరో న్యాయమూర్తి కూడా
- ఎమర్జెన్సీతో మరింత ముదిరిన రాజకీయ సంక్షోభం
- సైన్యంతో రండి.. మమ్మల్ని రక్షించండి
- భారత్‌ను కోరిన మాజీ నేత



2

కానిస్టేబుల్ సందీప్ ఆత్మహత్య

- వివాహేతర సంబంధం కేసులో విచారణ
- మీడియాలో వార్తలు, సస్పెన్షన్‌తో మనస్తాపం
- రైలు కిందపడి బలవన్మరణం

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే ఎఫ్‌ఐఆర్ నమోదు

12

పోలీసు వెబ్‌సైట్లో అందుబాటు

చిన్నారిది నరబలే

- 'భవనంపై తల' కేసులో వీడిన మిస్టరీ
- ఇంటి యజమానే హంతకుడు!
- భార్య ఆరోగ్యం కోసం ఘాతుకం
- గ్రహణం రోజు అత్తతో కలిసి పూజలు
- కరీంనగర్‌లో పసికందు కొనుగోలు!
- మంత్రగాడు, ముగ్గురు మహిళలు సహా ఆరుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భార్య అంటే అతనికి అంతులేని ప్రేమ! ఆ ప్రేమే అతడిని ఉన్మాదిని చేసింది! దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు స్వస్థత చేకూర్చేందుకు ఎవరో చెప్పిన మాటలు నమ్మి ఉన్మాదిగా మారాడు! భార్య ఆరోగ్యం కోసం తన అత్తతో కలిసి ఓ శిశువు నిండు ప్రాణాలను నిర్దాక్షిణ్యంగా బలిగొన్నాడు. కొందరు మంత్రగాళ్లతో కలిసి బోసినవ్వులు చిందిస్తున్న శిశువు తలను నరికాడు! హైదరాబాద్‌లో ఓ భవనం మీద శిశువు తల లభ్యమైన కేసులో మిస్టరీ వీడింది. ఈ ఘటనలో

మిగతా 2వ పేజీలో...

ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనాలి

నిజామాబాద్ జిల్లాలో రైతుల ధర్నా, రాస్తారోకో

8



నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కాలుష్య గోదారి

- పారిశ్రామిక వ్యర్థాలు నదిలోకే
- బొగ్గుబావుల దుమ్మూ దానిలోకే
- పవర్ ప్లాంట్ల నుంచి మునిసిపాలిటీల వరకు వ్యర్థాలకు నిలయం గోదావరే
- చెత్తాచెదారం, ఆస్పత్రి వ్యర్థాలూ అందులోనే
- వీటికితోడు విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు
- గోదావరి తలాపునే నీటి కొరత.. కాలుష్యం

మంచిర్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి జీవనది! ఏ ప్రాంత ప్రగతికైనా జీవనాడి! గోదావరి నీరుంటే సంపద ఉన్నట్టే! సాగు నీటికి లోటుండదు! తాగునీటికి కరువుండదు! పైరు మాత్రమే కాదు.. బతుకు కూడా పచ్చగానే ఉంటుంది! అటువంటి గోదావరిని సర్వనాశనం చేసేస్తున్నారు! కాలుష్య కాసారంలా మార్చేస్తున్నారు! రసాయన, పారిశ్రామిక వ్యర్థాలతో నింపేస్తున్నారు! ఇసుక తవ్వకాలతో గోదావరి గుండెను పిండేస్తున్నారు! ఫలితం, గోదావరి తలాపునే ఉన్నా.. నీటి కొరత! కాలుష్యం! తెలంగాణలోని మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి

మిగతా 8వ పేజీలో...



10 లక్షల కోట్ల సంపద ఆవిరి

- 6 రోజులుగా మార్కెట్‌లో బీభత్సం
- వాల్‌స్ట్రీట్ దెబ్బకు కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు
- దలాల్ స్ట్రీట్‌లోనూ పెను ప్రకంపనలు
- ఇంట్రాడేలో 1200 పాయింట్ల నష్టం
- గడగడలాడించిన సెన్సెక్స్
- అప్రమత్తమైన సెబీ, బీఎస్ఈ

9

వెయ్యి కోట్లతో సిమెంట్ రోడ్లు



- త్వరితగతిన ప్రతిపాదనలు పంపండి
- అనుమతించిన పనులను ప్రారంభించండి
- అధికారులకు జూపల్లి ఆదేశం

11

మంచిర్యాల నుంచి కోదండ పోటీ!

- పార్టీ అధ్యక్షుడిగా కూడా ఆయనే
- టీజేఏసీలో విస్తృత ప్రచారం
- ఇప్పటికే ఐదుగురితో కమిటీ



5

విమాన యుద్ధం

రాఫెల్ కొనుగోలు స్కాం.. వెనుక మోదీ

రాహుల్ తీవ్ర ఆరోపణ



- అనుంగు మిత్రుడితో కలిసి ఒప్పందాన్ని కుదిర్చారు
- వివరాలు చెప్పడానికి నిరాకరిస్తున్నారు: రాహుల్
- ఇది 'ద గ్రేట్ రాఫెల్ మిస్టరీ' అంటూ వ్యంగ్యం
- నిర్మలపైనా ఆరోపణలు.. తిరస్కరించిన బీజేపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. రాఫెల్ విమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించి ప్రధాని మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ఆ డీల్‌లో భారీగా ముడుపులు చేతులు మారాయని.. దాని వెనుక ఉన్నది సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీయేనని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని 'ద గ్రేట్ రాఫెల్ మిస్టరీ'గా అభివర్ణించారు. ఒక్కో రాఫెల్ విమానం ధర ఎంతో చెప్పడం కుదరదంటూ సోమవారంనాడురక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "వివరాల్ని రహస్యంగా ఉంచాలన్నది భారత్ ఫ్రాన్స్ మధ్య ఒప్పందం. డీల్ కుదిరినపుడే ఈ అంశంపైన కూడా సంతకాలు చేశాం. అంచేత అది అధికార రహస్యాల వెల్లడి నిషేధం కిందకు వస్తుంది. ఒక యుద్ధవిమానానికి

మిగతా 14వ పేజీలో...

పోలీస్ బ్లాక్ మెయిల్

బాస్‌తోనే తేల్చుకుందాం!

- సీఐ, డీఎస్పీలతో పనేంటి?.. ఎస్పీలకే బెదిరింపు లేఖలు
- ఒత్తిడి తగ్గించుకునేందుకు కింది స్థాయి సిబ్బంది ఎత్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) అంటే సూపర్ బాస్! ఆయన్ను ఓ సాధారణ ఎస్సై కలవాలన్నా, మాట్లాడాలన్నా చాలా ప్రొటోకాల్ ఉంటుంది. ముందు డీఎస్పీ, ఏఎస్పీ ఓకే చేస్తేనే ఎస్పీతో ముఖాముఖి. ఇదంతా గతం. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ఎస్పీలే నేరుగా ఎస్సై, సీఐలతో భేటీ అవుతున్నారు. ప్రొటోకాల్ పంచాయితీ లేకుండా నేరుగా ఫోన్‌లో మాట్లాడుతున్నారు. క్యాంపు ఆఫీసు మీటింగ్స్ జరుపుకొంటున్నారు. ఇది శాంతి భద్రతల పరిరక్షణలో

మిగతా 12వ పేజీలో...



నీ శత్రువు నీవే.. నీ మిత్రుడూ నీవే



ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవరిపురాత్మనః

'నీ మనస్సుతో వివేకవంతుడివై నిన్ను నీవే ఉద్ధరించుకో. నిన్ను నీవే అధోగతి పాలు చేసుకోకు. నీకు నీవే బంధువువి. నీకు నీవే శత్రువువి' ..అని దీని అర్థం. భగవద్గీతలోని శ్లోక మిది. వేదాంతం చెప్పే సారాంశం, ఆధునిక మానసిక నిపుణులు చెప్పేదీ ఇదే. ఒక వ్యక్తి ఉన్నతికైనా.. పతనానికైనా ఆ వ్యక్తే కారకుడు. భగవంతుని సన్నిధిలోగానీ.. ఏకాంతంలో ఉన్నప్పుడుగానీ.. విశ్రాంతి సమయంలోగానీ.. ఎవరికివారు తమ గురించి నిష్పక్షపాతంగా సమీక్షించుకోవాలి. విమర్శించుకోవాలి. పొరపాట్లను మనఃపూర్వకంగా అంగీకరించి సవరించుకోవాలి. మనలోనే అంతర్గతంగా మన మిత్రుడు ఉన్నాడు. శత్రువూ ఉన్నాడు. మనకు మార్గదర్శనం చేసేది మనస్సాక్షే. మన గురించి ఇతరులకన్నా మనకే సంపూర్ణంగా తెలుస్తుంది. ఇతరుల అవసరం లేకుండా మనని మనం శుద్ధం చేసుకోవడానికి భగవంతుడు మనస్సాక్షి అనే అవకాశాన్ని కలిగించాడు. మన ప్రమేయం లేనిదే ఎవరూ మనను ఏ విధంగానూ ప్రభావితం చేయలేరు. అలాగే.. "అపిచేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ సాధురేవ సమంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః" అని గీతలో పరమాత్ముడు చెప్పాడు. ఎటువంటివారైనా ఆ భగవంతుడిని భక్తిగా భజిస్తే అలాంటివారు సత్పురుషులే అని దీని అర్థం. భ్రష్టులైన వారెందరో భగవంతుడిని శరణాగతి వేడుకోవడం ద్వారా తమని తాము సంస్కరించుకొని.. "యోగీశ్వరులు పొందే ముక్తిని" ప్రాప్తించుకున్నారు. ఇది సుసాధ్యం.

- వేదాంతం జగన్నాథాచార్య

Paramjyothi
పరంజ్యోతి

మూలకణాల నుంచి కార్నియా, రెటీనా

ప్రపంచంలోనే తొలిసారిగా కణజాల అభివృద్ధి..ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యుల ఘనత

- **త్రీడీ కణజాల అభివృద్ధిలోనూ విజయవంతం**
- **ప్రస్తుతం ఎలుకలు, పందికొక్కులపై ప్రయోగం**
- **మరో నాలుగైదేళ్లలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి..**

మానవశరీరంలో అత్యంత సున్నితమైన భాగం కన్ను. ఈ ప్రాంతంలో దెబ్బతగిలితే మళ్లీ వాటిని సరిచేసుకోలేం. కంటికి ఏదేని వ్యాధులు సోకి పనిచేయకుండా పోయినా.. చికిత్స ద్వారా వాటిని బాగుచేసుకోలేని పరిస్థితి. కంటికి సంబంధించి రెటీనా, కార్నియాల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి చెంది డాక్టర్ ఇందుమతి బృందం మూలకణాల ద్వారా కృత్రిమ రెటీనా, కార్నియా కణజాలలను రూపొందించి విజయం సాధించారు. కార్నియా కణజాలాన్ని రూపొందించడం ప్రపంచంలో ఇదే తొలిసారి. ఈ ప్రయోగ విశేషాలను ఆమె ఆంధ్రజ్యోతికి వివరించారు.

ప్రతివ్యక్తి శరీరంలోనూ మూలకణాలుంటాయి. ఇవి ఎలాంటి అవయవంగానైనా అభివృద్ధి చెంగుతాయి. ఇప్పటికే వీటి ద్వారా శరీరంలోని పలు భాగాలను పరిశోధకులు అభివృద్ధి చేశారు. కంటికి సంబంధించిన కణజాలాలను అభివృద్ధికి ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో కూడా 15 ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ పరిశోధనలు ఇటీవలే కొలిక్కి వచ్చాయి. 'ప్రస్తుతం ఎలుకలు, పందికొక్కులపైన పరిశోధనలు చేస్తున్నాం. మేము పరిశోధనాంశాల్లో రూపొందించిన 3డీ రెటీనా, కార్నియా కణజాలాలను వీటికి అమర్చి అవి ఏమేరకు అభివృద్ధి చెందుతున్నాయో గమనిస్తున్నాం. ఈ పరిశోధనలు పూర్తయిన తర్వాత కోతులు, పందులపైన పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత మనుషులపై ఈ ప్రయోగాలు చేస్తాం' అని పరిశోధన బృంద నాయకురాలు ఇందుమతి పేర్కొన్నారు.



పరిశోధనా బృందం సభ్యులు

ఎంపిక క్లిష్టమైన ప్రక్రియ..

'మనశరీరంలో రకరకాల మూలకణాలుంటాయి. వీటిలో కొన్ని మాత్రమే అవయవ కణ జాలాల అభివృద్ధికి పనికొస్తాయి. ఇలాంటి వాటిని గుర్తించి ఎంపిక చేసుకోవడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. మేము బాగా పరిణితి చెందిన మూలకణాలను (ఎడల్ట్ స్టెమ్‌సెల్స్)ను ఎంపిక చేసుకున్నాం. ఇలా ఎంపిక చేసుకున్న వాటిని మనకు అవసరమైన కణజాలాలను అభివృద్ధి చేయాలి. మా పరిశోధనల్లో మేము రెటీనా, కార్నియా కణజాలాలను అభివృద్ధి చేయగలిగాం. మేము అభివృద్ధి చేసిన కార్నియా కణజాలం పరిమాణం రెండు మిల్లీమీటర్లు. ఇది ఒక వ్యక్తి కార్నియాలో ఆరొంతులు. అంటే ఈ కణజాలం పూర్తిగా ఎదిగితే కార్నియాగా మారుతుంది' అని ఇందుమతి వివరించారు. మూలకణం నుంచి ఒక అవయవంలోని కణజాలాన్ని రూపొందించటం వినటానికి చాలా సులభంగా ఉన్నా.. దాని వెనుక చాలా పరిశోధన దాగి ఉంది. మూలకణాలతో రెటీనాను ఇతర దేశాల్లో శాస్త్రవేత్తలు ఇప్పటికే అభివృద్ధి చేశారు. కానీ కార్నియా కణజాలాన్ని అభివృద్ధి చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి.

- క్షీరదాల కళ్ల పనితీరు ఒకేవిధంగా ఉంటుంది. మానవ కంటి కణజాలానికి.. పంది, కోతి వంటి జంతువుల కణజాలలకు పెద్ద తేడా ఉండదు.
- కార్నియాకు ఏదైనా సమస్య వస్తే దానికి మూలకణాల ద్వారా చికిత్స చేసే కొన్ని పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. రెటీనా విషయంలో అలాంటి పద్ధతులేమి లేవు.



- మన దేశంలో కార్నియా సమస్యల వల్ల దాదాపు 6.8 కోట్ల మంది బాధపడుతున్నారని ఒక అంచనా.
- రెటీనాకు వచ్చే సమస్యల వల్ల మరో 6 కోట్ల మంది ఇబ్బందులు పాలవుతున్నారని అంచనా.

ప్రయోజనాలు అనేకం..

'మనుషుల కంటిపై ఎలాంటి పరిశోధనలు చేయలేం. అందువల్ల పరిశోధనాంశాలలో అభివృద్ధి చేసిన కార్నియా, రెటీనాలను పరిశీలిస్తే మనకు వచ్చే రకరకాల కంటివ్యాధులకు కారణాలు తెలుస్తాయి. మేము అభివృద్ధి చేసిన రెటీనా, కార్నియాలు ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఇప్పుడిప్పుడే పనికిరావు. ఇది అంత సులభం కాదు. మా పరిశోధనలు మానవుల స్థాయికి చేరుకోవటానికి కనీసం నాలుగైదేళ్లు పడుతుంది' అంటారు ఇందుమతి. ఆమె పరిశోధనలు త్వరగా ఫలించి.. లక్షల మందికి ప్రయోజనం చేకూరాలని ఆశిద్దాం.

- స్పెషల్ డెస్క్



యాంకర్ అనసూయ పగులగొట్టిన ఫోన్ చూపిస్తున్న బాలుడి తల్లి గీత

చిన్నారిపై అనసూయాగ్రహం!

- **సెల్ఫీ కోసం వెళితే ఫోన్ పగులగొట్టి చిందులు**
- **ప్రశ్నించిన బాలుడి తల్లిపై దుర్భాషలు**
- **యాంకర్ అనసూయపై కేసు నమోదు**



ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు టీవీలోనే కనిపించిన సెలెబ్రిటీ కళ్ల ముందు కనిపించేసరికి ఆ బాలుడు ఉబ్బితబ్బిబ్బయ్యాడు! తన తల్లి చేయి విదిలించుకొని పరుగు పరుగున వెళ్లి.. ఏమేడం.. నాతో ఓ సెల్ఫీ దిగరూ ప్లీజ్ అని నవ్వుతూ అడిగాడు. అయితే, సెల్ఫీ ముచ్చటకు ఆ చిన్నారికి దక్కిన బహుమానం.. ఆ సెలెబ్రిటీ నుంచి తీవ్ర ఆగ్రహజ్వాల! బాలుడి చేతిలోంచి ఫోన్ లాక్కొన్న ఆమె.. దాన్ని నేలకేసి కొట్టారు. ఇలా వివాదంలో చిక్కుకున్న ఆ సెలెబ్రిటీ టీవీ యాంకర్ అనసూయ! బాధితుల కథనం ప్రకారం.. మంగళవారం హైదరాబాద్‌లోని తార్నాక వద్ద చోటుచేసుకుందీ ఘటన. నాచారంలో నివాసం ఉండే గీత తార్నాకలోని నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో చదువుతున్న తన కొడుకును తీసుకొని ఇంటికెళ్తోంది. దారిలో టీవీ యాంకర్ అనసూయ కనిపించడంతో ఆగింది. యాంకర్‌తో సెల్ఫీ దిగాలని ముచ్చటపడిన గీత కొడుకు ఆమె వద్దకు వెళ్లాడు. అయితే, అనసూయ ఆ బాలుడిని నానా మాటలంటూ సెల్‌ఫోన్ లాక్కొని పగులగొట్టారు. దూరం నుంచే గమనించిన బాలుడి తల్లి గీత.. అనసూయ దగ్గరకు వెళ్లి ఇదేం పద్ధతి అని నిలదీసింది. బాలుడు ఏదో సరదాపడి ఫొటో దిగాలని కోరితే ఫోన్ పగులగొడతారా? అని ప్రశ్నించింది. అయితే, ఆమెపైనా అనసూయ ఆగ్రహం వ్యక్తం చేశారు. నానా దుర్భాషలాడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై గీత ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పోలీసులు అనసూయను విచారించగా.. ఈ ఘటనలో తనతప్పేమీ లేదన్నట్టుగా ఆమె వివరణ ఇచ్చారు. తాను సోమవారం సాయంత్రం తార్నాకలో నివసిస్తున్న తల్లిదండ్రులను చూసి వెళ్తుండగా.. ఓ మహిళ తన ప్రమేయం లేకుండా సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించిందని, ఆ క్రమంలో తన చేయి తగిలి సెల్‌ఫోన్ కింద పడి ఉండొచ్చని, తాను ఎవరినీ ఏమీ అనలేదని అనసూయ పోలీసులకు చెప్పారు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, సీసీ పుటేజీలు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఓయూ పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు ఈ ఘటనపై సోషల్‌మీడియాలో నెటిజన్లు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తుండడంతో అనసూయ తన ఫేస్‌బుక్, ట్విటర్ అకౌంట్లను నిలిపివేశారు.

చిన్నారిది నరబలే

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన నిందితుడు ఆ ఇంటి యజమానేనని పోలీసులు నిర్ధారించినట్టు సమాచారం. భార్య అనారోగ్యం నుంచి కోలుకునేందుకే అతడు శిశువును బలి ఇచ్చాడని తేల్చారు. ఈ నెల 1వ తేదీన ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో ఉంటున్న క్యాబ్‌డ్రైవర్ రాజశేఖర్ ఇంటిపై 3నెలల శిశువు తల లభ్యమైంది. తన ఇంటిపై శిశువు తల ఉందంటూ రాజశేఖరే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాచకొండ పోలీసులు.. నాలుగు బృందాలను రంగంలోకి దించారు. ఐదురోజుల పాటు కొనసాగించిన విచారణలో ఇంటి యజమాని రాజశేఖరే నిందితుడని గుర్తించారు. అతడి ఇంట్లో తనిఖీలు నిర్వహించిన పోలీసులకు క్షుద్రపూజలకు సంబంధించి కొన్ని కీలకమైన ఆధారాలు లభించాయి. నిందితుడి కారులో క్షుద్ర పూజలకు సంబంధించిన వస్తువులు దొరికాయి.

మంత్రగాళ్లసూచనతోనే

పోలీసుల కథనం ప్రకారం.. రాజశేఖర్ భార్య శ్రీలత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు ఎలాగైనా స్వస్థత చేకూర్చాలంటూ అతడు కొందరు మంత్రగాళ్లను ఆశ్రయించాడు. అయితే, ఆమె కోలుకోవాలంటే సంపూర్ణ చంద్రగ్రహణం రోజున ఇంట్లో క్షుద్రపూజలు చేసి, బయట నరబలి ఇవ్వాలని మంత్రగాళ్లు రాజశేఖర్‌కు సూచించారు. మంత్రగాళ్ల సలహామేరకు రాజశేఖర్ కరీంనగర్ జిల్లాలోని ఓ గిరిజన తండాకు వెళ్లాడు. అక్కడ ఓ కుటుంబం నుంచి శిశువును కొనుగోలు చేశాడు. ఆ చిన్నారిని చంద్రగ్రహణం రోజైన, జనవరి 31న మంత్రగాళ్లతో కలిసి బలి ఇచ్చాడు. కాగా బలి ఇచ్చిన అనంతరం రాజశేఖర్ శిశువు మొండాన్ని కారులో తీసుకెళ్లి ఓ శ్మశానంలో పూడ్చిపెట్టిపెట్టారు.

పక్కంటిపై అనుమానం వచ్చేలా..

శిశువును అన్యాయంగా పొట్టనబెట్టుకున్న రాజశేఖర్.. తనపై పోలీసులకు అనుమానం కలుగకుండా ఉండేందుకు, కేసును పక్కదారి పట్టించేందుకు పథకం వేశాడు. అర్ధరాత్రి శిశువు తలను ఇంట్లోకి తెచ్చేటప్పుడు.. బయట నుంచి నేరుగా పొరుగున ఉంటున్న నరహరి అనే వ్యక్తి ఇంటి వరకు వెళ్లాడు. అక్కడ చిన్నారి తల వెంట్రుకలలను వారి చెత్తడబ్బాలో వేశాడు. మరికొన్ని వెంట్రుకలను అతని బైక్‌పై వేసి ఆ తర్వాత తన ఇంట్లోకి ప్రవేశించాడు. దీంతో పోలీస్ జాగిలం రాజశేఖర్ ఊహించినట్టుగానే నేరుగా పక్కంటి నరహరి ఇంట్లోకి వెళ్లింది. అయితే, నరహరి ప్రమేయం లేదని విచారణలో పోలీసులు నిర్ధారించారు. కాలనీలోని ఓ ఇంటి యజమని ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ఆధారంగా రాజశేఖర్ బండారాన్ని బట్టబయలు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడు రాజశేఖర్, ఓ క్షుద్ర పూజారి, ముగ్గురు మహిళలు సహా ఆరుగురిని అరెస్టు చేశారు. నిందితుల్లో రాజశేఖర్ అత్త కూడా ఉంది. కాగా కరీంనగర్ జిల్లాలోని ఓ గిరిజన తండా నుంచి రాజశేఖర్ ఆ చిన్నారిని కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలిసింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం పాపను అమ్మిన వారిని అదుపులోకి తీసుకోవడానికి కరీంనగర్ బయల్దేరి వెళ్లారు.



లోకం తీరు

ఇది డైనింగ్ హాల్ కాదు...
మా సీఎం గారి మీటింగ్ హాల్

సైబీరియా వల్లే శీతల గాలులు

- **మరికొద్దిరోజులు ఇదే ప్రభావం**
- **ఈసారి ఎక్కువ కాలం చలి తీవ్రత**

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాయణం ప్రవేశించిన తర్వాత కూడా చలి తీవ్రత కొనసాగుతోంది. రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సైబీరియాలో నెలకొన్న చలి ప్రభావంతోనే భారత్‌లోనూ దక్షిణాది వరకు గాలులు కొనసాగాయి. చాలాకాలం తర్వాత ఈ సంవత్సరం సైబీరియాలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. అక్కడ మైనస్ 67 డిగ్రీలు నమోదైంది. అక్కడ నుంచి మధ్య ఆసియా మీదుగా దేశంలోనికి చలిగాలులు వీస్తున్నాయి. అందుకే దేశంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో చూస్తే డిసెంబరు రెండో వారం నుంచి చలి ప్రభావం ఎక్కువగా ఉంది. సాధారణంగా తీరానికి ఆనుకుని వుండే కోస్తాలో అడపాదడపా మేఘాలు ఆవరించి వర్షాలు కురిసేవని, ఈ ఏడాది అటువంటి పరిస్థితులు లేకపోవడం చలి తీవ్రతకు ఒక కారణమని నిపుణులు పేర్కొన్నారు.



అమెరికా వలస చట్టాలను మార్చాలి

అమెరికా వలస చట్టాల వ్యవస్థ పనితీరు మరింత వేగంగా, అందరికీ సమానంగా అవకాశమిచ్చేలా ఉండాలి. గ్రీన్ కార్డుల మంజూరుపై ఉన్న పరిమితిని తొలగించాలి. అమెరికాలోని భారత సంతతికి చెందిన వారు ఎన్నో ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రతివాళ్లూ తమ కన్నీటి గాథలను అందరికీ చెప్పాలి.

- కూచిభొట్ల శ్రీనివాస్ భార్య సునయన



గాంధీ కలను మోదీ నెరవేర్చారు

మహాత్మాగాంధీ స్వచ్ఛభారత్ కోసం కలగన్నారు. ఆ కలను మోదీ సర్కారు నెరవేర్చింది. ఆరు దశాబ్దాలు అధికారంలో ఉన్నా కాంగ్రెస్ ఆ పని చేయలేకపోయింది. మూడున్నరేళ్లలోనే 5.5 కోట్ల మరుగుదొడ్లను ప్రభుత్వం నిర్మించింది.

- బీజేపీ ఎంపీ రాకేశ్‌సింగ్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.77.63	పాత ధర 69.69
కొత్త ధర రూ.77.71	కొత్త ధర 69.77
పెరిగింది : 00.08 పైసలు	పెరిగింది : 00.08 పైసలు



గరం చాయ్‌తో అన్నవాహిక కేన్సర్!

బీజింగ్, ఫిబ్రవరి 6: వేడి వేడి చాయ్ తాగితే అన్నవాహిక కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం సేవించే అలవాటు ఉన్నవారికి మరీ ప్రమాదమని చెబుతున్నారు. వేడి చాయ్ వల్ల ఈ కేన్సర్ వచ్చే అవకాశం 5 రెట్లు ఎక్కువగా ఉంటుందని, చాయ్ తాగుతూ ధూమపానం అసలే చేయొద్దని చైనాలోని పెర్కింగ్ యూనివర్సిటీ పరిశోధకులు సూచిస్తున్నారు.



శరీరంలో కరిగే ఫైబర్ ఆప్టిక్ సెన్సర్లు!

లండన్, ఫిబ్రవరి 6: మెరుగైన వైద్యం అందించేందుకు కొత్త రకం ఫైబర్ ఆప్టిక్ సెన్సర్లను గ్రీస్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ స్ట్రక్చర్ అండ్ లేజర్ రూపొందించింది. ఈ సెన్సర్లు శరీరంలో ఇట్టే కరిగిపోయి.. ఎముకల్లోని పగుళ్లను, మెదడు వంటి సున్నితమైన అవయవాల్లో ట్యూమర్లను గుర్తిస్తాయి. అంతేకాకుండా వాటికి చికిత్సను కూడా అందిస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.



వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న నల్లగొండ కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్

కలెక్టరే డాక్టర్!

- **పానగల్ అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**
- **సమయం దాటినా విధులకు హాజరు కాని వైద్యురాలు**
- **జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడికి స్వయంగా పరీక్షలు**
- **వైద్యాధికారిని సస్పెండ్ చేయాలని డీఎంహెచ్‌వోకు ఆదేశం**

నల్లగొండ అర్బన్, ఫిబ్రవరి 6: అది నల్లగొండ జిల్లా పానగల్లు అర్బన్ ఆరోగ్య కేంద్రం.. మంగళవారం ఉదయం 10:30 అవుతోంది. వైద్యాధికారి డాక్టర్ శ్రీప్రియ ఇంకా విధులకు హాజరు కాలేదు. ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ తనిఖీకి వచ్చారు. అప్పటికే వైద్యురాలి కోసం రోగులు గంటలకొద్దీ పడిగాపులు కాస్తున్నారు. అక్కడ తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఓ వృద్ధుడి అవస్థను చూసి చలించిన ఆయన.. డాక్టర్ అవతారమెత్తారు. స్టెతస్కోప్‌తో గుండె కొట్టుకునేవేగాన్ని, బీపీని పరీక్షించారు. తానే స్వయంగా మందుల చీటీ రాసిచ్చారు. కొన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కేంద్రాస్పత్రికి సిఫారసు చేశారు. వైద్యం కోసం వచ్చిన పలువురు రోగులను వైద్య సేవలపై ఆరా తీశారు. ఉదయం 9 గంటలకే రావాల్సిన వైద్యాధికారి సమయం దాటినా రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్.. ఆమెను సస్పెండ్ చేయాలని ఫోన్‌లో డీఎంహెచ్‌వో భానుప్రసాద్‌నాయక్‌ను ఆదేశించారు. హాజరు రిజిస్టర్‌లో సంతకాలు పెట్టిన సిబ్బందిని ఒక్కొక్కరిని పిలుస్తూ హాజరు సరిచూశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వారంలో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తానని, సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, విధి నిర్వహణలో సమయపాలన పాటించని వైద్యాధికారి శ్రీప్రియ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. దీంతో ఆమెను సస్పెండ్ చేయడం కుదరకపోవడంతో డీఎంహెచ్‌వో ఆమెకు మెమో జారీచేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

పిల్లలేం చేశారు!

- **మీ కోపాలకు వారిని బలిచేస్తారా!**
- **పెంచకపోతే మాకివ్వండి**
- **శిశు సంరక్షణ కేంద్రాల అధికారులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు తమ మధ్య మనస్పర్థలు, కోపతాపాలకు పిల్లలను బలిచేయొద్దని శిశు సంరక్షణ కేంద్రాల అధికారులు కోరుతున్నారు! జీవితాల్లో ఏదో కష్టం వచ్చిందని చిన్నారుల ప్రాణాలను తీయొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తిచేస్తున్నారు. పెంచడం తలకుమించిన భారమని భావిస్తే.. పిల్లలను శిశు సంరక్షణ కేంద్రాల్లో చేర్చాలని కోరుతున్నారు. ఇందుకు హైదరాబాద్‌లో శిశు విహార్‌తో పాటు ప్రతి జిల్లాలో తమ సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని సూచిస్తున్నారు. హైదరాబాద్ జిల్లెలగూడలో నివాసం ఉంటున్న హరీందర్‌గౌడ్.. తన భార్య జ్యోతిని, పిల్లలు అభిజిత్ (6), సహస్ర (4)ను సోమవారం కిరాతకంగా హత్యచేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో అధికారులు స్పందించారు. తాము పోతే పిల్లల పరిస్థితి ఏమవుతుందోననే భయంతో కొందరు దంపతులు పిల్లలనూ చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శిశుసంరక్షణ కేంద్రాలను గుర్తించడం కష్టమనుకుంటే 1091 చైల్డ్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

కన్నీళ్ల నడుమ అంత్యక్రియలు

చందుర్తి: కట్టుకున్న భార్యను, కన్నబిడ్డలను చంపుకొనేందుకు అతడికి చేతులెలా వచ్చాయంటూ ఆ గ్రామస్థులంతా హరీందర్‌గౌడ్‌కు శాపనార్థాలు పెట్టారు! పాడెపై తల్లీబిడ్డల మృతదేహాలను చూసి బోరుమన్నారు. ముగ్గురి మృతదేహాలకు మంగళవారం అమ్మమ్మ గ్రామమైన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామ శివారులో తల్లి మృతదేహాన్ని దహనం చేయగా చిన్నారుల మృతదేహాలను ఖననం చేశారు.

సంయమనం అవసరం

కుటుంబంలో సమస్య వచ్చినపుడు భార్యాభర్తల్లో ఎవరో ఒకరు సంయమనంతో వ్యవహరించాలి. ఎదుటి మనిషిని రెచ్చగొట్టేలా మాట్లాడొద్దు. మహిళలకు సహనం ఎక్కువ అంటారు. అయితే ఈ తరం మహిళల్లో అది లోపిస్తోంది. క్షణికావేశాలకుపోయి వారు తమ పిల్లల్ని చంపుకొంటున్నారు. సమస్యలు వచ్చినప్పుడు పురుషులు సంయమనంతో వ్యవహరించాలి.

- డాక్టర్ అనురాధ, మానసిక నిపుణురాలు

చెరువులో దూకి కుటుంబం ఆత్మహత్య

- **మృతుల్లో ఇద్దరు చిన్నారులు..ఆర్థిక ఇబ్బందులే కారణం?**



కూతురు దివ్య, భార్య మానసతో రమేశ్ (ఫైల్)

మేడ్చల్, ఫిబ్రవరి 6: ఆ యువ దంపతులది చూడముచ్చటైన జంట! వారికి ముద్దులొలికే ఇద్దరు చిన్నారులు! ఉన్నంతలో చక్కగా సాగుతున్న సంసారం! మరి.. ఒక్కసారిగా అంత కష్టం ఏమొచ్చిందో గానీ పిల్లలతో కలిసి ఆ జంట చెరువులో దూకి ఆత్మహత్యకు ఒడిగట్టింది! మల్కాజ్‌గిరి జిల్లా కీసర మండల కేంద్రంలో ఈ విషాదం నెలకొంది. మృతులను ఘట్‌కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రమేశ్(27), ఆయన భార్య మానస (21), కూతుళ్లు గీతశ్రీ (4), దివ్య (3నెలలు)గా గుర్తించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే ఈ ఘటనకు కారణమై ఉంటాయని భావిస్తున్నారు. భార్య, పిల్లలతో కలిసి రమేశ్ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ద్విచక్రవాహనంపై ఇంట్లోంచి బయటకు వచ్చాడు. అనంతరం ఈ నలుగురు మళ్లీ తిరిగి రాలేదు. ఈ క్రమంలో వారి కోసం మానస సోదరుడు రామాంజనేయులు వెతుకుతుండగా మంగళవారం ఉదయం కీసరలోని పెద్దమ్మ చెరువు వద్ద రమేశ్ ద్విచక్రవాహనం కనిపించింది. ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనాస్థలికి చేరుకోగా మధ్యాహ్నానికి చెరువులో మృతదేహాలు తేలాయి. మృతదేహాలను వెలికితీయించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మానస సోదరుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేందర్‌గౌడ్ తెలిపారు.

కానిస్టేబుల్ సందీప్ ఆత్మహత్య

- **వివాహేతర సంబంధం కేసులో విచారణతో మనస్తాపం**
- **రైలు కింద పడి బలవన్మరణం**



కానిస్టేబుల్ సందీప్‌కుమార్ (ఫైల్)

హైదరాబాద్ సిటీ, చార్మినార్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వివాహితతో అక్రమ సంబంధం కేసులో విచారణ ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ సందీప్ కుమార్ గౌడ్ (23) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాతబస్తీ మొగల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మంగళవారం ఉదయం మౌలాలీ రైల్వే స్టేషన్ వద్ద రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. తన భార్యను ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకున్న సందీప్.. ఆమెతో సంబంధం కొనసాగిస్తున్నాడంటూ వివాహిత భర్త పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు క్రమశిక్షణ చర్యల కింద అతడిని సస్పెండ్ చేశారు. మీడియాలో కథనాలు రావడం.. సోషల్ మీడియాలో అది విస్తృతంగా ప్రచారం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. సందీప్ మృతదేహాన్ని రైలు పట్టాలపై చూసి మొగల్‌పురా పీఎస్‌సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. సందీప్‌పై ఆరోపణలు రావడంతోనే చర్యలు తీసుకున్నామని, విధుల్లో మాత్రం మంచి పేరుందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

భర్త నుంచి విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు వక్ఫ్‌బోర్డు ద్వారా ఆర్థికసాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.దానకిశోర్ సూచించారు. - హైదరాబాద్

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు మిథ్యే!

- కృష్ణా బేసిన్‌లో రబీ గట్టెక్కేనా?
- ఆరుతడి పంటల స్థానంలో వరి సాగు
- వేసవిలో తాగునీటి సంగతేంటి?
- ప్రణాళికపై అధికారుల కసరత్తు


జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్

గద్వాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా కనిపిస్తున్నా.. రబీ పంటలు చేతికందేవరకు నీరు అందించడం సందేహమే. ఆరుతడి పంటలను దృష్టిలో పెట్టుకుని మార్చి వరకే ఆయకట్టుకు నీరు అందించాలని అధికారులు ప్రణాళిక రూపొందించినా, ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తున్న నేపథ్యంలో ఏప్రిల్‌లోనూ నీరిస్తేనే పంటలు చేతికందే అవకాశాలు కనిపిస్తున్నాయి.పంటలను కాపాడేందుకు అధికారులు ఎలాంటి విధానం అవలంబిస్తారోనని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇదే సమయంలో ఏప్రిల్ నుంచి మిషన్ భగీరథ పథకాలకు కృష్ణా జలాలను వినియోగంలోకి తెస్తే నీటి నిల్వ మరింత తగ్గుతుందని, తాగునీటి అవసరాలకే కృష్ణా జలాలు పరిమితమవుతాయనే అంచనాలున్నాయి. కృష్ణాబేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 851.49 టీఎంసీలకు గాను గతేడాది ఫిబ్రవరిలో 299.49 టీఎంసీల నీటి నిల్వలుండగా, ఈ ఏడాది 385.76 టీఎంసీల నీటి నిల్వలున్నాయి.

జాగ్రత్తగా వినియోగిస్తేనే..!

వేసవిలో ఆయా ప్రాంతాల్లోని తాగు నీటి పథకాలతో పాటు, వేసవి ముగిసేంతవరకు హైదరాబాద్‌కు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాల్సి ఉంది. పాలమూరులోని జూరాల, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద 90 వేల ఎకరాల్లో వరి, ఆయకట్టు చివరి ప్రాంతాల్లోని మరో 90 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద కూడా మొదటిజోన్ పరిధిలో 5 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. మార్చి వరకు నీటిని ఇచ్చి నిలిపివేస్తే పంటలు చేతికందే పరిస్థితి ఉండదు. కనీసం ఏప్రిల్ 20 వరకు ప్రాజెక్టుల కింద సాగునీరు ఇవ్వకతప్పదని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులు యోచిస్తున్నారు.

ఉరితాళ్లతో ఫార్మ్‌-డీ విద్యార్థుల నిరసన

- కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి సంఘీభావం
- హన్మకొండలో విద్యార్థుల ర్యాలీ, ధర్నా


హన్మకొండలో ఫార్మ్ డీ విద్యార్థుల ర్యాలీ

కరీంనగర్/వడ్డేపల్లి, ఫిబ్రవరి 6: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరు రోజులుగా కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫార్మ్‌-డీ విద్యార్థులు మంగళవారం ఉరితాళ్లతో నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ శాసన సభాపక్ష ఉపనేత జీవన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్లు న్యాయమైనవని వాటిని ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. తమను క్లినికల్ ఫార్మసిస్టుగా గుర్తించాలని విద్యార్థులు రోడ్డెక్కడం బాధాకరమన్నారు. అనేక రాష్ట్రాల్లో ఫార్మ్‌-డీ విద్యార్థులకు గుర్తింపునిస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగావకాశాలు కల్పించాయని చెప్పారు. 515 జీవోను అమలు పరచకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యను ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ఫార్మ్‌-డీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్‌ను చేరుస్తామని చెప్పారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఫార్మ్‌-డీ విద్యార్థులు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో 11 రోజులుగా ధర్నా చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో మంగళవారం ఏకశిల పార్క్ నుంచి హన్మకొండ అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. విద్యార్థుల ఆందోళనకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. వందలాది మంది విద్యార్థులు ధర్నా చేస్తుండడంతో అంబేద్కర్ జంక్షన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.

దళితులను పట్టించుకోని సీఎం: లక్ష్మణ్



సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 6: సీఎం కేసీఆర్ దళితులను పట్టించుకోకుండా వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దళిత అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరు లక్షల దళిత కుటుంబాలకు మూడు ఎకరాల చొప్పున భూమిని ఇస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఆ హామీలను తుంగలో తొక్కి, నియంత పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా పేట్రేగి పోతోందని కేసీఆర్ కుటుంబ సభ్యుల చొరవతో చాప కింద నీరులా ఇసుక మాఫియా విస్తరిస్తోందన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకున్న 12 మంది హత్యలు చేయించారని, వీరిలో దళితులున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మద్యం అమ్మకాల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, ప్రభుత్వం ఆదాయం కోసం మద్యం వ్యాపారం ద్వారా పేదల రక్తాన్ని పీలుస్తోందని విమర్శించారు.

మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

- నేడు తిరుగు వారం పండుగ

పోచమ్మ మైదాన్/మేడారం, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర కానుకల హుండీల లెక్కింపు ప్రారంభమైంది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం హుండీల లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా మేడారం ఆలయ ఈవో రమేశ్ బాబు మాట్లాడుతూ తొలి రోజు 85 హుండీలను లెక్కించామని, రూ. ఒక కోటి 72 లక్షల 40 వేల ఆదాయం(కానుకలు) వచ్చినట్లు తెలిపారు. మేడారం మహాజాతర ముగిశాక తిరుగువారం పండుగ చేయడం ఆదివాసీల ఆచారం. అందులో భాగంగా బుధవారం ఆదివాసీలు మహాజాతరలో వనదేవతల పూజా సామగ్రిని శుద్ధిచేసి ముగ్గులు వేసి గుడిలో భద్రపరుస్తారు. అదేవిధంగా జాతరకు వచ్చిన భక్తులు వనదేవతలను ఏమైనా ఇబ్బంది పెట్టి ఉంటే క్షమించమని వేడుకుని బలిముక్కులతో నైవేద్యం ఆరగింపజేసి అందరూ చల్లగా ఉండాలని కోరుకుంటారు.


హుండీల్లోని కానుకలను లెక్కిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

భద్రాద్రిలో అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు ప్రారంభం


కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

భద్రాచలం, ఫిబ్రవరి 6: భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో భద్రాచలంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఐదు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా కళాభారతి అధ్యక్షుడు పాకాల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ నాటక రంగాన్ని పరిరక్షించడమే ప్రధాన ధ్యేయంగా భద్రాద్రి కళాభారతి ఈ నాటకోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ జానపద కళాకారుడు శివనాగులను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి.

'సబ్సిడీ గొర్రెల' పరిశీలన తాత్కాలికంగానే వాయిదా

- పశుసంవర్ధక శాఖ వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం ద్వారా గొల్ల కురుమలకు కలిగిన ఆర్థిక లాభం అంచనా వేసేందుకు ఆర్థిక, సామాజిక అధ్యయనాల కేంద్రం ద్వారా చేస్తున్న పరిశీలనను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పశుసంవర్ధక శాఖ వివరణ ఇచ్చింది. ఈ మేరకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పథకం ద్వారా కలిగిన లబ్ధిని అంచనా వేసేందుకు ఏడాదిపాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నందున తాత్కాలికంగా పరిశీలనను వాయిదా వేసినట్లు వెల్లడించింది. పంపిణీ చేసిన గొర్రెల్లో ఇప్పటివరకు 36వేల గొర్రెలు చనిపోగా.. వీటిలో 9,524 గొర్రెలకు బీమా పరిహారం ఇప్పించడం జరిగిందని తెలిపింది. మిగిలిన గొర్రెలకు నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పింది. సోమవారం నాటికి రాష్ట్రంలో 42,42,126 గొర్రెలను 2,02,006మందికి పంపిణీ చేసినట్లు తెలిపింది.

11న 'ఇంటికో యువ రైతు' కార్యక్రమం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఈ నెల 11న అమ్మ కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్ట్, శ్రీవారి సేన ఆధ్వర్యంలో 'ఇంటికో యువ రైతు' పేరిట విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి కనకదుర్గ దేవాలయం వరకు యాత్ర కార్యక్రమం ఉంటుందని ట్రస్ట్ ఛైర్మన్ కేవీవీ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో ప్రకృతి కరుణించాలని, తెలుగు రాష్ట్రాల్లోని రైతుల బతుకులు బాగుపడాలని వేడుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించి.. వారి ప్రతిభా పాటవాలతో సాంకేతికతను ఉపయోగించి మంచి పంటలు పండించాలన్న సత్సంకల్పంతో ఈనెల 10వ తేదీన ఉదయం కనకదుర్గ ఆలయంలో నిర్వహించే 'చండీయాగం'లో అమ్మ జోతిర్మయి పాల్గొంటారని ఆయన చెప్పారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: అప్పుల బాధతో నిర్మల్ జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ముథోల్ కోలిగల్లికి చెందిన బి.శంకర్ (48) రెండు ఎకరాల పొలంలో సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. అప్పుల బాధతో కుంగిపోయన ఆయన వారం రోజులుగా అదృశ్యమయ్యాడు. మంగళవారం ముథోల్ గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. దస్తూరాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నూర్‌కు చెందిన కొట్టే వేణు (35) సాగులో నష్టపోయి రూ.7 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. మనస్తాపం చెంది మంగళవారం వ్యవసాయ బావిలో దూకాడు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం చామన్‌పల్లికి చెందిన ఏలేటి రాజవ్వ (65) మంగళవారం ఉదయం జొన్న పంట కాపలాకు వెళ్లింది. అక్కడ తెగి పడి ఉన్న విద్యుత్ తీగ తగిలి షాక్‌తో మృతిచెందింది.

మాల్దీవుల్లో సంక్షోభం

మాల్దీవుల్లో ఉత్పన్నమైన సంక్షోభం భారత్‌కు పెద్ద పరీక్ష. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ దేశంలో అత్యయిక స్థితిని ప్రకటించి, వ్యతిరేకులందరినీ నిర్బంధిస్తున్నారు. ఇద్దరు న్యాయమూర్తులతో పాటు, సుప్రీంకోర్టు భవన సముదాయంలోకి దూసుకుపోయిన సైన్యం ప్రధాన న్యాయమూర్తిని కూడా అరెస్టు చేసింది. జైళ్ళలో ఉన్న విపక్ష నేతలందరినీ విడుదల చేయాలనీ, పన్నెండు మంది ఎంపీలపై గతంలో విధించిన అనర్హత వేటు కూడా చెల్లదని మొన్న గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ పరిణామాలన్నింటికీ కారణం. తీర్పును అమలు చేసిన పక్షంలో పార్లమెంటులో విపక్షం బలపడి యమీన్‌ను అభిశంసించడం ఖాయం. దీనితో పాటు, ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల్లో పోటీచేసి నెగ్గడమూ ఖాయం. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ యమీన్ నియంతృత్వ ఎజెండాను అందుకున్నారు.తక్షణమే జోక్యం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిందిగా మాల్దీవులనుంచి విజ్ఞప్తులు అందుతున్న నేపథ్యంలో, భారతదేశం సందిగ్ధతను ఎదుర్కొంటున్నది.

అవసరమైన పక్షంలో, మాల్దీవుల్లో కాలూనేందుకు సిద్ధంగా ఉండాలంటూ భారతప్రభుత్వం ఇప్పటికే సాయుధ బలగాలను ఆదేశించిందంటూ వార్తలు వెలువడ్డాయి. సుప్రీంకోర్టు తీర్పును తక్షణం అమలు చేయాల్సిందిగా భారతదేశం యమీన్‌కు సలహా ఇచ్చింది. చైనాకు సన్నిహితుడిగా పేరొందిన యమీన్ విషయంలో భారత ప్రకటన కాస్తంత ఘాటుగా ఉండటం సహజం. రాజకీయ ఎత్తులు, పై ఎత్తుల్లో అక్కడి న్యాయస్థానం కూడా అంతర్భాగమైపోయిందనీ, ఈ కారణంగా న్యాయస్థానం తీర్పు అక్కడి ప్రజలకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదన్న వాదన లేకపోలేదు. గత కొద్ది సంవత్సరాలుగా పాలకుడికి అనుకూలంగా తీర్పులు వస్తూ, అత్యంత కీలకమైన ఈ తీర్పు తిరగబడటంలోనూ కారణాలు ఏవో ఉండవచ్చు. తీర్పునిచ్చిన న్యాయమూర్తులంతా తనకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలో భాగస్వాములేనని యమీన్ ఆరోపిస్తున్నారు. దౌత్యంతోనూ, అవసరమైనపక్షంలో సైన్యంతోనూ తన దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిందిగా మాజీ అధ్యక్షుడు నషీద్ ప్రవాసం నుంచి భారతదేశానికి చేసిన విజ్ఞప్తిని అటుంచితే, మాల్దీవుల్లో జరుగుతున్న పరిణామాలను చూసీచూడనట్టు ఊరుకోగలిగే స్థితిలో భారత దేశం లేదు. మాల్దీవులతో భారత్ సంబంధాలు సంక్లిష్టమైనవి. మన భద్రతా కారణాల రీత్యా అక్కడ చైనా ప్రాబల్యం పెరగకుండా అడ్డుకోవలసిన అవసరం ఉన్నది. యమీన్ ఏలుబడిలో మాల్దీవుల్లో చైనా ముద్ర మరింత హెచ్చింది. మనలను పక్కనబెట్టి చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం, విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భారతదేశ సంస్థతో కుదిరిన గత ఒప్పందాన్ని రద్దుచేయడం వంటి నిర్ణయాలు అనేకం ఆయన పాలనలో జరిగాయి. యమీన్ అనుసరిస్తున్న చైనా అనుకూల వైఖరి కారణంగానే మోదీ ఈ దేశంలో ఇప్పటివరకూ కాలు మోపలేదు. గతనెలలోనే యమీన్ తన విదేశాంగమంత్రిని న్యూఢిల్లీ పంపి, ఇకపై తాను భారతదేశానికి అనుకూలంగా వ్యవహరిస్తానని చెప్పినట్టుగా, దీనివల్లనే మాల్దీవుల్లో పర్యటనకు మోదీ అంగీకరించినట్టుగా వార్తలు వెలువడ్డాయి. యమీన్ ముందస్తు జాగ్రత్తకు కారణాలు ఏమిటో తెలియదు కానీ, ఇప్పుడు మారిన పరిణామాల నేపథ్యంలో మోదీ పర్యటన ఇప్పుడప్పుడే సాధ్యం కాదన్నది వాస్తవం.

ఆయా దేశాల అంతర్గత వ్యవహారాల్లో ఇతరదేశాల జోక్యాన్ని వ్యతిరేకించడం, తాను అటువంటి పనికి పాల్పడకపోవడం ఒక విధానంగా ప్రకటిస్తూ వచ్చిన భారతదేశం, సరిగ్గా మూడు దశాబ్దాల క్రితం మాల్దీవుల్లో అబ్దుల్ గయూమ్ ప్రభుత్వాన్ని కాపాడేందుకు ఇందుకు భిన్నంగా వ్యవహరించింది. భారత సైన్యం ఆ దేశంలోకి ప్రవేశించి కుట్రదారులందరినీ నిర్బంధించి గయూమ్‌కు వ్యతిరేకంగా సైనిక కుట్ర జరగకుండా చూసింది. ఈ పరిణామం తరువాత భారతదేశం పెద్దన్న పాత్రపై విమర్శలు హెచ్చడం అటుంచితే, భారత్ అండచూసుకొని గయూమ్ మరింత అప్రజాస్వామికంగా వ్యవహరించడం ఆరంభించారు. సర్వవ్యవస్థలనూ గుప్పిట్లో పెట్టుకొని దేశాన్ని ఏలిన గయూమ్ 2004నుంచి రెండేళ్ళపాటు సాగిన ప్రజాఉద్యమాలతో చివరకు దిగిరావాల్సి వచ్చింది. అప్పటికే జైల్లో ఉన్న నషీద్ 2008 అధ్యక్ష ఎన్నికల్లో గయూమ్‌పై విజయం సాధించడంతో ప్రజాస్వామ్యం వేళ్ళూనుకుంటున్నదని అందరూ అనుకున్నారు. కానీ, ఆర్థిక మాంద్యం సృష్టించిన పలు సమస్యలతో అతడు కూడా ప్రజావ్యతిరేకతను ఎదుర్కొని, చివరకు అధికారాన్ని కాపాడుకోవడానికి న్యాయమూర్తులను అరెస్టు చేయించడం వంటి నియంతృత్వ పోకడలకు పోయాడు. పోలీసులు, సైన్యం కలిసి తనకు వ్యతిరేకంగా కుట్రపన్నితే, గతంలో గయూమ్‌ను కాపాడినట్టుగా భారతదేశం కాపాడలేదన్నది నషీద్ అసంతృప్తి. నషీద్ చైనా పక్షపాతి కావడం వల్లనే భారత్ అతడు కుప్పకూలిపోతుంటే చూడనట్టు వదిలివేసిందని కొందరు అంటారు. నషీద్‌ను కాపాడివుంటే, అతడు భారత్ పక్షాన నిలిచివుండేవాడనీ, చైనా ప్రాబల్యం అక్కడ పెరిగేది కాదన్న వాదన కూడా లేకపోలేదు. 2013ఎన్నికల్లో నషీద్ స్థానంలో అధికారంలో వచ్చిన యమీన్ కూడా ఇప్పుడు అదే తోవలో నడుస్తున్నారు. యమీన్‌కు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన ఇద్దరు న్యాయమూర్తులు నిర్బంధంలో ఉండగానే మరో ముగ్గురు న్యాయమూర్తులు ఈ తీర్పును రద్దుచేస్తూ మంగళవారం రాత్రి నిర్ణయం తీసుకోవడం ఒక విచిత్రమైన ఆశ్చర్యకరమైన పరిణామం. మాల్దీవుల్లో ఏర్పడిన సంక్షోభం ఏ దిశగా పయనించి ఎలా ముగుస్తుందో వేచిచూడాలి.

పార్లమెంటరీ ప్రమాణాల పతనం

ఇండియాగేట్



ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా అనేక వేదికల్లో చేసే ప్రసంగాలకూ పార్లమెంట్‌లో చేసే ప్రసంగాలకూ పెద్దగా తేడా ఉండడం లేదు. ప్రసంగాల విన్యాసాలు, హావభావాల వల్ల ప్రజాస్వామిక విలువలను కాపాడలేము. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అన్న భావనను పార్లమెంట్‌లోనూ, బయటా మనసా వాచా కర్మణా అనుసరిస్తున్నట్లు రుజువు చేసుకోవడం నినాదం చేసినంత సులభం కాదు.

■ ఎ. కృష్ణారావు

ఒకప్పుడు పార్లమెంట్ లో ప్రవేశిస్తుంటే ఒక సమున్నత ప్రజాస్వామ్య మందిరంలోకి ప్రవేశిస్తున్నట్లు అనిపించేది. రాజ్యాంగ సభ నుంచి ఇప్పటివరకూ ఎందరో హేమాహేమీలు పార్లమెంట్ లో ప్రజాస్వామ్యాన్ని తమదైన రీతిలో ప్రదర్శించి దానికి ఒక విలువ తెచ్చిన రోజులున్నాయి. అంబేడ్కర్, జవహర్ లాల్ నెహ్రూ, హీరేంద్రనాథ్ ముఖర్జీ, రామనోహర్ లోహియా, పీలూ మోడీ, అటల్ బిహారీ వాజపేయి, చంద్రశేఖర్, భూపేశ్ గుప్తా, సోమనాథ్ ఛటర్జీ, ఇంద్రజిత్ గుప్తా లాంటి వారు మాట్లాడుతుంటే వారి వాక్ప్రవాహం సభను స్తంభింపచేసినట్లుండేది. సాహిత్యం, న్యాయశాస్త్రం, రాజనీతి, ఉన్నత స్థాయి చమత్కృతి మొదలైన అనేక అంశాల మేళవింపు వారి ప్రసంగంలో కనపడేది. 1957లో జనసంఘ్ ఎంపిగా వాజపేయి మొదటి సారి లోక్ సభలో ప్రసంగించినప్పుడు ఆయన ప్రసంగం సభను అమితంగా ఆకట్టుకుంది. ప్రధానమంత్రి నెహ్రూ వాజపేయిని ఒక విదేశీ ప్రముఖుడికి పరిచయం చేస్తూ 'ఒక రోజు ఈ యువకుడు భారత ప్రధానమంత్రి అవుతారు..' అని ప్రశంసించారు. సిపిఐ సభ్యుడు హీరేన్ ముఖర్జీ ప్రసంగం అంటే కూడా నెహ్రూ బాగా ఇష్టపడేవారు. క్రమక్రమంగా పార్లమెంట్ లో అద్భుత ప్రసంగాలు చేసే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారాలు ఇచ్చేందుకు కూడా ఇప్పుడు నేతలు లభించడం లేదు. ఆఖరుకు కాంగ్రెస్ నేత గులాంనబీఆజాద్, బిజెడి నేత భర్తృహరి మెహతాబ్ లాంటివారికి కూడా ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారాలు లభిస్తున్నాయంటే గతంతో పోలిస్తే ప్రమాణాలు ఎంత పలచనవుతున్నాయో అర్థమవుతోంది. ఎవరూ లేని చోట ఆముదపు చెట్లే మహావృక్షాలవుతున్నాయి. పార్లమెంట్ లో ముఖ్యంగా అధికార పార్టీలో చక్కటి ప్రసంగాలు చేసే వారు లేరని చెప్పలేం. ఏ అంశంపైనైనా అనర్గళంగా మాట్లాడగలిగిన సుష్మా స్వరాజ్ ను విదేశాంగ మంత్రిగా నియమించి, ప్రధానమంత్రి స్వయంగా తానే అన్ని దేశాలకు తిరుగుతూ ఉధృతంగా ప్రసంగాలు ఇస్తుండడంతో ఆమె గొంతు నొక్కేసినట్లయింది. ఎప్పుడో కాని ఆమె స్వరం వినిపించడం లేదు. మోదీ ప్రభుత్వాన్ని రెండు భుజాలపై వేసుకుని ఎవరు ఏమి మాట్లాడినా తిప్పిగొట్టి విజృంభించే వెంకయ్యానాయుడు ఉపరాష్ట్రపతి కావడంతో ఆయనను ఉపయోగించుకునే అవకాశం బిజెపికి లేకుండా పోయింది. బహుశా తాను తప్ప ఎవరూ అద్భుతంగా ప్రసంగించలేరని అందరూ అనుకోవాలని మోదీ భావిస్తున్నారేమో. కాంగ్రెస్ లో కూడా గొప్ప వక్తలు కనపడడం లేదు. లోక్ సభలో మల్లిఖార్జున ఖర్గే, రాజ్యసభలో ఆనంద్ శర్మ ప్రసంగాల్లో సృజనాత్మకత ఏమీ కనిపించదు.

తాజాగా రాజ్యసభలో ప్రవేశించిన బిజెపి అధ్యక్షుడు అమిత్ షా ప్రసంగంలో స్వరవిన్యాసం తప్ప సరుకు పెద్దగా లేదు. ఒక పార్టీ అధ్యక్షుడు ప్రసంగిస్తే అందులో గాఢత కానీ, గాంభీర్యం కానీ, విషయ నాణ్యత కానీ ఉండాలి. కాని అవేమీ ఆయన ప్రసంగంలో లేవు. మోదీ పథకాలను ఏకరువు పెట్టడమే ఆయన గంటన్నర సేపు చేసిన ప్రసంగంలో ప్రధానంగా ఎంచుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రతిసారీ వెంకయ్య లేదా అరుణ్ జైట్లీ చర్చను ప్రారంభించేవారు. . ఈసారి జూనియర్ సభ్యుడైన అమిత్ షాకు ఆ బాధ్యత అప్పగించారు. పార్టీ అధ్యక్షుడు కావడమే ఆయన అర్హతగా కనిపించింది. ఇక లోక్ సభలో మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను రాకేశ్ సింగ్ అనే ఒక ఎంపికి అప్పగించారు. దాదాపు 50 పేజీలకు పైగా ప్రసంగాన్ని రాసుకువచ్చిన ఈ ఎంపి కి ఒక్కో పథకంపై మాట్లాడడానికే గంటకుపైగా సమయం సరిపోయింది. రాజ్యసభలో అమిత్ షా ప్రసంగం చేసేటప్పుడు ప్రక్కనే ఉండి ప్రోత్సహించిన మోదీ లోక్ సభలో ఇదే అంశంపై తమ పార్టీ ఎంపి చర్చను ప్రారంభించినప్పుడు సభలో కనపడలేదు. రాష్ట్రపతి ప్రసంగం అంటే ప్రతి ఏడాదీ ప్రభుత్వం ప్రజలకు సమర్పించే విధాన పత్రం. అంతటి కీలకమైన విషయంపై చర్చ ప్రారంభమైనప్పుడు ప్రధానమంత్రి మాత్రమే కాదు, అనేక మంది కేంద్రమంత్రులు, బిజెపి ఎంపిలు కనపడలేదు. 273 మంది ఎంపిల్లో కేవలం వందమంది ఎంపిలు మాత్రమే కనపడ్డారు. వారిలో కొందరు నిద్రకు జోగుతూ కనపడగా, కొందరు ముచ్చట్లు చెప్పుకుంటూ, మొబైల్ ఫోన్లు చూసుకుంటూ కనపడ్డారు. సినీరంగానికి చెందిన కిరణ్ ఖేర్, హేమమాలిని లాంటి వారు కాస్సేపు కూర్చుని మధ్యలోనే వెళ్లిపోయారు. ఎవరికీ తమ సభ్యుడు ప్రారంభించిన ప్రసంగంపై ఆసక్తి అంతకనపడలేదు .విచిత్రమేమంటే రాజ్యసభలో తృణమూల్ ఎంపిలు తమ రాష్ట్ర గవర్నర్ పేరు ఎత్తినందుకే సభను చైర్మన్ మూడుగంటలపాటు వాయిదా వేయగా, లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ఎంపిలు అడ్డుతగులుతున్నా స్పీకర్ చర్చను అలాగే కొనసాగించారు.

పార్లమెంట్ కు ఎలాంటి సభ్యులను పంపించాలి? పార్లమెంట్ లో ఎలా ప్రమాణాలు నెలకొల్పాలి? ఒక ఎంపి తాను ఎన్నికై వచ్చిన రాష్ట్రానికి, పార్టీకి ఎలాంటి గౌరవం కల్పించాలి? తాను ఏ అంశంపై మాట్లాడాలి? దేనిపై ప్రావీణ్యం సంపాదించాలి? అన్న విషయాలకు ఇటీవలికాలంలో పెద్దగా ఎవరూ ప్రాదాన్యతనిస్తున్నట్లు లేదు. డబ్బు, కులం, ఇతరత్రా రాజకీయ సమీకరణాలు అభ్యర్థుల ఎంపికకు కారణమవుతున్నాయి. దీని వల్ల పార్లమెంట్ లో అంతర్గత భద్రత, విదేశాంగనీతి, ఆర్థిక వ్యవహారాలు, ప్రభుత్వ పథకాలు, దేశ రక్షణ మొదలైన అంశాలపై సీరియస్ గా చర్చించి ప్రభుత్వానికి, ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేయాలని భావించేవారు తక్కువవుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే సభ్యుల్లో ప్రమాణాలు సరిగా ఉంటే పరిపాలనకు సంబంధించిన అనేక సవాళ్లు పరిష్కారమవుతాయని, సంస్థలు పటిష్ఠమవుతాయని, సరైన చట్టాలు చేయగలుగుతామని చాలా మంది అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఎన్నికైన వారికి నిజాయితీ, వ్యక్తిత్వం, సమర్థత, ప్రమాణాలు ఉంటే రాజ్యాంగంలోని లోపాలను కూడా సవరించుకోవచ్చునని తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇప్పుడు రాజ్యాంగాన్ని కాలరాసినా, అన్ని వ్యవస్థలతో చెలగాటమాడినా, వ్యక్తుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రమాదంలో పడినా, ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల జీవితాలతో చెలగాటమాడినా ఎవరూ ప్రశ్నించలేని, కనీసం గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఎప్పుడో కాని రైతుల ఆత్మహత్యల వంటి సమస్యలు పార్లమెంట్ లో చర్చకు రావడం లేదు. పార్లమెంట్ ప్రజలకోసమేనా అని ప్రజలే అనుకోకుండా జాగ్రత్త పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

బిజెపి నుంచి ఈ సారి పెద్ద ఎత్తున సభ్యులు ఎన్నికైనప్పటికీ చాలా మంది ఎంపిలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చుట్టుప్రక్కల ఉన్నప్పుడు సభల్లో ఉండడమో, లేక సెంట్రల్ హాలు లో కాలక్షేపం చేయడమో జరుగుతోంది. నేరుగా ఎన్నికైన ఎంపిలెందరో ఉండగా, మాజీ అధికారులు మంత్రులుగా మారి తమ ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం వారికి అంతగా రుచించడం లేదు. మరో వైపు గతంలో మాదిరి స్థాయీ సంఘాల సమావేశాల్లో కూడా సీరియస్ గా చర్చలు సాగడం లేదు. వాటి నివేదికల్లో కూడా పస ఉండడం లేదు. బహుశా ప్రభుత్వమే పార్లమెంట్ సమావేశాలకు, సంప్రదాయాలకు, కీలకమైన చర్చలకు వేదిక కాకూడదని, ఏదో మొక్కుబడిగా సమావేశాలను నిర్వహించి తాను అనుకున్న ఎజెండాను అమలు చేసేందుకు మాత్రమే పార్లమెంట్ ను ఉపయోగించుకోవాలని భావిస్తున్నదా అన్న అనుమానాలకు ఆస్కారం కలుగుతున్నది. గుజరాత్ ఎన్నికల కోసం శీతాకాల సమావేశాలను వాయిదా వేయడం, కొత్త సంవత్సరంలో కూడా ఈ సమావేశాలను కొనసాగించడం, కీలకమైన బిల్లులపై చర్చలకు తమ సభ్యులు రాకపోయినా చర్యలు తీసుకోకపోవడం, రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు కూడా ఒక వ్యూహరచన వంటిది అనుసరించకపోవడం సభపై మోదీ సర్కార్ అనాసక్తిని వెల్లడిస్తున్నది. సభను సజావుగా నడిపించేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ ఎలాంటి స్వతంత్ర నిర్ణయాలూ తీసుకోలేకపోతున్నారు. హోంమంత్రి కూడా తన వద్దకు వచ్చే ప్రతినిధి వర్గాలకు స్పష్టమైన జవాబు ఇవ్వలేకపోయేవారు. కాంగ్రెస్ హయాంలో మంత్రుల నుంచే ఒక స్పష్టమైన జవాబు వచ్చేది కనుక సభ్యులకు పెద్దగా ప్రదానమంత్రిని కలిసే అవసరం ఉండేది కాదు. ఇప్పుడు మంత్రులు స్పష్టమైన జవాబులు ఇవ్వలేకపోతున్నారు సరికదా, ప్రధానమంత్రి వద్దకు వెళ్లినా అంత స్పష్టత రావడం లేదు. ప్రధానమంత్రి మోదీ కనుసన్నల్లో పడేందుకు, ఆయన దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, ప్రతి అంశానికీ ఆయన వైపూ, ఆయన కార్యాలయం వైపూ చూడడం, ఎంపిలు తాము చేసే ప్రతి ప్రసంగంలోనూ మోదీ ని ఆకాశానికెత్తుతూ, ఈ భూదేవి గర్వించదగ్గ పుత్రుడుగా అభినందించడం స్పష్టంగా కనిపిస్తోంది. ఏ అంశంపై మోదీ ఎలా స్పందిస్తారో, ఎలాంటి హావభావాలు ప్రదర్శిస్తారో, ఎలా వ్యాఖ్యానిస్తారో ఆయన స్వబావాన్ని బట్టి అంచనా వేసే ప్రయత్నం జరుగుతుంది. అందుకే మంచికైనా,చెడ్డకైనా మోదీ వైపు చూడడం, ఆయన ను విమర్శించడం సహజంగా మారింది.



చాలా మంది ఎంపిలకు పార్లమెంట్ అంటే ఒకరిపై మరొకరు విమర్శనాస్త్రాలు గుప్పించడం, అరుచుకోవడం, పరస్పరదాడులు చేసేందుకు వేదికగా కనపడుతోంది. కొంతమంది ఎంపిలకు పార్లమెంట్ తమ వ్యాపారాలను పెంచుకునేందుకు, పైరవీలు చేసుకునేందుకు కేంద్రంగా మారింది. రాష్ట్రాల అవసరాలను కేంద్రం పట్టించుకోకపోవడంతో ఆయా రాష్ట్ర ఎంపిలకు నిరసన ప్రదర్శనలు నిర్వహించడం, పార్లమెంట్ ను స్తంభింపచేయడం మినహా వేరే మార్గం లేకపోయింది. తమ అవసరాల గురించి సభలో ఎంత అనర్గళంగా వివరించినా, వినతిపత్రాలు సమర్పించినా, నేతల చుట్టూ చక్కర్లు కొట్టినా పనులు రాకపోవడంతో ఆఖరుకు నిరసనే తప్పనిసరిగా మారింది. ఎంపిలు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తుంటే అదొక మామూలు సంఘటనగా భావించే పరిస్థితి ఏర్పడింది.

పార్లమెంట్ అంటే కేవలం ప్రసంగాల వేదిక కాదు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామిక సంస్థలను పటిష్ఠం చేసేందుకు, దేశ అభివృద్ధికి అవసరమైన విధాన నిర్ణయాలు చేసేందుకు ప్రధాని నుంచి ప్రజా ప్రతినిధుల వరకూ జరిగే సమిష్టి కృషికి దర్పణంగా పార్లమెంట్ కనిపించాలి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బిజెపి అధ్యక్షుడు అమిత్ షా అనేక వేదికల్లో చేసే ప్రసంగాలకూ పార్లమెంట్ లో చేసే ప్రసంగాలకూ పెద్దగా తేడా ఉండడం లేదు. ప్రసంగాల విన్యాసాలు, హావభావాల వల్ల ప్రజాస్వామిక విలువలను కాపాడలేము. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అన్న భావనను పార్లమెంట్ లోనూ, బయటా మనసా వాచా కర్మణా అనుసరిస్తున్నట్లు రుజువు చేసుకోవడం నినాదం చేసినంత సులభం కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

'వలస', 'సుంకాల' విలీనం

సెప్టెంబర్ 11 ఉగ్రవాద దాడుల అనంతరం అమెరికాలో అమలులోకి వచ్చిన పాలనా సంస్కరణలలో ప్రధానమైనది ఇమిగ్రేషన్, కస్టమ్స్ విభాగాలను కలిపివేయడం. పలు సరిహద్దు భద్రతా సంస్థల, రెవెన్యూ చట్టాలను అమలు చేసే ఏజెన్సీల విధులు, అధికారాలను సమన్వయపరచి వాటిని "అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్" గా సుసంఘటితం చేశారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం కూడా ఇటీవల ఇమిగ్రేషన్, కస్టమ్స్ విభాగాలను విలీనం చేపి ఆస్ట్రేలియన్ బోర్డర్ ఫోర్స్ అనే ఒక కొత్త ఏజెన్సీని సృష్టించింది.

ఈ విలీనానికి మూలకారణం విమానాశ్రయాలు, నౌకాశ్రయాల వద్ద ప్రయాణీకులు, సంస్థలు 'ఒక అధికారి' లేదా 'ఒక అధికార సంస్థ'తో వ్యవహరించే సౌకర్యం కల్పించడానికేనని చెప్పవచ్చు ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలను మిళితం చేయడం, అలాగే రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో కలిపివేయడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని పెంపొందించడానికి న్యూఢిల్లీ పాలకులు విశేష శ్రద్ధ చూపుతున్నారని స్పష్టమవుతుంది. మరి హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఇమిగ్రేషన్ విభాగాన్ని, ఆర్థిక మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సిబిఇసి) తో విలీనం చేసే విషయమై విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయమాసన్నమయింది. విలీనంతో ఏర్పడే కొత్త సంస్థకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి)గా నామకరణం చేయాలి.

జాతి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని సిబిఇసి కింద 'ఇండియన్ బోర్డర్ ఫోర్స్' లేదా ఇండియన్ బోర్డర్ ప్రొటెక్షన్ ఫోర్స్' అనే కొత్త సంస్థ నేర్పాటు చేయాలి. సరిహద్దుల రక్షణను బలహీనపరచడానికి ప్రయత్నించే వ్యక్తుల, స్మగ్లర్ల, మాఫియా సంస్థలకు వ్యతిరేకంగా మొదటి రక్షణ సదుపాయంగా ఈ కొత్త సంస్థను రూపొందించాలి. ఈ సంస్థకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలన్నిటినీ సమకూర్చాలి. సంస్థ సిబ్బంది చురుకుగా, సమర్థంగా వ్యవహరించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాలి.



సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్) స్థానంలో కస్టమ్స్ ఆర్మ్‌డ్ యూనిట్ నేర్పాటు చేయాలని సిబిఇసి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను తక్షణమే అమలుజరపాలి.

అంతర్జాతీయ విమానాశ్రయాల ద్వారా దేశంలోకి రాకపోకలు సాగించే ప్రయాణికులు మూడు ఏజెన్సీల– ఇమిగ్రేషన్, కస్టమ్స్, సిఐఎస్ ఎఫ్–తో వ్యవహరించవలసివస్తోంది. ఈ క్రమంలో వారు చాలా చికాకులకు గురికావలసివస్తోంది. ప్రతిపాదిత కొత్త సంస్థ ఈ మూడు ఏజెన్సీల విధులను నిర్వర్తించేదిగా ఉండాలి. దీని వల్ల ప్రయాణికులకు అనవసర ప్రయాసలు తొలగిపోతాయి. అంతర్జాతీయ విమానాశ్రయాల ప్రవేశ, నిష్క్రమణ ప్రదేశాల వద్ద ఒకే విధమైన పద్ధతులను అమలుపరచాలి.

ఇమిగ్రేషన్, కస్టమ్స్ విభాగాల విలీనం తొలుత కొన్ని అడ్డంకులను సృష్టించినప్పటికీ సంబంధిత విధులను మరింత పటిష్ఠంగా నిర్వహించడం సాధ్యమవుతుంది. ప్రజలధనం గణనీయంగా ఆదా అవుతుంది . చట్ట విరుద్ధ కార్యకలాపాల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించడానికి ఈ విలీనం విశేషంగా తోడ్పడుతుంది.

ఇమిగ్రేషన్ విభాగం సత్వరమే 'ఇమిగ్రేషన్, వీసా అండ్ ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్' (ఐవిఎఫ్‌ఆర్‌టి) ప్రాజెక్టును అభివృద్ధిపరచాల్సిన అవసరమున్నది భద్రతా ఏర్పాట్లను పటిష్ఠం చేయడంతో పాటు చట్టబద్ధ ప్రయాణికులకు అవసరమైన సేవలన్నిటిని సమర్థంగా సమకూర్చడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉండాలి. దేశంలోకి రాకపోకలు సాగిస్తున్న సమస్త ప్రయాణికుల, విమానయాన సంస్థల సిబ్బందికి సంబంధించి సమగ్ర వివరాల డేటాబేస్‌గా 'ఇండియన్ కస్టమ్స్ అడ్వాన్స్‌డ్ ప్యాసెంజర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్' (ఎపిఐఎస్) వ్యవహరిస్తోంది.

ఐవిఎఫ్ ఆర్‌టి, ఎపిఐఎస్ రెండిటినీ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసి) అభివృద్ధి పరచింది . ఈ రెండు ప్రాజెక్టుల లక్ష్యమూ, లక్షణాలు ఒకే విధంగా ఉంటాయి. కనుక ఈ రెండిటినీ విలీనం చేయడం మంచిది. దీనివల్ల అలాంటి ప్రాజెక్టులను డూప్లికేట్ చేయడం అసాధ్యమవుతుంది. ప్రజల సొమ్ము దుర్వినియోగాన్ని అరికట్టడం సాధ్యమవుతుంది.

పాలనా విషయాలకు వస్తే ఇమిగ్రేషన్ విభాగంలో అంకిత భావంతో పనిచేసే సిబ్బంది కొరత ఉన్నది. ఈ విభాగంలో పనిచేసే వారందరూ దాదాపుగా ఇతర విభాగాల నుంచి డెప్యుటేషన్ మీద వచ్చిన వారే కావడం అందుకు ఒక కారణంగా చెప్పవచ్చు. రాష్ట్ర గూఢచారి విభాగాలు, సిబిఐ లేదా సమాంతర సైనికదళాల సిబ్బందిని డెప్యుటేషన్ మీద ఇమిగ్రేషన్ విభాగంలో నియమించడం జరుగుతోంది. ఇటీవల 2.8 లక్షల మంది సిబ్బందిని నియమించనున్నట్టు కేంద్రం ప్రకటించింది. వీరిలో 41 వేల మందిని కస్టమ్స్, జీఎస్టీ విభాగాలకు కేటాయిస్తారు.

ఇమిగ్రేషన్, కస్టమ్స్ విభాగాల విలీనంతో సిబ్బంది సమస్య తీరిపోగలదు. సిబిఇసి నుంచి అధికారులు, ఉద్యోగులను కేటాయించడం సాధ్యమవుతుంది. కొన్ని పోస్టులను డెప్యుటేషన్ సిబ్బందితో భర్తీచేయవచ్చు. హిందుపూర్ (ఆంధ్రప్రదేశ్)లోని ఐదు వందల ఎకరాల ఎన్ఎసిఐఎన్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్) వద్ద భారీ మౌలిక సదుపాయాలను సిబిఇసి సృష్టిస్తోంది. ఇండియన్ బోర్డర్ ఫోర్స్, కస్టమ్స్, జిఎస్టీ అధికారులకు శిక్షణ ఇవ్వడానకి ఈ సదుపాయాలు ఉపయోగపడతాయి.

సిబిఇసి కింద ఏర్పాటయ్యే కొత్త ఏజెన్సీ వల్ల ఒక ప్రధాన ప్రయోజనమున్నది. సమర్థంగా పనిచేస్తున్న కస్టమ్స్ ఓవర్సీస్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ మొదలైన సంస్థలతో కొత్త ఏజెన్సీ మరింత మెరుగైన సమన్వయ సహకారాలతో పనిచేయడం ఆర్థికమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అన్ని విమానాశ్రయాల వద్ద ఒకే విధమైన పద్ధతులను అనుసరించడం సాధ్యమవుతుంది. అలాగే దర్యాప్తు సంస్థల మధ్య సహకారం పెంపొంది నేర నియంత్రణ కార్యకలాపాలు పటిష్ఠంగా సాగడానికి దోహదం జరుగుతుంది.

ఇమిగ్రేషన్, కస్టమ్స్ విభాగాల విలీనం తొలుత కొన్ని అడ్డంకులను సృష్టించినప్పటికీ దేశ సరిహద్దులకు లోపల వెలుపల సంబంధిత విధులను మరింత పటిష్ఠంగా నిర్వహించడానికి వెసులుబాటు కలుగుతుంది. ప్రజలధనం కూడా గణనీయంగా ఆదా అవుతుంది . దేశ ఆర్థిక వ్యవస్థ సరిహద్దులను మరింత పటిష్ఠం చేయడానికి ఈ విలీనం విశేషంగా దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు.

■ కల్యాణ్ రేవెళ్ల

(డిప్యూటీ కమిషనర్, ఇండియన్ రెవెన్యూ సర్వీస్)

చరిత్రను కాలరాచే విస్తరణ వద్దు

అభివృద్ధి ప్రధానంగా, ఆధునికత సూచికగా, సాంకేతిక విలువలే ప్రామాణికంగా పరిగెడుతున్న నగరాలు సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. ఎన్నో భిన్న సంస్కృతులకు నిలయమైన చారిత్రాత్మక నగరం హైదరాబాద్ అటువంటి నగరాలలో ఒకటి. ఈ నగర విశిష్టత ఇక్కడి రాజ్యాల, రాజుల చరిత్రనే కాకుండా నగర భౌగోళిక స్వరూప స్వభావాల ప్రాధాన్యతను నగర మనుగడ కోణంలోంచి విశదపరుస్తుంది. మరీ ముఖ్యంగా ఈ నగర ఉనికికి ఆధారం అయిన చెరువుల వ్యవస్థ ద్వారా. కుండపోత వర్షాలకు హైదరాబాద్ మహానగరంలో వర్షం మూలంగా సంభవించే సమస్యలు... వరదలు, ప్రజారవాణాలో అంతరాయం, నాలాలు ఉప్పొంగడం, మురుగునీటి శుద్ధి ట్యాంకులు సరిగా పనిచేయకపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం, చెట్లుకూలడం, ఇళ్ళు మునిగిపోవడం, పాతగోడలు కూలడం, ప్రాణ, ధన నష్టం జరిగడం, రోజువారీ విధులకు ఆటంకం కలగడం, పడిన వర్షపునీరు చెరువులలోకి చేరకపోవడం, పడిన వర్షపు నీరు ఎందుకూ ఉపయోగ పడకపోవడం... ఇలా ఎన్నైనా చెప్పొచ్చు.

ఇలాంటి సమస్యల పరిష్కారానికి పరిపాలనా సంస్థలు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, అవి సమస్యలను నివారించడంలో గానీ, వాటి తీవ్రతను తగ్గించడంలో గానీ ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. రహదారుల మీద నిలిచిన నీటిని తొలగించడం, పాడైన విద్యుత్ తీగలను సరిచేయడం, లోతట్టుప్రాంతాల్లో వరదలకు గురైన ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పడిపోయిన ఇళ్ళ శిథిలాలను తొలగించడం, రక్షిత ప్రాంతాల మీదుగా ట్రాఫిక్ మళ్ళించడం, నగర ప్రజలకు తగు సూచనలు చేయడం వంటివి కేవలం తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే.

వర్షంవల్ల సంభవించే సమస్యల స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి వాటి మూలకారణాలు కనుక్కోవడానికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ (స్థానిక, జాతీయ, అంతర్జాతీయ) సంస్థలెన్నో ప్రయత్నాలు చేస్తూ జీవులను, ప్రాంతాలను రక్షిస్తున్నాయి. ఈ కోవలో విజయం సాధిస్తున్న అతికొన్ని పథకాలలో బయో రీజియోనలిజం కాన్సెప్ట్(Bioregionalism concept) ఆధారంగా రూపొందించిన పథకాలు ముఖ్యమైనవి. ఈ కాన్సెప్ట్ (concept) సూత్రప్రాయంగా చెప్పే అంశం బయోరీజియన్(Bioregion)లలో ఉండే సమస్యలను భూమి లేదా పరిపాలనా పరిమితుల ఆధారంగా కాకుండా సమస్యల తీవ్రతను, అక్కడ జీవరాశుల చరిత్రతో చూడాలి అన్నది. ఈ కాన్సెప్ట్‌కు ఉత్తర అమెరికా లోని కాలిఫోర్నియా ప్రాంతంలో 1960–70 దశకంలోనే బీజం పడ్డప్పటికీ, దీని ప్రాముఖ్యత 1990 దశకం నుంచి పెరిగింది.

భారతదేశంలోని వివిధ ప్రభుత్వ సంస్థలు నగరాలలోని సమస్యల పరిష్కారానికి అనుసరించే పద్ధతులను నిశితంగా గమనిస్తే రెండు విషయాలు తెలియవస్తాయి. ఒకటి– సమస్యల తీవ్రత ఆధారంగా ఆయా ప్రభుత్వ వ్యవస్థలు స్పందించే తీరు, వాటి కార్యాచరణ. రెండవది– ఆయా ప్రభుత్వాలు సమస్యలను అర్థం చేసుకున్న తీరు. ఉదాహరణకు, దక్కన్ పీఠభూమిలో భాగం అయిన హైదరాబాద్ నగరం పెద్ద రాతికొండలు, మధ్యలో భూభాగం, వీటి మధ్యలో చిన్న చిన్న చెరువులు, కుంటలు, వీటి కలయికకు కారణమైన వాగులు, వంకలు, నదీప్రవాహాలతో ఇమిడి ఉంది. దీనిని 'గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ' అంటారు. ఈ వ్యవస్థ ద్వారా జరిగే ప్రవాహాల సముదాయం ఇక్కడ జీవవ్యవస్థకు ప్రాణనాడులుగా మారాయి. దీని ఆధారంగా హైదరాబాద్ నగరాన్ని సిటీ ఆఫ్ లేక్స్ (city of lakes)గా చరిత్రలో వర్ణించడం జరిగింది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన చెరువుల వ్యవస్థ కాలక్రమేణా ఎన్నో మార్పులకు గురైంది. ఈ ప్రాంతంలోని చెరువుల వ్యవస్థ కాకతీయుల వైభవానికి, కుతుబ్ షాహి మరియు నిజాం ప్రభువుల ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో దోహదపడుతూ ప్రజల సంస్కృతికి అద్దం పడుతుంది. దీన్ని బతుకమ్మ పండుగ విశిష్టతలో, చెరువు నీటితో సంబంధం గల మిగతా పండుగలలో చూడవచ్చు.

ఇందులో మొదట చెప్పుకోవాల్సిన అంశం నగరీకరణ, నగరవిస్తరణ. హైదరాబాద్ నగర విస్తరణ 1970– 80 దశకంలో ప్రారంభమైనప్పటికీ 1990–2000 దశకంలో ఎక్కువగా జరిగింది. ఇందుకు కారణం ప్రపంచీకరణ నేపథ్యంలో జరిగిన నగరీకరణ, ఉచిత మార్కెట్ విధానాలు, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్సుకత (హైదరాబాద్ నగరాన్ని బెస్ట్ సిటీగా, హైటెక్ సిటీగా మరియు విశ్వనగరంగా చేయాలనే పట్టుదల) గా చెప్పవచ్చు. దీని ఫలితం, నగరవిస్తరణకు ఆయా ప్రభుత్వాలు అనుసరించిన విధివిధానాల వలన నగర భూభాగంలో సంభవించిన మార్పులు కాలక్రమేణా తీవ్రమైన సమస్యలుగా మారాయి. ఇవి ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన, ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా జరిగిన ప్రభుత్వ సౌకర్యాల కల్పన, రియల్ ఎస్టేట్ ద్వారా జరిగిన కార్యకలాపాల ఫలితంగా భూమి వినియోగంలో మార్పులు, జనాభా పెరుగుదల, పెరిగిన జనాభాకు తగిన సౌకర్యాలు కల్పించకపోవడం, బస్తీలు, మురికివాడలు విస్తరించడం, చెరువులు, ప్రవాహాలు ఉండే ప్రాంతాలు నివాస ప్రాంతాలుగా ఏర్పడటం, పశుపక్ష్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గడం, వాతావరణంలో మార్పు, నీటి కాలుష్యం, చెరువు గట్టు ప్రాంతాలు ప్రధాన రహదారులుగా మారడం, చెరువు అలుగు ప్రాంతాలలో మార్పులు జరిగాయి. చెరువు గట్టుమీద ఉండే కట్టమైసమ్మ దేవాలయాలు ప్రధాన రహదారులలో భాగం కావడం, ఇక్కడ ప్రకృతి వనరులతో ప్రజలకు ఉండే సంబంధం తెగిపోవడం జరిగింది. ఉదాహణకు షేక్ పేటలోని కొత్తచెరువు మీద జరిగిన వివిధ కార్యకలాపాలు ప్రధానంగా ఫిల్మ్ నగర్ నుంచి కుతుబ్ షాహీ టూంబ్స్ ద్వారా గోల్కొండ కోట వరకూ వేయబడ్డ రహదారి, కొత్త చెరువుకు బాతుర్ కుంట నుంచి ప్రవహించే వర్షపు నీరు చెరువులోకి రాకుండా చేసింది. ఫలితంగా కొత్తచెరువు దిగువకు ప్రవహించే నాలాలకు ఇరువైపుల వ్యాప్తి చెంది ఉన్న ప్రాంతాలతోపాటు, కొత్త చెరువు లోతట్టు ప్రాంతాలు అయిన నదీమ్ కాలనీ, టోలీచౌకి, లంగర్ హౌస్ చుట్టు పక్కల ప్రాంతాలలో వరదలు సంభవించాయి. వీటి కారణంగా, వర్షపు నీరు దిగువున ఉండే చెరువులోకి ప్రవహించక పోవడం మాత్రమే కాక మూసీనదిలోకి చేరడం లేదు. ఇది కేవలం షేక్ పేటలోని కొత్త చెరువు ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదు. ప్రస్తుతం నగరంలోని ప్రతి సమస్యాత్మక ప్రాంతం షేక్ పేట కొత్త చెరువు లాంటి చరిత్రనే చెపుతున్నాయి.



హైదరాబాద్‌లోని షేక్ పేట కొత్తచెరువు కింద భాగాన రైతుల జీవనోపాధి ఉందని, పిల్లకాలువలు, చెరువులు, చెరువు కింద ప్రాంతాలు దెబ్బతింటాయని గ్రహించి ఉన్నట్లయితే నగర ప్రణాళికా రూపకర్తలు ఆ ప్రాంతాన్ని వివిధ నివాస, వాణిజ్య సముదాయాలకు, రహదారులకు కేటాయించి ఉండేవారు కాదు. నగర విస్తరణకు ఉద్దేశించిన ప్రాంతాలలో స్థానికుల చరిత్రను నిర్లక్ష్యం చేస్తే పట్టణీకరణ సమస్యలకు పరిష్కారం లభించదు.

దీనిని నగర విస్తరణ కోణం నించి చూస్తూ నగర నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించే ప్రణాళికా వ్యవస్థ ద్వారా అర్థం చేసుకోవాలి. నగర ప్రణాళికా వ్యవస్థా విధానం ద్వారా ప్రపంచ పటంలో చాలా నగరాలు ఎంతో గొప్ప కీర్తిని గడించాయి. అలాగే సర్వనాశనం అయిన నగరాలూ ఉన్నాయి. షేక్ పేట కొత్తచెరువు కింది భాగాన, రైతుల జీవనోపాధి ఉందని అలాగే పిల్లకాలువలు, చెరువులు, చెరువు లకింది ప్రాంతాలు దెబ్బతింటాయని గ్రహించి ఉన్నట్లయితే నగర ప్రణాళికా రూపకర్తలు ఆ ప్రాంతాన్ని వివిధ నివాస, వాణిజ్య సముదాయాలకు, రహదారులకు కేటాయించి ఉండేవారు కాదు. అంతేకాకుండా బాల్కాపూర్ (పురాతనమైన) నాలా హైదరాబాద్ నగరం వెలుపల పుట్టి ఎన్నో గ్రామాలలోని నీటి కుంటలు/చెరువులను కలుపుతూ చివరికి హుస్సేన్ సాగర్ లో కలుస్తుంది. ఈ నాలా ఆక్రమణల కారణంగా చుట్టూ ఉండే ప్రాంతాలు వర్షం పడిన ప్రతిసారీ ముంపుకు గురవుతున్నాయి. దీని పరిష్కారానికి కేవలం మలక చెరువు నుంచి హుస్సేన్ సాగర్ వరకు శుభ్రం చేస్తే బాల్కాపూర్ నాలా బతికినట్లు కాదు. దానికి ఎగువన ఉండే ప్రాంతాలలో ప్రవహించే నాలా చరిత్రను అక్కడి ప్రజల చరిత్రతో చూస్తూ దాన్ని పరిరక్షణ చేయాలి, లేనిచో వాటికీ పరిష్కారం లభించదు.

ఇది కేవలం బాల్కాపూర్ నాలాకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఇది షేక్ పేట నుంచి దిగువకు ప్రవహించే అన్ని చెరువులకు వర్తిస్తుంది. అలాగే మూసీ నదికి, కృష్ణా, గోదావరి నదులకు, నాలుగు దేశాలను కలుపుతూ ప్రవహించే బ్రహ్మపుత్రానదికీ వర్తిస్తుంది. అంతే కాకుండా భౌగోళిక పరంగా చూసుకున్నప్పుడు ఇది కేవలం హైదరాబాద్ నగరం ఉండే తెలంగాణ ప్రాంతానికి మాత్రమే కాకుండా భారతదేశ వ్యాప్తంగా ఇలాంటి సమస్యలతో సతమతవుతున్న చారిత్రాత్మక నగరాలు అయిన బొంబాయి, ఢిల్లీ, చెన్నై, కలకత్తా, బెంగళూరుతో పాటు తక్కిన నగరాలు అయిన అహ్మదాబాద్, గువహటి, జమ్ము కాశ్మీరుకు కూడా వర్తిస్తుంది. అందువలన నగరాలలో సంభవించే సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కారాలను రూపొందించుకోవడానికి కృతనిశ్చయంతో పాటు వాటి చారిత్రక నేపథ్యం ఎంతో కీలకం.

■ విద్యాపోగు పుల్లన్న

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థి

తెలంగాణ సెంటిమెంటుకు కాలం చెల్లింది!

- కేసీఆర్ పాలనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం
- 2024 నాటికి ప్రత్యామ్నాయంగా బీఎల్ఎఫ్
- సీపీఎం రాజకీయ ముసాయిదాపై చర్చలో నేతలు
- కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలి: రాఘవులు
- నేటితో ముగియనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలు

నల్లగొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సెంటిమెంట్ అనే అంశానికి కాలం చెల్లిందని, రాష్ట్ర ఏర్పాటును సీపీఎం అడ్డుకుందనే అంశం ఇక మరుగున పడినట్లేనని ఆ పార్టీ భావిస్తోంది. నల్లగొండలో ఈ నెల 4 నుంచి జరుగుతున్న సీపీఎం రాష్ట్ర రెండో మహాసభల్లో భాగంగా రాజకీయ ముసాయిదాలో ఈ అంశాన్ని పేర్కొంది. మహాసభల్లో మూడు రోజులుగా కార్యదర్శి నివేదిక, రాజకీయ ముసాయిదాపై చర్చలు జరుగుతున్నాయి. కాగా నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఆచరణలో విఫలమయ్యారని, దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇక తెలంగాణ సెంటిమెంట్ అనేది ఒక చారిత్రక అంశమేనని పార్టీ నేతలు తేల్చారు. జనాన్ని సెంటిమెంట్ ఉచ్చులో పడేసి పెట్టుబడిదారులు, పాలకులు ఒక్కటై రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని రాజకీయ ముసాయిదాలో పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చేపట్టిన మహాజన పాదయాత్రతో తెలంగాణలో తమపై ఉన్న వ్యతిరేకత క్రమంగా తొలగిపోయిందని, టీ-మాస్ పేరిట చేపడుతున్న కార్యక్రమాలతో మధ్యతరగతి వర్గాలు సీపీఎంకు చేరువవుతున్నాయని అభిప్రాయపడ్డారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)కు సానుకూల వాతావరణం కనిపిస్తోందని, 2024 ఎన్నికల నాటికి ఇది బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని సీపీఎం నేతలు విశ్వసిస్తున్నారు. ఈ కూటమిలోకి సీపీఐ, న్యూడెమోక్రసీని రప్పించేందుకు మరోమారు ఆ పార్టీలకు విజ్ఞప్తి చేయాలని అభిప్రాయపడ్డారు. ఇక పార్టీ కార్యదర్శిని స్థానిక కమిటీ సభ్యులు ఎన్నుకోవాలని, పై కమిటీలు కేవలం పరిశీలనకే పరిమితం కావాలని ముసాయిదా పేర్కొంది. కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం, ఒకటి, రెండు మార్పులతో రాష్ట్ర కార్యవర్గం కూడా పాతదే కొనసాగుతుందని అంటున్నారు. కాగా బుధవారం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికతో ఈ మహాసభలు ముగియనున్నాయి.


నల్లగొండలో సీపీఎం రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

నాలుగు డ్రై పోర్టులు ఏమయ్యాయి?

తెలంగాణలో మౌలిక సదుపాయాలకు సంబంధించి నాలుగు డ్రై పోర్టులు ఇస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం చెప్పిందని, ఇప్పటివరకూ ఒక్కటీ ఇవ్వలేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. గిరిజన యూనివర్సిటీ అడ్రస్ కూడా లేదని పేర్కొన్నారు. నాలుగేళ్లలో కేంద్రం ఏమిచ్చిందో సీఎం కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బడ్జెట్ కేటాయింపులపై ఏపీ సీఎం చంద్రబాబు నాటకం మొదలుపెట్టాడని, కేసీఆర్ మాత్రం అది కూడా చేయడం లేదని అన్నారు. అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై పోరాటానికి సిద్ధం కావాలని, లేదంటే ప్రభుత్వం విఫలమైనట్లేనని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రజల ఆశలను వమ్ము చేసిందని, ప్రధాని మోదీ చెబుతున్న అభివృద్ధి ఎజెండా ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు.

ఉద్యోగాలివ్వలేని దద్దమ్మ కేసీఆర్

నాలుగేళ్లలో ఎన్ని పోస్టులు నింపారు?.. నిరుద్యోగ యాత్ర ప్రారంభంలో ఉత్తమ్

- రాష్ట్రంలో మిగిలేది రెండే శక్తులు
- కోదండ కాంగ్రెస్ ఏజెంట్ కాదు
- కువైత్ బాధితుల్ని ఆదుకోవాలి : కుంతియా

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్.. ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేని దద్దమ్మ సీఎం కేసీఆర్ అని ఆరోపించారు. గాంధీభవన్ నుంచి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్రను మంగళవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు రాక యువకులు ఆత్మహత్య చేసుకుంటుంటే.. మంత్రి కేటీఆర్ సూటు, బూటు వేసుకుని విదేశాల్లో విలాసాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాకపోగా, దాదాపు 5వేల పరిశ్రమలు మూతపడి వేలాది కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. నాలుగేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేని చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడమే కాకుండా, నిరుద్యోగులకు భృతి ఇచ్చి అండగా ఉంటామన్నారు. కేసీఆర్ నియంతృత్వ పాలనను వ్యతిరేకంగా చేపట్టిన యాత్రను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిరుద్యోగ చైతన్య యాత్ర 49 రోజులపాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తుందన్నారు. కాగా, రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయంగా మిగిలిన బలమైన శక్తులు టీఆర్ఎస్, కాంగ్రెస్ రెండేనని కుంతియా అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. టీజేఏసీ నేత కోదండరాం పార్టీ ప్రకటనపై స్పందిస్తూ.. రాష్ట్రంలో కొత్తగా ఏ శక్తి అవతరించినా ఏదో ఒకవైపు చేరాల్సి ఉంటుందన్నారు. కోదండరాం కాంగ్రెస్ ఏజెంట్ అని టీఆర్ఎస్ విమర్శించడాన్ని తప్పుపట్టారు. ఆయన తమ ఏజెంట్ కాదని, ఉద్యమ కాలంలో ఆయన కేసీఆర్‌తోనే కలిసి పని చేశారని గుర్తు చేశారు. వారం, పది రోజుల్లో టీఆర్ఎస్, టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు ఉంటాయన్నారు. కాగా, కువైత్ ప్రభుత్వం క్షమాభిక్ష పథకం ప్రకటించిన నేపథ్యంలో అక్కడున్న భారతీయులను ఆదుకోవాలని కుంతియా విజ్ఞప్తి చేశారు. కువైత్‌లో వీసా, వర్క్ పర్మిట్లు పొడిగించుకోలేక 30 వేల మంది భారతీయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారందరికీ ప్రభుత్వమే ఉచితంగా టికెట్లు అందజేసి స్వదేశానికి రప్పించాలని డిమాండ్ చేశారు. బాధితులకు తమ వంతు సాయం అందజేసేందుకు ఈ నెల 12, 13 తేదీల్లో కాంగ్రెస్ బృందం కువైత్ వెళ్లనున్నట్లు వెల్లడించారు.



గాంధీభవన్ వద్ద నిరుద్యోగ చైతన్య యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్సీ కుంతియా, చిత్రంలో ఉత్తమ్, భట్టి తదితరులు


హైదరాబాద్ కలెక్టరేట్ ముందు విద్యార్థుల ధర్నాలో ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా అన్యాయం

- జనాభా మేరకు ప్రాతినిధ్యం లేదు: ఆర్. కృష్ణయ్య

నాంపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడుస్తున్నప్పటికీ బీసీల జనాభా మేరకు వారికి సరైన ప్రాతినిధ్యం లేదని, రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకురావాలంటూ మంగళవారం బీసీ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆందోళనలో పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లను కల్పించాలని, వారికి క్రిమిలేయర్‌ను తొలిగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర సర్వీసులో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ రంగాల్లోనూ రిజర్వేషన్లను కల్పించాలని, న్యాయస్థానాల్లోనూ బీసీ జడ్జీలను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీ రిజర్వేషన్ డిమాండ్‌పై రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోనూ ఆందోళనలు నిర్వహించారు.

మంచిర్యాల నుంచి కోదండ పోటీ!

- పార్టీ అధ్యక్షుడిగా కూడా ఆయనే
- టీజేఏసీలో విస్తృత ప్రచారం
- త్వరలోనే చేరికలు ప్రారంభం
- ఇప్పటికే ఐదుగురితో కమిటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): త్వరలో పార్టీని ఏర్పాటు చేయబోతున్నానని ప్రకటించిన టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని టీజేఏసీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇందుకు కోదండరాం కూడా సుముఖంగా ఉన్నట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని టీజేఏసీ నేతలు కోరుతున్నా ఆయన మాత్రం మంచిర్యాల వైపే మొగ్గు చూపుతున్నారని టీజేఏసీ ముఖ్యులు చెబుతున్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని జోగాపూర్ ఆయన స్వగ్రామం. ఈ గ్రామం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. అయితే ఆ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం. దీంతో ఆ నియోజకవర్గం పక్కనే ఉన్న మంచిర్యాల నుంచి పోటీ చేయాలని కోదండరాం భావిస్తున్నట్లు వారు చెబుతున్నారు. మరోవైపు పార్టీ అధ్యక్షుడిగా కూడా ఆయనే ఉండే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. అధ్యక్షుడి స్థానంలో ఉండి, ఎన్నికల్లో పోటీ చేయకపోతే భిన్నమైన సంకేతాలు వెళ్తాయని భావించడం వల్లే ఆయన పోటీకి సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే చాలాసార్లు మంచిర్యాల జిల్లాతో పాటు పూర్వ ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ నియోజకవర్గాల్లో కోదండరాం విస్తృతంగా పర్యటించారు. అక్కడ సంస్థాగతంగా తాము బలంగా ఉన్నట్లు టీజేఏసీ భావిస్తోంది. ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా సింగరేణి పరిరక్షణ యాత్రను కూడా గతంలో చేపట్టామని, ఈ పరిస్థితులన్నీ కలిసి వస్తాయని నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇక, ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని టీఆర్ఎస్‌తోపాటు వివిధ పార్టీల్లో సరైన గుర్తింపు, ప్రాధాన్యం లభించక అసంతృప్తితో ఉన్న నేతలను తన పార్టీలో చేర్చుకునేందుకు కోదండరాం సంప్రదింపులు, మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఐదుగురు సభ్యులతో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కాగా, కోదండరాం మంచిర్యాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం రాత్రి ఆయనను ఫోన్‌లో సంప్రదించగా అలాంటిది ఏమీ లేదని తోసిపుచ్చారు. ఇప్పుడే అంత దూరం ఆలోచించలేదని, తమకు చాలా పనులు ఉన్నాయని చెప్పారు. గతంలోనూ ఈ రకమైన ప్రచారం జరిగిందన్నారు.

పదవులన్నీ ఒకే సామాజికవర్గానికా?

- మాకు అధికారాలు లేకుండా పనులేనా!
- కాంగ్రెస్ నాయకత్వంపై బీసీ సాధికారిక కమిటీ సభ్యుల అసంతృప్తి?
- సాధికారిక కమిటీ తొలి సమావేశం..

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం పట్ల కొత్తగా ఏర్పాటైన బీసీ సాధికారిక కమిటీ సభ్యులు కొందరు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో పదవులన్నీ ఒక్క సామాజికవర్గానికే ఉన్నాయని, తమకు మాత్రం ఎలాంటి అధికారాలు లేకుండా పనులు మాత్రమే అప్పగిస్తున్నారని వారు కినుక వహించినట్లు సమాచారం. ఇటీవలే నియమించిన బీసీ సాధికారిక కమిటీ తొలి సమావేశాన్ని మంగళవారం గాంధీభవన్‌లో నిర్వహించిన నేతలు.. ఈ సందర్భంగా కమిటీకి పలు పనులను అప్పగించారు. బీసీలను సాధికారత దిశగా నడిపించేందుకు ఉన్న అవరోధాలేంటో పరిశీలించేందుకే సాధికారిక కమిటీని నియమించినట్లు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సూచన మేరకు నియమించిన ఈ కమిటీ 90 రోజుల్లో నివేదిక సమర్పించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల పేరిట చేపడుతున్న పథకాల్లో అవినీతిపై సాధికారిక కమిటీ అధ్యయనం చేసి ప్రజలకు చెప్పాలన్నారు. దీంతోపాటు కాంగ్రెస్ ఎలాంటి పథకాలు అమలు చేస్తే బీసీలకు న్యాయం జరుగుతుందో సూచించాలన్నారు. అయితే తమకు అధికారాలు కల్పించకపోతే ఏ హోదాతో జనంలోకి వెళ్లాలని పలువురు కమిటీ సభ్యులు ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా స్పందిస్తూ.. దానిని సవరించేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశామని చెప్పినట్లు తెలిసింది. కాగా పార్టీలో బీసీ సెల్ ఉండగా కమిటీ అవసరం ఎందుకొచ్చిందనే ప్రశ్న కూడా తలెత్తినట్లు, దీంతో బీసీ సెల్ మందకొడిగా పనిచేస్తున్నందునే కమిటీ అవసరం ఏర్పడిందని ఓ ముఖ్యనేత అన్నట్లు సమాచారం. సాధికారిక కమిటీ చైర్మన్ టి.నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, దాసోజు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా గతంలో తాము బీసీ ఫోరం పేరిట ఏర్పాటు చేసిన సమావేశం ఫలితమే సాధికారిక కమిటీ అని కమిటీ చైర్మన్ నాగయ్య, కన్వీనర్ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నాటి ప్రయత్నాన్ని గుర్తించిన అధిష్ఠానం.. తమను మరింత ప్రోత్సహించేందుకే ఈ కమిటీని నియమించిందన్నారు. ఓబీసీ సెల్‌కు ఇది వ్యతిరేకం కాదన్నారు.

9న ఓబీసీ సెల్ సమావేశం

ఈ నెల 9న టీపీసీసీ ఓబీసీ సెల్ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు సెల్ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్ ప్రకటించారు. బీసీ సాధికారిక కమిటీతో తమకు సంబంధం లేదని, తమది పార్టీకి అనుబంధంగా పని చేసే సంస్థ అని, పార్టీతో పాటు శాశ్వతంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్ కరెంట్ ఒప్పందం
వివరాలివ్వండి

- ప్రభుత్వాన్ని కోరిన అకౌంటెంట్ జనరల్
- రెండేళ్లుగా కొంటున్న తెలంగాణ సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పంద వివరాలు అందించాలని అకౌంటెంట్ జనరల్(ఏజీ) కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దాదాపు రెండేళ్ల నుంచి తెలంగాణ ప్రభుత్వం 1000 మెగావాట్ల విద్యుత్తును ఛత్తీస్‌గఢ్ లోని మార్వా ప్లాంట్ నుంచి కొనుగోలు చేస్తోంది. ఈ మేరకు 2015 సెప్టెంబరు 22న విద్యుత్తు కొనుగోలు ఒప్పందం(పీపీఏ) చేసుకుంది. యూనిట్ రూ.3.90 (రూ.2.70 స్థిర చార్జీలు, రూ.1.20 ఇంధన చార్జీలు)గా నిర్ణయించి విద్యుత్తును కొనుగోలు చేస్తున్నప్పటికీ డిస్కంలకు చేరడానికి దాదాపు రూ.5 పైనే వ్యయమవుతోంది. ఈ కరెంట్ వల్ల ఒక్క ఏడాదిలో సరఫరా నష్టాలు 225.83 మిలియన్ యూనిట్లుగా ఉండటం గమనార్హం. ఈ ఒప్పందం నష్టదాయకమని పలువురు నిపుణులు కూడా పేర్కొన్నారు. కానీ, అప్పట్లో ఛత్తీస్‌గఢ్‌లోనే ఎక్కువగా కరెంట్ లభ్యత ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు ఒప్పందం చేసుకుంది. దీనివల్ల ఉత్తరాది-దక్షిణాది గ్రిడ్‌కు మధ్య అనుసంధాన ప్రక్రియ కూడా జరిగింది. ఈ నేపథ్యంలో 1000 మెగావాట్ల కరెంట్ కొనుగోలులో స్థిరచార్జీలపైనా విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో జరిగే నష్టాలపై అకౌంటెంట్ జనరల్ దృష్టి సారించినట్లు సమాచారం.

కేసీఆర్‌ను గిన్నిస్‌లోకి ఎక్కించాలి: చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మాటలతో మభ్యపెడుతున్నందుకు, హామీలను విస్మరించినందుకు సీఎం కేసీఆర్‌ను గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం గిరిజన సమాఖ్య వర్క్‌షాప్‌లో మాట్లాడారు.



కొత్త ఉద్యోగంలో పాత కంపెనీ ప్రస్తావన

కొంతమంది కొత్తగా ఉద్యోగంలో చేరిన తరువాత పాత కంపెనీ గురించి కామెంట్లు చేస్తుంటారు. అంతేకాదు తోటి ఉద్యోగులు, అక్కడి బాస్‌లపై కూడా ప్రస్తావిస్తూ ఉంటారు. ఇది పూర్తిగా సదరు వ్యక్తిపై తప్పుడు అభిప్రాయాన్ని ఏర్పరుస్తుంది. వేరే చోట కొత్త పోస్టు కోసం ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు మీ మునపటి బాస్‌పై ప్రశ్న రావచ్చు. అయితే కోపం దిగమింగుకుని అబద్ధం చెప్పాల్సిన అవసరం లేదు. అలాగని నిజాన్ని నిష్ఠూరంగా వెల్లడించాల్సిన పనీ లేదు. ఒకింత సున్నితం మేళవించి నిజాన్ని నిఖార్సుగా చెప్పవచ్చు. అది ఎలా అంటే... పాత బాస్ కారణంగా ఎంత ఇబ్బంది పడినప్పటికీ దానిని వ్యక్తం చేసే విధానంలో మర్యాద తొంగి చూడాలి.

ఉద్యోగం మారిన పదిహేను వేల మందిని ఇటీవల సర్వే చేస్తే, డెబ్బయ్ శాతం మంది తమ బాస్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి దేశం, ప్రాంతం అన్న మినహాయింపే లేదు. 'టెరిబుల్', 'హారిబుల్' అని వ్యాఖ్యానించిన వారే ఎక్కువ. అయితే ఇదే విషయాన్ని ఇంటర్వ్యూలో అడిగినప్పుడు మాత్రం జాగ్రత్తగా వెల్లడించాలి.

1 నిజాయతీ వ్యక్తం కావాలి

బ్యాడ్ ఎంప్లాయర్ గురించి అడిగినప్పుడు నిజాయతీగా చెప్పడమే ఎప్పటికైనా మంచిది. అంతా మంచి అనుభవాలే ఉంటాయని అనుకోవడం కూడా వాస్తవం కాదు. మీ పాత బాస్ మంచి స్నేహితుడే కావచ్చు. అయినప్పటికీ కొన్ని విషయాల్లో మీ ఇద్దరికీ భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. అవి ఇబ్బంది కరంగానూ అనిపించవచ్చు. ఉదాహరణకు కుమార్ అనే ఉద్యోగి తన పాత బాస్‌ను ఎంతగానో అభిమానిస్తాడు. అయితే అప్పటికప్పుడు షెడ్యూల్ చెప్పి, కానిచ్చేయండని తొందర చేయడం మాత్రం నచ్చేది కాదు. ఒక్కోసారి కష్టంగానూ అనిపించేది. ఆ ఒక్క విషయాన్ని మాత్రమే సగౌరవంగానే వెల్లడించడం తప్పేం కాదు. అక్కడ తనకున్న ప్రాబ్లెమ్ మాత్రమే వ్యక్తం కావాలి.

2 పక్కన పెట్టేశారు

మేఘన అనుభవం వేరు. బాస్‌తో కలిసి రెండేళ్ళకు పైగా పని చేసింది. సరిగ్గా ప్రమోషన్ ఇవ్వాల్సిన సమయంలో పక్కన పెట్టేశారు. తనకంటే తక్కువ అనుభవం ఉన్న కిషోర్‌ను ఆ స్థానంలో కూర్చోపెట్టారు. కంపెనీ చెప్పే కారణాలు ఏవైనా కావచ్చు, మేఘనలో అసంతృప్తికి ఆ పరిణామం తావిచ్చింది. కొత్త ఉద్యోగం వెతుక్కుంటోంది. అయితే ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని చెప్పాల్సిన పనిలేదు. అక్కడ కంటే మెరుగైన జాబ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు చెపితే సరిపోతుంది. అనవసర సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇంకా బాగా చెప్పాలంటే సోదంతా పూసగిచ్చినట్టు చెప్పనక్కర్లేదు.

3 నెగెటివ్‌ను పాజిటివ్‌గా మార్చుకోండి

అత్యంత దుర్భర పరిస్థితులు, ఘటనలకు సైతం సానుకూల కోణాలు ఉంటాయి. పనిలో భాగంగా చోటుచేసుకునే ప్రతి చెడు అనుభవం పాఠం నేర్పుతుంది. ఉదాహరణకు వెంకటేష్‌కు నెలలో కొన్ని రోజులు వర్క్‌లోడ్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పనికి ఆవల అంటే ఫ్రీ సమయాన్ని జాగ్రత్తగా షెడ్యూల్ చేసుకున్నాడు. అదే విషయాన్ని ఇంటర్వ్యూలో జాగ్రత్తగా వివరించాడు. ఆఫీసులో పని ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్రీ సమయాన్ని జాగ్రత్తగా వినియోగించుకుంటానని వెల్లడించాడు. తన ముందున్న టాస్క్‌లను ప్రాధాన్యం ప్రకారం చేసుకుంటూ వెళతానని చెప్పాడు. సమస్యలను అధిగమించడం కాదు, సక్రమంగా, సమర్థంగా పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇస్తానని వివరించాడు. నిజానికి ఓవర్‌లోడ్ ఎవరికైనా కష్టమే. అదే విషయాన్ని చెప్పడంలోనే వెంకటేష్ జాగ్రత్తపడ్డాడు.

4 ఆనంద విషయాలను గుర్తుంచుకోండి

ఇందాకటి ఉదాహరణలో మేఘన విషయమే తీసుకుంటే, ఆమె అక్కడి పనిని ప్రేమించింది. యాజమాన్యం ఆమె చేసే పనిని సరిగ్గా అంచనా వేయలేదు. అదీ ఆమె ఫిర్యాదు. అయితే దానినే మరో రకంగా చెప్పింది. పాత బాస్‌ను గుర్తు చేసుకుంటూ, అక్కడ పనిని ఎంజాయి చేసినట్టు వెల్లడించింది. అనుత్పాదక, అనవసర విషయాలను పరిహరించింది. తద్వారా నెగెటివ్‌ను పాజిటివ్‌గా మలుచుకుంది. ఇక్కడ ఒక రకంగా అబద్ధం చెప్పలేదు. అనవసర విషయాలను ప్రస్తావించకుండా డిప్లమాటిక్‌గా ప్రవర్తించింది.

5 కొత్తదనం

కొత్త జాబ్ కోసం వెతుకులాట సందర్భంలో వైవిధ్యం కోరుకుంటారు. పాత ఎంప్లాయిర్‌పై అసంతృప్తి ఒక కారణం. అయితే ఎక్కువ మంది అదే జాబ్‌ను కొత్త బాస్ కింద పని చేసేందుకు ఉత్సాహం చూపుతారట. మేఘన సరికొత్త బాధ్యతలు కోరుకుంది. షెడ్యూల్ చాలా చక్కగా ఉండాలని భావించింది. పాత జాబ్‌లో ఎదురైన సమస్యలకు పరిష్కారాలను వెతుక్కుంది. నెగెటివ్ పరిస్థితుల్లోనూ కష్టించి పనిచేయగలనని ఆచరణాత్మకమైన పద్ధతిలో చెప్పడం ద్వారానే సరి కొత్త ఉద్యోగం పొందగలిగింది.

గవర్నమెంట్ జాబ్స్

ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

ఖాళీలు 111

సిఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యుయెల్ రీసెర్చ్ (సిఐఎంఎఫ్ఆర్) - కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్ (లెవల్ 1 & 2) పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- లెవల్ 1 పోస్టులు 78, లెవల్ 2 పోస్టులు 33
- అర్హత: ప్రాజెక్ట్ అసిస్టెంట్ - లెవల్ 1 పోస్టులకు 55 శాతం మార్కులతో డిగ్రీ (ఆనర్స్/ జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ/ కెమిస్ట్రీ/ ఫిజిక్స్) /డిప్లొమా (మెకానికల్/ సివిల్) ఉత్తీర్ణులై ఉండాలి. లెవల్ 2 పోస్టులకు పీజీ (జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ/ కెమిస్ట్రీ/ ఫిజిక్స్)/ బిటెక్ (జియో సైన్స్/ కంప్యూటర్ సైన్స్/ మెకానికల్/ ఎలక్ట్రికల్) పూర్తిచేసి ఉండాలి.
- వయసు: లెవల్ 1 పోస్టులకు 28 ఏళ్లలోపు, లెవల్ 2 పోస్టులకు 30 ఏళ్లలోపు ఉండాలి.
- స్టయిపెండ్: లెవల్ 1 పోస్టులకు నెలకు రూ.15,000; లెవల్ 2 పోస్టులకు రూ.25,000 ఇస్తారు.
- ఇంటర్వ్యూలు: లెవల్ 1 పోస్టులకు సంబంధించి జియాలజీ, కెమిస్ట్రీ విభాగాలకు ఫిబ్రవరి 13న, ఫిజిక్స్ & ఇంజనీరింగ్ విభాగాలకు 17న ఇంటర్వ్యూలు జరుగుతాయి. లెవల్ 2 పోస్టుల్లో జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ/ ఫిజిక్స్/ జియో సైన్స్ విభాగాలకు ఫిబ్రవరి 14న, ఎలక్ట్రికల్ & సిఎస్ఇ విభాగాలకు 19న, మెకానికల్ విభాగానికి 20న ఇంటర్వ్యూలు ఉంటాయి.
- వెబ్‌సైట్: www.cimfr.nic.in

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్

ఖాళీలు 56

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్)- మార్కెటింగ్ డివిజన్‌లో జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/ పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వ్యాలిడ్ హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం ఏడాది అనుభవం ఉండాలి
- వయసు: 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
- రాత పరీక్ష జరుగు తేదీ: ఫిబ్రవరి 25
- ఫలితాల విడుదల: మార్చి 7
- ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: మార్చి 27
- దరఖాస్తు ఫీజు: రూ.150
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 20
- వెబ్‌సైట్: www.iocl.com

ఐడిబిఐ బ్యాంక్

ఖాళీలు 760

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడిబిఐ) నుంచి భారీ నోటిఫికేషన్ విడుదలైంది. కేవలం డిగ్రీ అర్హతతో ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టును సొంతం చేసుకోవాలనుకునే అభ్యర్థులకు ఇది సువర్ణావకాశం. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం......

తాజా నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్ట్ బేసిస్ మీద మొత్తం 760 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటిలో జనరల్ అభ్యర్థులకు 296, ఒబిసిలకు 202, ఎస్సీలకు 122, ఎస్టీలకు 56, దివ్యాంగులకు 84 పోస్టులను కేటాయించారు. కాంట్రాక్ట్ వ్యవధి ఏడాది అయినప్పటికీ ఏటా పొడిగిస్తూ మరో రెండేళ్ల వరకు కొనసాగిస్తారు. ఈ మూడేళ్ల కాంట్రాక్టు వ్యవధి పూర్తిచేసుకున్న అభ్యర్థులకు అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్ - ఎ) పోస్టుకు ఎంపికయ్యే అవకాశం ఉంటుంది.

- వేతనం: మొదటి ఏడాది నెలకు రూ.17,000 రెండో ఏడాది రూ.18,500 మూడో ఏడాది రూ.20,000 చెల్లిస్తారు.
- అర్హత: దరఖాస్తు నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వుడు వర్గాలకు 55 శాతం మార్కులు వస్తే చాలు. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.
- వయసు: జనవరి 1 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైనవారికి వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.
- ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, ప్రీ రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: అభ్యర్థులు గంటన్నర సమయంలో 150 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. రీజనింగ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాల్లో ఒక్కోదాని నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ మినహా మిగిలిన అన్ని టెస్టులకు సంబంధించిన ప్రశ్నలను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఇస్తారు. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. ప్రశ్నకు సమాధానం గుర్తించని పక్షంలో ఎటువంటి కోత విధింపు ఉండదు. బ్యాంక్ నిర్ణయం మేరకు ఆన్‌లైన్ టెస్టులో అర్హత పొందినవారికి తదుపరి ఎంపిక ప్రక్రియలు నిర్వహిస్తారు.

- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.700(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.150)
- ఆన్‌లైన్ టెస్ట్ కోసం కాల్ లెటర్స్ డౌన్‌లోడింగ్ : ఏప్రిల్ 17 తరవాత
- ఆన్‌లైన్ టెస్ట్ జరుగు తేదీ: ఏప్రిల్ 28
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
- వెబ్‌సైట్: www.idbi.com

ప్రైవేట్ జాబ్స్

శిల్ప మెడికేర్

- విభాగాలు: ప్రొడక్షన్ - ఒఎస్‌డి, ప్యాకింగ్, రెగ్యులేటరీ అఫైర్స్, క్యూఎ / క్యూసి, మైక్రోబయాలజీ
- ఉద్యోగం: ప్యాకింగ్ ఆపరేటర్, ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్, ఇంజనీరింగ్ ఆఫీసర్, డిప్యూటీ మేనేజర్.
- అనుభవం: ఆయా విభాగాల్లో కనీసం రెండు సంవత్సరాలు అనుభవం ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- వాక్ ఇన్ ఇంటర్వ్యూ: 2018 ఫిబ్రవరి 11
- వేదిక: Hotel Aishwarya Grand Restaurant & Residency, JSR Complex, Shahpurnagar, Jeedimetla, Hyderabad.
- ఇ-మెయిల్: hrd_fdz@vbshilpa.com

సుకాన్ ఎరోస్పేస్

- ఉద్యోగం: QC - ఇంజనీర్
- అర్హత: మెకానికల్ (బిటెక్/డిప్లొమా)
- అనుభవం: 2 - 5 సంవత్సరాలు
- ఉద్యోగం: సిఎన్‌సి మిల్లింగ్ & టర్నింగ్ ఆపరేటర్స్
- అనుభవం: 2 - 4 సంవత్సరాలు
- ఉద్యోగం: ఐటిఐ టెక్నీషియన్స్
- అర్హత: మెకానికల్ & ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- వాక్ ఇన్ ఇంటర్వ్యూ: 2018 ఫిబ్రవరి 8, 9
- వేదిక: Plot No.1/1 & 1/2, Sy No.523, Nadergul I.P, Saroornagar, R.R.Dist.

విప్రో

- ఉద్యోగం: డెవలపర్ కోర్ జావా
- అర్హత: ఏదైనా డిగ్రీ
- అనుభవం: 1 - 3 సంవత్సరాలు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: https://careers.wipro.com/share-search-for-jobs.aspx?jobcode=566915&cc=TE& Subsource=DJ

సిటీ

- ఉద్యోగం: యుఐ డెవలపర్
- అర్హత: బ్యాచిలర్ డిగ్రీ
- అనుభవం: 3 - 6 సంవత్సరాలు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: https://jobs.citi.com/job/-/-/287/7043636?src=DJ

బ్రాండ్‌హైప్

- ఉద్యోగం: కంటెంట్ రైటర్
- అర్హత: ఏదైనా డిగ్రీ
- అనుభవం: 1 - 3 సంవత్సరాలు
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- వెబ్‌సైట్: https://brandhype.in/jobs/content-writer

కౌన్సెలింగ్

ఎమ్మెస్సీ (మెడిసినల్ కెమిస్ట్రీ) చదువుతున్నాను. అమెరికాలో ఏ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తే మంచిదో తెలపండి.

- డి. కృష్ణ ప్రసాద్, హైదరాబాద్

- వాషింగ్టన్‌లోని స్కూల్ ఆఫ్ ఫార్మసీ యూనివర్సిటీ - మెడిసినల్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇక్కడ డ్రగ్ మెటబాలిజం అండ్ డిస్పొజిషన్, డ్రగ్ డిజైన్ అండ్ డెలివరీ, డిసీజ్ మెకానిజం వంటి అంశాల్లో ప్రయోగాత్మక పరిశోధనలు జరుగుతుంటాయి.
  వెబ్‌సైట్: https://sop.washington.edu
- మిచిగన్‌లోని కాలేజ్ ఆఫ్ ఫార్మసీ యూనివర్సిటీ కూడా ఈ కోర్సును నిర్వహిస్తోంది. డ్రగ్ డిస్కవరీ, డ్రగ్ టార్గెట్ ఐడెంటిఫికేషన్ అండ్ వ్యాలిడేషన్, రేషనల్ డ్రగ్ డిజైన్, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బేస్డ్ డ్రగ్ డిజైన్, మెథడ్స్ డెవలప్‌మెంట్ (కెమికల్/ బయో కెమికల్/ కంప్యూటేషనల్)లను ఎంచుకోవచ్చు. కెమికల్ బయాలజీ, సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ, మెకానిస్టిక్ ఎంజైమాలజీ, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, కెమికల్ జినామిక్స్ వంటి విభాగాల్లో మెడిసినల్ కెమిస్ట్‌లకు అవగాహన కల్పిస్తారు.
  వెబ్‌సైట్: pharmacy.umich.edu/medchem
- కాలేజ్ ఆఫ్ ఫార్మసీ యూనివర్సిటీ ఆఫ్ జార్జియా నిర్వహించే పిహెచ్‌డి కోర్సులో క్వాంటిటేటివ్ స్ట్రక్చర్, కంప్యూటేషనల్ మెథడ్స్ ద్వారా మాలిక్యులర్ బయాలజీలోని ఫార్మకాలజికల్ టార్గెట్స్‌ను అర్థం చేసుకోవడం, తద్వారా ఫార్మకాలజికల్ ఏజెంట్ల కెమికల్ డిజైన్ల పరిశీలన వంటివి ఉంటాయి.
  వెబ్‌సైట్: https://www.rx.uga.edu

- డాక్టర్ యు.ఎస్.ఎన్. మూర్తి
సీనియర్ సైంటిస్ట్

దిక్సూచి

ఇంజనీరింగ్ తర్వాత పీహెచ్‌డీ చేస్తే...

నెలకు రూ. 75 వేల ఫెలోషిప్

పరిశోధనలపై ఆసక్తి ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులకు మంచి అవకాశం. మేథో వలసను నిరోధించడంతోపాటు దేశంలో ఆవిష్కరణలకు పెద్ద పీట వేయాలనే ఉద్దేశంతో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల వార్షిక బడ్జెట్‌లో 'ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్ (పీఎంఆర్ఎఫ్)' పథకాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమం కింద 1000 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.75 వేల ఫెలోషిప్‌ను అందజేస్తారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో రూ. 1,800 కోట్లను కేటాయించింది. ఈ పథకంపై దేశ వ్యాప్తంగా ఆసక్తి కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో సంబంధిత విశేషాలు..

గతేడాది వివిధ కంపెనీల సీఈఓలతో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి సమావేశమయ్యారు. మేకిన్ ఇండియాను మరింత ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాలకు రెట్టింపు కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికా, చైనా, దక్షిణ కొరియా, ఇజ్రాయెల్ వంటి దేశాలతో పోల్చితే ఆర్ అండ్ డీపై మనదేశం చేస్తున్న ఖర్చు స్వల్పమే. గత రెండు దశాబ్దాలుగా జీడీపీలో 0.6-0.7 శాతాన్ని మాత్రమే ఇందుకు కేటాయిస్తున్నట్లు ఆర్థిక సర్వే 2017-18 పేర్కొంది. కాబట్టి పరిశోధనలకు పెద్దపీట వేయాలని భావిస్తోంది. అందులో భాగంగా చేపట్టిన కార్యక్రమాల్లో పీఎంఆర్ఎఫ్ ఒకటి. వాస్తవానికి ప్రతిపాదన కొత్తదేమీ కాదు. గతేడాది సెప్టెంబరు 7న మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ఒక ప్రకటన చేస్తూ.. పరిశోధనల దిశగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభావంతులైన వెయ్యి మంది విద్యార్థులకు నెలకు రూ. 75 వేల స్కాలర్‌షిప్‌ను అందజేస్తామని వెల్లడించారు. ఇప్పుడు దాన్ని కేంద్ర బడ్జెట్‌లో చేర్చారు.



అర్హులు

- ఐఐటీ, నిట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), ఐఐఎస్సీ, ఐఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తదితర ప్రధాన విద్యా సంస్థ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- మంచి ప్రతిభావంతులై ఉండాలి. 8 సీజీపీఏ కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి.
- ఎంపిక ప్రక్రియ కొంత కఠినంగా ఉంటుంది. పరిశోధనలపై ఆసక్తి ఉన్న ఉత్తమ విద్యార్థులనే ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉంది.


లక్ష్యాలు - చర్యలు


పీఎంఆర్ఎఫ్ ప్రధాన లక్ష్యం.. మేథోవలసను అరికట్టడం, అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులను పరిశోధనల దిశగా ఆకర్షించడం. ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో. పరిశోధనల కోసం మన విద్యార్థులు విదేశీ యూనివర్సిటీలను ఎంచుకోవడానికి ప్రధానంగా మూడు అంశాలను ప్రధాన కారణాలుగా ప్రభుత్వం అంచనా వేస్తోంది. అవి..

- పరిశోధన చేసేందుకు అనువైన సౌకర్యాలు, ఉత్తమ గైడెన్స్, స్కాలర్‌షిప్స్. ఈ మూడు వసతులను దేశంలోనే కల్పిస్తే బ్రెయిన్ డ్రెయిన్ (మేథోవలస) నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఆ లక్ష్యాన్ని సాధించడానికి పీఎంఆర్ఎఫ్ తోడ్పతుందని ప్రభుత్వం ఆశిస్తుంది.
- నాణ్యమైన మౌలిక సదుపాయాల కోసం విశ్వజిత్ ప్రాజెక్ట్, ఉచ్ఛతర్ ఆవిష్కార్ యోజన (యూఏవై) పథకాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుంది.
- ఐఐటీలు ఎదుర్కొంటున్న ఫ్యాకల్టీల కొరతను కొంతవరకు తగ్గించడానికి ఈ పథకం ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఎంపికైన విద్యార్థులు కొంత సమయం బోధనను నిర్వహిస్తారు. తద్వారా బోధనపై ఆసక్తి ఉన్నవారు భవిష్యత్‌లో నాణ్యమైన ఫ్యాకల్టీగా రూపొందడానికి సైతం ఈ కార్యక్రమం తోడ్పడుతుంది.

అమలు ఇలా..

- ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా ప్రధానమైన ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి 1000 మంది బీటెక్ విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- ఈ విధానంలో మొత్తమ్మీద మూడేళ్లపాటు 3000 మందిని ఎంపిక చేస్తారు.
- వీరికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) ద్వారా పీహెచ్‌డీ చేసే అవకాశాన్ని కల్పిస్తారు.
- ఎంపికైన వారికి ఐదేళ్లపాటు నెలకు రూ. 75 వేల ఫెలోషిప్‌ను అందజేస్తారు.
- వీరు పరిశోధనలకే పరిమితం కాకుండా వారానికి కొన్ని గంటలపాటు బోధన చేయాల్సి ఉంటుంది.





మీరు తింటున్న అన్నంలో బలం ఉందా? మీరు ప్రతి రోజూ వాడే బియ్యంలో సూక్ష్మపోషకాలు ఉన్నాయా? తెల్లగా మిలమిల మెరిసే అన్నం తినటం వల్ల ఉపయోగం ఏమిటి? ఈ ప్రశ్నలను ఏ పౌష్టికాహార నిపుణుడిని అడిగినా 'మనం తినే బియ్యంలో సూక్ష్మ పోషకాలు లేవు. అన్నం తినటం వల్ల శరీరానికి కొన్ని కార్బోహైడ్రేట్లు లభించటం తప్ప వేరే ఉపయోగం ఉండదు" అని సమాధానం చెబుతారు. అందుకే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్).. గ్రనోవా నేచురల్స్ అనే సంస్థతో కలిసి.. కొత్త రకం బియ్యాన్ని తయారు చేసింది.

ఈ బియ్యం బలాన్నిస్తుంది..

అరకిలో బియ్యానికి కొసరుగా 5 గ్రాముల 'డాక్టర్ రైస్'

తక్కువ ఖర్చుతో శరీరానికి మెండుగా పోషకాలు

వరి పండుతుంది కానీ.. బియ్యాన్ని తయారు చేయటం ఏమిటా అనుకుంటున్నారా? ఈ ప్రశ్నలోనే సమాధానం ఉందంటారు 'డాక్టర్ రైస్' ఆవిష్కర్త డాక్టర్ శ్రీనివాసరావు. "వడ్లను ఆడించినప్పుడు పై పొట్టు పోతుంది. దీని వల్ల కొన్ని పోషకాలు ఈ పొట్టుతో పాటుగా పోతాయి. వాటిని మరింతగా పాలిష్ చేయటం వల్ల మరిన్ని పోషకాలు వెళ్లిపోతాయి. దీనితో వరిని తినటం వల్ల కలిగే ప్రయోజనం పెద్దగా ఉండదు. దీనిని దృష్టిలో పెట్టుకొని బియ్యంలో అవసరమైన పోషకాలను చేర్చాలని మేము ప్రయోగాలు చేశాం. అయితే ఈ పోషకాలను నేరుగా బియ్యంలో కలపలేం కాబట్టి- వాటిని కూడా బియ్యం రూపంలోనే తయారుచేసి అందిస్తున్నాం" అని శ్రీనివాసరావు వెల్లడించారు. ఎన్ఐఎన్ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో ప్రతి కేజీ బియ్యంలో అవసరమైన మోతాదులో పోషకాలు ఉండటం లేదని తేలింది. ఈ పరిశోధనల ఆధారంగా విటమిన్ ఏ, బీ1, బీ3, బీ6, బీ9, బీ12లతో పాటుగా ఇనుము, జింక్‌లను బియ్యపు పిండిలో కలిపి ఆ మిశ్రమాన్ని బియ్యపు గింజల రూపంలో తయారు చేశారు. "చాలా సందర్భాలలో ఏదైనా వ్యాధి వచ్చే దాకా మనకు పౌష్టికాహార లోపం ఉందనే విషయాన్ని గమనించం. అప్పుడు డాక్టర్లు ఇచ్చే మాత్రలను వాడతాం. ఆ విధంగా కాకుండా ప్రతి రోజూ మనం వండుకొనే బియ్యంలో ఈ బియ్యపు గింజలను- ఒక శాతం కలిపితే సరిపోతుంది. ఉదాహరణకు ఒక అరకేజీ బియ్యం వండితే.. దానిలో ఐదు గ్రాముల పోషక బియ్యాన్ని కలిపితే సరిపోతుంది. ఇలా నెల రోజులు చేస్తే- పౌష్టికాహార సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.." అంటున్నారు శ్రీనివాసరావు. 2017లో విడుదలయిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం మన దేశంలో 69.4% మంది పిల్లలకు, 57.9% మహిళలకు, 24.2% పురుషులకు ఏదో ఒక రకమైన పౌష్టికాహార లోపం ఉందని తేలింది.



ఏ సూక్ష్మ పోషకం ఎందుకు?

- విటమిన్ ఏ- కంటిచూపు, వ్యాధినిరోధక, ప్రత్యుత్పత్తి వ్యవస్థలు సక్రమంగా పని చేయటానికి
- విటమిన్ బి1- మనం తినే ఆహారం శక్తిగా మారటానికి ఇది అవసరం. దీని లోపం వల్ల కండరాల బలహీనత, బెరిబెరి వంటి వ్యాధులు వస్తాయి
- విటమిన్ బి3- ఇది తగ్గితే నోటి పూత, నీరసం, తలనొప్పి వస్తాయి
- విటమిన్ బి6- జీవక్రియలో పాల్గొనే వందరకాల ఎంజైమ్‌లు పనిచేయటానికి ఇది అత్యవసరం
- విటమిన్ బి9- గర్భిణులకు ఇది అత్యవసరం. దీని లోపం వల్ల నీరసం వస్తుంది
- విటమిన్ బి12- నరాలు, రక్తకణాల ఆరోగ్యానికి ఇది అవసరం.
- ఇనుము- హిమోగ్లోబిన్ తయారీకి ఇది అత్యవసరం. ఇది లేకపోతే రక్తహీనత వస్తుంది

చవక కూడా..

ఇండియా, అమెరికా సహా దాదాపు 25 దేశాల్లో 'డాక్టర్ రైస్' ఉపయోగిస్తున్నారు. శరీరానికి బలాన్నివ్వడంతో బాటు.. ఈ బియ్యం చాలా చవక కూడా! 'డాక్టర్ రైస్'లో ఉండే పోషకాలన్నింటినీ మనం మాత్రల రూపం లో తీసుకుంటే రోజుకు కనీసం 20 రూపాయల ఖర్చు అవుతుంది. అదే ఈ బియ్యం ద్వారా వీటిని తీసుకుంటే ఒక రూపాయి కూడా ఖర్చు కాదు.." అని శ్రీనివాసరావు వెల్లడించారు. "మన దేశంలో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలు ఎక్కువ మంది ఉన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ద్వారా కొంత పౌష్టికాహారాన్ని అందిస్తోంది. దీనిలోనే ఇతర సూక్ష్మపోషకాలనూ జోడించగల్గితే పిల్లలకు వచ్చే అనేక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి.." అంటారు శ్రీనివాసరావు. తాము ఈ విషయంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ విద్యాసంస్థలను సంప్రదిస్తున్నామని ఆయన వెల్లడించారు.

–స్పెషల్ డెస్క్

వెయ్యేళ్లలో మటాష్

భూ అయస్కాంత క్షేత్రం క్రమేణా బలహీనం

సౌర పవనాల ధాటికి మానవాళి అంతం ?.. మరో వెయ్యేళ్లలో మనదీ అంగారకుడి పరిస్థితే

మనం భూగోళంపై నిశ్చింతగా నివసిస్తున్నామంటే.. దానికి కారణం భూఅయస్కాంత క్షేత్రం.

సూర్యుడి నుంచి వెలువడే అత్యంత శక్తిమంతమైన రేణువులు మనల్ని తాకకుండా ఈ అయస్కాంత ఆవరణం కాపాడుతోంది.

ఇప్పుడీ అయస్కాంత క్షేత్రానికే ముప్పు వచ్చిపడింది. అనేక కారణాల రీత్యా ఇది బలహీనపడిపోతున్నట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఒకవేళ ఈ అయస్కాంత క్షేత్రం గనక మాయమయితే.. మన పని గోవిందా!



సూర్యుడి నుంచి ధాటిగా వెలువడే పవనాలు భూగ్రహాన్ని అతలాకుతలం చేస్తాయి. రేడియేషన్ మన ఉపగ్రహ వ్యవస్థను అంతరిక్షంలోనే కకావికలం చేస్తుంది. భూమిపై విద్యుత్ ఉండదు.. అంతా అంధకారం. రేడియేషన్ వల్ల మనుషులకి రకరకాల కేన్సర్లు వస్తాయి. డీఎన్ఏ వ్యవస్థ ఛిద్రమవుతాయి.. మనుషులు కదల్లేని స్థితికి వస్తారు.. చివరకు వ్యాధులు, బాధలతో మానవాళి అచిరకాలంలోనే అంతమవుతుంది. మన పక్కనే ఉన్న అరుణగ్రహంలో కొన్ని మిలియన్ సంవత్సరాల కిందట జరిగినదే ఇక్కడా జరగవచ్చు. ఇదేదో సైన్స్ ఫిక్షన్ సినిమా కాదు.. కల్పిత నవల అంతకన్నా కాదు.. జరగబోయే కఠోర నిజం!! అయితే ఇది జరగడానికి మరో వెయ్యేళ్లు పడుతుందని కొలరాడో విశ్వవిద్యాలయ స్పేస్ ఫిజిక్స్ ల్యాబ్ డైరెక్టర్ డేనియల్ బేకర్ చెబుతున్నారు. "భూగ్రహం అంతర్గతంగా - మధ్యభాగంలో- పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. భూ అయస్కాంత ధ్రువాలు ఆకస్మికంగా కదులుతూ తలకిందులవుతున్నట్లు అత్యంత ఆధునికమైన మానిటరింగ్ పరికరాలు రికార్డు చేస్తున్నాయి. ఈ సంకేతాలు నిజంగా జరుగుతున్న పరిణామాలనే రికార్డు చేస్తున్నట్లయితే భూ అయస్కాంత క్షేత్రమే కుప్పకూలిపోతున్నట్లు లెక్క. ఇది తక్షణం జరగకపోవచ్చు.. ఓ వెయ్యేళ్లు పట్టినా జరుగుతున్న మార్పు మాత్రం నిజం. ఈ క్షేత్రం అంతమయినా, కనీసం బలహీనపడినా, దాని విపరిణామాలు మాత్రం అత్యంత దారుణంగా ఉంటాయి. కనీసం ఆ అయస్కాంత క్షేత్రంలో కనీసం 10% మార్పు జరిగినా సూర్యప్రతాపం మహోధృతంగా ఉంటుంది. భూగ్రహం తట్టుకోలేనంత తీవ్రంగా ఉంటుంది" అని బేకర్ వివరించారు. విశేషమేమంటే ఈ భూఅయస్కాంత క్షేత్రం దెబ్బతినడం, బలహీనపడడం గతంలో జరిగినదే.. పురాతన కాలం నాటి శిలలను పరిశీలించిన శాస్త్రవేత్తలు ఆ విషయాన్ని తేల్చారు. తొలుత ఊహించిన దానికంటే పదిరెట్లు వేగంగా అయస్కాంత క్షేత్రం బలహీనపడుతోంది. దశాబ్దానికి 5% చొప్పున క్షీణిస్తోంది. ముఖ్యంగా దక్షిణ అమెరికా ఎగువన ఇది మరీ వేగంగా కుచించుకుపోతోంది.

–కొలరాడో (అమెరికా)

ఒక గుర్రానికి రెండు కోట్ల బంపర్ ఆఫర్.. వేరొకరైతే ఎగిరి గంతేస్తారు. పంజాబ్‌కు చెందిన సిరాజ్‌ఖాన్ పఠాన్ కుటుంబం మాత్రం దానిని తోసిపుచ్చింది. పఠాన్ వద్ద ఉన్న అరుదైన సంకరజాతి గుర్రం సకాబ్ కోసం సల్మాన్ గత ఏడాది రూ.1.11 కోట్లు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. అప్పట్లో పఠాన్ తిరస్కరించారు. ఆ ఆఫర్‌ను సల్మాన్ తాజాగా రూ.2 కోట్లకు పెంచారు. పఠాన్ మళ్లీ ససేమిరా అన్నారు! ఇందుకు కారణం లేకపోలేదు.. ఆ జాతి గుర్రం దేశంలో ఉన్నది అదొక్కటే. ప్రపంచం మొత్తం మీద ఉన్నవి రెండే రెండు. ఒకటి అమెరికాలో, మరొకటి కెనడాలో ఉన్నాయి. సకాబ్ పరుగు వేగం గంటకు 43 కిలోమీటర్లు!



మరే బిడ్డ చనిపోకుండా..

68 ఏళ్ల వయసులో.. రోజూ 4 గంటలపాటు ట్రాఫిక్ డ్యూటీ




చెట్టంత కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆ షాక్ నుంచి బయటకు రావడానికి రాం దయాల్ యాదవ్‌కు చాలా కాలం పట్టింది. తాను పడుతున్న బాధ మరెవ్వరూ పడకూడదనుకున్నారాయన! ఇరవై ఏళ్ల సైన్యంలో పనిచేసిన యాదవ్ మళ్లీ డ్యూటీ చేయడం మొదలుపెట్టారు. 68 ఏళ్ల వయసులో నెమ్మదిగా శక్తిని కూడదీసుకుని ముంబై సమీపంలోని నల్లా సోపరా (తూర్పు) పోలీస్ స్టేషన్ సమీపంలో నిత్యం నాలుగు గంటలపాటు ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఈ వయసులో కూడా ముందుటెండలో ఆయన స్వచ్ఛందంగా చేస్తున్న ట్రాఫిక్ డ్యూటీ ప్రజలను ఆలోచింపజేస్తోంది. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసులకు సహకరిస్తున్నారు. రాం దయాల్ యాదవ్ కృషితో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తులింజ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నిబద్ధతకు హ్యాట్సాఫ్ చెబుతున్నారు.

బడిలో టీచర్‌కి పుతిన్ గుడి

చదువు చెప్పిన ఉపాధ్యాయురాలి రుణం తీర్చుకున్న రష్యా అధ్యక్షుడు

శిష్యుడిచ్చిన ఇంటిని అతనికే రాసిస్తూ విల్లు రాసిన టీచర్

చదువు చెప్పిన గురువుల రుణం తీర్చుకున్న వారెందరో మనకి తెలుసు.. కష్టకాలంలో గురువులను ఆదుకున్న శిష్యుల సంగతీ విన్నాం.. ఆ కోవలోకే వస్తారు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఆయన చదువుకొనేటపుడు మినా యుదిత్సాకాయా అనే టీచరుండేది. ఇజ్రాయెల్‌లో పుట్టి పెరిగిన ఆమె రెండో ప్రపంచ యుద్ధకాలంలో రష్యా వచ్చింది. ఆమెకు వ్లాదిమిర్ అంటే చాలా ఇష్టం. పుతిన్‌కూ అంతే! పాఠాలు చెప్పడంలో ఆమె శైలి ఎవరికీ లేదని తరువాతి కాలంలో తన బయోగ్రఫీలో గుర్తు చేసుకున్నారాయన. మినా కొన్నేళ్లు పనిచేశాక 1973లో రిటైరై స్వదేశం వెళ్లిపోయింది. అయితే ఆమెకు నా అనే వారెవరూ లేరు. ఏదో ఓ చిన్న అద్దె ఇంట్లో కాలక్షేపం చేసేది. పుతిన్ అధ్యక్షుడయ్యాక 2005లో ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లారు. అప్పుడు తన ప్రియశిష్యుడైన పుతిన్‌ని 35 ఏళ్ల తరువాత కలిసింది. ఆ తర్వాత వారి మధ్య ఆత్మీయం సంబంధాలు పెరిగాయి. ఆమె క్షేమ సమాచారం తెలుసుకోడానికి, వ్యక్తిగత అవసరాలు చూడడానికి ఎంబసీ నుంచి ఓ అధికారిని కూడా కేటాయించారు పుతిన్. ఆ క్రమంలో ఆమె నగరానికి దూరంగా కాకుండా ఆస్పత్రికి, బస్టాండుకీ దగ్గరగా ఓ సొంత ఇల్లు లేదా ఫ్లాట్ కావాలని కోరింది.. పుతిన్ ఆమె కోరినట్లే పిన్‌స్కర్ వీధిలో ఓ డబుల్ బెడ్రూం ఫ్లాట్ కొనిచ్చాడు. అందులోనే ఆమె నివసించేది.. పుతిన్‌తో ఉత్తరప్రత్యుత్తరాలు సాగించేది. కిందటి డిసెంబరులో మినా చనిపోయింది.. రష్యా ప్రభుత్వమే ఆమె అంత్యక్రియలన్నింటినీ సొంత ఖర్చుతో నిర్వహించింది. పోతూ పోతూ ఆమె తన ఫ్లాట్‌ను పుతిన్ పేరిట రాసిపోయింది. ఆయన అందులో ఉండేది లేదు గానీ, మినా స్మృత్యర్థం ఆ ఫ్లాట్‌ను అలాగే ఉంచేయాలి తప్ప అద్దెకివ్వడమో లేక విక్రయించడమో చేయరాదని పుతిన్ నిర్ణయించుకొన్నారు.



కాక పుట్టించిన కాశ్యప్ పటేల్

- ట్రంప్-ఎఫ్‌బీఐ వార్‌లో అగ్గి రాజేసిన భారతీయ లాయర్
- రిపబ్లికన్ మెమో రూపకర్త ఇతనే
- అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం వ్యవహారంపై మలుపులు తిరుగుతున్న విచారణ



కాశ్యప్ పటేల్ అలియాస్ కాష్ పటేల్.. ఇపుడు అమెరికా అంతటా మార్మోగుతున్న పేరు.. ఇంతకీ ఎవరితను? ఒక పేరుమోసిన న్యాయవాది. తల్లిదండ్రులు గుజరాతీలు కానీ ఈయన మాత్రం న్యూయార్క్‌లో పుట్టిపెరిగాడు. 2002లో రిచ్‌మండ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకున్నాడు. ఇంటర్నేషనల్ లాలో ఆరితేరాడు. కౌంటర్ టెర్రరిజం నిపుణుడిగానూ ఎదిగాడు. కొన్నాళ్లు ఫ్లోరిడాలో లాయర్‌గా పనిచేసి- ఆ తరువాత అమెరికా ప్రతినిధుల సభ ఇంటెలిజెన్స్ కమిటీలో చేరాడు. ఆ కమిటీ చైర్మన్ డెవిన్ న్యూన్స్ ఆఫీసులో ఓ కీలక వ్యక్తి.

ఇతనెందుకు మీడియాలోకెక్కాడు?

2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం ఉందనీ, డొనాల్డ్ ట్రంప్ రష్యన్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను వాడుకుని ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్ ఎత్తుగడల గురించి తెలుసుకున్నారనీ, ఎన్నికల అనంతరం రష్యాతో అనుసరించబోయే వైఖరికి సంబంధించి ముందే ట్రంప్‌తో పుతిన్ ఒప్పందం కుదుర్చుకున్నారనీ ఆరోపణలు గుప్పుమన్న సంగతి తెలిసిందే. దీనికి ఆధారం.. ట్రంప్ ప్రచార కమిటీలో కార్టర్ పేజ్.. విదేశీ వ్యవహారాల సలహాదారుగా ఉండేవాడు. అమెరికా నౌకాదళంలో అధికారిగా పనిచేసిన ఈయన రష్యాతో సంబంధాలున్నవాడు. మాస్కోలో పనిచేసినపుడే ఆయనకు రష్యన్ అధికార యంత్రాంగం, పుతిన్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ పేజ్.. రష్యా ఏజెంట్ అని డెమొక్రాట్ల ఆరోపణ. ప్రచార సమయం మధ్యలో రెండుసార్లు పేజ్ మాస్కో వెళ్లి వచ్చారు. ఎందుకన్నది మిస్టరీగా ఉండిపోయింది. అధ్యక్షుడిగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేయక మునుపు ట్రంప్ ఎఫ్‌బీఐ, ఇంటెలిజెన్స్ అధికారులను పేజ్ దగ్గరకు వెళ్లమనడం, ఆయన సలహాల ప్రకారం నిర్ణయాలు తీసుకోమనడం, రష్యా అనుకూలత ప్రదర్శించడం... ఇవన్నీ దుమారం రేపాయి.

ట్రంప్‌తో ఎఫ్‌బీఐ ఢీ

2017 ప్రారంభంలోనే కార్టర్ పేజ్ వ్యవహారంపై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) కన్నేసింది. ఆయన ఫోన్ ట్యాప్ చేయడానికి అనుమతి ఇవ్వాలని ఇంటెలిజెన్స్ అధికారులను కోరింది. అందుకు కారణాలను కూడా చూపింది. అయితే ఆ కారణాలు డెమొక్రాట్లు, హిల్లరీ క్లింటన్ ప్రచార సిబ్బంది తాలూకు వ్యక్తిగత మెయిల్స్ అనీ, ఎఫ్‌బీఐ- డెమొక్రాట్ అనుకూలత ప్రదర్శిస్తోందని ట్రంప్ శిబిరం ఆరోపించింది. అయితే ఈ రగడ తీవ్రరూపు దాల్చింది. ట్రంప్, రష్యాకు మధ్య ఉన్న బంధంపై పూర్తిస్థాయి విచారణ మొదలయ్యింది. ఇందుకోసం 2013 వరకూ ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా పనిచేసిన రాబర్ట్ మ్యూలర్ చైర్మన్‌గా ఓ కమిషన్ ఏర్పాటయ్యింది. కమిషన్ దాదాపుగా దర్యాప్తు పూర్తిచేసి ట్రంప్‌ను అభిశంసించవచ్చని వార్తలు వస్తున్న దశలో ట్రంప్ శిబిరం, రిపబ్లికన్లు ప్రతివ్యూహం రచించారు. ఏకంగా ఎఫ్‌బీఐ మీదే ఆరోపణలు గుప్పించారు. ఎఫ్‌బీఐ పూర్తిగా డెమొక్రాట్లు చెప్పినట్లు నడుస్తోందని, శ్వేతసౌధం నుంచి ట్రంప్‌ను దూరం చేయడానికి జరుగుతున్న కుట్రలో ఇది భాగమని ఆరోపించారు. అంతేకాక కాంగ్రెస్‌లోని ఇంటెలిజెన్స్ విభాగం దీనిపై ఓ మెమో కూడా రూపొందించింది. 4 పేజీల ఆ మెమోలో ఎఫ్‌బీఐ, మ్యూలర్ మీద తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఈ మెమో రూపకర్తే కాశ్యప్ పటేల్. మంచి లాయర్ కావడంతో ఎఫ్‌బీఐ వాదనను ధాటిగా తిప్పికొడుతూ కాశ్యప్ ఆ మెమోను డ్రాఫ్ట్ చేశారు. మొదట రహస్యంగా ఉంచినా దీన్ని బహిరంగ పర్చాలన్న డిమాండ్లు రావడంతో ట్రంప్ దీనిని కాంగ్రెస్ సభ్యులందరికీ చూపాలని ఆదేశాలిచ్చారు. రిపబ్లికన్లు ట్రంప్ తరపున రాజకీయంగా పోరాడుతున్నప్పటికీ మ్యూలర్ కమిషన్ ఏం చెబుతుందా అన్నదానిపై ఇపుడు అమెరికన్ల దృష్టి కేంద్రీకృతమయ్యింది.



ఆమనగల్లు జడ్పీ స్కూల్‌లో తప్పిన ప్రమాదం

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వరండాలోని పైకప్పు పెచ్చులూడిపడింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. మొత్తానికి పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో స్కూల్ నిర్వహిస్తుండడంపై పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురించినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

-ఆమనగల్లు



24 గంటల విద్యుత్తు వద్దని స్పీకర్‌కు రైతుల మొర

24 గంటల విద్యుత్తు సరఫరా వద్దని మంగళవారం జయశంకర్ జిల్లా గణపురం మండలం నగరంపల్లి, అప్పయ్యపల్లి గ్రామాల రైతులు శాసనసభ స్పీకర్ మధుసూదనాచారిని కలిసి వేడుకున్నారు. మంగళవారం నగరంపల్లికి వచ్చిన స్పీకర్‌ను కలిసిన రైతులు గతంలో ఇచ్చిన విధంగా కరెంటును అందించాలని వినతిపత్రం సమర్పించారు. 24గంటల విద్యుత్తు వల్ల బోర్లు ఎత్తిపోతున్నాయని, 150 అడుగుల లోపల ఉన్న భూ గర్భజలాలు 250 అడుగులకు తగ్గిపోయాయని ఈ సందర్భంగా వారు తెలిపారు.

-గణపురం


నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనాలి

నిజామాబాద్ జిల్లాలో రైతుల ధర్నా, రాస్తారోకో

కమ్మర్‌పల్లి/ఆర్మూర్, ఫిబ్రవరి 6: ఎర్రజొన్న రైతులు రోడ్డెక్కారు. దళారీ వ్యవస్థను అరికట్టాలని, ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో, ఆర్మూర్‌లో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కమ్మర్‌పల్లిలో చేపట్టిన ఆందోళనకు పార్టీలకతీతంగా రైతులు తరలివచ్చారు. వారికి కాంగ్రెస్ నాయకులు కేఆర్ సురేశ్‌రెడ్డి, రాజారాం యాదవ్, ఏఐకేఎమ్మెస్ కార్యదర్శి వి.ప్రభాకర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే ఎర్రజొన్నలను రైతుల నుంచి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుందని ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో రైతులకు సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో హామీ ఇచ్చారని, కానీ.. అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల గడుస్తున్నా హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఎర్రజొన్నలను దేశమంతా సరఫరా చేసే స్థితిలో ఉన్నా.. దళారీ వ్యవస్థ కారణంగా రూ.1700, రూ.1500 ధరలతో రైతులకు గిట్టుబాటు కాకుండా పోతోందన్నారు. కాగా పసుపు, ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ ఆర్మూర్‌లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

సౌదీలో మెదక్ జిల్లా వాసి ఆత్మహత్య


మల్లేశం (ఫైల్)

నిజాంపేట(మెదక్ జిల్లా), ఫిబ్రవరి 6 : పొట్టకూటి కోసం వలసెళ్లిన ఓ వ్యక్తి సౌదీలో ఉరేసుకుని సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. మెదక్ జిల్లా నిజాంపేటకు చెందిన జాల మల్లేశం (37) అప్పు చేసి మరీ రెండేళ్ల కిందట సౌదీకి వెళ్లాడు. సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో మల్లేశం మాట్లాడాడు. అయితే అదే రోజు రాత్రి తాను ఉంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా.. మృతి గల కారణాలు తెలియలేదు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తన భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేలా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలని లక్ష్మి వేడుకుంది.

కరీంనగర్ లారీ.. మహారాష్ట్రలో స్ర్కాప్

- చోరీ జరిగిన రెండ్రోజుల్లోనే తుక్కుగా మార్పు
- ముఠా కోసం గాలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: కరీంనగర్‌లో చోరీకి గురైన ఓ లారీ.. మహారాష్ట్రలోని ఓ స్ర్కాప్ దుకాణంలో తుక్కుగా మారింది. రెండు రోజుల వ్యవధిలోనే.. లారీని ముక్కలుగా చేసిన ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ నివాసి నారదాసు మారుతీరావుకు చెందిన 10 టైర్ల లారీ (ఏపీ15ఎక్స్-9522) ఆదివారం రాత్రి చోరీకి గురైంది. రాత్రి లారీ అసోసియేషన్ ముందు పార్క్ చేసిన వాహనం, ఉదయానికి కనిపించకుండా పోయిందంటూ.. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ లారీకి ట్రాకింగ్ వ్యవస్థ ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు.. జీపీఎస్ ద్వారా ఆ లారీ మహారాష్ట్ర పర్బనీలోని ఓ స్ర్కాప్ దుకాణంలో ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం అక్కడకు చేరుకున్న పోలీసులు కంగు తిన్నారు. లారీ క్యాబిన్, చాసీస్, టైర్లు మినహా.. మిగతా భాగాలన్నీ ముక్కలుగా మారాయి. చాసీస్, రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు, జీపీఎస్ పరికరం ఆధారంగా పోలీసులు అది చోరీకి గురైన లారీ అని నిర్ధారించారు. కొందరు వ్యక్తులు ఆ లారీని తుక్కు కింద అమ్మినట్లు స్ర్కాప్ దుకాణం యజమాని చెబుతున్నాడని పోలీసులు తెలిపారు. కాగా.. గతంలోనూ.. కరీంనగర్ లారీ అసోసియేషన్ ఆవరణలో పార్క్ చేసిన ఐదు లారీలు చోరీకి గురయ్యాయి.



రోడ్డెక్కిన కంది రైతు

కందుల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం మూసివేయడం అన్యాయం అంటూ రైతులు కన్నెర్ర జేశారు. వికారాబాద్ జిల్లా యాలాలలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించగా, బషీరాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేశారు. కొనుగోలు కేంద్రాలను తెరిపిస్తామంటూ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. -యాలాల/బషీరాబాద్



పింఛన్ డబ్బులు ఇవ్వాలని రాస్తారోకో

పింఛన్ డబ్బులు ఇవ్వాలని కోరుతూ.. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరిలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు రాస్తారోకో చేశారు. పెబ్బేరు-కొల్లాపూర్ రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

-వీపనగండ్ల

కాలుష్య గోదావరి!

(మొదటిపేజీ తరువాయి..)

కొత్తగూడెం జిల్లాల్లోని గోదావరి తీరంలోని పరిస్థితి ఇది. పారిశ్రామిక వ్యర్థాలతో తీరమంతా కాలుష్య కోరల్లో కొట్టుమిట్టాడుతోంది. ఓపెన్ కాస్ట్ బొగ్గు బావులతోపాటు ఎన్టీపీసీ, ఎస్టీపీపీ, సిరామిక్స్ తదితర పరిశ్రమలు తమ తమ వ్యర్థాలను గోదావరిలోనే కలుపుతున్నాయి. వాటి నుంచి వచ్చే డస్ట్, వ్యర్థాలకు గోదావరి నిలయమవుతోంది. ఉదాహరణకు, భూపాలపల్లిలో 1200 మెగావాట్ల విద్యుదుత్పత్తి సంస్థ ఉంది. ఇందులో రోజుకు 50 వేల టన్నుల బొగ్గును మండిస్తారు. దీనిద్వారా వచ్చే కలుషిత ఆయిల్స్, నీళ్లు, దుమ్ము ధూళి గోదావరిలోనే కలుపుతున్నారు. ఎన్టీపీసీ వీటిని రామగుండంలో కలుపుతుంటే.. ఎస్టీపీపీ జైపూర్‌లో కలిపేస్తోంది. గోదావరి తీరంలో ఆంధ్రజ్యోతి ప్రతినిధి పర్యటించినప్పుడు తీరమంతా మురికినీరే కనిపించింది. కొన్ని చోట్ల అయితే పాకుడు నీరు కనిపించింది. మనుషులు కాదు కదా.. కనీసం జంతువులు కూడా తాగని విధంగా ఆ నీరు ఉంది. ఇక ఎక్కడ చూసినా దుస్తులు, పాత సామాన్లు.. ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం. మున్సిపాల్టీ చెత్త, ఆస్పత్రి వ్యర్థాలూ అందులోనే కనిపించాయి. మున్సిపాల్టీలు తమ తమ చెత్తను, మురికినీటిని గోదావరిలోనే కలుపుతున్నాయి. గోదావరి తీరంలోని ఆరు జిల్లాల్లోనూ ఇళ్లల్లో వాడే మురికినీరుకు కేరాఫ్ అడ్రస్ గోదావరి నదే. ఇక ఆయా కాలనీల్లోని మురికినీరునూ గోదావరిలోకే వదులుతున్నారు. ఓపెన్ కాస్టుల దుమ్ము మొత్తం నదిలో పడుతోంది. ముఖ్యంగా పవర్ ప్లాంట్ల నుంచి సల్ఫర్ డయాక్సైడ్, రసాయనిక వ్యర్థమైన పేపర్, ప్లాస్టిక్ కలిపేస్తున్నారు. మంచిర్యాలలోని ఓవర్ బ్రిడ్జి మీది నుంచి చూస్తే ఇటు శ్రీరాంపూర్‌వైపు, అటు రామగుండంవైపు, గోదావరిఖనివైపు కొండలను తలపించే ఓపెన్‌కాస్టు మట్టి దిబ్బలు ముప్పునకు నిలువెత్తు నిదర్శనగా నిలుస్తాయి. వాటి కారణంగా ఆ చుట్టుపక్కల వందలాది ఎకరాలు బీడుగా మారాయి. పంటలు వేసినా పండడం లేదు. ఖామనుషులకు ప్రాణప్రదమైన గోదావరిని మనుషులే ఖరాబు చేస్తున్నారు. మా చిన్నప్పుడు గోదావరిలో పైసలు వేసేవాళ్లం. ప్రవాహానికి అవి ఎక్కడ ఉన్నాయో కనిపించేవి కాదు. కానీ, ఇప్పుడు పైసలు వేస్తే క్షణాల్లోనే ఎవరో ఒకరు ఎత్తుకెళ్లేలా పరిస్థితి మారింద్ అని ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు గోదావరిని చూస్తుంటే దుఖం వస్తోందని కూడా వ్యాఖ్యానించారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

గోదావరి గుండెను పిండేస్తున్నారు. ఇసుక తవ్వకాలను ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారు. కోట్ల రూపాయల ఇసుకను తవ్వేసి అమ్మేసుకుంటున్నారు. ఫలితంగా, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. తీరంలోని గ్రామాల్లో మంచి నీటి బావులు ఎండిపోయాయి. బావుల్లో నీరు లేక పల్లెలు కన్నీరు పెడుతున్నాయి. మంచిర్యాల జిల్లాలోని ఇందారం, కుందారం, పెద్దపల్లి జిల్లా పరిధిలోకి వచ్చే బేగంపేట, తదితర ప్రాంతాల్లో 'ఆంధ్రజ్యోతి' పరిశీలించినప్పుడు 150కి పైగా మంచినీటి చేత బావులు ఎండిపోయాయి. కనీసం మూరెడు నీరు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. అంతేనా, ఇసుక తవ్వకాలు ఈ ప్రాంతానికే ముప్పుగా పరిణమించాయి. ఇటీవల గోదావరి ప్రాంతంలోనే కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. గనుల బ్లాస్టింగ్‌తో ఆయా ప్రాంతాల్లో ఇండ్లు దెబ్బతిన్నాయి. అర్ధరాత్రి, తెల్లవారుజామున రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్, గోదావరిఖని ప్రాంతాల్లో ఓపెన్ కాస్టు గనుల్లో జరిగే బ్లాస్టింగ్ చప్పుళ్లు పిడుగులు పడినట్లు మంచిర్యాల, గోదావరిఖని ప్రజలకు వినిపిస్తాయి.


మంచిర్యాల, రామగుండం మధ్య గోదావరి దుస్థితి


ఇసుక దోపిడీతో గుంతలమయమైన గోదావరి

రోగాల బారిన జనం

దాదాపు ఆరు జిల్లాల్లోని కోల్‌బెల్ట్ ప్రాంతంలో గోదావరి నీటినే తాగడానికి సరఫరా చేస్తున్నారు. శుద్ధి చేయకుండా గోదావరి నీటిని సరఫరా చేస్తున్నందున దానిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ నీటిలో నైట్రోజన్, సల్ఫర్, లెడ్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ ఉంటున్నాయని, ఈ నీరు తాగడానికే కాదు.. వాడడానికి కూడా పనికిరాదని పర్యావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అలాగే, కలుషిత వాయువుల ప్రభావంతో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, ఇందారం, గోదావరిఖని, మంథని వరకు శ్వాస సంబంధిత, ఊపిరితిత్తులు, గుండె జబ్బులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలోనే, గోదావరిని ప్రక్షాళన చేయాలని. ఇసుక దోపిడీని అరికట్టాలని పర్యావరణ నిపుణులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వ్యర్థాలను గోదావరిలో కలపకుండా అడ్డుకోవాలని కోరుతున్నారు.

గోదావరిని ముంచిండ్రు

గలగలాపారే గోదారి ఉండేది. మంచిగ ఈతగొట్టెటోళ్లం. పారే నీల్లే తాగెటోల్లం. ఇవ్వాల గోదావరిని చూస్తే దుఃఖం వస్తోంది. ఎవరైనా చచ్చిపోతే దహనం చేయడానికి వస్తే స్నానం చేయడానికి కూడా భయమైతంది. ఇసుక తవ్వీ, తవ్వీ దొంగలు గోదావరిని మాకు కాకుండా చేసింద్రు. ఎన్టీపీసీల బేకార్ అంతా ఇండ్ల కలుస్తంది. సింగరేణి ఓపెన్‌కాస్టు దుమ్ము, దుబ్బ కలుస్తంది. ఇగెక్కడి గోదావరి.

బూడిద గట్టయ్య, బేగంపేట, పెద్దపల్లి జిల్లా

గోదావరిని ప్రక్షాళన చేయాలి

గోదావరిని ప్రక్షాళన చేయాలి. ముందు మురికినీరు అందులోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలి. కాల్వల నీళ్లను కూడా ఆపేయాలి. వ్యర్థాలను కలపకుండా చూడాలి. ఇసుక విచ్చలవిడిగా తరలించడం, పెద్ద పెద్ద గోతులు చేయడాన్ని అరికట్టాలి. గోదావరిని కాపాడుకోవాలంటే రక్షిత నీటిని మాత్రమే కలిపేలా చర్యలు తీసుకోవాలి.

డాక్టర్ కుమారస్వామి, వైద్య నిపుణులు

చేప పిల్లల ఉత్పత్తా.. అదెక్కడ?

ఆధునికీకరణకు నోచుకోని ఉత్పత్తి కేంద్రాలు.. మూడింట్లో రెండు కళాహీనం

అమలు కాని మంత్రి పోచారం హామీ.. మూడున్నరేళ్లయినా రాని నిధులు

శిథిలావస్థలో ఉత్పత్తి కేంద్రాలు..కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఇదీ పరిస్థితి

ఆంధ్రజ్యోతి, కామారెడ్డి/నిజాంసాగర్, ఫిబ్రవరి 6: చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి! వాటిని ఆధునికీకరించి పూర్వ వైభవం తెస్తామన్న పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి! ఇవిగో నిధులు.. అదిగో ఆధునికీకరణ.. అన్న రాష్ట్ర వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వాగ్దానాలకు మూడేళ్లు నిండాయి! ఉన్నతాధికారులకు పంపుతున్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి! నిధులు మంజూరవలేదు.. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు బాగుపడలేదు. ఇదీ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పోచంపాడ్, అర్సపల్లి, అచ్చంపేటల్లో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల దుస్థితి. ఈ కేంద్రాలను దాదాపు ఆరు దశాబ్దాల కిందట ఏర్పాటు చేశారు. అర్సపల్లి, అచ్చంపేటల్లో దాదాపు 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు కళాహీనంగా మారాయి. ఉభయ జిల్లాల్లోని బాల్కొండ నియోజకవర్గంలో ఉన్న పోచంపాడ్‌లో ఉత్పత్తి కేంద్రం నామమాత్రంగానే కొనసాగుతోంది. నిజామాబాద్ జిల్లా అర్సపల్లిలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి నీటి వసతి లేక పదేళ్ల కిందటే ఆనవాళ్లు లేకుండా పోయింది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా అచ్చంపేటలో 11 ఎకరాల్లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని 1956-57లో ఏర్పాటు చేశారు. పాతికేళ్ల పాటు ఈ కేంద్రం ఓ వెలుగు వెలిగింది. ఆ తర్వాత అధికారులు, పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఈ కేంద్రం ప్రతిష్ఠ మసకబారింది. ప్రస్తుతం ఇక్కడి చెరువులు ఎండిపోయాయి. ఏపుగా పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉభయ జిల్లాల్లో ఉన్న చిరు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల ఆధునికీకరణకు కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. కానీ, మూడేళ్లుగా నిధులు విడుదలవకపోవడంతో ఈ ఉత్పత్తి కేంద్రాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పాలకుల నిర్లక్ష్య వైఖరి పట్ల మత్స్య కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఉభయ జిల్లాల్లో రూ.10 కోట్లతో మత్స్య సంపదను పెంపొందించేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించినా నిధులు విడుదలవక కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి చేప పిల్లలను తెచ్చి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని చెరువులతోపాటు శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల్లో విడుదల చేసి చేతులు దులుపుకొంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం శ్రీరాంసాగర్, నిజాంసాగర్, అలీసాగర్ జలాశయాల్లో కేజ్ కల్చర్ చేపల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నప్పటికీ కేవలం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పెంచేందుకే అనుమతి ఇచ్చింది. అలీసాగర్, నిజాంసాగర్‌లలో పెంచేందుకు అనుమతి ఇవ్వకపోవడం పట్ల మత్స్యకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అర్సపల్లి, నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో సరిపడా సిబ్బంది కూడా లేరు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది.


నిజాంసాగర్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం బోర్డు

ప్రతిపాదనలు పంపాం..

నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి మరమ్మతుల కోసం తొలుత రూ.3.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. రెండోసారి రూ.2.50 కోట్లతో పంపగా, కలెక్టర్ నిధికి డబ్బులు మంజూరయ్యాయి. జిల్లా యంత్రాంగం టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఆధునికీకరించి చేప పిల్లలను ఉత్పత్తి చేస్తాం.

- పూర్ణిమ, జిల్లా మత్స్య శాఖాధికారి, కామారెడ్డి

కోరి కోరి జైలుకు కోటీశ్వరుడు!

- సంగారెడ్డి జైల్లో ఒకరోజు శిక్ష
- రొట్టె పప్పుతో భోజనం.. దోమల మధ్య నిద్ర..
- 20 ఏళ్ల ముచ్చట తీర్చుకున్న కేరళ వజ్రాల వ్యాపారి


జైలు నుంచి బయటకు వస్తున్న బాబీ చిమ్మనూర్

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 6: చిప్పకూడు.. ఇరుకైన గది.. చిల్లుల దుప్పట్లు.. దోమల స్వైరవిహారం మధ్య నిద్రపట్టని రాత్రులు! ఇలా జైలు జీవితాన్ని ఊహించుకుంటేనే ఎవరికైనా ఒళ్లు జలదరిస్తుంది. ఆ కోటీశ్వరుడికి మాత్రం కారాగారవాసం అనుభవించాలని సరదా పుట్టింది! అర్జెంటీనా సాకర్ దిగ్గజం మారడోనా బ్రాండ్ అంబాసిడర్‌గా అమెరికా సహా పలుదేశాల్లో వజ్రాల షాపులున్న ఆ కోటీశ్వరుడు రాష్ట్రం కాని రాష్ట్రం వచ్చారు. సంగారెడ్డి జిల్లా జైలులో చక్కగా డబ్బులు కట్టి ఒకరోజు పూర్తిగా జైల్లోనే గడిపి తన సరదా తీర్చుకున్నారు. ఆయనే.. కేరళకు చెందిన వజ్రాల వ్యాపారి బాబీ చిమ్మనూర్. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాతజైలును అధికారులు చాన్నాళ్ల క్రితమే హెరిటేజ్ జైలు మ్యూజియంగా మార్చారు. ఔత్సాహికులకు ఇక్కడ జైలు జీవితం గడిపే అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.500 రుసుము వసూలు చేస్తున్నారు. ప్రసారమాధ్యమాల ద్వారా చిమ్మనూర్ ఈ విషయాన్ని తెలుసుకున్నారు. సోమవారం ఆయన తన ముగ్గురు స్నేహితులతో కలిసి సంగారెడ్డికి వచ్చి జైలు అధికారులను కలిశారు. దీంతో అధికారులు వారికి ఖైదీలు వేసుకునే దుస్తులను అందజేశారు. మంగళవారం ఈ నలుగురు జైలు నుంచి విడుదలయ్యారు. కోటీశ్వరుడైనా.. తాను బస చేసిన లాడ్జికి చిమ్మనూర్ ఆటోలో వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి కారులో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్లిపోయారు. అంతకుముందు బాబీ చిమ్మనూర్ మీడియాతో మాట్లాడారు. జైలు జీవితం గడపాలని 20 ఏళ్ల క్రితమే తనకు కోరిక పుట్టిందని, అయితే.. ఆ అవకాశం లేదని, నేరం చేసిన వాళ్లనే జైలుకు తీసుకెళ్తారని అధికారులు చెప్పారన్నారు. ఏది ఏమైనా ఇన్నాళ్లకు తన ముచ్చట తీరిందని ఆనందం వ్యక్తం చేశారు. బయటకువెళితే.. ఫైవ్‌స్టార్ హోటళ్లలోనే గడిపే తాను.. ఒకరోజు జైలు జీవితంలో భాగంగా దోమల మధ్య కటికనేలపై నిద్రించానన్నారు. జైలు సిబ్బంది తనకు రొట్టె-పప్పు, స్వచ్ఛమైన తాగు నీరు ఇచ్చారన్నారు. ఈ అనుభవాన్ని మర్చిపోలేనని, జైలు మరమ్మతుల కోసం అవసరమైన ఆర్థికసాయం అందిస్తానని చెప్పారు. హెరిటేజ్ జైలు మ్యూజియం గురించి ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తానన్నారు. తమ సంస్థల ప్రచారకర్త మారడోనాను ఈ జైలుకు తీసుకొస్తానని చెప్పారు. చిమ్మనూర్‌ను జిల్లా జైలు సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్, జైలర్ వెంకటేశ్వర్లు అభినందించారు.


సుబాబుల్ తోట

సుబాబుల్ కష్టాలు

- తగ్గింపు ధరలతో నష్టపోతున్న రైతులు
- తెలంగాణలో టన్నుకు రూ. 800 చొప్పున నష్టం
- జోగులాంబ గద్వాల జిల్లాలో 20 వేల ఎకరాల్లో సాగు

గద్వాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సుబాబుల్ దిగుబడులకు మద్దతు ధరలు లభించక రైతాంగం భారీగా నష్టాల బారిన పడుతోంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గంలో రైతులు 20 వేల ఎకరాల్లో సుబాబుల్ సాగు చేశారు. 6 లక్షల టన్నుల సుబాబుల్ అమ్మకానికి సిద్ధంగా ఉంది. 8 సంవత్సరాల క్రితం టన్ను సుబాబుల్‌కు రూ. 1,150 కొనుగోలు చేశారు. మహారాష్ట్ర బల్లార్ష, ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగితం పరిశ్రమ మధ్య నెలకొన్న పోటీ వల్ల రూ. 3,800 వరకు ధర పెరిగింది. సిర్పూర్ పరిశ్రమ మూతపడడంతో రెండేళ్లుగా సుబాబుల్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం భద్రాచలంలోని ఐటీసీ పేపర్ మిల్లులో టన్నుకు రూ.3,300 ధరతో కొనుగోలు చేస్తున్నారని ప్రకటనలు వస్తున్నాయి. నిజానికి టన్నుకు రూ.2,600 మాత్రమే చెల్లిస్తున్నారని దళారులు చెబుతున్నారు. మరోవైపు సుబాబుల్ రైతులు మాత్రం తమకు టన్నుకు రూ. 800 తగ్గించి కొనుగోలు చేస్తున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరల్లో వ్యత్యాసంతో కొనుగోళ్లపై రగడ

భద్రాచలంలో ఐటీసీ పేపర్ మిల్లులో కొన్ని ప్రాంతాల వారికి టన్నుకు రూ. 3,300 చెల్లిస్తూ.. అలంపూర్ నుంచి తీసుకువెళ్లిన సుబాబుల్‌ను టన్ను రూ. 2,500కే కొనుగోలు చేస్తున్నారని దళారులు ఆరోపిస్తున్నారు. కంపెనీల మాయజాలమా? దళారుల మాయజాలమా? తెలియడం లేదు కానీ తమకు మాత్రం కనీస మద్దతు ధరలు రూ. 3,200 నుంచి రూ.3,300 ఇవ్వాలని సుబాబుల్ రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సుబాబుల్‌కు మద్దతు ధర ఇప్పించాలని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావుకు తుమ్మిళ్ల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా రైతులు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో అలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ సమస్యను లేవనెత్తారు. మద్దతు ధరతో కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని హరీశ్ హామీ ఇచ్చారు. కానీ, అచరణలో మాత్రం మంత్రి మాట చెల్లుబాటు కావడం లేదు.

కడప- విజయవాడ మధ్య ట్రూజెట్ విమాన సర్వీసు

» వచ్చేనెల 1 నుంచి ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ట్రూజెట్ బ్రాండ్‌నేమ్‌తో విమానయాన సేవలందిస్తోన్న టర్బో మేఘా ఎయిర్‌వేస్.. వచ్చే నెల 1 నుంచి కడప-విజయవాడ మధ్య విమాన సర్వీసును నడపనున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉడాన్ పథకంలో భాగంగా కడప నుంచి విమాన సర్వీసులు నడుపుతున్న ఏకైక సంస్థ ట్రూజెట్. ఇప్పటికే కడప నుంచి హైదరాబాద్, చెన్నైలకు విమానయాన సేవలందిస్తోంది. మొత్తం ఐదు విమానాలతో 13 నగరాలకు సంస్థ విమానాలు నడుపుతోంది.

బేర్ బీభత్సం..

వాల్‌స్ట్రీట్ దెబ్బకు కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు .. దలాల్ స్ట్రీట్‌లో పెను ప్రకంపనలు

ఇంట్రాడేలో 1200 పాయింట్ల నష్టంతో గడగడలాడించిన సెన్సెక్స్

ఆరు రోజుల్లోనే రూ.10 లక్షల కోట్ల సంపద ఆవిరి.. అప్రమత్తమైన సెబి, బిఎస్ఇ, ఎన్ఎస్ఇ



ప్రపంచ స్టాక్ మార్కెట్లలో బీభత్స వాతావరణం నెలకొంది. జైట్లీ బడ్జెట్ దెబ్బ నుంచి కోలుకోకముందే అంతర్జాతీయ మార్కెట్ల ఆకస్మిక పతనం దలాల్ స్ట్రీట్‌ను చావుదెబ్బ తీసింది. సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలతో ఇన్వెస్టర్లను వణికించాయి. ఆరు రోజుల వరుస పతనంతో 10 లక్షల కోట్ల రూపాయల మేర ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. ప్రపంచ మార్కెట్ల దిక్సూచి వాల్‌స్ట్రీట్ భారీ పతనం, యూరప్, ఆస్ట్రేలియా, ఆసియా సహా అన్ని ప్రధాన మార్కెట్లను అల్లకల్లోలం చేసింది. మార్కెట్లో నెలకొన్న కల్లోల వాతావరణంతో కలవరపడిన రెగ్యులేటరీ సంస్థ సెబి, ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలు బిఎస్ఇ, ఎన్ఎస్ఇ అప్రమత్తమయ్యాయి.



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు తీవ్రమైన కుదుపునకు లోనయ్యాయి. కీలక సూచీలు ఇంట్రాడేలో అసాధారణ స్థాయిలో పడిపోవడంతో ఇన్వెస్టర్లు భయకంపితులయ్యారు. సెన్సెక్స్ 561 పాయింట్ల నష్టంతో 34195 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 168 పాయింట్ల నష్టంతో 10498 వద్ద క్లోజైంది. అమెరికా స్టాక్ మార్కెట్ కుప్పకూలడం ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రధాన స్టాక్ మార్కెట్లను కుదిపేసింది. ట్రేడింగ్ ప్రారంభంతోనే నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్ ఇంట్రాడేలో 1275 పాయింట్ల భారీ నష్టంతో 33601 పాయింట్లకు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభంతోనే 390 పాయింట్లు కుప్పకూలింది. ట్రేడింగ్ చివరలో కనిష్ఠ స్థాయిలకు చేరిన మేలిమి షేర్లను ఎంపిక చేసి కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ముందుకు రావడంతో కీలక సూచీలు కోలుకున్నాయి. అయితే బేర్ సృష్టించిన బీభత్సం ప్రభావం మాత్రం మార్కెట్లను కమ్ముకొనే ఉంది. మంగళవారం ఒక్క రోజులోనే మార్కెట్ సంపద 2.7 లక్షల కోట్ల రూపాయల మేర హరించుకుపోయింది. 29 రోజుల వరుస లాభాలతో 2500 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ గత నెల 29న ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 36284 పాయింట్లను తాకింది. కేవలం ఆరు రోజుల్లో ఈ లాభాలన్నీ ఆవిరైపోయాయి.

దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ కారణంగా బడ్జెట్ మరునాడు సెన్సెక్స్ దాదాపు 850 పాయింట్లు పతనమైన విషయం తెలిసిందే. బడ్జెట్ దెబ్బ నుంచి కోలుకోకముందే ఇప్పుడు ప్రపంచ మార్కెట్ల కల్లోలం దేశీయ మార్కెట్‌ను తాకింది. మార్కెట్ ఫండమెంటల్స్‌తో సంబంధం లేకుండా, ఆర్థిక రంగం అధ్వాన్నంగా ఉన్నా దాదాపు రెండు,మూడేళ్లుగా స్టాక్ మార్కెట్లలో మాత్రం పండుగ వాతావరణమే ఉంది. సెన్సెక్స్, నిఫ్టీ కొత్త శిఖరాలను చేరుతూ వచ్చాయి. గత మూడు రోజుల్లో మాత్రం సీన్ రివర్స్ అయింది. ఇప్పుడిక ఆర్‌బిఐ వడ్డీ రేట్ల విషయంలో తీసుకునే నిర్ణయమే మార్కెట్ల గమనానికి కీలకం కానుంది.

- సెన్సెక్స్‌లోని మొత్తం 30 షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. బిఎస్ఇలో దాదాపు 200 షేర్లు 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకాయి. ఈ షేర్లలో ఆదిత్య బిర్లా క్యాపిటల్, ఆంధ్రా బ్యాంక్, బజాజ్ హిందుస్తాన్, బిజిఆర్ ఎనర్జీ, సెంట్రల్ బ్యాంక్, కమ్మిన్స్ ఇండియా.. వగైరా ఉన్నాయి.
- గత ఆరు రోజుల్లోనే బిఎస్ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్ 10 లక్షల కోట్ల రూపాయల మేర తుడిచి పెట్టుకుపోయింది.
- భారతి ఎయిర్‌టెల్, టాటా స్టీల్‌లో ముమ్మరంగా జరిగిన కొనుగోళ్లు ఒక రకంగా మార్కెట్ నష్టాలను తగ్గించాయి.
- ఫిబ్రవరి ఒకటిన ఆర్థిక మంత్రి జైట్లీ వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు నుంచి మూడు సెషన్స్‌లో సెన్సెక్స్ 1768 పాయింట్లు నష్టపోయింది.
- మార్కెట్లు కల్లోలంలో ఉన్నా దాదాపు 30 షేర్లు మాత్రం 52 వారాల గరిష్ఠ స్థాయిలో ముగిసాయి. ఏటికి ఎదురీదిన టెక్‌మహీంద్రా, ఐటిసి, బజాజ్ ఆటో బాహుబలి షేర్లు అనిపించుకున్నాయి.
- టాటా మోటార్స్ షేర్లు 5 శాతం నష్టపోయాయి. మార్కెట్ క్యాప్ 6,236 కోట్ల రూపాయల మేర తగ్గింది.



కొన్ని నెలలుగా అసాధారణ స్థాయిలో పెరిగిన మార్కెట్లు కరెక్షన్‌కు సరైన సందర్భం కోసం చూస్తున్నాయి. జైట్లీ బడ్జెట్, అంతర్జాతీయ మార్కెట్లలో కల్లోలం రూపంలో ఇప్పుడా సందర్భం కలిసివచ్చింది. ఇలాంటి పతనాల్లో వేగం తీవ్రంగా ఉంటుంది. నెలల్లో పోగుపడిన లాభాలు కొన్ని రోజుల్లో తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఉంది.

-సుమీత్ చవాన్
చీఫ్ ఎనలిస్ట్ ఏంజిల్ బ్రోకింగ్



గ్లోబల్ మార్కెట్లలో కల్లోలం, ఆర్‌బిఐ పాలసీ రేట్ల విషయంలో అనిశ్చితి సంస్థాగత ఇన్వెస్టర్లు, హెచ్ఎన్ఐలు మార్కెట్‌కు దూరంగా ఉన్నారు. ఆర్‌బిఐ నిర్ణయమే మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశం ఉంది.


-వినోద్ నాయర్
జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్



ప్రస్తుత పతనంతో మార్కెట్ల విలువ వాస్తవిక స్థాయిని చేరే అవకాశం ఉంది. కొత్త ఇన్వెస్టర్లకు మంచి అవకాశం లభిస్తుంది. జైట్లీ బడ్జెట్‌లోని ప్రతిపాదనల వల్ల ఆర్థిక రంగం మళ్లీ దూసుకుపోయే అవకాశం ఉంది. ఇప్పుడు ఆర్‌బిఐ పాలసీ రేట్లు చాలా కీలకం.

-అనితా గాంధీ, అరిహంత్ క్యాపిటల్ మార్కెట్స్

ఇవీ కారణాలు..



- అమెరికా ఫెడరల్ వడ్డీ రేట్లు పెరుగుతాయన్న వార్తలు, ఆసియా మార్కెట్లు కుప్పకూలడం, దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ పన్ను కారణంగా ఏర్పడిన నెగెటివ్ సెంటిమెంట్ మార్కెట్‌ను ప్రభావితం చేశాయి.
- ఆర్‌బిఐ ప్రస్తుత సమీక్ష సమావేశాల్లో రెపో రేటు పెంచే అవకాశం ఉందన్న వార్తలు కూడా నెగెటివ్ ప్రభావాన్ని చూపాయి. ద్రవ్యోల్బణం భయాల కారణంగా రేట్ల పెంపునకు ఆర్‌బిఐ మొగ్గుచూపిస్తున్నట్టు చెబుతున్నారు.
- ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనం కూడా ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేస్తోంది.
- మార్కెట్లో కొంతకాలంగా సాగుతున్న బుల్‌రన్ టెక్నికల్‌గా కరెక్ట్ కావాల్సి ఉంది. ఇప్పుడదే జరిగిందన్నది మరి కొందరి విశ్లేషణ
- కొన్ని చిన్న, మీడియం సైజు క్యాపెక్స్ షేర్లు గత కొన్ని నెలల్లో అసాధారణ స్థాయిలో పెరిగాయి. వాటి రాబడులకు షేర్ల ధరలకు పొంతన లేకుండా పోయింది. ఈ షేర్లలోనూ ప్రాఫిట్ బుకింగ్ బాకీ ఉంది.
- బాండ్ ఈల్డ్ పెరగడం కూడా మార్కెట్ పతనానికి కారణం.

ఏం జరుగుతుంది..

- ఇంకా అనేక కార్పొరేట్ దిగ్గజ సంస్థలు క్యూ 3 ఫలితాలను ప్రకటించాల్సి ఉంది. ఈ ఫలితాల సరళి బాగుంటే మార్కెట్ స్థిమితపడే అవకాశం ఉంది.

ఫెడ్ భయాలే..



అమెరికా స్టాక్ మార్కెట్‌ను ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు భయాలు పీడిస్తున్నాయి. వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందన్న భయాలతో రెండు రోజుల వ్యవధిలోనే డౌజోన్స్ 2200 పాయింట్లు నష్టపోయింది. అమెరికా వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉందన్న వార్తలే ప్రపంచ మార్కెట్లలోనూ విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలకు దారి తీశాయి. భారత్‌లో బడ్జెట్ కారణంగా స్టాక్ మార్కెట్ కుప్పకూలిన రోజే అమెరికాలో డౌజోన్స్ కూడా ఇతర కారణాల వల్ల పతనమైంది. ఈ ఏడాది ద్రవ్యోల్బణం భగ్గుమనే అవకాశం ఉందన్న వార్తలు, ఊహించిన దానికంటే ముందుగానే ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలు మార్కెట్ పతనానికి దారితీశాయి. అమెరికా మార్కెట్ పతనం యూరప్‌లో ప్రకపంనలు సృష్టించింది. ట్రేడింగ్ ప్రారంభంతోనే లండన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా కీలక మార్కెట్లు 3.5 శాతం నష్టపోయాయి. అయితే ఇది ఉత్పాతమేమీ కాదనీ కొన్ని నెలలుగా వరుస లాభాలతో పరుగులు తీసిన స్టాక్ మార్కెట్లలో టెక్నికల్ కరెక్షన్‌గా దీనిని భావించాలని నిపుణులు చెబుతున్నారు. ఆసియాలో అత్యంత కీలకమైన జపాన్ మార్కెట్ కుప్పకూలడంతో ఇతర మార్కెట్లలోనూ దాని ప్రభావం కనిపించింది. హాంకాంగ్ 5 శాతం నష్టపోయింది. సింగపూర్ 3 శాతం పతనమైంది.

ఏడు వారాల కనిష్ఠ స్థాయిలో రూపాయి

ఈక్విటీ మార్కెట్ల పతనం.. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటును దెబ్బతీసింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు 17 పైసలు పడిపోయి రూ.64.24 దగ్గర ముగిసింది. గత ఏడు వారాల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు ఈ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. గత నాలుగు రోజుల్లోనే డాలర్‌తో రూపాయి మారకం రేటు 66 పైసలు బక్కచిక్కింది. ఇంట్రాడేలో ఒక దశలో అయితే రూపాయి మారకం రేటు రూ.64.40 పైసల వరకు పడిపోయింది. ఎఫ్‌పిఐల అమ్మకాలకు తోడు బ్యాంకులు, దిగుమతిదారుల నుంచి డిమాండ్ పెరగడం ఇందుకు కారణంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం ప్రకటించే పరపతి, ద్రవ్య విధాన సమీక్షలో ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లపై ఎలాంటి ప్రకటన చేస్తుందోనన్న భయాలు ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటును వెంటాడాయి.

సెల్‌కాన్ నుంచి

'యూనిక్' మొబైల్ ఫోన్లు

» మరో వారంలో మార్కెట్లో విడుదల



యూనిక్ మోడల్ ఫోన్లను చూపుతున్న మురళి

తిరుపతి : దేశీయ మొబైల్ ఫోన్ల తయారీ కంపెనీ 'సెల్‌కాన్' మరో వారం రోజుల్లో కొత్త మొబైల్ ఫోన్‌ను మార్కెట్‌లో విడుదల చేయబోతోంది. ఫీచర్స్, లుక్స్‌లో ఐఫోన్‌లా ఉండే ఈ మోడల్‌కు 'యూనిక్' అని కంపెనీ పేరు పెట్టింది. పనితీరులో వేగం, 5 అంగుళాల హెచ్‌డి స్క్రీన్‌తో ఒక రోజు పూర్తిగా పనిచేసేలా 2700 ఎంహెచ్ బ్యాటరీ ఈ ఫోన్ ప్రత్యేకతలు. వెనుక 16 మెగా పిక్సెల్ కెమెరా, ముందు 8 మెగా పిక్సెల్ కెమెరా సామర్థ్యాన్ని కలిగి, 3 జీబీ ర్యామ్, 32 జీబీ మెమెరీతో రూపుదిద్దుకున్న ఈ 'యూనిక్' మొబైల్ ఫోన్‌ను సెల్‌కాన్ కంపెనీ రూ.8,000 కంటే తక్కువ ధరలోనే మార్కెట్‌లో విడుదల చేసే అవకాశం ఉంది.

అన్ని విడి భాగాల తయారీ : సెల్‌కాన్ ఇడి

ప్రధాని మోదీ ఆశయాలకు తగ్గట్టు సెల్‌ఫోన్లో వినియోగించే అన్ని విడి భాగాలను స్థానికంగానే తయారు చేయాలని సెల్‌కాన్ ఆలోచిస్తున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) మురళి చెప్పారు. మార్చి నుంచి తిరుపతి సమీపంలోని రేణిగుంట యూనిట్‌లో సెటాప్ బాక్స్‌ల తయారీ, బ్యాటరీ, పవర్‌బ్యాంకుల తయారీ ప్రారంభిస్తోంది. 2020 నాటికి సెల్‌ఫోన్‌లో వినియోగించే ప్రతి విడిభాగాన్ని తాము ఉత్పత్తి చేస్తామని కంపెనీ ఇడి ధీమా వ్యక్తం చేశారు. ఒకటికి మూడుసార్లు చెక్‌చేసిన తర్వాతే ప్యాకింగ్ చేసి తమ మొబైల్ ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం నెలకు 2.5 లక్షలుగా ఉన్న మొబైల్ ఫోన్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని త్వరలో ఐదు లక్షలకు విస్తరించనున్నట్టు తెలిపారు.

బులియన్ మార్కెట్‌లో మళ్లీ పరుగు

» 14 నెలల గరిష్ఠ స్థాయిలో పసిడి

» కిలో రూ.40,000 దాటిన వెండి ధర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : స్టాక్ మార్కెట్ పతనంతో బులియన్ మార్కెట్లో పరుగు ప్రారంభమైంది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర ఒక్క రోజే రూ.300 పెరిగి రూ.31,570కు చేరింది. ఢిల్లీలోనూ ఒక్క రోజే రూ.330 పెరిగి రూ.31,600కు చేరింది. కిలో వెండి ధర రూ.500 లాభంతో మళ్లీ రూ.40,000 దాటింది. పెళ్లిళ్ల సీజన్ డిమాండ్‌తో నగల వ్యాపారుల నుంచి పసిడికి డిమాండ్ పెరిగింది. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్ పతనంతో పెట్టుబడుల రక్షణ కోసం ఇన్వెస్టర్లు పసిడి, వెండిని ఆశ్రయించారు. దీంతో బంగారం 14 నెలల గరిష్ఠ స్థాయికి చేరింది.

మరింత పైకే

ప్రస్తుత పరిస్థితుల్లో పసిడి, వెండి ధర మరింత ముందుకు పోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్టు మార్కెట్ వర్గాల అంచనా. డాలర్‌తో రూపాయి మారకం రేటు బక్కచిక్కటం, స్టాక్ మార్కెట్లలో కనిపిస్తున్న బలహీనత ఇందుకు దోహదం చేస్తాయని జెన్ కమొడిటీస్‌కు చెందిన ఓం నమశివాయ తెలిపారు. భారత మార్కెట్లో పది గ్రాముల మేలిమి బంగారం ఇప్పటికే రూ.31,600కు చేరింది. 'మరో మూడు నెలల్లో పది గ్రాముల పసిడి రూ.32,000కు, కిలో



వెండి రూ.41,000-42,000కు చేరే అవకాశం ఉంది' అని కమొడిటీస్ నిపుణులు భరత్ చెప్పారు. ఈ రెండు విలువైన లోహాల ప్రస్తుత ధరలను రెసిస్టెన్స్ ధరగా భావించవచ్చని మార్కెట్ వర్గాల అంచనా.

పెరిగిన పసిడి దిగుమతులు

పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి ఆందోళనలు సద్దుమణగడంతో 2017లో దేశంలోకి పసిడి దిగుమతులు 59 శాతం పెరిగాయి. 2016లో 558 టన్నులున్న దిగుమతులు, 2017లో 888 టన్నులకు పెరిగాయని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యుజిసి) ఒక నివేదికలో పేర్కొంది. ఇదే కాలంలో దేశంలో బంగారం గిరాకీ కూడా 9.1 శాతం పెరిగి 727 టన్నులకు చేరింది. పసిడి ఆభరణాలకు డిమాండ్ పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని డబ్ల్యుజిసి పేర్కొంది.

చక్కెరపై దిగుమతి సుంకం రెట్టింపు

» 50 శాతం నుంచి 100 శాతానికి చేరిక

న్యూఢిల్లీ: చక్కెర ధర మరింత పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే, చక్కెర దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్రం రెట్టింపు చేసింది. దాంతో 50 శాతంగా ఉన్న చక్కెర దిగుమతి సుంకం 100 శాతానికి పెరిగింది. తద్వారా చౌక దిగుమతులు తగ్గి దేశంలోని చెరకు రైతులకు పంట దిగుబడిపై మెరుగైన ధర లభిస్తుందన్న ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, మార్కెట్లో చక్కెర లభ్యత తగ్గి ధరలు ఎగువముఖంగా ప్రయాణించే అవకాశాలున్నాయి. చక్కెర తోపాటు శనగలపైనా దిగుమతి సుంకాన్ని 30 శాతం నుంచి 40 శాతానికి పెంచుతూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సిబిఇసి) మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది.

చక్కెర ధర ఉత్పత్తి వ్యయం కంటే తగ్గడంతో చెరకు రైతులకు బకాయిలు చెల్లించలేకపోతున్నామని, దిగుమతి సుంకాన్ని పెంచాలని కొద్దికాలంగా మిల్లర్లు డిమాండ్ చేసున్నారు. 2017-18 మార్కెటింగ్ ఏడాది(అక్టోబర్-సెప్టెంబర్)కి చక్కెర ఉత్పత్తి 2.61 కోట్ల టన్నులకు చేరుకోవచ్చని, డిమాండ్ 2.5 కోట్ల టన్నులుగా ఉండవచ్చని ఇండస్ట్రీ అంచనా.

క్రిప్టో కరెన్సీ ఇన్వెస్టర్లకు ఐటి నోటీసులు

» 8 కోట్లకు చేరిన పన్ను చెల్లింపుదారులు: సిబిడిటి చీఫ్ సుశీల్ చంద్ర

న్యూఢిల్లీ : బిట్‌కాయిన్స్ లాంటి క్రిప్టో కరెన్సీల్లో ఇన్వెస్ట్ చేశారా? అయితే ఆ పెట్టుబడులను మీ ఆదాయ పన్ను (ఐటి) రిటర్న్స్‌లో తెలిపారో లేదో గుర్తు చేసుకోండి. పేర్కొనకపోతే మాత్రం త్వరలోనే మీకు ఐటి శాఖ నుంచి నోటీసులు ఖాయం. ఐటి రిటర్న్‌లో ఈ పెట్టుబడులకు సంబంధించిన ఆదాయ వనరులు పేర్కొనకపోయినా లేదా వీటి అమ్మకాలపై వచ్చిన లాభాలపై పన్ను చెల్లించక పోయినా అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తున్నట్టు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) చైర్మన్ సుశీల్ చంద్ర చెప్పారు.

'ఈ పెట్టుబడుల ఆదాయం, అమ్మినపుడు వచ్చే లాభాలు పన్నుల పరిధిలోకి వస్తాయి. అందుకే వారికి నోటీసులు జారీ చేస్తున్నాం' అన్నారు. ఈ మేరకు ఇప్పటికే దేశవ్యాప్తంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ (డిజి)లకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. ఎలాంటి చట్ట బద్దత లేని బిట్‌కాయిన్స్ వంటి క్రిప్టో కరెన్సీలను నిర్మూలించి తీరుతామని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించిన కొద్ది రోజులకే సిబిడిటి ఈ చర్య తీసుకోవడం విశేషం.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
34195.94	10498.25	30650	38775	64.24	67.37
561.22	168.30	195		45	

మేలిమి - 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

నేడే ఆర్‌బిఐ పాలసీ

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి సమీక్ష మొదలైంది. బడ్జెట్ 2018-19 ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బిఐ నిర్వహించబోతున్న మొదటి సమీక్ష ఇదే. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో కూడిన ద్రవ్యపరపతి విధాన కమిటీ (ఎంపిసి) సమీక్ష మంగళవారం ప్రారంభమైంది. బుధవారం ఉదయం మరోసారి సమావేశం కానుంది. మధ్యాహ్నం ఆర్‌బిఐ సమీక్ష నిర్ణయాలను ప్రకటించనుంది. ద్రవ్యోల్బణ ఆందోళనకర స్థాయికి పెరిగిన నేపథ్యంలో ఆర్‌బిఐ కీలక వడ్డీ (రెపో) రేట్లను యథాతథంగా కొనసాగించనుందని బ్యాంకర్లు, విశ్లేషకులు భావిస్తున్నారు. బిఎన్‌పి పారిబాస్ కూడా తాజా నివేదికలో ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. గత రెండు సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును యథాతథంగా కొనసాగించింది. ఆహారోత్పత్తుల రేట్లు భగ్గుమనడంతో డిసెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 5.21 శాతానికి ఎగబాకింది. మున్ముందు నెల్లో ధరలు మరింత పెరిగే అవకాశముంది.

బ్లాక్ చెయిన్‌కు ఆకాశమే హద్దు

» బ్లాక్‌సి 60 చైర్మన్ గిరీష్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రపంచవ్యాప్తంగా సైబర్ రిస్కులు పెరిగిపోయిన వాతావరణంలో బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా మాత్రమే డేటా రక్షణ సాధ్యమని బ్లాక్‌సి 60 చైర్మన్ ఇకె గిరీష్ సింగ్ అన్నారు. మంగళవారం ఇక్కడ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీపై జరిగిన సదస్సులో మాట్లాడుతూ సాధారణ సర్వర్లలో డేటాను భద్రపరచడం వల్ల చౌర్యానికి లేదా మార్పిడికి అవకాశం ఉంటుందని, కాని బ్లాక్‌చెయిన్ టెక్నాలజీలో అలాంటి మార్పులకు తావుండదని చెప్పారు. కొన్ని దశాబ్దాల క్రితం ఇంటర్నెట్ అంటే ప్రపంచానికి ఎంత కొత్తో ఈ రోజు బ్లాక్‌చెయిన్ కూడా అంతేనని ఆయన తెలిపారు. ఆర్థిక సర్వీసులు, బ్యాంకింగ్, బీమా, ఎగుమతి దిగుమతులు వంటి రంగాలన్నింటికీ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వర్తించేవీలవుతున్నాయన్నారు. వాస్తవానికి 'ఆధార్' వ్యవస్థ కూడా ఒక బ్లాక్ చెయిన్ టెక్నాలజీయేనని ఆయన చెప్పారు. ప్రభుత్వ వనరులు, వ్యక్తులు, వారి ఆస్తులు, భూముల వంటి సమాచారం అంతటికీ బ్లాక్ చెయిన్ ఒక డిఎన్ఏగా అభివృద్ధిచేయవచ్చునని పేర్కొన్నారు. వ్యక్తుల డిఎన్ఏలో మార్పులు చేయడం ఎంత అసాధ్యమో బ్లాక్‌చెయిన్‌లో మార్పులు చేయడం కూడా అంతేనని గిరీష్ తెలిపారు. బ్లాక్ చెయిన్ విధానంలో సమాచారం భిన్న విభాగాల్లో నిక్షిప్తం అయి ఉంటుందని, ఒక విభాగం విఫలం అయినా మరో విభాగం నుంచి దాన్ని పొందగలుగుతారని ఆయన అన్నారు. ఇలాంటి సంపూర్ణ రక్షణ ఉన్నందున సమగ్ర సమాచారాన్ని బ్లాక్‌చెయిన్‌లో నిక్షిప్తం చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చిన క్రిప్టో కరెన్సీలు కూడా బ్లాక్ చెయిన్ వర్తింపచేస్తున్నట్టు గిరీష్ తెలిపారు. రోజుకి 10 లక్షల మాల్‌వేర్ దాడులు జరుగుతున్నాయని, సెక్యూరిటీ ఎంతగా విస్తరిస్తున్నా రిస్కులు కూడా అంతగా పెరిగి పోతున్నాయని కాస్పర్ కంపెనీ సిఈఓ రోమన్ గోరెంట్ అన్నారు. వివిధానైన ఆస్తుల సంరక్షణకు భద్రత అత్యంత కీలకమంటూ ఈ విషయంలో ఎలాంటి అలసత్వం వహించరాదని అవసరం అనుకున్నప్పుడు నిపుణుల సలహా పొందాలని ఆయన సూచించారు.

క్రిప్టోలలో తస్మాత్ జాగ్రత...

ప్రపంచంలో క్రిప్టో కరెన్సీల చుట్టూ తీవ్రమైన ఉత్కంఠ నెలకొన్నందున, వాటిని కొనుగోలు చేసే విషయంలో అతిజాగ్రత్తగా వ్యవహరించాలని లండన్‌కు చెందిన క్రిప్టో కార్పొరేషన్ చైర్మన్ ముదిత్ అగర్వాల్ హెచ్చరించారు. క్రిప్టో కరెన్సీల్లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు విశ్వసనీయమైన కంపెనీలను ఎంపిక చేసుకుని అవి జారీ చేసే కరెన్సీల్లో మాత్రమే ఇన్వెస్ట్ చేయాలని సూచించారు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడిపై రెండంకెల స్థాయిలో రాబడులుంటే ఇలాంటి కరెన్సీల్లో రాబడులు కొన్ని వేల రెట్లు ఉండడమే ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోందన్నారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో రక్షణ కల్పించి జారీ చేసే టోకెన్లను కొనుగోలు చేయడం మాత్రమే మంచిదని అన్నారు.

నాట్కో 350 శాతం మధ్యంతర డివిడెండ్

డిసెంబరు త్రైమాసిక లాభం రూ.217 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 11.54 శాతం వృద్ధి చెంది 217.40 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం 194.90 కోట్ల రూపాయలుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రాబడులు మాత్రం 685.10 కోట్ల రూపాయల నుంచి 573.60 కోట్ల రూపాయలకు తగ్గినట్టు నాట్కో వెల్లడించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో జెనరిక్ ఒసెల్టామివిర్ విక్రయాలతో రాబడులు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. త్రైమాసిక సమీక్షా కాలంలో అమెరికా మార్కెట్లో ఒసెల్టామివిర్ విక్రయాలకు సంబంధించి ప్రత్యేక హక్కులు లేకపోయినప్పటికీ మెరుగైన లాభాలను ప్రకటించగలిగినట్టు నాట్కో తెలిపింది. అమెరికా మార్కెట్లో ఇటీవలి కాలంలో జెనరిక్ వెర్షన్లయిన గ్లాటిరామర్ అసిటేట్, ఒసెల్టామివిర్ సస్పెన్షన్, లిపోసోమల్ డోక్సోరుబిసిన్, లాంథనమ్ కార్బొనేట్ సహా పలు కొత్త ఉత్పత్తులను విడుదల చేసినట్టు తెలిపింది. ఈ ఔషధాల కారణంగా రానున్న త్రైమాసికాల్లో మంచి వృద్ధిని సాధించవచ్చని విశ్వసిస్తున్నట్టు పేర్కొంది. కాగా త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను 2 రూపాయల ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 7 రూపాయల మధ్యంతర డివిడెండ్ (350 శాతం)ను నాట్కో ఫార్మా ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీని ఈ నెల 17 వ తేదీని ఖరారు చేసినట్లు తెలిపింది. ఈ నెల 22 నుంచి మధ్యంతర డివిడెండ్ చెల్లింపులను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. మంగళవారం బిఎస్ఇలో నాట్కో షేరు 1.01 శాతం నష్టంతో 904.30 రూపాయల వద్ద క్లోజైంది.

గల్ఫ్ ఆయిల్ లాభంలో 59 శాతం వృద్ధి

» 200 శాతం మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో హిందూజా గ్రూప్ సంస్థ గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా లిమిటెడ్ అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో అమ్మకాలు గణనీయంగా పెరగడంతో నికర లాభం ఏకంగా 59.14 శాతం వృద్ధి చెంది 42.49 కోట్ల రూపాయలుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో సంస్థ నికర లాభం 26.70 కోట్ల రూపాయలుగా ఉంది. సమీక్షా కాలంలో కీలక వ్యాపారాల్లో 22 శాతం మేర వృద్ధి నమోదు కావటం కలిసి వచ్చిందని గల్ఫ్ ఆయిల్ మేనేజింగ్ డైరెక్టర్ రవి చావ్లా తెలిపారు. డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ మొత్తం రాబడులు 34.4 శాతం వృద్ధి చెంది 355.95 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. మోటార్ సైకిల్ ఇంజిన్ ఆయిల్ విక్రయాలు ఏకంగా 35 శాతం పెరగటంతో పాటు 9 శాతం మార్కెట్ వాటాతో పటిష్ఠమైన స్థానాన్ని దక్కించుకుందని చెప్పారు. మరోవైపు డీజిల్ ఇంజిన్ ఆయిల్ విభాగ విక్రయాలు కూడా 15 శాతం పెరిగాయని పేర్కొన్నారు. రాబడులు, అమ్మకాలపరంగా డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ రికార్డులు నమోదు చేసిందని, ఆర్థిక వ్యవస్థ వృద్ధిపథంలో సాగుతుండటంతో పాటు సంస్థ కూడా అదే పంథాలో ముందుకు సాగుతోందన్నారు. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెన్నైలోని కొత్త ప్లాంట్‌లో అదనపు ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి రానుందని, దీంతో మరిన్ని అవకాశాలు చేజిక్కించుకోవచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ప్యాసింజర్ కార్ మోటార్ ఆయిల్ పిసిఎంఒ విభాగంపై కూడా దృష్టి సారించనున్నట్లు చావ్లా వెల్లడించారు. త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 2 రూపాయల ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 200 శాతం (4 రూపాయలు) మధ్యంతర డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. మంగళవారం బిఎస్ఇలో గల్ఫ్ ఆయిల్ షేరు స్వల్ప నష్టంతో 895.45 రూపాయల వద్ద స్థిరపడింది.

పిఎన్‌బి లాభం రూ.230 కోట్లు

Q3 ఫలితాలు

న్యూఢిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) లాభం రూ.230.11 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.207.18 కోట్ల లాభంతో పోల్చితే 11.06 శాతం వృద్ధి కనబర్చింది. క్యూ3లో పిఎన్‌బి ఆదాయం 8.02 శాతం పుంజుకొని రూ.15,257.50 కోట్లకు చేరుకొంది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.14,123.98 కోట్లుగా నమోదైంది. డిసెంబర్ 31, 2016తో ముగిసిన త్రైమాసికంలో 13.70 శాతంగా నమోదైన బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు.. గత ఏడాది ఇదేకాలానికి 12.11 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 9.09 శాతం నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చి 7.55 శాతానికి పరిమితమయ్యాయి. వార్షిక ప్రాతిపదికన చూస్తే.. బ్యాంక్ ప్రొవిజనింగ్ మాత్రం రూ.2,562.19 కోట్ల నుంచి 74 శాతం పెరిగి రూ.4,466.68 కోట్లకు చేరుకుంది.


స్వల్పంగా పెరిగిన హీరో మోటోకార్ప్ లాభం

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ డిసెంబరు త్రైమాసికంలో రూ.7,415.51 కోట్ల రాబడిపై రూ.805.43 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాదితో పోలిస్తే రాబడి 5.47 శాతం, నికర లాభం 4.32 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన విక్రయాలు పెరగడం కంపెనీకి కలిసొచ్చింది. మూడో త్రైమాసికంలో లాభం స్వల్పంగా పెరిగినప్పటికీ ఇన్వెస్టర్లకు భారీ నజరానా ప్రకటించింది. రెండు రూపాయల ముఖ విలువ ఉండే ఒక్కో ఈక్విటీ షేరుపై 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.55 (2,750 శాతం) చొప్పున డివిడెండ్ ప్రకటించాలని డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

కెల్టన్ టెక్ లాభం రూ. 17 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న కెల్టన్ టెక్ సొల్యూషన్స్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 17 కోట్ల రూపాయల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది (14 కోట్ల రూపాయలు)తో పోల్చితే నికర లాభం 24 శాతం వృద్ధిని సాధించినట్లు కంపెనీ చైర్మన్ నిరంజన్ చింతం వెల్లడించారు. మంగళవారం నాడిక్కడ ఆర్థిక ఫలితాలను వెల్లడించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమీక్షా కాలంలో మొత్తం రాబడులు 158.82 కోట్ల రూపాయల నుంచి 210.78 కోట్ల రూపాయలకు పెరిగాయని తెలిపారు. కంపెనీ మొత్తం రాబడుల్లో 72 శాతం వాటా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగం నుంచి రాగా బిఎఫ్ఎస్ విభాగాల వాటా 25 శాతంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కంపెనీకి అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉండగా భారత్ వాటా 7 శాతంగా ఉందని ఆయన చెప్పారు. ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 1,500గా ఉండగా భారత్‌లో 800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో మరో 200 మందిని నియమించుకోనున్నట్లు నిరంజన్ తెలిపారు. సంస్థ ఏటా 20 శాతం వృద్ధిని సాధిస్తూ వస్తోందని, అందు కు తగ్గట్టుగానే నియామకాల ప్రక్రియను చేపడుతున్నట్లు చెప్పారు. సంస్థకు హైదరాబాద్, గుర్గావ్‌ల్లో సెంటర్లున్నాయి. కార్యకలాపాల విస్తరణ కోసం 75 కోట్ల రూపాయల నుంచి 100 కోట్ల రూపాయల వరకు సమీకరించాలని చూస్తున్నట్లు నిరంజన్ వెల్లడించారు. కాగా ఇంధన రంగం కోసం ఇంటర్నెట్ ఆధారిత ఇన్నోవేషన్ టెక్నాలజీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. తొలుత ఆసియా, పసిఫిక్ దేశాలకు ఈ సేవలను అందించాలని చూస్తున్నామని, ఇందులో భాగంగా ఇండోనేషియాకు చెందిన కంపెనీలతో చర్చలు సాగిస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాతి కాలంలో యూరప్, అమెరికా దేశాలకు ఈ సేవలను విస్తరించనున్నట్లు నిరంజన్ తెలిపారు.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,570	31,150	31,540	---	30,570
క్రితం ముగింపు	31,270	31,000	---	31,050	30,410
22 క్యారెట్లు	29,230	28,800	29,010	---	29,110
క్రితం ముగింపు	28,950	28,800	---	28,800	28,960
వెండి (కిలో)	40,000	40,200	39,800	---	41,800
క్రితం ముగింపు	39,600	40,000	---	40,700	41,500

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	66.00	విజయవాడ	71.00
కరీంనగర్	68.00	గుంటూరు	71.00
వరంగల్	68.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	66.00	చిత్తూరు	60.00
కర్నూలు	66.00	నెల్లూరు	67.00
విశాఖపట్నం	67.00	అనంతపురం	64.00
గోదావరి	70.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	345.00	చిత్తూరు	373.00
వరంగల్	347.00	చెన్నై	380.00
విజయవాడ	350.00	నమక్కల్	365.00
గోదావరి	350.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	355.00	ముంబై	390.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.59	67.94
పౌండ్	81.78	94.86
యూరో	72.49	84.08
ఆస్ట్రేలియా డాలర్	46.12	53.36
బహ్రెయిన్ దినార్	158.68	181.85
కువైట్ దినార్	177.66	221.17
ఒమని రియాల్	155.39	177.78
సౌదీ రియాల్	15.58	18.47
సింగపూర్ డాలర్	44.32	52.51
యుఎఇ దిరమ్	15.95	18.64

కొనసాగిన బలహీనత

టెక్ వ్యూ

నిఫ్టీ 350 పాయింట్ల నష్టంతో భారీ డౌన్‌ట్రెండ్‌లో ప్రారంభమై 10300 వరకు దిగజారింది. డే కనిష్ఠ స్థాయి నుంచి రికవరీ సాధించి 170 పాయింట్ల వరకు నష్టాన్ని పూడ్చుకుని చివరికి డే కనిష్ఠ స్థాయిలో ముగిసింది. 11200 పాయింట్ల వద్ద ఏర్పడిన డౌన్ ట్రెండ్ టెక్నికల్‌గా కొనసాగుతోంది. ట్రెండ్ ఇప్పటికీ బలహీనంగా ఉంది. 20 డిఎంఎ దిగువకు చేరిన ఇండెక్స్ 50 డిఎంఎ వద్ద పరీక్షకు సమాయత్తం అవుతోంది. ప్రస్తుత ఆటుపోట్లు ముగిసి కన్సాలిడేషన్ పూర్తయిన తర్వాతనే ట్రెండ్‌లో స్పష్టత వస్తుంది.

బుధవారం స్థాయిలివే...

నిరోధం : 10600 **మద్దతు :** 10400

- రికవరీ బాట పడితే ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన నిరోధం 10600 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం 10700.
- ప్రధాన మద్దతు స్థాయి 10400. మరింత బలహీనత ప్రదర్శించి అంతకన్నా దిగువన ముగిస్తే మరింత కరెక్షన్ ఉంటుంది.
- బ్యాంక్ నిఫ్టీ కూడా కీలక స్థాయి 25000 కన్నా పైన రికవరీ సాధించింది. ట్రెండ్‌లో సానుకూలత కోసం రానున్న కొద్ది రోజుల్లో కన్సాలిడేట్ కావడం తప్పనిసరి.

■ వి.సుందర్ రాజా

సాధారణ నిలకడ/నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : మాఘ బహుళ అష్టమి **నక్షత్రం :** స్వాతి, విశాఖ

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి (ఉదయం), అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 10498.25 (-168.30) **టెండ్ మార్పు వేళలు:** 12.14, 1.50

ధోరణి: గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 9.30 నుంచి 12.15 మధ్యన నిస్తేజంగా ట్రేడయి 12.15 నుంచి 1.10 మధ్యలోను, చివరి సెషన్‌లోను మళ్లీ మెరుగ్గా మారవచ్చు. 1.15 నుంచి 3.15 మధ్యలో నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్ లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ఒంటి గంటకు క్లోజ్ చేసుకోవచ్చు. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే తిరిగి షార్ట్ పొజిషన్లు తీసుకుని మూడు గంటలకు క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10540, 10575

మద్దతు స్థాయిలు : 10455, 10420

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 6.25(6.57)500
ADITYA SPIN. 8.11(8.31)1081
AGRO TECH FO 631.55(632.2)1928
AISHWARYA TE 7.51(7.9)4681
ALPHAGEO (I) 853.6(876.5)6265
ALU FLUORIDE 112.6(111.65)29324
AMAR RAJA BA 762.3(778.95)28679
ANDHRA BANK 46.9(48.9)400736
ANDHRA CEMEN 11.39(11.92)34237
ANDHRA PETRO 64.2(67.05)224152
ANJANI PORTL 207.6(205.8)3126
ASTRA MICRO 103.95(107.75)93114
AUROB.PHARMA 596.25(613.65)224866
AVANTEL LTD 481.65(490.25)26302
AVANTI FEEDS 2225.15(2317.75)35920
B.N.RATHI SE 38.45(39.6)6033
BALAJI AMINE 590.4(627.75)24966
BAMBINO AGRO 237.25(246.85)2336
BARTRONICSIN 12.77(13.03)29865
BHAGIRA.CHEM 277.7(278.6)2388
BHAGYA INL 38.7(38.95)12956
BHARATFIN 1009.75(1024.9)51924
CAMBRIDGE 78.55(80.15)1738
CCHHL 14.6(15.3)50012
CCL PRODUCTS 290.4(280.4)20328
CELESTIAL 15.9(16.45)20660
CIL SECURITS 32.05(31.3)2602
COROM INTER 544.55(554)45289
CUBEX TUBING 23.9(24.75)507
CYBERMATE 3.15(3.31)93690
CYIENT 601.35(623.2)169034
DANLAW TECH. 80(82.1)9786
DECAN CEMENT 544(559.7)436
DHAN ROTO SP 36.55(38.45)530
DIAMONPOWER 16.25(17.05)57034
DIVI'S LAB. 1002.95(1033.25)65839
DIVYA.GRANIT 110(112.9)200
DQ ENT 15.75(16.35)8873
DR.REDDY'S 2095.05(2110)59191
EMPEE SUGARS 4.4(4.36)11762
EVEREST ORG. 135.05(141.85)1299
FACOR ALLOYS 3.27(3.44)117419
FIRSTOBJ 15.35(15.35)2153
GATI LTD. 114.45(119.3)158171
GAYATRI BIO 9.95(10)100
GAYATRI PROJ 192.05(200.55)13301
GENNEX LAB 4.16(4.46)348499
GMR INFRASTR 19.35(20.2)7293205
GODAVARI DRU 34.75(35)5361
GOLDST INFRA 182.55(193.1)55031
GOLDSTONE EN 13.45(14.05)15663
GRANULES (I) 115.05(119.9)269890
GVK POWERINF 18.6(19.5)1078884
HBL P SYS 52.95(55.15)181449
HERITGFOOD 694.65(722)3391
HIND.FLUROCA 15.24(14.8)1880
HINDUSTN BIO .7(.7)206
I.C.S.A. IND 4.08(4.29)32664
IKF TECHNO 1.09(1.14)66145
INCAP LTD. 95(96)4613
IPAPPM 299.8(313.7)16518
IVRCL LTD 4.69(4.75)233378
KAKATIYA CEM 292.1(312.95)24491
KALLAM SPG. 22.1(22.5)59268
KAVERI SEED 457(480.6)70215
KCP LTD 126.95(128.95)26883
KERNEX MICRO 44.6(46.9)2232
KNR CONST 302.5(299.25)37504
KREBS BIOCHM 136.95(134)1528
LANCO INFRA 1.35(1.42)939687
LOKESH MACH 59.6(64.7)33776
LOTUS CHOC 50.9(49.9)18672
MADHUCON PRJ 27(28.9)82903
MOLD-TEK TEC 62.75(66)2229
MOSCHIP SEMI 34.15(36.2)105831
MSR INDIA 36.9(37.7)1863
N C L IND. 230.9(247.85)59303
NACLIND 43.4(46.95)115188
NATCO PHARM 904.3(913.5)99806
NCC 110.2(112.65)1001880
NEHA INTER. 6.92(7.24)31679
NETTLINX LTD 82.75(87.2)13263
NEULAND LAB. 709.2(758.1)6646
NIHAR INFO 12.6(13.21)173
NILE LTD. 794(824.95)11825
NTL 4.05(4.09)24727
OIL COUNTRY 41.3(44)13231
PADMALAYA TE 4.79(5.01)15051
PALRED 84.9(90)4101
PANYAM CEMEN 52.5(54.6)28847
PENNAR STEEL 55.75(57.45)119740
PFL INFOTECH 9.59(9.93)4739
PHYTOCHEM I. 61.65(65.1)4144
PITTI LAMIN. 74.5(78.4)11425
POKARNA LTD 200.55(207.65)14516
PRAJAY ENGS. 13.95(14.65)10514
PREMIER EXPL 403.3(416.1)2254
PRISM CEMENT 122.15(127.55)187771
RAIN 330.6(337.3)883160
RAJ PACKAGIN 37.3(37.8)4047
REG.CERAMIC 6.24(6.2)252
RESTILE CER. 7.25(7.38)6402
SAGAR CEM. 905(926.5)2558
SAMKRG PIST. 293.1(307.5)13175
SAMPRE NUTRI 61.15(64.35)12528
SANGHI IND. 112.2(115.55)75305
SATVAH.ISPAT 22.3(23.9)16901
SAVEN TECHNO 19(19.75)9483
SMPL 1.39(1.43)10739
SMS PHARMACE 88(91.1)6061
SREE RAYALA 168.85(170.05)2599
STEEL EXCH 28.65(30.15)29060
SUJANA INDUS 1.02(1.07)1236
SURANATP 5.31(5.48)19213
SURYACHAKRA 1.5(1.57)18484
SURYAMBA SP 66.1(67.9)359
SURYAVA SPIN 8.16(7.78)72
SURYLAK.COTT 79.2(82.15)15364
SUVEN LIFE S 193.65(198.95)124331
TAJ GVK HOTL 163.8(168.55)8311
TANLA 29.8(31.3)147390
TRANSCORP IN 38.95(40.95)14905
TRANSGENE BI 2.28(2.18)12866
TRANSPORT CO 263.7(263.45)7771
USHER AGRO 7.84(7.75)13846
VICEROY HOTE 15.2(16.05)132347
VIJAY TEXTIL 51.05(53.7)3746
VIMTA LABS 189.9(195.2)16764
VIRAT CRANE 43(43.35)10427
VIRINCHI 114.45(120.45)18379
VISAKA IND. 632.2(669.7)25466
VISTA PHARMA 38.95(40.5)42664
VIVIMED LABS 75.65(80.15)181040
VST INDUS. 3140.05(3187.15)136
WATERBASE 322.95(313.65)649745
XLENERGY 3.44(3.45)10101
YBRANTDIGI 5.68(5.84)219127
ZEN TECH 106.55(110.35)49885
ZENOTECH 44.05(46.25)12235

ఎన్ఎస్ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 594(591.65)10580
AARTIIND 1100.25(1105.3)120459
ABAN 180.3(191.1)1218331
ABB 1618.65(1627.85)44842
ABFRL 153.15(154.2)708017
ABGSHIP 11.35(11.2)23165
ACC 1618.95(1641.15)375432
ADANIENT 195.3(199.45)5920376
ADANIPORTS 404.8(408.2)2963450
ADANIPOWER 31.6(32.7)15347398
ADANITRANS 190.65(194.4)823111
AEGISCHEM 269.8(255.25)448712
AHLUCONT 316.35(320.8)8970
AIAENG 1433.75(1450.55)278790
AJANTPHARM 1294.3(1309.55)248640
AKZOINDIA 1750.15(1775.85)21060
ALBK 58.9(60.55)4678860
ALLCARGO 184.65(189.4)416574
ALOKTEXT 3.45(3.55)2626096
AMARAJABAT 763.05(779.85)554863
AMBUJACEM 255.3(259.1)1907347
AMTEKAUTO 23.3(23.2)549447
ANANTRAJ 55.75(58.25)2090546
ANDHRABANK 46.85(48.7)4641341
APARINDS 737.5(718.65)29823
APLLTD 518.65(523.65)127794
APOLLOHOSP 1140.9(1129.55)747984
APOLLOTYRE 248.25(252)6238520
ARVIND 381.85(387.9)2292979
ASHIANA 176.25(180.6)198888
ASHOKA 212.15(218.8)152127
ASHOKLEY 126.9(129.35)24648572
ASIANPAINT 1110.25(1134.1)1055719
ASTRAL 774.75(796.8)242925
ASTRAZEN 1050.2(1141.75)32656
ATUL 2687.55(2665.6)27017
AUROPHARMA 596.85(614)2247282
AVANTIFEED 2219.7(2316.95)128997
AXISBANK 563.7(566.25)13938327
BAJAJ-AUTO 3135.1(3185.55)270751
BAJAJCORP 472.8(469.75)80987
BAJAJELEC 446.8(432.45)373544
BAJAJFINSV 4904.6(4918)263080
BAJAJHIND 13.4(13.85)4854879
BAJAJHLDNG 2694.3(2742.7)26334
BALKRISIND 1061.1(1069.6)435058
BALLARPUR 14.7(14.8)3714942
BALMLAWRIE 226.45(229.45)175831
BALRAMCHIN 113.7(116.2)4319983
BANKBARODA 154.45(157.5)11335878
BANKINDIA 142.6(147.2)4104306
BASF 1971.6(2043.75)42762
BATAINDIA 681.75(693.8)574987
BBTC 1292.3(1305.75)213025
BEML 1203.6(1263.2)664526
BERGEPAINT 241.5(242.35)1428686
BFUTILITIE 418.9(430.55)405459
BGRENERGY 117.35(122.55)154882
BHARATFIN 1009.45(1026.5)879515
BHARATFORG 699.9(714.05)1334003
BHARTIARTL 439.15(440.2)8409695
BHEL 92.5(94.85)9712898
BHUSANSTL 51(44.6)18414559
BIOCON 584.95(605.2)2001630
BIRLACORPN 1001.15(1041.7)58557
BLISSGVS 185.15(194.4)401921
BLUEDART 4551.05(4693.35)6396
BLUESTARCO 723.8(719.7)136461
BOMDYEING 230.2(222.55)17753199
BOSCHLTD 19556.1(19951.55)31736
BPCL 467.2(475.95)3148093
BRFL 57.95(61)54733
BRIGADE 280.3(278.8)107653
BRITANNIA 4530.45(4616.7)137134
CADILAHC 404.5(408.15)1402738
CANBK 318.95(317.65)5199121
CAPF 661.55(681.5)1045915
CARERATING 1304.7(1330.6)67798
CASTEXTECH 5.1(5.15)967770
CASTROLIND 179.45(180.75)6116257
CCL 292.45(281.25)235155
CEATLTD 1504.35(1619.65)980016
CENTRALBK 65.9(68.1)586709
CENTURYPLY 296.65(303.1)306417
CENTURYTEX 1261.6(1246.95)1135785
CERA 3151.1(3224.7)8980
CESC 989.5(1000.4)677609
CHAMBLFERT 141.5(142.25)2454358
CHENNPETRO 362.65(377.3)557952
CHOLAFIN 1284.95(1273.6)227637
CIPLA 564.25(580.1)1284112
CLNINDIA 590.85(597.8)15285
COALINDIA 290.35(294.8)4674661
COLPAL 1100.2(1122.65)755874
CONCOR 1300.45(1341.3)353150
COROMANDEL 544.3(551.8)240555
CORPBANK 34.5(35.6)322582
COX&KINGS 230.75(236.35)146136
CRISIL 1939.6(1958.35)11584
CUB 156.15(157.35)399796
CUMMINSIND 809.8(807)252213
CYIENT 601.35(622.5)870998
DABUR 339.25(339.1)1948962
DALMIABHA 2727.85(2731.45)159771
DBCORP 322.25(329.7)37394
DBREALTY 53.2(56)1656085
DCBBANK 164(166.2)1399393
DCMSHRIRAM 540.45(583.2)276902
DEEPAKFERT 357.65(364.35)257027
DELTACORP 325.3(342.85)3544938
DEN 100.75(100.8)522145
DENABANK 22.35(23.1)2570770
DHANUKA 655.7(694.4)31131
DHFL 505.55(509.8)9299530
DISHTV 73.8(75)6810467
DIVISLAB 1003.2(1034.65)659453
DLF 225.45(228.3)12918029
DREDGECORP 713.8(720.35)674465
DRREDDY 2095.7(2116.5)763234
DYNAMATECH 1694.25(1732.25)4081
ECLERX 1382.3(1434.55)36869
EDELWEISS 254(249.1)4283947
EICHERMOT 27579.25(27537.95)61408
EIDPARRY 316.1(319.45)104134
EIHOTEL 168.85(176.55)150504
ELECTCAST 30.85(31.3)660287
ELGIEQUIP 309.85(314.85)26274
EMAMILTD 1110.85(1092.4)498832
ENGINERSIN 163.25(166.4)2036615
EROSMEDIA 185.35(191.65)714841
ESCORTS 891.65(878.95)2966125
ESSDEE 67.8(71.35)14546
ESSELPACK 262.4(267.7)123072
EVEREADY 377.45(381)110493
EXIDEIND 203.35(204.85)2119854
FCONSUMER 61.5(60.3)7746247
FDC 241(232.65)105232
FEDERALBNK 93.15(94.2)12481756
FINCABLES 642.9(675.2)84488
FINPIPE 647.45(659.5)69735
FLFL 373.05(375.05)113676
FORTIS 114.2(118.45)15167517
FSL 39.85(40.25)5588950
GAIL 452.6(462.35)3048494
GATI 114.15(119.45)1088110
GDL 212.05(220.75)118165
GEPIL 889.25(901.3)49090
GESHIP 383.6(386.95)30208
GET&D 374.8(389.35)73336
GILLETTE 6438.65(6390.2)2937
GLAXO 2464.6(2479)14494
GLENMARK 571.3(591.55)745778
GLOBOFFS 33.1(33.75)16256
GMDCLTD 138.4(143)322062
GMRINFRA 19.35(20.15)70024411
GODFRYPHLP 850.05(888.85)181540
GODREJCP 1008.6(1039)807449
GODREJIND 555.4(557)653335
GODREJPROP 769.75(780.8)279517
GPPL 134.1(138.25)316390
GRANULES 114.85(119.45)2920956
GREAVESCOT 129.3(132.7)940169
GREENPLY 315.45(324.95)115500
GRINDWELL 500.3(500.1)15482
GRUH 518.45(545.25)532162
GSFC 120.1(124.65)3849293
GSKCONS 6341.2(6521.95)13104
GSPL 193.05(189.45)655822
GUJFLUORO 771.35(799.7)29435
GUJGASLTD 835.6(837.4)21989
GULFOILLUB 896.15(895.75)15010
GVKPIL 18.7(19.65)562379
HATHWAY 37.15(36.15)860142
HAVELLS 505.8(499.05)2052384
HCC 34.3(35.95)14054866
HCL-INSYS 52.4(54.7)3150977
HCLTECH 953.85(993.15)1655497
HDFC 1788.6(1823.35)3601190
HDFCBANK 1890(2039.5)330000
HDFCBANK 1896.8(1913.85)2687451
HDIL 50.55(52.65)17249088
HEIDELBERG 146.2(147.85)165482
HEROMOTOCO 3541.85(3636.4)442426
HEXAWARE 368.8(370.8)861156
HFCL 25.2(26.3)12727995
HIMATSEIDE 335.85(330.85)72548
HINDALCO 244.4(246.6)10473645
HINDCOPPER 73.55(75.65)3549403
HINDPETRO 377.6(383.85)5391602
HINDUNILVR 1325.35(1355.75)1540401
HINDZINC 283.3(292.95)2196991
HMT 33(34.7)14603
HMVL 234.75(250.45)92538
HONAUT 15931(16474.2)2378
HOTELEELA 19.3(20.4)394383
HSIL 400.25(414.8)83454
HTMEDIA 92.5(94.55)349526
IBREALEST 195.9(202.7)9278881
IBULHSGFIN 1294.95(1292.45)1554111
ICICIBANK 330.7(329.7)18491736
ICRA 3781(3880.3)970
IDBI 57(60.4)7384625
IDEA 85(87.55)21516479
IDFC 51.7(53.25)16575076
IFBIND 1269.15(1275.9)8289
IFCI 23(24.7)20178335
IGARASHI 790.4(827.5)81042
IIFL 697.85(751.25)365272
IL&FSTRANS 72.95(75.95)325666
INDHOTEL 135.5(135.95)683967
INDIACEM 150.7(153.1)7969557
INDIANB 327.85(340.1)1267150
INDOCO 260.1(272)172173
INDUSINDBK 1682.85(1713)1846944
INEOSSTYRO 913.85(940.65)5510
INFRATEL 344.95(349)1662550
INFY 1107.75(1138.2)5276039
INGERRAND 737.95(743.2)9418
INOXLEISUR 284.65(284.5)383860
INOXWIND 117.35(121.9)168427
INTELLECT 181.85(192.95)1191927
IOB 20.45(21.05)1152144
IOC 401.3(409)6888685
IPAPPM 298.9(314.15)82320
IPCALAB 555.1(557.4)122207
IRB 220(223.65)1963158
ITC 273.5(279.25)15822723
J&KBANK 68.7(70.65)436184
JAGRAN 163.7(169.9)965418
JAICORPLTD 151.2(161.45)3067774
JBCHEPHARM 291.15(298.2)69360
JBFIND 167.45(173.3)44220
JCHAC 2214.85(2334.4)13926
JETAIRWAYS 709.95(690.8)3713022
JINDALPOLY 332.5(343.25)78645
JINDALSTEL 253.9(259.55)16272624
JISLJALEQS 113.65(121.3)29587395
JKCEMENT 1053.65(1070.4)19531
JKIL 291.8(288.55)126840
JKLAKSHMI 401.65(409.35)93486
JKTYRE 167.2(174.6)1378372
JMFINANCIL 155.1(156.05)1614678
JPASSOCIAT 17.6(19.05)74742676
JPINFRATEC 14.05(14.65)4456962
JPPOWER 6.15(6.5)3911210
JSWENERGY 82.75(85.15)5037430
JSWHL 1690.05(1700.95)5044
JUBILANT 923.6(955.75)1746786
JUBLFOOD 1979.1(1959.35)1389047
JUSTDIAL 421.9(449.4)5256229
JYOTHYLAB 356.15(360.55)870910
KALPATPOWR 427.75(432)145267
KANSAINER 491.4(492.8)166153
KEC 347.6(352.25)841188
KESORAMIND 128.25(129.4)1009207
KIRLOSENG 354.4(378.05)23157
KITEX 270.85(272.1)104012
KOLTEPATIL 318.4(315.45)787980
KOTAKBANK 1033.8(1062.25)3334520
KPIT 206.3(207.1)3919459
KRBL 552.95(591.35)175185
KSCL 456.05(479.05)810088
KSK 13.55(14.25)402532
KTKBANK 132.65(137.9)4399966
KWALITY 90.2(94.7)1243920
L&TFH 159.35(158.4)11701257
LAKSHVILAS 126.3(129.5)613092
LAOPALA 599.95(627.75)213810
LAXMIMACH 5717.05(5714.3)4534
LICHSGFIN 500.9(516.4)3663381
LITL 1.5(1.55)620004
LT 1353.05(1363.65)4230633
LUPIN 800.9(849.1)4675402
M&M 751.8(760.5)5626253
M&MFIN 444.55(438.45)2335951
MAGMA 147.85(155.9)148115
MAHINDCIE 205.5(210.5)377806
MAHLIFE 466.1(475.55)42738
MANAPPURAM 102.55(105.4)8187525
MANPASAND 374.5(381.95)132628
MARICO 299.2(295.4)2142356
MARKSANS 37.75(38.2)4190394
MARUTI 8984.6(9080.6)840339
MAYURUNIQ 467.5(479)33482
MCDOWELL-N 3121.1(3189.7)528133
MCLEODRUSS 162.05(169.65)428541
MERCK 1427.75(1397.65)25848
MHRIL 298.05(316.8)288392
MINDACORP 182.65(186.7)656488
MINDTREE 720.7(705)2091682
MMTC 52.45(54.6)1527928
MOIL 229.25(230.45)1040364
MONSANTO 2471.7(2532.1)11355
MOTHERSUMI 356(354.6)4136488
MOTILALOFS 1173.9(1168.25)120753
MPHASIS 845.35(856.3)234511
MRF 68528.45(68615.1)21197
MRPL 114.95(117.95)2402919
MTNL 20.15(20.95)1573094
MUTHOOTFIN 391.7(396.05)1298227
NATCOPHARM 901.25(909.2)1004212
NATIONALUM 70.4(72.9)5570663
NAUKRI 1208.55(1285.5)366026
NAVKARCORP 167.9(173.65)275128
NCC 110.5(112.5)9827590
NETWORK18 49.8(51.3)1383511
NHPC 28.05(28.05)8595360
NIITTECH 830.7(826.75)1086438
NITINFIRE 5.5(5.7)357264
NLCINDIA 98.25(100.25)362499
NMDC 127.8(132.85)6666353
NTPC 165.3(166.25)4044285
OBEROIRLTY 459.15(468.95)212602
OFSS 4173.85(4233.9)58661
OIL 349.25(336.6)1502914
OMAXE 228.6(228.65)224920
ONGC 185.45(188.75)5935676
ORIENTBANK 109.2(113.55)4020358
ORIENTCEM 146.2(142)170146
ORISSAMINE 1692.6(1734.15)4370
PAGEIND 19770.9(19157.4)43269
PARSVNATH 20.65(21.7)193174
PCJEWELLER 391.45(423.7)23519891
PEL 2553.8(2617)224647
PERSISTENT 784.6(770.4)258039
PETRONET 244.3(247.65)3185974
PFC 108.55(112.35)7313821
PFIZER 2181.9(2208.85)19684
PFS 32.55(33.75)1369470
PGHH 9015(9252.2)50426
PHOENIXLTD 600.25(605.1)185843
PIDILITIND 866.5(875.2)502411
PIIND 820.65(855.6)193149
PNB 161.05(163.7)27530912
POLARIS 449.8(450.95)402662
POWERGRID 194.95(196.5)7591082
PRAJIND 91.7(96.2)2198136
PRESTIGE 288.45(302.25)335019
PRISMCEM 121.85(126.85)1569827
PTC 94(97.3)1508980
PUNJLLOYD 20.35(21.05)1880288
PURVA 136.8(143.65)453433
PVR 1331.25(1297.7)218865
RADICO 333.5(354.2)2621910
RAIN 330.65(337.55)4882060
RAJESHEXPO 800.25(817.35)269227
RALLIS 226.2(229.9)502944
RAMCOCEM 732.85(719.55)995888
RAMCOSYS 446.95(461.5)20164
RATNAMANI 952.45(965.8)9938
RAYMOND 885.9(931.9)1092806
RCF 80(84.95)5184009
RCOM 24.55(26.25)69365330
RECLTD 144.55(147.7)4580031
REDINGTON 146.85(149.45)1188950
RELAXO 598.15(588.35)281181
RELCAPITAL 436.15(456)6805153
RELIANCE 892.1(902.15)11000567
RELINFRA 431.45(446.2)2913613
RENUKA 14.8(15.25)3654110
REPCOHOME 596.8(592.1)336609
RIIL 457.25(482.75)496864
RKFORGE 752.1(764.7)77625
RNAVAL 36.3(38)7487928
ROLTA 59.25(60.65)1268905
RPOWER 40.65(42.6)10119828
RTNPOWER 6.05(6.35)8192779
RUCHISOYA 14.65(15.1)1513812
SADBHAV 399.05(389.35)252426
SADBHIN 127.6(136)370417
SAIL 83.95(84.8)20127433
SANOFI 4776.55(4931.05)4827
SBIN 291.75(298.05)30577218
SCHAEFFLER 5412.5(5375.65)2882
SCHNEIDER 110.2(114.85)105408
SCI 70.85(72)955604
SHARDACROP 400.95(413.8)25277
SHILPAMED 518.75(518.95)20149
SHK 280.75(292.7)427746
SHOPERSTOP 523.1(524)332398
SHREECEM 16517.8(16635.65)61641
SHRIRAMCIT 1893.75(1957.25)31757
SIEMENS 1256(1269)456680
SIMPLEXINF 549.85(583.05)39936
SINTEX 21.15(21.9)4306132
SITINET 19.5(20.75)313787
SJVN 34.65(35.15)937365
SKFINDIA 1733.9(1767.75)5079
SMLISUZU 781.45(811.2)28709
SNOWMAN 49.6(51.15)1459590
SOBHA 545.45(536.95)287834
SOMANYCERA 679.45(699.7)36853
SONATSOFTW 273.2(273.1)462301
SOUTHBANK 26.95(27.7)17728279
SPARC 406(416.2)404440
SREINFRA 76.25(80.15)6303757
SRF 1730.35(1775.05)167404
SRTRANSFIN 1362.35(1345.8)1250605
STAR 671.35(686.4)471683
STCINDIA 144.55(148.95)30187
SUNDARMFIN 1648.5(1636.9)8609
SUNDRMFAST 510.75(505.15)192137
SUNPHARMA 551.8(557.45)6325143
SUNTV 935.75(953.6)1007848
SUPREMEIND 1214.6(1265)36636
SUVEN 194.1(199.45)534111
SUZLON 12.8(13.3)52310997
SWANENERGY 195.3(205.5)142576
SYMPHONY 1692.2(1775.35)21869
SYNDIBANK 63.45(66.15)5567040
SYNGENE 591.15(596)94929
TAKE 163.45(163.05)175741
TATACHEM 686.2(695.45)927501
TATACOFFEE 132.7(135.6)886012
TATACOMM 603.7(619.25)755961
TATAELXSI 969(1006.45)535781
TATAGLOBAL 266.7(273.1)7044561
TATAMOTORS 375.45(395.8)25294860
TATAMTRDVR 208.55(218.95)5080477
TATAPOWER 82.8(85)7742393
TATASPONGE 969.15(1018.95)186093
TATASTEEL 664.5(664.05)6704557
TBZ 112.3(115.9)511413
TCS 2997.25(3103.2)1328653
TECHM 606.7(629.05)3104038
TECHNO 357.95(360.75)35701
TEXRAIL 92.05(96.9)935783
THERMAX 1152.8(1195.1)9973
THOMASCOOK 227.6(232.05)685000
TIDEWATER 6263.55(6460.55)2534
TIMKEN 850.2(877)131833
TITAN 782.65(802.3)3188895
TNPL 400.1(417.3)119369
TORNTPHARM 1333.75(1342.35)99878
TORNTPOWER 242.55(252.75)1747168
TREEHOUSE 12.95(13.5)23796
TRIDENT 68.9(71.9)1214924
TRITURBINE 123.5(126.9)120724
TTKPRESTIG 6767.85(6952.9)4318
TTML 6.25(6.55)563827
TV18BRDCST 53.15(54.75)8567716
TVSMOTOR 650.4(658.35)1433863
TVSSRICHAK 3450.45(3423.25)7348
TVTODAY 435.1(450.95)90617
UBL 1126.95(1180.2)1007077
UCOBANK 28.7(29.35)817871
UFLEX 363.55(378.55)315353
ULTRACEMCO 4092.65(4146.4)298939
UNICHEMLAB 354.8(357.35)531201
UNIONBANK 125.25(126.65)6453887
UNITECH 7.1(7.4)35741600
UPL 700.05(722.5)2199496
VAIBHAVGBL 677.3(680.75)39255
VAKRANGEE 212.8(236.4)4384596
VEDL 321.65(328.85)12008404
VIDEOIND 16.45(16.85)1743629
VIJAYABANK 61.35(61.1)1200993
VINATIORGA 817.2(879.35)65282
VIPIND 352.2(339.4)369373
VOLTAS 586.1(596.1)874049
VRLLOG 408.65(417.7)57388
VSTIND 3129.55(3190.15)2425
VTL 1304.15(1344.1)22306
WABAG 543.3(569.25)128831
WABCOINDIA 7182.5(7298.05)9185
WELCORP 151.9(161.15)607724
WELSPUNIND 61(62.75)3132033
WHIRLPOOL 1363.3(1365.15)61517
WIPRO 294.65(298.75)2433492
WOCKPHARMA 736.05(745.2)2711607
WONDERLA 376.1(375.35)39086
ZEEL 571.75(582.7)1296900
ZEELEARN 41.8(43.35)433443
ZENSARTECH 920.25(932.45)20077
ZYDUSWELL 971.9(976.85)45213

ఆర్డర్.. ఆర్డర్

అధిక ధరలపై ఏం చేశారు?

చర్యలు, తనిఖీల వివరాలివ్వండి : టీటీడీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అధికధరలకు విక్రయిస్తున్న హోటళ్లపై గడిచిన రెండు నెలల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎన్నిసార్లు తనిఖీలు చేశారో, అక్రమాలకు పాల్పడిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని టీటీడీని హైకోర్టు ఆదేశించింది. తిరుమలలో అధిక ధరలకు విక్రయించే హోటళ్లలో తరచూ తనిఖీలు చేయాలని అధికారులకు చెప్పాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. తిరుమలలోని రెస్టారెంట్లలో ఆహార పదార్థాలను 300 నుంచి 500 శాతం అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ చిత్తూరుకు చెందిన పరిహార సేవాసమితి గత ఏడాది దాఖలు చేసిన వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ మేరకు కోర్టు స్పందిస్తూ.. దేవునిపై ఎంతో విశ్వాసంతో తిరుమలకు వస్తుంటారని, కొండపై అవినీతి లేకుండా చూడాలని సూచించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని టీటీడీని ఆదేశించింది.

పక్కా ఇళ్ల పట్టాలపైనా నోటీసులు

అనంతపురం జిల్లా ఉరవకొండలో లబ్ధిదారులకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం... పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక వైసీపీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పైనా హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు హైకోర్టు నోటీసులు జారీచేసింది.

● బాల్య వివాహాల నిరోధానికి చర్యలేంటి?

తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిరోధానికి ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాల్య వివాహాలు చేసుకున్న బాధితుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శులతోపాటు న్యాయశాఖ కార్యదర్శిని ఆదేశించింది. బాల్య వివాహ బాధిత యువతులు మధులత, మరో పది మంది రాసిన లేఖను హైకోర్టు పిల్‌గా విచారణకు స్వీకరించింది. ఈ మేరకు ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

● నల్లగొండ ఎస్పీకి హెచ్‌ఆర్‌సీ నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బాధితులను భయభ్రాంతులకు గురిచేసిన ఒక ఘటనపై సమగ్ర నివేదిక అందజేయాలని నల్లగొండ ఎస్పీకి మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) నోటీసులు జారీ చేసింది. పోలీస్ అధికారుల వ్యవహార శైలిపై ఏప్రిల్ 17లోగా లిఖితపూర్వకంగా సమాధానం చెప్పాలని వారిని ఆదేశించింది. నల్గొండ జిల్లా మహ్మదపురానికి చెందిన ఎం.గణేశ్‌పై జనవరి 5న ఐదుగురు దుండగులు దాడి చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో అతను చికిత్స పొందుతూ వారం తర్వాత మృతి చెందాడు. అయితే ఈ కేసును విచారించిన దేవరకొండ డీఎస్పీ రాజీ కుదుర్చుకోవాలంటూ తమను వేధిస్తున్నారని మృతుడి తండ్రి మారేపల్లి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌ఆర్‌సీ స్పందించింది.

● కార్యాలయాల నిర్మాణాన్ని ఆపలేం

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లా కార్యాలయ భవనాల సముదాయ నిర్మాణ పనులను ఆపేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రజల సౌకర్యం కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాలనూ ఒకేచోట ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని, ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచందర్‌రావు నివేదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. మంత్రి లక్ష్మారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌లు తమ భూముల విలువను పెంచుకునేందుకే ఎదిరె, పాలకొండ మధ్యలో జిల్లా కార్యాలయ భవనాల సముదాయాన్ని ఏర్పాటు చేస్తోందంటూ దాఖలైన పిల్‌ను ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది.

● రిజర్వాయరు కడితే తప్పేంటి?

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు రిజర్వాయర్లను నిర్మించాలా? వద్దా అన్నది ప్రభుత్వ నిర్ణయమని, ఈ వ్యవహారంలో తామెలా జోక్యం చేసుకుంటామని హైకోర్టు... పిటిషనర్‌ను ప్రశ్నించింది. భవిష్యత్తు అవసరాల కోసం రిజర్వాయర్ల నిర్మాణం చేపడితే తప్పెలా అవుతుందని పేర్కొంది. హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు కేశవాపూర్‌లో 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయరు నిర్మించాలని తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ ఏఈ లక్ష్మీనారాయణ దాఖలు చేసిన పిల్‌ను ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

● డబ్బు డిపాజిట్ చేస్తే సరిపోదు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాజన్న సిరిసిల్ల అటవీ ప్రాంతంలో కొట్టేసిన చెట్లకు డబ్బు డిపాజిట్ చేస్తే సరిపోదని, ప్రత్యామ్నాయంగా మొక్కలు నాటాలని హైకోర్టు స్పష్టం చేసింది. మొక్కలను నాటేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు? ఇప్పటికి ఎన్ని మొక్కలు నాటారు? తదితర వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. సిరిసిల్ల జిల్లా మలకపేటలో అనుమతి లేకుండానే అటవీ ప్రాంతంలోని మూడు వేల చెట్లను కొట్టేశారని, ఇందుకు బాధ్యులైన కాంట్రాక్టు సంస్థలైన ఐవీఆర్‌సీఎల్, ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిల్‌ను ధర్మాసనం మంగళవారం విచారించింది.

జాతీయ రహదారులకు నిధులివ్వండి

గడ్కరీని కోరిన తుమ్మల నాగేశ్వరరావు

సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ/ఖమ్మం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో ప్రతి జిల్లా కేంద్రాన్ని కలిపేలా జాతీయ రహదారులు నిర్మించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రోడ్ల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌ను గతంలోనే అందించామని, టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలని మంగళవారం గడ్కరీని ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఖమ్మం-సూర్యాపేట పనులు త్వరగా చేయాలని, ఖమ్మం-అశ్వారావుపేట రహదారికి టెండర్లు పిలవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం ప్రకటించిన 3155 కిలోమీటర్ల నిడివి గల 25 నూతన జాతీయ రహదారులకు అదనంగా మరో 1207 కిలోమీటర్ల రహదారులను జాతీయ రహదారులుగా బదలాయించాలన్నారు. అంతర్రాష్ట్ర అనుసంధాన పథకంలో భాగంగా రూ.190.10 కోట్ల ప్రతిపాదనల్ని సమర్పించారు. కాగా, రూ.10 వేల కోట్ల పనులకు మార్చిలోపు టెండర్లు పిలుస్తామని గడ్కరీ హామీ ఇచ్చారని తుమ్మల 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మరోవైపు కాళేశ్వరానికి, సీతారామ ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు పర్యావరణ అనుమతులు త్వరగా అందించిన కేంద్ర పర్యావరణ మంత్రి హర్షవర్ధన్‌కు తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులను కలసిన వారిలో ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్, విశ్వేశ్వర్‌రెడ్డి, నర్సయ్యగౌడ్, సీతారాంనాయక్, దయాకర్ ఉన్నారు. మరోవైపు కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్‌సింగ్‌ను పార్లమెంటులో కలిసిన ఎంపీలు.. కందికి మద్దతు ధర ఇవ్వడంతోపాటు 2లక్షల టన్నులు కొనుగోలు చేయాలని కోరారు.


గడ్కరీని సన్మానిస్తున్న తుమ్మల

గడ్కరీకి తుమ్మల ప్రతిపాదనలు

- నిర్మల్ జిల్లాలో భైంసా - పెద్దపల్లి రోడ్డు59.00 కోట్లు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీనగరం- లక్ష్మీపురం రోడ్డు రూ.51 కోట్లు
- ముల్కలపల్లి - వెంకటాపురం రోడ్డు రూ.34.70 కోట్లు
- ఖమ్మం జిల్లా ఖానాపురం-గన్నవరం రోడ్డు రూ.12.40 కోట్లు
- ఖమ్మం జిల్లాలోని మిట్టపల్లి - ఊట్కూరు(వయా) పెద కొరికొండ రూ.34.70 కోట్లు
- నకిరేకల్ - మల్లంపల్లి జాతీయ రహదారి 365పై జమన్నపల్లీ - మంగలవారిపేట్ సెక్షన్‌లో 33 కి.మీ రహదారిపై అటవీ అనుమతుల కోసం నిలిచిన రోడ్డు విస్తరణ పనులకు అనుమతులు కోసం అభ్యర్థన
- జడ్చర్ల-దేవరకొండ సెక్షన్ జాతీయ రహదారి 167పై విస్తరణకు రూ.114.23 కోట్ల ప్రతిపాదనల అనుమతులకు వినతి
- హైదరాబాద్ మహానగరం చుట్టూ ప్రాంతీయ బాహ్య వలయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ఇతర రహదారుల పనులకు వినతి

5 వేల ఎకరాలకో వ్యవసాయాధికారి

ఆకుపచ్చ తెలంగాణ సాధనే లక్ష్యం.. ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కాంగ్రెస్: హరీశ్‌రావు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రాజెక్ట్ పనుల పరిశీలన

సిరిసిల్ల/సిద్దిపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రతి 5వేల ఎకరాలకు ఒక వ్యవసాయాధికారిని నియమిస్తున్నామని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ వద్ద సర్జిపూల్, కోనరావుపేట మండలం మల్కపేట టన్నెల్స్, రిజర్వాయర్ పనులను మంత్రి పరిశీలించారు. తిప్పాపూర్ టన్నెల్ పనుల వద్ద మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. ఆకుపచ్చ తెలంగాణ సాధనే లక్ష్యమని, అందుకోసమే రిజర్వాయర్లను నిర్మిస్తున్నామని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు కాంగ్రెస్ నేతలు మోకాలడ్డుతున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం రైతుల ప్రయోజనాలే ముఖ్యంగా ముందుకు పోతోందన్నారు. అనంతారం రిజర్వాయర్ పనుల్లో మూడు బండ్ పనులు, నాన్ ఓవర్‌ఫ్లో డ్యాం నిర్మాణ పనులు మార్చిలోగా పూర్తవుతాయన్నారు. 95 మీటర్ల ఎత్తు, 56 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఓపెన్ సర్జిపూల్ పంప్‌హౌజ్ ఆసియాలోనే మొదటిదన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్లకు పెరిగిన వేతనాలను త్వరలోనే అందిస్తామన్నారు.

ఆస్పత్రిలోలేని వైద్యులు.. మంత్రి ఆగ్రహం

ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి, అనుబంధ మెడికల్ కళాశాలను పరిశీలించిన మంత్రికి ఉదయం 9గంటలకు ఓపీ విభాగంలో వైద్యులు కనిపించలేదు. దీంతో వైద్యుల హాజరు పట్టికను తెప్పించి ఏ సమయానికి వస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగారు. చికిత్స కోసం రోగులు వస్తున్నా వైద్యులు పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చికిత్స అందిస్తున్న తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనుబంధ మెడికల్ కళాశాలలోనూ పలు డిపార్ట్‌మెంట్ గదులను పరిశీలించారు. బెడ్‌పై బెడ్‌షీట్ లేకపోవడంతో సిబ్బందిపై మండిపడ్డారు. ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. 9వ తేదీన మళ్లీ వస్తానని, నిర్లక్ష్యం కనబడితే చర్యలు తప్పవన్నారు.


తిప్పాపూర్ టన్నెల్‌ను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

నేనెవరో తెలుసా?: మంత్రి

రోజూ టీవీలో కనిపించే హరీశ్: రైతులు

'నన్ను గుర్తు పట్టారా? నేనెవరో తెలుసా?' అని మంత్రి హరీశ్‌రావు అడగగా.. 'రోజూ టీవీలో కనిపించే హరీశ్‌రావు' అని రైతులు సమాధానమిచ్చారు. సిరిసిల్లకు వెళ్తూ ముస్కానిపేట గ్రామ సమీపంలో రైతులతో మంత్రి మాట్లాడారు. నిరంతర విద్యుత్ సరఫరా వల్ల ఇబ్బందులున్నాయా? ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించారా? అని అడిగారు. దళారుల మాటలు నమ్మొద్దని, రానున్న రోజుల్లో పంట సాయం చేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి కాలేదని రైతులు ఫిర్యాదు చేయగా కలెక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేస్తామన్నారు.

వెయ్యి కోట్లతో సిమెంట్ రోడ్లు

త్వరితగతిన ప్రతిపాదనలు పంపండి

అనుమతించిన పనులను ప్రారంభించండి

అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1000 కోట్ల ఉపాధి నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు అనుమతించిన పనులను వెంటనే ప్రారంభించాలని, మిగతావాటికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై వనపర్తి జిల్లా కేంద్రం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్‌డీవోలు, అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. 6,834 సీసీ రోడ్ల పనులకు ఇప్పటికే అనుమతి ఇచ్చామని, ఇంకా 12 జిల్లాల నుంచి ప్రతిపాదనలు అందాల్సి ఉందని తెలిపారు. రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపిస్తే వాటికీ అనుమతులు ఇస్తామన్నారు. గత ఏడాదికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.199 కోట్ల విలువైన 5వేల సీసీ రోడ్ల పనులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఉపాధి కూలీలకు వేతనాలు అందడం లేదని, ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, రాష్ట్రంలో మరింత మెరుగ్గా అమలు చేయాలని సూచించారు. కాగా, వ్యక్తిగత మరుగుదొడ్లు వంద శాతం పూర్తి చేసిన గ్రామాల్లో.. సోషల్ ఆడిట్ కోసం జిల్లాల వారీగా బృందాలను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూప్రసాద్ తెలిపారు.

శాసనసభ, మండలి ప్రొరోగ్

నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు (ప్రొరోగేషన్) గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు జీవోలు విడుదల చేశారు. గతేడాది అక్టోబరు 27న అసెంబ్లీ, మండలి సమావేశాలు ప్రారంభమై అనంతరం నిరవధికంగా వాయిదా వేశారు. అయితే ఈ నెలలోనే ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని, అందులోనే పంచాయతీరాజ్ చట్టం సవరణ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే ఇటీవలే జరిగిన సమీక్షలో వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే చట్ట సవరణను ప్రవేశపెడతామని సీఎం ప్రకటించారు. దీంతో మార్చి రెండో వారంలో బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. అయితే గత సమావేశాలను ప్రొరోగేషన్ చేయడంతో తదుపరి సమావేశాలకు గవర్నర్ అనుమతి తప్పనిసరి. ప్రభుత్వం రికార్డ్ ఆఫ్ రైట్ (ఆర్వోఆర్) యాక్ట్‌తో పాటు అసైన్డ్ చట్ట సవరణపై ఆర్డినెన్స్ తెచ్చే అవకాశాలున్నాయి. ఆ తర్వాత బడ్జెట్ సమావేశాల్లో వాటి బిల్లులను సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.


రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామం

ఈ ఊరును అమ్ముకుంటాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రీతి జెనా తదితరులు దీనికి డైరెక్టర్లుగా ఉన్నారు. కంపెనీ విస్తరణ పేరిట వీళ్లు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థకు వల వేశారు. ఆయా రంగాల్లో విదేశీ ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఏర్పాటైన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పీఈసీ (ది ప్రాజెక్ట్ అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్)లోని కొందరు ఉన్నతాధికారులతో పరిచయం పెంచుకున్నారు. నేరుగా వారి సహకారంతో వందల కోట్లు కొల్లగొట్టేందుకు పక్కా స్కెచ్ వేశారు. 2014 మేలో దేశమంతా సార్వత్రిక ఎన్నికల హడావిడిలో ఉన్నప్పుడు తమ ప్లాన్‌ను అమల్లోకి తెచ్చారు. రూ.332 కోట్ల రుణం కోసం పీఈసీ లిమిటెడ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారు దరఖాస్తు చేసుకున్నదే తడవుగా ఫైల్ వేగంగా కదిలింది. అయితే, ఇంత భారీ రుణం తీసుకోవాలంటే ఏదో ఒక ఆస్తి తనఖా పెట్టాలి. దానిని చూసి, వందల కోట్ల రుణం ఇచ్చేలా ఉండాలి. ఇప్పుడు అంత ఆస్తిని ఎక్కడి నుంచి తీసుకురావాలని ఆలోచించిన వాళ్లు.. తెలంగాణలోని కొత్వాల్‌గూడను తాకట్టు పెట్టాలని నిర్ణయించారు. ఇందుకు హైదరాబాద్‌లోని ఎం.శివ భూషణ్ (76)ను థర్డ్ పార్టీగా సృష్టించారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో 1 నుంచి 170 వరకు సర్వే నంబర్లలో ఆయనకు 1,820 ఎకరాల భూమి ఉందని చూపించారు. దానిని ఆయన 1977లో సయ్యద్ మహ్మద్ హసన్ నుంచి కొనుగోలు చేశాడని, ఈ భూమి మొత్తాన్ని తన పేరు మీద 1979 జూన్ 14వ తేదీన రిజిస్టర్ చేసుకున్నాడని చూపించారు. విశేషం ఏమిటంటే, కొత్వాల్‌గూడలో ఉన్నవే 174 సర్వే నంబర్లు! వాటిలో నాలుగు మినహా మిగిలినవన్నీ శివ భూషణ్‌వేనని చూపించారు. శివభూషణ్‌ను తెరపైకి తెచ్చి తాము పీఈసీ నుంచి తీసుకునే రుణానికి పూచీకత్తుగా ఆ 1820 ఎకరాలను చూపించారు. దానిని తనఖా పెడుతున్నట్లు 2014 మే రెండో తేదీన రిజిస్ట్రేషన్ చేశారు. నిబంధనల ప్రకారం తనఖా పెట్టడానికి ఖాళీ భూములను పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. ప్లాటు ఏదైనా ఉంటే రుణం సులభతరం అవుతుంది. అందుకే, సరూర్‌నగర్‌లోని సర్వే నంబరు 9లో 500 గజాల ప్లాటును కూడా తనఖా పెట్టారు. ఒకే వ్యక్తికి వరుసగా 170 సర్వే నంబర్లలో 1820 ఎకరాల భూమి ఉంటుందా!? అది ప్రభుత్వ భూమా? పట్టా భూమా? అనే వివరాలు ఏవీ పట్టించుకోకుండానే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఏకంగా రూ.332 కోట్ల రుణం ఇచ్చేసింది.

తనఖా 10 లక్షలు.. రుణం 332 కోట్లు

తనఖా రిజిస్ట్రేషన్‌ను కూడా చాలా తెలివిగా చేశారు. 1820 ఎకరాల భూమిని పీఈసీకి కేవలం రూ.10 లక్షలకే తనఖా పెట్టారు. కానీ, ఆ భూమి విలువను మాత్రం రూ.364 కోట్లుగా చూపించారు. రూ.10 లక్షలకే తనఖా పెట్టినా పీఈసీ మాత్రం ఏకంగా రూ.332 కోట్ల రుణం ఇచ్చింది. ఇందుకు పీఈసీ అధికారులు అన్ని విధాలా సహకరించారు. ఒకవేళ ఈ కుంభకోణం ఎప్పటికైనా బయటపడితే, కుట్రదారులంతా క్షేమంగా బయటపడేందుకే ఇలా చేశారు. తమ భూమి విలువ రూ.364 కోట్లు అయినా తాము తనఖా పెట్టింది మాత్రం రూ.10 లక్షల రుణానికేనని, ఆ సొమ్మును వడ్డీతో చెల్లిస్తామని చెప్పి బయటపడవచ్చు. మిగిలిన రుణానికి తనకు సంబంధం లేదని భూమి హక్కుదారునిగా చెబుతున్న శివభూషణ్ కూడా తప్పించుకోవచ్చు. ఈ పొరపాట్లకు పీఈసీ అధికారులే బాధ్యులని చూపి కంపెనీ ప్రతినిధులు కూడా జారుకోవచ్చు. ఒకవేళ వడ్డీతో సహా రుణాన్ని రికవరీ చేసే అవకాశం ఉంటే చేయవచ్చు. కానీ, తనఖా పెట్టిన ఈ భూమికి సదరు కంపెనీ లేదా థర్డ్ పార్టీ వ్యక్తికి ఎలాంటి సంబంధం లేనందున ఈ భూములను స్వాధీనం చేసుకునే అవకాశాలు ఉండవు. దీంతో నష్టపోయేది కేంద్ర ప్రభుత్వ సంస్థ మాత్రమే! అంతేనా,

ఇది జనం సొమ్మే

ఈ కుంభకోణం జరిగిన మూడున్నరేళ్లకు పీఈసీ స్పందించింది. తమకు వచ్చిన నష్టంపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు లేఖ రాసింది. రుణంగా ఇచ్చిందంతా జనం సొమ్మేనని చెప్పింది. ఫైసీస్ సంస్థ తమ నుంచి రూ.332 కోట్ల రుణం తీసుకుందని, ఇప్పటి వరకు చెల్లింపులు లేవని పేర్కొంది. 2017 మార్చి 31 నాటికి ఈ మొత్తం వడ్డీతో కలిపి రూ.568 కోట్లకు పెరిగిందని తెలిపింది. ఈ బకాయిలు ఇప్పుడు రూ.650 కోట్లు దాటి ఉంటాయని అంచనా. తమ బకాయిలు రాబట్టుకునేందుకు తనఖా భూములను విక్రయించదలిచామని, వాటిలో ప్రభుత్వ భూములు కానీ వివాదాలున్న భూములు కానీ ఉన్నాయేమో చెప్పాలని సీఈసీ చీఫ్ మార్కెటింగ్, బ్రాంచ్ మేనేజర్ జీపై దూపటే కోరారు. తనఖా రిజిస్ట్రేషన్‌ను మీ ప్రభుత్వానికి చెందిన సబ్ రిజిస్ట్రారే చేశారని ప్రస్తావించడం గమనార్హం.



కొత్వాల్‌గూడ గ్రామం మొత్తాన్ని తనఖా పెడుతూ చేసుకున్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లోని క్రయవిక్రయదారులు

సబ్ రిజిస్ట్రార్‌ను ఎంచుకోవడం నుంచి రిజిస్ట్రేషన్ వరకూ పక్కాగా చేశారు. తనఖా రిజిస్ట్రేషన్ నుంచే ఫైసీస్ కంపెనీ- పీఈసీ ప్రతినిధులు మాయాజాలం మొదలు పెట్టారు. ఇందుకు ఎల్బీ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (అప్పటి తూర్పు రంగారెడ్డి రిజిస్ట్రార్ కార్యాలయం) అనువైనదిగా ఎంచుకున్నారు. నిజానికి, శంషాబాద్ మండలంలోని భూముల లావాదేవీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల వ్యవహారాలన్నీ స్థానికంగా ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేస్తుంటారు. అక్కడ దొరికిపోయే అవకాశం ఉండడంతో ఎల్బీ నగర్‌ను ఎంచుకున్నారు. ఇటీవల భూముల కుంభకోణంలో అరెస్టైన సబ్ రిజిస్ట్రార్ రమేశ్ చంద్రారెడ్డి అప్పట్లో అక్కడ జాయింట్ రిజిస్ట్రార్‌గా ఉన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌కు ఆయన వీరికి సహకరించారు. 1820 ఎకరాలను శివభూషణ్ పేరు మీద ఎలా ఉంది? సీలింగ్ వర్తించదా? తదితరాలను పట్టించుకుండా, కొత్వాల్‌గూడలోని మొత్తం భూమి ఆయనదేనన్నట్లుగా తనఖా రిజిస్ట్రేషన్ చేసేశారు. ఇక రిజిస్ట్రేషన్‌కు పీఈసీ తరఫున హాజరైన వ్యక్తులు కూడా బయటివారే. పీఈసీ వీరిని కన్సల్టెంట్లుగా నియమించినట్లు రికార్డుల్లో రాశారు. దొరికిపోతే సురక్షితంగా బయట పడేందుకు ఈ ఎత్తుగడ వేశారు.

చేయూతకు బ్రేక్!

నిలిచిన బ్రాహ్మణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పథకం

లబ్ధిదారుల ఎంపిక తీరుపై విమర్శల వెల్లువ

రెండు విడతల్లోనూ లబ్ధిదారులకు అందని నిధులు

ఇప్పుడు సీఎంవోలో నిలిచిన మూడో విడత ఫైలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బ్రాహ్మణుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. పేద బ్రాహ్మణుల సంక్షేమానికి పలు పథకాల్ని చేపట్టింది. బ్రాహ్మణుల్లోని ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఆర్థిక ప్రోత్సాహక పథకం ప్రారంభించింది. స్వయం ఉపాధి, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో బ్రాహ్మణ యువత రాణించేలా.. వారికి ఆర్థిక చేయూత ఇచ్చేలా ఈ పథకాన్ని రూపొందించింది. పథకం లక్ష్యం బాగానే ఉన్నా.. లబ్ధిదారుల ఎంపిక తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా, ప్రస్తుతం ఈ పథకం మొత్తానికే బ్రేక్ పడింది. ఇప్పటికే రెండు విడతల్లో ఎంపికైన వారికి ఇప్పటి వరకు ఆర్థిక సాయం అందలేదు. సరికదా.. మూడో విడత ఆర్థిక సహాయానికి సంబంధించిన ఫైల్ సీఎంవోలో నిలిచిపోయింది. ఇప్పటికే ఆయా రంగాల్లో ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయడం ఇందుకు ఒక కారణమని తెలుస్తోంది. లబ్ధిదారుల ఎంపిక తీరు పథకం లక్ష్యానికి తూట్లు పొడిచేదిగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. నిజానికి, మొదటి విడతలో 56 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసిన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్.. వారికి మంజూరు లేఖలు కూడా అందజేసింది. వాటిలో ముగ్గురి నుంచి కోటి రూపాయల కంటే ఎక్కువ వ్యయం ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చాయి. సొంతంగా ఆస్పత్రి కట్టుకోవడానికి రూ.1.40 కోట్లు; ఈ-కామర్స్ బేస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటుకు రూ.1.20 కోట్లు; స్ట్రీమింగ్ టీవీ చానల్ ఏర్పాటుకు రూ.1.20 కోట్ల ప్రతిపాదనలతో దరఖాస్తు చేసుకున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో.. పార్ట్‌నర్‌షిప్ మోటిఫ్ టెక్నోసిస్ రూ.98.92 లక్షలు, హెడ్‌డీపీఎఫ్ పైప్స్ తయారీకి రూ.82 లక్షలు, టూ వీలర్ సేల్స్ అండ్ సర్వీసెస్ రూ.25 లక్షలు, జియోసన్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు రూ.25 లక్షలు, డెయిరీ ఫారానికి రూ.22.90 లక్షలు, ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి రూ.20 లక్షలు; దుస్తుల తయారీ యూనిట్‌కు రూ.18 లక్షలు చొప్పున మంజూరు చేశారు. మొదటి విడతలో రూ.3.2 కోట్లు; రెండో విడతలో 99 మందిని ఎంపిక చేసి రూ.4 కోట్లు; మూడో విడతలో 86 మందికి రూ.3.1 కోట్లు ఆర్థిక సహాయం అందించేందుకు పరిషత్ నిర్ణయించింది. మూడు విడతల్లోనూ 241 మంది దరఖాస్తుదారులకు మంజూరు ఉత్తర్వులు కూడా ఇచ్చింది. వీరికి సబ్సిడీ కింద ఒక్కో సంస్థకు గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు లభిస్తుంది. అయితే, స్ట్రీమింగ్ టీవీ చానల్‌కు; సొంతంగా ఆస్పత్రి పెట్టుకోవడానికి, సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటుకు మంజూరులు ఇవ్వడం.. వాటికి రూ.30 లక్షలు సబ్సిడీ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. చిన్న, మధ్యతరహాతో పాటు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు పరిషత్ నుంచి అందుతున్న ఆర్థిక సహకారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సబ్సిడీ ఇలా..

ఈ పథకంలో మొత్తం ప్రాజెక్టు వ్యయంలో లబ్ధిదారులు సొంతంగా 70% నిధులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రాజెక్టు యూనిట్ విలువ రూ.5 లక్షల వరకు ఉంటే పరిషత్ నుంచి 75% సబ్సిడీ, రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు ఉంటే 50% సబ్సిడీ, రూ. 10 లక్షలు, అంతకు మించి ఉంటే 30% సబ్సిడీ లేదా గరిష్ఠంగా రూ.30 లక్షలు.. వీటిలో ఏది తక్కువగా ఉంటే ఆ మొత్తాన్ని దశలవారీగా చెల్లిస్తారు.

బాస్‌తోనే తేల్చుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

భాగమో.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగమో కాదు. సూసైడ్ లెటర్ ఎఫెక్ట్‌తోనే ఇదంతా! దీని దెబ్బకు ప్రొటోకాల్ జారిపోయింది. హద్దులు చెరిగిపోయాయి. వాటి స్థానంలో భయాందోళనలతో కూడిన స్నేహం.. ఓదార్పులు తెరమీదకొచ్చాయి. దీంతో ఏఎస్పీ, డీఎస్పీ, సీఐస్థాయి అధికారులు ప్రేక్షకపాత్రలయ్యారు. ఒక్క లెటర్ చేతిలో ఉంటే చాలు.. అంతా డైరెక్టే. పోస్టింగ్‌ల నుంచి రివార్డుల వరకు.. పలకరింపుల నుంచి ప్రశంసల వరకూ అంతా భయంతో కూడినవే. పోలీసు శాఖలో ఒకటి రెండు జిల్లాలకే పరిమితమైన ఈ ట్రెండు ఇప్పుడు హద్దులు లేకుండా విస్తరిస్తోంది. చివరకు పోలీసు శిక్షణలో కూడా చర్చనీయాంశాలుగా మారాయి. బ్లాక్ మెయిలింగ్ అనేది గతంలో విభిన్నంగా ఉండేది. భారీ దొంగతనాలు జరిగి, కేసును ఛేదించి సొమ్మును రికవరీ చేసినప్పుడో, రేషన్ బియ్యం, గంజాయి, గుడుంబా, ఇసుక అక్రమ రవాణా వంటి కేసుల్లో పంపకాలతో కూడిన స్నేహం బాగానే ఉంటోంది. ఒకరిపై మరొకరికి అపారమైన నమ్మకాలు కుదిరిపోతాయి. పనితీరులో తేడా వచ్చినప్పుడో.. కొన్ని కేసుల్లో పంపకాల్లో తేడా జరిగినప్పుడో విభేదాలు బయటకొస్తాయి. వేధింపుల పర్వం ఛార్జ్‌మెమోలు, బదిలీ దశ దాటి సస్పెన్షన్ దాకా వస్తున్నప్పుడు అప్పటిదాకా లోలోన దాగిన వైరం ఒక్కసారిగా కాగితంపై బెదిరింపు లేఖ రూపంలోకి మారిపోతోందని ఓ సీనియర్ అధికారి విశ్లేషించారు. "అన్ని కేసులూ ఇలాగే ఉండటం లేదు. కొన్ని కేసుల్లో కిందివారు తప్పు చేసినప్పుడు వారితో ఉన్నతాధికారికి ఎలాంటి దొంగ లావాదేవీలు లేకపోయినా చర్యలు తీసుకొనే విషయంలో తీవ్రంగా భయపడిపోతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వెలుగుచూడని ఓ దారుణమైన బెదిరింపుల ఘటన గతంలో జరిగింది. గుడుంబా కేసుల్లో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఓ దిగువ శ్రేణి పోలీసు అధికారిపై 18 ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత డీఎస్పీని ఆదేశించారు. ఆయన విచారణలో కొన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. విచారణ నివేదికను రూపొందిస్తున్న సమయంలో డీఎస్పీ ఆఫీసు నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి 'నువ్వు ఫినిష్. బీ రెడీ' అని మెసేజ్ వెళ్లింది. నివేదికను లీక్ చేశారు. అంతే.. ఆ అధికారి ఆగమేఘాల మీద ఓ సూసైడ్ లేఖను డీటీపీ చేయించారు. తనపై అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి సూసైడ్ చేసుకుంటున్నానని, తనపై అన్యాయంగా చర్యలు తీసుకోబోతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్పీ ఆఫీసు ముందే సూసైడ్ చేసుకోబోతున్నానంటూ ఎస్పీకి కూడా మెసేజ్ ఇచ్చారు. ఆ సమయంలో జిల్లా ఎస్పీగా ఓ మహిళా ఐపీఎస్ అధికారి ఉన్నారు. విషయం తెలుసుకున్న ఆమె భయపడిపోయారు. "ఆ ఆఫీసర్‌ను ఏమన్నావు? నీ కారణంగానే సూసైడ్ చేసుకుంటున్నా అంటున్నాడు. టెర్రర్ క్రియేట్ చేస్తున్నారు" అని డీఎస్పీని ప్రశ్నించారు. దాంతో, ఆయన గజగజ వణికిపోయాడు. అంతే.. ఇక ఆ కేసును పక్కనపెట్టేసి ఆత్మహత్య చేసుకుంటానన్న అధికారిని ఓదార్చారు. క్రమశిక్షణ చర్యలను నిలిపివేశారు. అంతే కాదు.. విచారణ నివేదికనే బుట్టదాఖలు చేశారు. ఈ ఘటన తర్వాత ఏదైనా విషయం ఉంటే ఎస్పీ నేరుగా ఎస్సైతోనే మాట్లాడేవారు. డీఎస్పీ, సీఐల పాత్ర ఏమీ ఉండేది కాదు. ఇదే అదనుగా కిందిస్థాయి అధికారి వీరిని లెక్కచేసే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో తీవ్ర ఇబ్బందికి గురయిన ఆ డీఎస్పీ వెంటనే అప్పటి డీజీపీ అనురాగ్ శర్మని కలిసి బదిలీ చేయించుకున్నారు" అని ఆ అధికారి వివరించారు. తమ కింద పనిచేసే అధికారులు తప్పులు చేస్తే చర్యలు తీసుకోవాలన్న దానికన్నా.. వారెక్కడ ఆత్మహత్య చేసుకుంటారో? లేక బెదిరిస్తారో అన్న భయంతోనే చాలామంది ఉన్నతాధికారులు కొన్ని ఫిర్యాదులపై కనీసం విచారణకు ఆదేశించడానికి కూడా జంకుతున్నారని తెలిసింది. సెన్సిటివ్‌గా ఉన్నారనే పేరుతో ఉన్నతాధికారులు నేరుగా కిందిస్థాయి అధికారులతో సంప్రదింపులు జరపడంతో మధ్యలో ఉండేవారి పాత్ర ప్రశ్నార్థకమైంది. ఇటీవలి కాలంలో ఛార్జ్‌మెమోలకు బదులు నోటిమాట ద్వారా హెచ్చరించే విధానంలోనూ చాలా మార్పు వచ్చింది. ఎస్సై, సీఐలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిపై అంతర్గత నివేదికలు తెప్పించుకొన్నాక ఉన్నతాధికారులు కొందరు చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. "ఇటీవల ఉత్తర తెలంగాణలోని ఓ జిల్లాలో ఎస్పీ తన కింద పనిచేసే సీఐని పిలిచి బాగా మందలించారు. మీ డీఎస్పీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే నీకు వార్నింగ్ ఇస్తున్నాను. తలకాయ లేకుండా పని చేస్తున్నావని, అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నావని మీ డీఎస్పీ చెప్పారు. బుద్ధిగా పని చేసుకోకపోతే కఠినంగా చర్యలు తీసుకునేందుకు డీఎస్పీ రెడీగా ఉన్నారు" అని తెలిపారు. అంతే.. ఆరోజు నుంచి ఆ సీఐకి, డీఎస్పీకి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం. ఎస్పీ దొర మంచివారు కాబట్టే డీఎస్పీ ఫిర్యాదు గురించి వివరించారని, మరొకరైతే తనపై వెంటనే చర్యలు తీసుకునేవారని ఆ సీఐలో బలంగా నాటుకుపోయింది. ఇది జరిగిన కొద్ది రోజులకే అదే సర్కిల్ పరిధిలోని ఓ ఎస్సైని పిలిచి ఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. "నువ్వు బుద్ధి, జ్ఞానం లేకుండా పని చేస్తున్నావని, ఇసుక, బొగ్గు వ్యాపారుల నుంచి లంచాలు తీసుకుంటున్నావని మీ సీఐ చెబుతున్నారు. ఏంటీ! మీ సీఐని కలవడం లేదా?" అని మందలించారు. దీంతో సీఐకి, ఎస్సైకి మధ్య లడాయి మొదలైంది. తనపై అధికారులకు సీఐ తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, తనకేదైనా జరిగితే ఆయనదే బాధ్యతంటూ ఎస్సై పలు వేదికల వద్ద వాపోయారు. నిజానికి, ఈ రెండు విషయాల్లోనూ ఎస్పీ స్థాయి అధికారి కమాండింగ్ తరహాలో కాకుండా కింది స్థాయి అధికారుల ఫిర్యాదులను ఉటంకిస్తూ పిలిచి మందలించారు. తన పాత్రేమీ లేదంటూ చెప్పుకొనే ప్రయత్నంచేశారు. దీనివల్ల సమస్య పరిష్కారం కాకపోగా.. కలిసి పని చేయాల్సిన అధికారుల మధ్య మరింత అగాధం పెరిగిపోయింది. ఆ ముగ్గురూ ఘర్షణ పడుతుంటే ఎస్పీది ప్రేక్షకపాత్ర అయిపోయింది" అని ఆ అధికారి వివరించారు. ఎవరిపై ఎలాంటి చర్య తీసుకుంటే ఎలాంటి సమస్యలు వస్తాయో? ఛార్జ్ మెమో ఇస్తే ఎవరి నుంచి సూసైడ్ లెటర్ వస్తుందోనన్న భయంతో పోలీసు శాఖలో అన్ని స్థాయిల్లో చిత్ర విచిత్ర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అధికార వర్గాలే చెబుతున్నాయి. ఈ పరిణామాలతో పోలీసు స్టేషన్‌ల తనిఖీ, క్రైమ్ మీటింగ్‌లు, నేరాల నియంత్రణకు ఇచ్చే టార్గెట్‌లు ప్రహసనంగా మారిపోయాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక, పోలీసులపై సంస్థాగతంగా వచ్చే ఫిర్యాదులపై విచారణ నివేదికలు ఉన్నతస్థాయికి చేరకముందే లీకయిపోవడం మరిన్ని సమస్యలకు దారితీస్తోందన్న ఆందోళనా వ్యక్తమవుతోంది.

మరో సీఐ 'బ్లాక్‌మెయిల్' కథ!

▸▸ ఆత్మహత్య చేసుకోబోతున్నా..!.. జనరల్ డైరీలో రాసి రారెత్తించిన సీఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఓ పోలీసు ఉన్నతాధికారి సీఐని కాస్త గట్టిగా మందలించారు! అంతే... ఆ సీఐ బెదిరింపు అస్త్రాన్ని సంధించాడు! రెండు రోజులు మాయమయ్యాడు! ఠారెత్తిన ఉన్నతాధికారి.. 48 గంటల తర్వాత అతని జాడ తెలుసుకొని బుజ్జగించారు! ఇది తాజాగా వెలుగులోకి వచ్చిన మరో సీఐ బెదిరింపు(బ్లాక్‌మెయిల్) కథ! హైదరాబాద్ నగర పోలీసులను కలవరపెట్టిన ఈ ఘటన 15 రోజుల కిందట జరిగింది. ఆ సీఐ వ్యవహారం ఇప్పటికే రెండుసార్లు రచ్చకెక్కింది. ఆయన శంషాబాద్‌లో పోస్టింగ్ కోసం విపరీతంగా ప్రయత్నిస్తున్నారు. కానీ, అతనికి అక్కడ పోస్టింగ్ ఇవ్వొద్దని, గతంలో రంగారెడ్డిలో పనిచేసిన సమయంలోనూ బాగా రచ్చచేశాడంటూ ఓ ప్రజాప్రతినిధి పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. కాగా ఆ సీఐ ప్రస్తుతం పనిచేస్తోన్న చోట.. ఓ నేరానికి సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఆయన పట్టించుకోలేదు. ఇది తెలిసి సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారి సీఐని పిలిచి గట్టిగా మందలించారు. ఆ సీఐ వెంటనే జీడీ (జనరల్ డైరీ)లో నేను 'అనారోగ్యానికి గురయ్యా. ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని రాసి వెళ్లిపోయారు.

'పోలీస్ బ్లాక్‌మెయిల్'పై దృష్టి!

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కిందిస్థాయి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిస్తే చాలు.. వేధిస్తున్నారన్న ఆరోపణలతో పాటు ఆత్మహత్యలు, బెదిరింపులు ఎక్కువయ్యాయి. పోలీసింగ్‌లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. 'యూనిఫాం' సర్వీసులో ఉన్నవారు క్రమశిక్షణగా ఉండడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంది. అలాకాకుండా బెదిరింపులు, ఆత్మహత్యలకు పాల్పడటం చట్టవిరుద్ధం. ఈ విషయాలను పోలీసు సిబ్బందిలో ప్రతి ఒక్కరికీ మరోసారి గుర్తుచేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. విచారణాధికారులుగా ఉండే ఎస్సై, ఇన్‌స్పెక్టర్లపై పని ఒత్తిడి తగ్గించే అంశంపైనా దృష్టి సారించారు. విచారణ కొనసాగుతున్న(యూఐ) కేసుల సంఖ్యను తగ్గించడంపై దృష్టిపెట్టనున్నారు.

తెలంగాణ రైల్వే డివిజన్లకు 1,813 కోట్లు

▸▸ నాలుగు కొత్త లైన్లకు నిధులు

▸▸ మరో మూడు డబ్లింగ్, ట్రిప్లింగ్ ప్రాజెక్టులు

▸▸ యాదాద్రికి ఎంఎంటీఎస్ రెండోదశ

▸▸ దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్



హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణలోని రైల్వే డివిజన్లకు రూ.1,813 కోట్ల మేర కేటాయింపులు జరిగాయని దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే.. ఇవి 5% అదనమన్నారు. మంగళవారం రైల్ నిలయంలో ఆయన విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. 'ఎస్‌సీఆర్‌లోని 6 జోన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5,752 కోట్లు కేటాయించారు. గత మూడేళ్లతో పోలిస్తే ఈ దఫా ఎక్కువ నిధులు రానున్నాయన్నారు. కొత్త లైన్లకు రూ.1,757.50 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ.1,653.52 కోట్లు, ట్రాఫిక్ సౌకర్యాలకు రూ.210.77 కోట్లు, ప్రయాణికుల సౌకర్యాలకు రూ.120.03 కోట్ల మేర కేటాయింపులు జరిగాయి. మొత్తం 1,261 రైల్వే కిలోమీటర్ల మేర లైన్లను విద్యుదీకరించేందుకు నిధులు మంజూరయ్యాయి' అన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిచ్చారన్నారు. అన్ని రైల్వే స్టేషన్లలో సీసీటీవీలు ఏర్పాటు చేస్తామని, 25వేల మంది ప్రయాణికులు దాటే ప్రతి స్టేషన్‌లో ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణలో హఫీజ్‌పేట్, ఖమ్మం రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుదీకరణలో భాగంగా రూ.80.29 కోట్లతో లింగంపేట జగిత్యాల-నిజామాబాద్(95 కిలోమీటర్లు), రూ. 262.12కోట్లతో వికారాబాద్-పర్లి (269 కిమీ)లను అభివృద్ధి చేస్తామన్నారు. 4 కొత్త రైల్వేలైన్లకు నిధులు కేటాయించగా మరో 3 మార్గాల్లో సర్వేలకు అనుమతి లభించిందన్నారు. సర్వే మంజూరైన లైన్లలో పటాన్‌చెరు-సంగారెడ్డి-జోగిపేట-మెదక్(95 కిమీ), నిజామాబాద్-నిర్మల్-ఆదిలాబాద్(125 కిమీ), మానకొండూరు-హుజూరాబాద్-ఎల్కతుర్తి(60 కిమీ) ఉన్నాయన్నారు. 'చర్లపల్లి సమీపంలో శాటిలైట్ టెర్మినల్ నిర్మాణానికి రూ.5 కోట్లు, కాజీపేట దగ్గర పిరియాడికల్ ఓవరాలింగ్ వర్క్‌షాప్‌నకు రూ.200కోట్లు, మౌలాలిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైల్వే ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఏర్పాటుకు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. మౌలాలి స్టేషన్‌లో వెల్డింగ్ ప్లాంట్ అప్‌గ్రెడేషన్ కోసం రూ.7.71 కోట్లు కేటాయించారు. తెలంగాణలో 2 ఆర్‌వోబీలు, 9 ఆర్‌యూబీలు/సబ్‌వేల నిర్మాణానికి రూ.195.37 కోట్లు ప్రకటించారు. ఇందులో రైల్వే వాటా రూ.73.14 కోట్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.122.22 కోట్లు. ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్-2 పనులు పూర్తికానుండగా.. అక్కడి నుంచి యాదాద్రి వరకు పొడిగింపు పనులకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయ'ని జీఎం చెప్పారు.

కావాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత!

▸▸ రైల్వే బడ్జెట్‌లో అరకొర నిధులు

▸▸ వీటితో ప్రాజెక్టులు పూర్తయ్యేదెన్నడు?

▸▸ కేటాయింపులపై తీవ్ర అసంతృప్తి.. 2 రాష్ట్రాలకూ నిరాశే

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రైల్వే బడ్జెట్ తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నిరాశ మిగిల్చింది! ఈ సారైనా బుల్లెట్ రైళ్లలా పరుగెడతాయనుకున్న ప్రాజెక్టులు.. గూడ్సు బళ్ల కంటే నెమ్మదిగా నడవాల్సిన దుస్థితి! కారణం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన ప్రాజెక్టులకు కేంద్రం అరకొర నిధులు కేటాయించడమే. దశాబ్దాలుగా నత్తనడకన కొనసాగుతున్న ప్రాజెక్టులు సహా హైదరాబాద్ ఎంఎంటీఎస్‌కు సైతం తూతూమంత్రంగానే నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో కేటాయించిన అరకొర నిధులతో రైల్వే ప్రాజెక్టులు ఎన్నటికి పూర్తవుతాయో కేంద్రానికే తెలియాలని ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు విమర్శలు గుప్పిస్తున్నారు.

తెలంగాణలో ఇదీ పరిస్థితి..

- సికింద్రాబాద్-భువనగిరి కొత్త లైను నిర్మాణానికి రూ.400 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లికి రూ.2,300 కోట్లు, అక్కన్నపేట-మెదక్ నిర్మాణానికి రూ.100 కోట్లు కావాల్సి ఉండగా.. రూ.100 కోట్ల లోపే కేటాయంచారు!
- బలార్షా నుంచి కాజీపేట-విజయవాడ వరకు మూడో లైనుకూ అరకొర నిధులే కేటాయించారు. రూ.3 వేల కోట్లు కావాల్సి ఉండగా ఇప్పుడు కేటాయించింది సర్వేలకూ సరిపోదని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.
- రామగుండం-భూపాలపల్లి-మహదేవపూర్-కాళేశ్వరం-మణుగూరు కొత్త లైనుకు రూ.2,200 కోట్లు; కొత్తగూడెం నుంచి ఖమ్మం(వయా సత్తుపల్లి) కొత్త లైనుకు రూ.350 కోట్లు కావాల్సి ఉండగా తక్కువగా కేటాయించారు.
- యాదాద్రి జిల్లా ప్రగడపల్లి నుంచి నడికుడి వరకు డబుల్ లైనుకు రూ.1,800 కోట్లు కావాలి. కానీ, 30 కోట్లు మాత్రమే కేటాయించారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ అంతే..

ఏపీలో ప్రధానమైన నడికుడి-శ్రీకాళహస్తి కొత్త లైను నిర్మాణానికి వేల కోట్లు కావాల్సి ఉండగా నిధులు తక్కువగా కేటాయించారు. విజయవాడ-గూడూరు కొత్తలైను, విజయవాడ-విశాఖపట్నం మూడో లైను నిర్మాణాలకు రూ.2 వేల కోట్లు కావాల్సి ఉండగా చాలా తక్కువగా కేటాయించారు. గుడివాడ-విజయవాడ, గుడివాడ-భీమవరం డబ్లింగ్ పనుల ఊసేలేదు. ఎర్రగుంట్ల-బెంగళూరు కొత్త లైనుకు అత్యల్పంగా కేటాయించారు. మొత్తానికి రెండు రాష్ట్రాలకూ నిరాశే మిగిలింది.

- దేవరకద్ర నుంచి కృష్ణ-మునీరాబాద్ కొత్త లైను నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కావాల్సి ఉండగా పూర్తిగా విస్మరించారు.
- ఆర్మూరు నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ కొత్త లైను నిర్మాణానికి నిధుల కేటాయింపులు జరగలేదు.
- హసన్‌పర్తి నుంచి కరీంనగర్‌కు 52 కిలోమీటర్ల కొత్త లైను నిర్మాణానికి నిధుల ఊసే లేదు.
- చర్లపల్లి, నాగులపల్లి టెర్మినళ్లకు కేటాయింపులు సరిగ్గా జరగలేదు.
- ఎంఎంటీఎస్ రెండో దశకు 1,100 కోట్లు కావాల్సి ఉండగా.. పదో వంతు కూడా కేటాయించలేదు. ఇతర ప్రాజెక్టులకూ నిధులు కేటాయించలేదు.
- ఇక విద్యుదీకరణ కోసం 2,500 కిలోమీటర్ల రైల్వే లైన్లు ఎదురుచూస్తుండగా.. 2018-19 బడ్జెట్‌లో వందల కిలోమీటర్లకే, అతి తక్కువ నిధులు కేటాయించారు. ఎస్‌సీఆర్‌పరిధిలో బలార్షా-కాజీపేట-విజయవాడ; రాయచూరు-వాడి, జగ్గయ్యపేట-విష్ణుపురం, ఎంఎంటీఎస్ రెండోదశ సహా మరికొన్ని ప్రధాన మార్గాలు విద్యుదీకరణ కోసం చూస్తున్నాయి.
- కాచిగూడ-మహబూబ్‌నగర్ మార్గంలో డబ్లింగ్, విద్యుదీకరణ పనులు కూడా నిధులు కోసం ఎదురు చూస్తున్నాయి. రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని ఎస్‌సీర్ భావించగా అరకొర నిధులే కేటాయించారు.

ఆన్‌లైన్‌లోనూ.. పోలీసు ఫిర్యాదు

▸▸ ఠాణా మెట్లెక్కాల్సిన పనిలేదు

▸▸ ఎఫ్ఐఆర్ తర్వాత సంతకం తప్పనిసరి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఒక్క మీటతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేలా కొత్త వ్యవస్థను తెలంగాణ పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. ఈ వ్యవస్థతో ఫిర్యాదుదారులు ఠాణాకు పదేపదే వెళ్లాల్సిన అవసరం ఉండదు. పోలీస్‌స్టేషన్లలో అధికారులు బిజీగా ఉన్నా.. వేరే కేసుల్లో తలమునకలైనా.. ఆన్‌లైన్ ద్వారా అందిన ఫిర్యాదులను రోజులో కనీసం ఒక్కసారైనా చూస్తున్నారు. సిబ్బందికి సూచనలు, ఆదేశాలిస్తున్నారు. ఈ వ్యవస్థను తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్ (www.tspolice.gov.in) లోని 'సిటిజన్ చార్టర్'లో పొందుపరిచారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయదలిచిన వారు ముందుగా తమ వివరాలను సమర్పించి యూజర్ ఖాతాను ప్రారంభించాలి. ఆన్‌లైన్ ఫిర్యాదు తీవ్రతను బట్టి పోలీసులు స్పందిస్తారు. కేసు నమోదయ్యాక.. ఫిర్యాదుదారు ఠాణాకు వెళ్లి, సంతకంచేస్తే.. వెంటనే ఎఫ్ఐఆర్ కాపీని అందజేస్తారు. కేసు పురోగతి వివరాలను ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. 'ఈ వ్యవస్థతో మహిళలకు ఏ వేళలోనైనా ఫిర్యాదు చేసే వెసులుబాటు లభిస్తుంది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌హెచ్‌వో వచ్చేవరకు ఇబ్బందికర పరిస్థితుల మధ్య వేచిచూడాల్సిన అవసరముండదు' అని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇటీవల నగరానికి చెందిన ఓ వ్యక్తి తన బైక్ చోరీకి గురైందని ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత స్టేషన్‌కు సమాచారం వెళ్లడంతో కేసు నమోదుచేసి, బాధితుడికి సమాచారం అందించారు. కాగా.. ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ ఫిర్యాదులను స్వీకరించాలన్న డిమాండ్ 15 ఏళ్లుగా ఉంది.

సిరిసిల్ల రైతు సమితి ఏర్పాటు

▸▸ మిగతా జిల్లాల్లోనూ ప్రక్రియ వేగవంతం

హైదరాబాద్, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా రైతు సమన్వయ సమితి ఏర్పాటైంది. ఈ వివరాలను జిల్లా కలెక్టర్ మంగళవారం వ్యవసాయ శాఖకు పంపారు. సిరిసిల్ల రైతు సమన్వయ సమితి ఏర్పాటుకు ఉత్తర్వులు 2 రోజుల్లో వెలువడనున్నాయి. జిల్లా రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు సంబంధిత మంత్రులు చర్యలు చేపట్టాలని శనివారం నాటి సమీక్షలో సీఎం కేసీఆర్ సూచించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల ఇన్‌చార్జి మంత్రులకు వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఫోన్లు చేసి.. సమితుల ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. సిరిసిల్లకు సంబంధించి జిల్లా సమితి ఆమోదం పొందడమే కాకుండా ఉత్తర్వుల జారీ దశకూ వచ్చింది. మరి కొన్ని జిల్లాల్లో ఇప్పటికే ఇన్‌చార్జి మంత్రుల ఆమోదం లభించిందని, వాటికి సంబంధించి వివరాలు ఒకటి రెండు రోజుల్లో వ్యవసాయశాఖకు చేరతాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా.. రాష్ట్రంలో 559 మండలాలకుగాను 547 మండలాల్లో మండలస్థాయి రైతు సమన్వయ సమితుల ఏర్పాటు పూర్తయింది.

సుప్రీం చెత్తబుట్ట కాదు



మేం చెత్త సేకరించేవాళ్లం కాదు.. మీరు చేసిన చట్టాలనే రాష్ట్రాలు పట్టించుకోవట్లేదు

▸▸ అలాంటప్పుడు వాటిని ఉపసంహరించుకోండి

▸▸ కేంద్రానికి తలంటిన ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: "మీ ఉద్దేశమేంటి!? మమ్మల్ని ప్రభావితం చేయాలని భావిస్తున్నారా!? ప్రతీ చెత్తనూ మాపై పోసేయాలని అనుకుంటున్నారు. దీన్ని మేం అంగీకరించం. మీ దగ్గర ఉన్న చెత్తంతా మా ముందు పారేస్తున్నారు. మేం చెత్త సేకరించుకునేవాళ్లం కాదు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండండి" అంటూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో తలంటింది. కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను స్వీకరించడానికి నిరాకరించింది. డెంగీ సోకిన ఏడేళ్ల బాలుడికి చికిత్స చేయడానికి 2015లో ఐదు ప్రైవేటు ఆస్పత్రులు నిరాకరించాయి. అనంతరం అతను మరణించాడు. తీవ్ర ఆందోళనకు గురైన అతని తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ కేసును సుప్రీం కోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఘన వ్యర్థాల నిర్వహణపై గత ఏడాది డిసెంబరు 12న విచారించింది. కీటకాల నుంచి వ్యాపించే డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులతో పెద్దఎత్తున మరణాలు సంభవించడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఘన వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడంతో దేశవ్యాప్తంగా వేలాది మరణాలు సంభవిస్తున్నాయని స్పష్టం చేసింది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2016 ప్రకారం రాష్ట్రస్థాయి సలహా బోర్డులను రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పాటు చేశాయా!? అయితే, ఎప్పుడు ఏర్పాటు చేశారు? వాటిలో సభ్యులు ఎవరు!? అవి ఇప్పటి వరకూ ఏమైనా సమావేశాలు నిర్వహించాయా? అయితే వాటి వివరాలు ఏమిటి? తదితర వివరాలతో మూడు వారాల్లో చార్టును సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. దానికి స్పందనగా 845 పేజీల అఫిడవిట్‌ను కేంద్రం మంగళవారం సమర్పించింది. అయితే, అది కూడా అసంపూర్తి సమాచారంతోనే. ఆంధ్రప్రదేశ్, అసోం, బిహార్, ఢిల్లీలు ఇంకా వివరాలు పంపలేదని తెలిపింది. దాంతో, ఈ కేసును విచారించిన జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం కేంద్రంపై మండిపడింది. సుప్రీం కోర్టు చెత్త బుట్ట కాదని వ్యాఖ్యానించింది. దీనికి సంబంధించి ధర్మాసనం కొన్ని ప్రశ్నలు సంధించగా, ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది వసీం ఏ ఖాద్రీ సరైన జవాబులు చెప్పలేకపోయారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చామని చెప్పారు. ఎటువంటి వివరాలూ లేనప్పుడు అఫిడవిట్ దాఖలు చేయడం ఎందుకని సుప్రీం మండిపడింది. అంతేనా, ఘన వ్యర్థాలకు సంబంధించి 2000లో నిబంధనలు రూపొందించారని, వాటిని ఏ రాష్ట్రమూ పట్టించుకోలేదని, తిరిగి 2016లో నిబంధనలు రూపొందించారని, అయినా ఎవరూ అమలు చేయలేదని కేంద్రంపై మండిపడింది. రాష్ట్రాలు సులభ నిబంధనలనే పాటించనప్పుడు కష్టమైన వాటిని ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించింది. ఇటువంటి నిబంధనలను అసలు మీరు ఎందుకు రూపొందిస్తున్నారని నిలదీసింది. వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది. కాగా, ఘన వ్యర్థాల నిర్వహణకు మున్సిపల్ కార్పొరేషన్, ఢిల్లీ సర్కారు ఒప్పందం చేసుకున్నాయని, ఇక్కడ అమలు చేస్తున్న విధానం దేశానికే ఆదర్శనీయమని అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది కొలిన్ గాన్‌సాల్వ్స్ అన్నారు. దాంతో, తాము అలా అనుకోవడం లేదని, ఇక్కడ కాలుష్య సమస్య దారుణంగా ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

క్లస్టర్ల వారీగా యాంత్రీకరణ!

▸▸ వ్యవసాయశాఖ కసరత్తు.. ఏ యంత్రాలు కావాలో తెలపండి

▸▸ ఏవో, ఏఈవోలకు ఆదేశం.. ట్రాక్టర్ల కోటా తగ్గే అవకాశం?

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కూలీల కొరత నేపథ్యంలో రైతులకు అవసరమైన యంత్రాలను అందించేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు ప్రారంభించింది. వీటిని క్లస్టర్ల వారీగా అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఆయా క్లస్టర్లలోని రైతులకు ఏయే యంత్రాలు అవసరమో తెలియజేయాలని అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులను ఆదేశించింది. వివరాలను ఈ నెల 12 కల్లా పంపాలని, వాటి ఆధారంగానే బడ్జెట్‌నూ ప్రతిపాదిస్తామని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. కూలీల కొరతను నివారించేందుకు యాంత్రీకరణకు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయశాఖ భావిస్తోంది. వరి నాటు యంత్రాలను ఈ ఏడాది సగం సబ్సిడీపై ఇవ్వనుంది. రాష్ట్రంలో ప్రతి 5 వేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా నిర్ణయించి.. ఒక్కో క్లస్టర్‌కు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని(ఏఈవో) నియమించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏఈవో సంబంధిత క్లస్టర్లోని గ్రామాల్లో ఏయే యంత్రాలు కావాలనే వివరాలను పంపాలని వ్యవసాయశాఖ ఆదేశించింది. ఆ నివేదికల ఆధారంగా యాంత్రీకరణ ప్రణాళికను రూపొందించనుంది. వచ్చే ఏడాది సబ్సిడీ ట్రాక్టర్లకు కేటాయింపులు తగ్గి.. వరినాటు యంత్రాలు, హార్వెస్టర్లు వంటి వాటికి పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు రూ.10 కోట్లతో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ బోర్డు చైర్మన్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తెలిపారు. సచివాలయంలో మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 వేల హెక్టార్ల మేర ఆయిల్ పామ్ సాగవుతోందని, దీన్ని మరో 4 వేల హెక్టార్లు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పామాయిల్ తోటల పెంపకంలో అత్యాధునిక యంత్రాలు సబ్సిడీపై అందించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

ఆధార్ 'స్మార్ట్‌కార్డు' అవసరం లేదు

▸▸ అనధికారిక ఏజెన్సీల వద్ద ప్రింటింగ్ వద్దు

▸▸ దుర్వినియోగానికి ఆస్కారం.. డబ్బు దండగ

▸▸ జిరాక్స్ కాపీ, ఎం-ఆధార్ ఉంటే చాలు

▸▸ ఆధార్ చీఫ్ అజయ్ భూషణ్ పాండే



ఆధార్ సీఈఓ పాండే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: మీరు ఆధార్‌కార్డును 'స్మార్ట్'గా ప్రింట్ చేయించాలనుకుంటున్నారా? కలర్ ప్రింటింగ్, లామినేషన్ చేసుకుంటున్నారా? ఆ చర్యలతో మీ ఆధార్ దుర్వినియోగమయ్యే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) సీఈఓ అజయ్ భూషణ్ పాండే. 'ఆధార్ స్మార్ట్‌కార్డు' ప్రింటింగ్ పేరుతో.. అనధికారిక ఏజెన్సీలు ప్రజలను దోచుకుంటున్నాయని, ఇందుకు రూ. 50 నుంచి రూ. 300 వరకు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసి, తెల్లకాగితంపై ప్రింట్ తీసిన ఆధార్ చెల్లుబాటు అవుతుందని చెప్పారు. ఎం-ఆధార్, జిరాక్స్ కాపీలు కూడా ప్రామాణికమేనన్నారు. 'లామినేషన్, పీవీసీ కార్డు, స్మార్ట్ కార్డు ఆధార్‌లతో పనిలేదు. వాటి అవసరం లేదు. డబ్బు దండగ పని అది. పైగా.. అలా ముద్రించడం వల్ల క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ పనిచేయకపోవచ్చు. అనధికారిక ఏజెన్సీలు ఆధార్ డేటాను దుర్వినియోగం చేసే ప్రమాదముంది' అని వివరించారు.

ఆధార్‌లో మార్పులపై ఇక రూ. 29.5 చార్జీ

ఆధార్‌లో మార్పుల ఛార్జీలు పెరగనున్నాయి. ప్రస్తుతం రూ. 25 చార్జీ ఉండగా.. 18 శాతం జీఎస్టీ విధింపుతో.. రూ. 29.5లకు పెరగనుంది. కీలక మార్పులు మినహా.. కొత్త మొబైల్ నంబరు, ఈమెయిల్‌ల నమోదుకు ఎలాంటి చార్జీ ఉండదని యూఐడీఏఐ పేర్కొంది. చిన్నారుల వివరాల్లో మార్పులకు గతంలో మాదిరిగా.. ఎలాంటి చార్జీలు ఉండవని తెలిపింది.

రైల్వే పోస్టులకు తప్పనిరి

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బీ) 26 వేల ఉద్యోగాలకు తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో.. అభ్యర్థులు తప్పనిసరిగా ఆధార్ వివరాలు అందించాలని పేర్కొంది. అభ్యర్థులు ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలోనే.. 12 అంకెల ఆధార్ నంబరు వివరాలు అందించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆధార్ కోసం దరఖాస్తు చేసుకుని, ఇంకా కార్డు రాని వారు 28 అంకెల ఎన్‌రోల్‌మెంట్ నంబరును పేర్కొనాలి. కాగా.. 26 వేల రైల్వే పోస్టుల్లో.. 17,673 అసిస్టెంట్ లోకో పైలట్, 8,829 సాంకేతిక ఉద్యోగాలున్నాయి.

ఎలక్టోరల్ బాండ్స్‌కు తప్పనిసరి కాదు: జైట్లీ

రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు ఇచ్చేవారికి ఆధార్ తప్పనిసరి కాదని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. 'ఈ పథకం కింద.. ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ ఇంతవరకూ ఎలాంటి ప్రతిపాదన చేయలేదు' అని లోక్‌సభకు ఆయన లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఎస్‌బీఐకి చెందిన కొన్ని ప్రత్యేక శాఖల్లోనే ఎలక్టోరల్ బాండ్స్ జారీచేస్తారు. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరు నెలల్లో పది రోజులు మాత్రమే ఈ బాండ్లు అందుబాటులో ఉంటాయి.



తైవాన్ తూర్పు తీరాన్ని భూకంపం కుదిపేసింది. దీని తీవ్రత 6.4గా నమోదైంది. భూకంపం తీవ్రతకు హువాలీన్ నగరంలోని హోటల్ ఇలా ఓ పక్కకు ఒరిగిపోయింది.

'స్వర్ణ' సాయి

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్‌లో పసిడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి ఆర్.ఎస్.ఎల్. సాయి స్వర్ణంతో మెరిశాడు. ఢిల్లీలో మంగళవారం జరిగిన బాలుర 69 కిలోల విభాగంలో సాయి మొత్తం 239 (స్నాచ్ 105, క్లీన్ అండ్ జెర్క్ 134) కేజీల బరువెత్తి బంగారు పతకం నెగ్గాడు.

ఆస్ట్రేలియా x ఇంగ్లండ్

రెండో టీ 20
మ.2.10 నుంచి
సోనీ సిక్స్‌లో



సింధు

ఆరంభం అదుర్స్

● భారత జట్ల బోణీ ● మహిళా జట్టును గెలిపించిన సింధు ● పురుషుల అలవోక విజయం ● ఆసియా బ్యాడ్మింటన్

అలోర్ సెటార్ (మలేసియా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో ఫేవరెట్ భారత్ శుభారంభం చేసింది. పురుషుల, మహిళల విభాగాల్లో తొలి మ్యాచ్‌ల్లో భారత జట్లు నెగ్గాయి. కిడాంబి శ్రీకాంత్ నేతృత్వంలోని పురుషుల జట్టు 5-0తో ఫిలిప్పీన్స్‌ను చిత్తుగా ఓడించగా.. పీవీ సింధు సారథ్యంలోని అమ్మాయిలు తొలి పోరు గట్టెక్కేందుకు పోరాడాల్సి వచ్చింది. సింధు ముందుండి నడిపించగా 3-2తో హాంకాంగ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మరో టాప్ షట్లర్ సైనా నెహ్వాల్ గాయం కారణంగా వైదొలిగిన నేపథ్యంలో తనపై పెరిగిన బాధ్యతను సింధు సమర్థవంతంగా నిర్వర్తించింది. గ్రూప్-డబ్ల్యూలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్ సింగిల్స్‌తో పాటు సిక్కిరెడ్డితో జతకట్టిన డబుల్స్‌లోనూ గెలిచి జట్టుకు విజయం అందించింది. మరో తెలుగు షట్లర్ రుత్వికా శివాని కూడా సత్తా చాటింది. గత ఆదివారం సొంతగడ్డపై ఇండియా ఓపెన్ ఫైనల్లో ఓటమి నుంచి వెంటనే కోలుకున్న సింధు ఈ మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యం చెలాయించింది. తొలి సింగిల్స్‌లో 21-12, 21-18తో హాంకాంగ్ క్రీడాకారిణి యిప్ పుయ్ యిన్‌పై వరుస గేమ్‌ల్లో గెలిచింది. ఆ తర్వాత 52 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మొదటి డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-ప్రజక్తా సావంత్ తుదికంటా పోరాడినా 22-20, 20-22, 10-21తో ఎంగ్ వింగ్ యంగ్-యాంగ్ ఎన్గా తింగ్ జంట చేతిలో ఓడిపోయింది. దాంతో, హాం కాంగ్ 1-1తో స్కోరు సమం చేసింది. అలాగే, రెండో సింగిల్స్‌లో అద్భుతంగా పోరాడినప్పటికీ తెలుగు యువ ప్లేయర్ కుదరవల్లి శ్రీ కృష్ణ ప్రియ 19-21, 21-18, 20-22తో చెయుంగ్ యింగ్ మియి చేతిలో పరాజయం పాలైంది. దాంతో, భారత్ 1-2తో వెనుకబడింది. మ్యాచ్‌లో నిలవాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన రెండో డబుల్స్‌లో సింధు-సిక్కిరెడ్డి జంట గొప్ప ప్రదర్శన చేసింది. భారత జోడీ 21-15, 15-21, 21-14తో ఎంగ్ తయ్ యవు-యుయెన్ సిన్ యింగ్ జోడీని ఓడించింది. ఇక, మ్యాచ్ ఫలితాన్ని తేల్చే చివరి, మూడో సింగిల్స్‌లో తెలుగు యువ క్రీడాకారిణి గద్దె రుత్వికా శివాని 16-21, 21-16, 21-13తో యెయుంగ్ సమ్ యీపై నెగ్గి జట్టుకు విజయం కట్టబెట్టింది. తొలి గేమ్ చేజారినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోరాడిన శివాని తన ఆటతీరుతో ఆకట్టుకున్నది. కాగా, గురువారం జరిగే రెండో మ్యాచ్‌లో జపాన్‌తో భారత అమ్మాయిలు తలపడనున్నారు.



రుత్వికా శివాని

అబ్బాయిల క్లీన్‌స్వీప్

కిడాంబి శ్రీకాంత్ నేతృత్వంలోని పురుషుల జట్టు గ్రూప్-డి తొలిమ్యాచ్‌లో చెలరేగిపోయింది. ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి ఫిలిప్పీన్స్‌ను మట్టికరిపించింది. వీటిలో భారత షట్లర్లు ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. మొదటి సింగిల్స్‌లో శ్రీకాంత్ 21-12, 21-12తో రాస్ పెడోర్సాను చిత్తు చేశాడు. డబుల్స్‌లో సుమీత్ రెడ్డి-మను అత్రి జోడీ 21-15, 21-13తో వరుస గేమ్‌ల్లో కయానన్-ఫిలిప్ జోపర్ ద్వయంపై నెగ్గింది. రెండో సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 21-6, 21-10 తో 23 నిమిషాల్లోనే సామ్యూల్ పని పట్టాడు. ఇక, రెండో డబుల్స్‌లో అర్జున్-రామచంద్రన్ జోడీ గాబ్రియెల్-అల్విన్ మొరాడను ఓడించింది. చివరిదైన మూడో సింగిల్స్‌లోనూ సమీర్ వర్మ 21-15, 21-12తో రాల్ఫ్ జఫ్రాను ఓడించడంతో ఈ మ్యాచ్‌ను భారత జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. బుధవారం జరిగే తర్వాతి మ్యాచ్‌లో శ్రీకాంత్‌సేన.. మాల్దీవ్స్‌ను ఎదుర్కోనుంది. కాగా, ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్న పురుషుల, మహిళల జట్లు బ్యాంకాక్ వేదికగా మే నెలలో జరిగే ఉబెర్ కప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

వింటర్ ఒలింపిక్స్‌కు వైరస్ భయం

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): వింటర్ ఒలింపిక్స్‌కు వైరస్ దెబ్బ తగిలింది. నోరోవైరస్ అనే వ్యాధి బారిన పడడంతో ఒలింపిక్స్‌కు సేవలందిస్తున్న 1,200మంది గార్డులను విధులనుంచి తప్పించారు. 41 మంది గార్డులు ఆదివారం వాంతులు చేసుకోవడంతో వారిని చికిత్స నిమిత్తం తరలించినట్టు నిర్వాహకులు తెలిపారు. నోరోవైరస్ అనే అంటువ్యాధి సోకడంతో వారిని విధుల నుంచి ఉపసంహరించినట్టు వివరించారు. ఈ వ్యాధి ఆహారం, నీటిద్వారా కూడా వ్యాపించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వారి స్థానంలో 900మంది సైనిక సిబ్బందిని నియమించారు. ఈ వైరస్‌పై ఆరోగ్య శాఖాధికారులు విచారిస్తున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

ఐస్‌లో వీరూ-అఫ్రీది సవాల్

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్, పాకిస్థాన్ మాజీ షాహిద్ అఫ్రీది మరోసారి సై అంటే.. సై అనున్నారు. అయితే ఇది రెగ్యులర్ క్రికెట్‌లో కాదు.. ఐస్ క్రికెట్ టోర్నీలో..! స్విట్జర్లాండ్‌లోని ఆల్ఫ్స్‌లో ఈ క్రేజీ ఐస్ క్రికెట్ టోర్నీ గురువారం మొదలు కానుంది. రెండు రోజుల పాటు జరిగే టోర్నీలో బ్యాడ్‌రట్స్‌కు సెహ్వాగ్, రాయల్స్‌కు అఫ్రీది సారథ్యం వహిస్తున్నారు. వీరూ టీమ్‌లో జహీర్ ఖాన్, మహమ్మద్ కైఫ్, అజిత్ అగార్కర్‌తోపాటు లంక మాజీ జయవర్ధనె, తిలక రత్నే, మలింగ, ఆసీస్ మాజీలు హస్సీ, సైమండ్స్ ఆడనున్నారు. స్విస్‌లో ఐస్ క్రికెట్ చాలెంజ్‌కు తాను సిద్ధమని అఫ్రీది ట్వీట్ చేశాడు.

'కామన్వెల్త్' బ్యాడ్మింటన్‌లో ఈజీ డ్రా

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఏప్రిల్‌లో జరిగే కామన్వెల్త్ క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ జట్టుకు సులభమైన డ్రా లభించింది. పాకిస్థాన్, స్కాట్లాండ్, శ్రీలంక ఉన్న గ్రూప్-ఎలో ఇండియా ఉండడంతో సునాయాసంగా నాకౌట్ స్థాయికి చేరుకునే అవకాశాలున్నాయి. బ్యాడ్మింటన్ విభాగంలో 16 దేశాలు పోటీపడుతుండగా 4 గ్రూపులుగా విభజించి పోటీలను నిర్వహించనున్నారు. ప్రతి జట్టు గ్రూపులోని తక్కిన మూడు జట్లతో తలపడాల్సి ఉంటుంది.

రోహిత్ శతకం

● హైదరాబాద్‌కు రెండో విజయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): రోహిత్ రాయుడు (135 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 126) సెంచరీతో అదరగొట్టడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 66 పరుగుల తేడాతో జార్ఖండ్‌ను చిత్తు చేసింది. తొలుత హైదరాబాద్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 333 పరుగులు చేసింది. అక్షత్ రెడ్డి (75), సందీప్ (69) కూడా రాణించారు. భారీ ఛేదనలో జార్ఖండ్ 45.5 ఓవర్లలో 267 రన్స్‌కే కుప్పకూలింది. ఆతిథ్యబౌలర్లలో రవికిరణ్ (2/41), సిరాజ్ (2/51) మెరిశారు.

ఆంధ్రను గెలిపించిన గిరినాథ్..: పేసర్ గిరినాథ్ రెడ్డి (6/24) నిప్పులు చెరగడంతో ఆంధ్ర కూడా వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-సిలో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 6 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై గ్రాండ్ విక్టరీ సాధించింది. తొలుత గిరినాథ్ ధాటికి ఎంపీ జట్టు 44.2 ఓవర్లలో 183 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ హనుమ విహారి (61) రాణించడంతో స్వల్పలక్ష్యాన్ని ఆంధ్ర 38.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కాగా, మరో మ్యాచ్‌లో చత్తీస్‌గఢ్ 4 వికెట్ల తేడాతో సర్వీసెస్‌పై నెగ్గింది. ఇక తమిళనాడును గోవా 4 వికెట్ల తేడాతో ఓడించింది. గుజరాత్‌పై ముంబై, జమ్మూ-కశ్మీర్‌పై విదర్భ గెలిచాయి.

చరిత్ర సృష్టిస్తారా!



రోహిత్ శర్మ

కోహ్లీ

● న్యూలాండ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా 33 వన్డేల్లో 28 మ్యాచ్‌లు గెలిచి ఐదు మాత్రమే ఓడింది. భారత్ నాలుగు ఆడితే రెండు మాత్రమే నెగ్గింది.

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఇప్పటిదాకా భారత్‌దే పూర్తి ఆధిపత్యం.. ఇక ఈ పర్యటనలో చరిత్ర సృష్టించేందుకు టీమిండియా సిద్ధమవుతోంది. ఎందుకంటే సఫారీ గడ్డపై భారత జట్టు ఓ సిరీస్‌లో ఇప్పటివరకు రెండు వన్డేలకు మించి గెలిచింది లేదు.. అంతులేని ఆత్మవిశ్వాసంతో గెలుపు జోరు మీదున్న కోహ్లీ సేన ఇప్పుడు తొలిసారిగా మూడో విజయాన్ని నమోదు చేయాలని చూస్తోంది. ఇదే జరిగితే మున్ముందు సిరీస్‌ను కోల్పోవడం మాత్రం ఉండదు. అన్ని విభాగాల్లో అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తున్నందున భారత జట్టే ఈ మ్యాచ్‌లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.

ఇక ఆతిథ్య జట్టు కథ మరోలా ఉంది. ప్రతీ మ్యాచ్‌కు ముందు ఆటగాళ్ల గాయాల రూపంలో వారికి షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. డివిల్లీర్స్, డుప్లెసిస్, డికాక్ దూరం కావడంతో జట్టు బలహీనంగా మారింది. దీనికి తోడు భారత స్పిన్ ద్వయాన్ని ఎదుర్కోవడంలో ఇబ్బందులు సరేసరి. ఈ నేపథ్యంలో సిరీస్‌పై ఆశలు పెట్టుకోవాలంటే ఈ మ్యాచ్ గెలవడం తప్పనిసరి. న్యూలాండ్స్ మైదానం ఈ జట్టుకు పెట్టని కోటగా ఉండడం వీరికి సానుకూలాంశం. తమకు అత్యంత అనుకూలించే మైదానంలోనైనా బోణీ చేయాలనే కసితో ఉంది.

● హ్యాట్రిక్‌పై భారత్ దృష్టి
● ఆందోళనలో దక్షిణాఫ్రికా
● నేడు మూడో వన్డే

సా. 4.30 నుంచి
SONY TEN 1

కేప్‌టౌన్: భీకర ఫామ్‌తో దూసుకెళుతున్న భారత జట్టు ముందు సువర్ణావకాశం. దక్షిణాఫ్రికాలో ఇప్పటిదాకా వన్డే సిరీస్‌ను గెలవకపోవడం పక్కన పెడితే ద్వైపాక్షిక సిరీస్‌లో కనీసం మూడు మ్యాచ్‌లు నెగ్గిన చరిత్ర కూడా భారత్‌కు లేదు. ప్రస్తుతం కోహ్లీ సేన ఆ లోటును తీర్చేసుకోవాలన్న ఆలోచనతో నేడు (బుధవారం) జరిగే మూడో వన్డేలో బరిలోకి దిగుతోంది. 1992-93లో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ 2-3తో ఓడగా.. ఆ తర్వాత 2010-11లో జరిగిన సిరీస్‌లో 2-5తో వెనుకబడింది. తాజాగా జరుగుతున్న ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-0తో ఆధిక్యంలో కొనసాగుతోంది. అదీకాకుండా సఫారీజట్టు గాయాల కారణంగా కీలక ఆటగాళ్లను చేజార్చుకుంది. కాబట్టి ఇదే జోరుతో హ్యాట్రిక్‌తో రికార్డు విజయాన్ని, ప్రత్యర్థిపై ఒత్తిడినీ పెంచాలని చూస్తోంది. అయితే న్యూలాండ్స్ మైదానంలో భారత జట్టు దక్షిణాఫ్రికాతో మూడు వన్డేలు ఆడితే ఒక్కదాంట్లో మాత్రమే గెలవగలిగింది. మరోవైపు ఆతిథ్య జట్టుకు అనుభవంలేని కెప్టెన్‌తో పాటు ఒంటి చేత్తో విజయాలు అందించే డివిల్లీర్స్, డుప్లెసిస్, డికాక్‌లను కోల్పోవడం మింగుడు పడడం లేదు. అటు బౌలర్లు కూడా ప్రభావం చూపించడం లేదు. దీంతో ఈ డే అండ్ నైట్ వన్డేలో ఎలా రాణిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ మ్యాచ్‌లో సఫారీలు గెలిస్తే భారత్ తిరిగి నెంబర్ 2కు పడిపోతుంది.

మరో దెబ్బకు రెడీ..: టెస్టు సిరీస్‌కు భిన్నంగా భారత జట్టుపై ఇప్పుడు ఎలాంటి ఒత్తిడీ లేదు. అందుకే జట్టులో కూడా మార్పులు లేకుండానే బరిలోకి దిగాలని చూస్తోంది. ఓపెనర్ రోహిత్ శర్మ ఫామ్‌ను పక్కనబెడితే బ్యాటింగ్ ఆర్డర్ పటిష్ఠంగా ఉంది. శిఖర్ ధవన్, విరాట్ కోహ్లీలకు రెండు వన్డేల్లో పూర్తి స్థాయిలో బ్యాటింగ్ చేసే అవకాశం చిక్కింది. మిగతా ఆటగాళ్లకు పెద్దగా అవకాశం లభించలేదు. రోహిత్ మాత్రం ఈ మ్యాచ్‌లో రాణించి విమర్శకులకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అతడిపై వ్యతిరేకంగా కామెంట్స్ వినిపిస్తున్నాయి. నాలుగో నెంబర్ స్థానంలో రహానెకు రెండో వన్డేలో ఆడే పరిస్థితి రాకపోయినా తొలి మ్యాచ్‌లో తానేంటో నిరూపించుకోగలిగాడు. ఇక ధోనీ.. జట్టుకు పెద్ద దిక్కుగా మారి కెప్టెన్‌కు సలహాలతో పాటు బౌలర్లకు నిర్దేశకం చేస్తున్నాడు. కేదార్ జాదవ్, పాండ్యాల బ్యాటింగ్‌కు ఇంకా పరీక్ష ఎదురుకాలేదు. ఇక బౌలింగ్‌లో స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌ల హవా తెలిసిందే. తమ మాయాజాలంతో కట్టిపడేస్తూ వికెట్లను నేలకూలుస్తున్నారు. పేసర్లు భువనేశ్వర్, బుమ్రా కూడా సత్తా నిరూపించుకోవాల్సి ఉంది.

సమస్యలతో సతమతం: దక్షిణాఫ్రికాకు ఇప్పుడు తుది జట్టు కూర్పుపై సతమతమవుతోంది. కీలక మ్యాచ్ కావడంతో డికాక్ స్థానంలో వికెట్ కీపర్ క్లాసెన్ అరంగేట్రం ఖాయంగా కనిపిస్తోంది. కెప్టెన్ మార్‌క్రమ్‌తో పాటు డుమిని, మిల్లర్ ఫామ్‌లో లేరు. భారత స్పిన్ ద్వయాన్ని ఎదుర్కొనే విషయంలో అంతా తడబడుతున్నారు. ఇప్పుడు ఈ త్రయం రాణింపుపైనే విజయం ఆధారపడి ఉంది. తొలి మ్యాచే అయినా జోండో 25 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇంకా చేయలేదు. పేసర్లు రబాడ, మోర్కెల్, మోరిస్ భారత బ్యాట్స్‌మెన్ ముందు పూర్తి గా తేలిపోతున్నారు. సొంత గడ్డపై స్పిన్నర్ తాహిర్ కూడా విఫలమవుతుండడం వారిని మరింత ఆందోళనపరుస్తోంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రహానె, ధోనీ, కేదార్ జాదవ్, పాండ్యా, భువనేశ్వర్, కుల్దీప్, బుమ్రా, చాహల్.

దక్షిణాఫ్రికా: ఆమ్లా, మార్‌క్రమ్, డుమిని, జోండో, మిల్లర్, బెహార్డీన్, క్లాసెన్, మోరిస్, రబాడ, మోర్కెల్, తాహిర్.

పిచ్, వాతావరణం

న్యూల్యాండ్స్ మైదానంలో జరిగిన చివరి ఆరు వన్డేలను పరిశీలిస్తే తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 311. ఈసారీ బ్యాటింగ్‌కు అనుకూలించే పరిస్థితే కనిపిస్తోంది. అయితే సీమర్లకు కూడా సహకరించే అవకాశాలు లేకపోలేదు. వాతావరణం 30 డిగ్రీల ఉష్ణోగ్రతతో వేడిగా ఉంటుంది.

గెలిచే జట్టును మార్చొద్దు

(కృష్ణమాచారి శ్రీకాంత్)



అగ్రశ్రేణి జట్టు దక్షిణాఫ్రికా నుంచి మంచి పోరాటాన్ని ఆశించాం. కానీ ఆ జట్టు పేలవమైన ఆటతో దాసోహం అవడం విస్మయాన్ని కలిగించింది. జట్టులో కీలకమైన డివిల్లీర్స్, డుప్లెసిస్ లేరనే విషయం తెలుసు. కానీ వారిద్దరిపైనే సౌతాఫ్రికా పూర్తిగా ఆధారపడలేదు. భారత్ స్పిన్ ద్వయం ముందు ఎలా నిలబడాలో కూడా సఫారీలకు అర్థం కాకపోవడం విచారించదగ్గ విషయం. ఇప్పుడు డికాక్ కూడా గాయంతో దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో మన పేస్ ముందు సౌతాఫ్రికా టాపార్డర్ ఏమేరకు నిలబడుతుందనేది ప్రశ్నార్థకం. రెండో వన్డేలో కుల్దీప్, చాహల్ అదరగొట్టారు. ముఖ్యంగా చాహల్ గాల్లోకి లేపేలా బ్యాట్స్‌మన్‌కు ఊరించే బంతులేయగా.. కుల్దీప్ నియంత్రణతో బౌలింగ్ చేశాడు. చైనామన్ బౌలింగ్ అంటేనే దక్షిణాఫ్రికా కలవరపడుతోంది. ఫార్మాట్ ఏదైనా లెగ్ స్పిన్నర్లు ఎప్పుడూ వికెట్ టేకర్లే..! పిచ్ నుంచి అంతంత మాత్రం సహకారం అందుతున్నా మనోళ్లు మాత్రం చెలరేగిపోతున్నారు. వన్డేల్లో బౌలింగ్‌తోపాటు బ్యాట్స్‌మెన్ రాణిస్తున్నారు. విజయాలు సాధిస్తున్నంత సేపు విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చకూడదనేది నా అభిప్రాయం. అయితే సిరీస్ చేతికి వచ్చిన తర్వాత ఏమైనా ప్రయోగాలు చేయొచ్చు. విదేశాల్లో టీమిండియా ఆధిపత్యం చెలాయిస్తుండడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. -(టీసీఎం)

నజరానాల్లో తేడాలేల?

సహాయ సిబ్బంది ప్రోత్సాహకాలపై ద్రావిడ్ అసంతృప్తి

న్యూఢిల్లీ: అండర్-19 వరల్డ్‌కప్‌లో విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు, కోచింగ్ సిబ్బందికి ప్రకటించిన నజరానాల్లో వ్యత్యాసాలపై ద్రావిడ్ అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. వరల్డ్ కప్ నెగ్గిన వెంటనే బీసీసీఐ పాలక మండలి (సీవోఏ).. ద్రావిడ్‌కు రూ. 50 లక్షలు, క్రికెటర్లకు ఒక్కొక్కరికీ రూ. 30 లక్షలు, ఫీల్డింగ్ కోచ్ అభయ్ శర్మ, బౌలింగ్ కోచ్ పరాస్ సహా సహాయ సిబ్బందికి తలా 20 లక్షల నగదు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, జట్టు విజయంలో అందరూ సమాన కృషి చేసినా.. ప్రోత్సాహకాల్లో ఇంత వ్యత్యాసం ఉండడం భావ్యం కాదని రాహుల్ పేర్కొన్నట్టు సమాచారం. 'నాపైనే అందరి దృష్టి కేంద్రీకృతం అవడంతో కొన్నిసార్లు చాలా ఇబ్బంది పడ్డా. అయితే, ఈ ఫలితంలో సహాయ సిబ్బంది పాత్ర గొప్పది. ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. కుర్రాళ్ల కోసం మా శాయశక్తులా కృషి చేశామ'ని రాహుల్ పేర్కొన్నాడు.

పాక్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లలేదు: భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ జట్టులో ఆత్మస్థైర్యం నింపినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని ద్రావిడ్ పేర్కొన్నాడు. అసలు తాను పాక్ డ్రెస్సింగ్‌కు వెళ్లనేలేదని చెప్పాడు. 'నేను వాళ్ల డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లలేదు. వారిని ఓదార్చలేదు. పాక్ జట్టులో ప్రతిభావంతుడైన ఒక లెఫ్టార్మ్ ఫాస్ట్ బౌలర్ ఉన్నాడు. టోర్నమెంట్‌లో అతను చాలా బాగా బౌలింగ్ చేశాడు. డ్రెస్సింగ్ రూమ్ బయట ఆ కుర్రాడిని కలిసి బాగా ఆడావని చెప్పా. అంతే. ఒక కోచ్‌గా అలాంటి ప్రతిభావంతుడిని చూడడం ఉత్తేజపరిచింది' అని రాహుల్ చెప్పుకొచ్చాడు.



ద్రావిడ్‌కు రూ. 2.43 కోట్లు..!

● బకాయిలు చెల్లించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: క్రికెటర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను బీసీసీఐ విడుదల చేసింది. జనవరి వరకు ఆటగాళ్లకు, కోచ్‌లకు ఉన్న బకాయిలను బోర్డు చెల్లించింది. ఈ పేమెంట్లలో కోచ్ రాహుల్ ద్రావిడ్‌కు గత జూలై నుంచి డిసెంబర్ వరకు జీతం కింద బోర్డు రూ.2.43 కోట్ల భారీ మొత్తం చెల్లించింది. హార్దిక్ పాండ్యాకు మ్యాచ్, టూర్‌తో పాటు రిటెయిన్ ఫీజులతో కలిపి గత ఏడాది జూలై నుంచి సెప్టెంబర్ వరకు లెక్కించిన రూ. 1.27 కోట్లు అందుకున్నాడు. అదే విధంగా విదేశీ టూర్లకుగాను చైనామన్ కుల్దీప్ యాదవ్‌కు సుమారు రూ. కోటి అందింది. రహానె, అభినవ్ ముకుంద్‌లకు రూ. 1.47 కోట్లు, రూ. 33 లక్షలు ముట్టాయి. లంక టూర్‌కు సంబంధించి కీపర్ సాహాకు రూ.57 లక్షలు చెల్లించారు. మాజీ పేసర్ ఆశిష్ నెహ్రాకు వన్‌టైమ్ బెనిఫిట్ కింద రూ. 60 లక్షలు అందించారు. శ్రీలంకతో సిరీస్‌కు కామెంటేటర్‌గా వ్యవహరించిన మురళీ విజయ్‌కు రూ.30 లక్షలు, మంజ్రేకర్‌కు రూ.36 లక్షలు ముట్టాయి.

నేటినుంచి ఫెడరేషన్ కప్

న్యూఢిల్లీ: ఆసియా ఓసియానియా గ్రూప్ 1 ఫెడరేషన్ కప్ టెన్నిస్ టోర్నీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నది. 1991 నుంచి ప్రపంచకప్ గ్రూప్‌కు అర్హత సాధించని భారత టెన్నిస్ మహిళల జట్టుకు ఈసారి కూడా అవకాశాలు అంతంతమాత్రమే. కజకిస్థాన్, చైనావంటి బలమైన జట్లను ఓడించి ముందంజ వేయడం జట్టుకు కఠిన పరీక్షే. భారత ఆశలన్నీ అంకిత రైనా, కర్మన్ కౌర్ థండిపైనే ఉన్నాయి. ఈ యువ క్రీడాకారిణులు 2017లో గణనీయమైన విజయాలు సాధించినా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తమకంటే ముందున్న చైనా క్రీడాకారిణులకు ఏమేరకు పోటీ ఇవ్వగలరన్నదే ప్రశ్న. డబుల్స్‌లో ప్రాంజల ప్రార్థన తాంబ్రేతో ఆడే అవకాశముంది.




సీ మెటాల్లిడ్యురాన్స్

ఇది పరుసవేది బ్యాక్టీరియా!

విషపూరిత లోహాలను పసిడిగా మార్చే సూక్ష్మజీవి

బెర్లిన్, ఫిబ్రవరి 6: ఇనుమును బంగారంగా మార్చే 'పరుసవేది' విద్య గురించి విన్నారా? స్పర్శతోనే ఏ లోహాన్నైనా బంగారంగా ఎలా మార్చవచ్చో ఈ ప్రక్రియ వివరిస్తుందని ప్రతీతి. ఈ రకం మూఢనమ్మకం మధ్యయుగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉండేది. కాకతీయుల వద్ద పరుసవేది లింగం ఉండేదని, అందువల్లే వారి రాజ్యం ఆర్థికంగా దేదీప్యమానంగా వెలిగిపోయేదని జనబాహుళ్యంలో ఉన్న కథ. అచ్చం అలాగే, లోహాలను బంగారు ముద్దలుగా మార్చే బ్యాక్టీరియాను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దానిపేరే 'బ్యాక్టీరియం సీ మెటాల్లిడ్యురాన్స్'. సాధారణంగా విషపూరిత లోహాలను తింటే సూక్ష్మజీవులు చనిపోతాయి. కానీ, క్యాప్సుల్‌లా పొడవుండి, భూమిలో జీవించే ఈ బ్యాక్టీరియా విషపూరిత లోహాలు తిని బతకడమే కాకుండా బంగారు ముద్దలను కూడా ఇస్తోంది. ఈ బ్యాక్టీరియా తన జీవక్రియ ద్వారా బంగారాన్ని విడుదల చేస్తోందని 2009లోనే ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ అడిలైడ్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రాంక్ రెయిత్ కనుగొన్నారు. అదెలా సాధ్యమని జర్మనీకి చెందిన మార్టిన్ లూథర్ యూనివర్సిటీ హాల్లే-విట్టెన్‌బర్గ్, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్ శాస్త్రవేత్తలు సీ మెటాల్లిడ్యురాన్స్ బ్యాక్టీరియాపై పరిశోధనలు చేసి, తాజాగా, ఆ సూక్ష్మజీవి నుంచి బంగారు ముద్దలు విడుదలవుతున్న విధానాన్ని వెల్లడించారు. 'భూమిలోని భారలోహాలైన రాగి, బంగారాన్ని తిన్నపుడు బ్యాక్టీరియా శరీరంలోపల రసాయనిక చర్య జరుగుతుంది. ఆ సమయంలో దానిలోని 'కాప్‌ఏ' అనే ఎంజైమ్ ఈ లోహాల విషతీవ్రతను తగ్గిస్తుంది. ఒకవేళ పరిమితికి మించి రాగి ఉంటే బ్యాక్టీరియాలోని 'కప్‌ఏ' అనే ఎంజైమ్ దాన్ని బయటికి తోసేస్తుంది. రసాయనిక చర్య జరిగిన తర్వాత హానికరం కాని నానోమీటర్ పరిమాణంలో ఉండే బంగారు ముద్దలను విడుదల చేస్తుంది.' అని శాస్త్రవేత్తలు వివరించారు.





బ్యాక్టీరియా విడుదల చేసిన నానో బంగారు ముద్దలు



మృతులు ముస్తాక్ అహ్మద్, బాబర్ అహ్మద్

ఉగ్రవాదిని ఆస్పత్రికి తీసుకెళ్లిన పోలీసులపై..

లష్కరే మిలిటెంట్ల కాల్పులు

శ్రీనగర్ హరిసింగ్ ఆస్పత్రి వద్ద ఘటన

ఇద్దరు పోలీసులు మృతి.. పాక్ టెర్రరిస్టు పరార్



ఉగ్రవాది నవీద్

శ్రీనగర్, ఫిబ్రవరి 6: ఇద్దరు ఎస్కార్ట్ పోలీసులను కాల్చివేసిన లష్కరే తాయిబా మిలిటెంట్లు.. ఓ కరుడుగట్టిన పాకిస్థానీ ఉగ్రవాదిని విడిపించుకుపోయిన ఉదంతమిది. ఈ సంఘటన శ్రీనగర్‌లోని మహారాజా హరిసింగ్ ఆసుపత్రి ప్రాంగణంలో చోటుచేసుకుంది. శ్రీనగర్ సీనియర్ ఎస్పీ ఇంతియాజ్ ఇస్మాయిల్ కథనం ప్రకారం.. 2014లో పోలీసులు అరెస్టు చేసిన పాకిస్థానీ ఉగ్రవాది మహమ్మద్ నవీద్ అలియాస్ అబు హంజుల్లాను సాధారణ వైద్య పరీక్షల కోసం మంగళవారం ఉదయం హరిసింగ్ ఆసుపత్రికి తరలించారు. 'ఇద్దరు ఎస్కార్ట్ పోలీసులు నవీద్ సహా ఆరుగురు ఖైదీలను ఆసుపత్రి ప్రాంగణంలోకి తీసుకురాగానే.. అక్కడి పార్కింగ్ ప్రదేశంలో పొంచి ఉన్న లష్కరే దుండగులు వారిపై కాల్పులు జరిపారు. వీరికి ఎస్కార్ట్‌గా ఉన్న హెడ్ కానిస్టేబుల్ ముస్తాక్ అహ్మద్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రగాయాలపాలైన కానిస్టేబుల్ బాబర్ అహ్మద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు' అని వివరించారు. శ్రీనగర్‌లో రెడ్అలెర్ట్ ప్రకటించామని, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీజీపీ ఎస్పీ వైద్ తెలిపారు. కాగా.. పాకిస్థాన్ పంజాబ్‌లోని బొరెవెల్లా జిల్లా ముల్తాన్‌కు చెందిన నవీద్ ఏడు కేసుల్లో కీలక నిందితుడు. ఇతను పుల్వామా కోర్టు ప్రాంగణంలో ముగ్గురు పోలీసులను కాల్చి చంపాడు. మొత్తం ఏడుగురు పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్ల హత్యకేసుల్లో ఇతను ప్రధాన నిందితుడు. నవీద్ గత ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ఓ టీచర్‌ను కాల్చి చంపాడు. 2015లో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించిన లష్కరే తాయిబా కశ్మీర్ విభాగం నాయకుడు అబు ఖాసీమ్‌కు ఇతడు సన్నిహితుడు.

విమాన యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ఎంత ఖర్చు చేస్తున్నామో చెప్పడం కుదరదు.. 2008 లోనే ఈ రహస్యాల వెల్లడి ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందంలోని ఆర్టికల్ 10 ఈ విషయాన్ని స్పష్టంచేస్తోంది" అని నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో చెప్పారు. దీన్నే రాహుల్ తన అస్త్రంగా మల్చుకున్నారు. "ఆ విమానాలను కొనడానికి ఎంత చెల్లించారో దేశానికి, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల బంధువులకు చెప్పనని రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ అంటున్నారు. దీని అర్థం ఏమిటి? ఏదో కుంభకోణం ఉన్నదనే! రాఫెల్ విమానాల కొనుగోలుకు సంబంధించిన డీల్ కుదుర్చుకోడానికి ప్రధాని స్వయంగా పారిస్ వెళ్లారు. ఆయనే ఈ ఒప్పందాన్ని మార్చారు. ఆయనే సంతకం చేశారు.. ఇది యావద్దేశానికీ తెలుసు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. యుద్ధవిమానాల కొనుగోలుకు సంబంధించిన వివరాలను రక్షణ మంత్రి తెలపకపోవడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అన్నారు. 'దీనిపై ఎందుకు ప్రశ్నించరు?' అంటూ మీడియాను ప్రశ్నించారు. అనంతరం దీనిపై ఒక ట్వీట్ కూడా చేశారు. "అత్యంత రహస్యం (అందరికీ వెల్లడించడానికి కాదు)/ ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన అనుంగు మిత్రుడు కలిసి బేరమాడిన ఒక్కో రాఫెల్ జెట్ ధర ప్రభుత్వ రహస్యం అని రక్షణ మంత్రి అంటున్నారు. ప్రభుత్వం దీనిపై రెండు విధాల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఒకటి.. రాఫెల్ విమానాల ధర పార్లమెంటుకు తెలపడం దేశ భద్రతకు విఘాతం అని చెప్పడం. రెండు.. దీని గురించి అడిగిన వారిపై 'దేశ వ్యతిరేకులు' అనే ముద్ర వేయడం" అని ట్వీట్ చేశారు.

రక్షణ మంత్రికి కాంగ్రెస్ ట్వీట్లు..

రాఫెల్ ఒప్పందంపై రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో చేసిన వ్యాఖ్యను.. ఇప్పుడు చెబుతున్న మాటను.. కాంగ్రెస్ పార్టీ ట్విటర్‌లో పెట్టి, వేల కోట్ల ఒప్పందం విషయంలో కేంద్రం నిజాలను ఎందుకు దాచిపెడుతోందని.. పదేపదే తన వైఖరిని ఎందుకు మార్చుకుంటోందని ప్రశ్నించింది. 2017 నవంబరు 17న.. "(రాఫెల్ విమానాల విషయంలో) యూపీఏ సర్కారుతో పోలిస్తే ఎన్డీయే తక్కువ ధరకు ఒప్పందం కుదుర్చుకుంది" అని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయితే.. ఒక్కో విమానాన్నీ ఎంత పెట్టి కొనుగోలు చేస్తున్నదనే విషయాన్ని మాత్రం వెల్లడించలేమని సోమవారం నాడు (2018 ఫిబ్రవరి 5న) ఆమె చెప్పారు. ఈ రెండు వ్యాఖ్యలనే కాంగ్రెస్ ఉటంకించింది. 'రాఫెల్ డీల్ విషయంలో ప్రభుత్వం దాస్తున్నదేమిటి?' అని నిలదీసింది. కాగా.. రాఫెల్ ఒప్పందం పెద్ద స్కాం అని కాంగ్రెస్ గతంలోనూ ఆరోపణలు చేసింది. కానీ ఈ మధ్య బోఫోర్స్‌పై మళ్లీ విచారణ జరపాలంటూ మోదీ ప్రభుత్వం -2005 నాటి తీర్పుపై సుప్రీంలో సవాల్ చేయడంతో- కాంగ్రెస్ దూకుడు పెంచింది. అంతేకాక, మోదీపై నేరుగా రాహుల్ ఆరోపణలకు దిగడం ఇదే మొదటిసారి.

ఏమిటీ డీల్

మిగ్-21 యుద్ధవిమానాల స్థానే కొత్త తరహా ఫైటర్ జెట్స్‌ను కొనాలన్నది ఎప్పటినుంచో ఉన్న ప్రతిపాదన. 126 మిరేజ్-2000 రకం యుద్ధవిమానాలను కొనాలని 2000వ సంవత్సరంలోనే ఓ ప్రపోజల్ వచ్చింది. దానిని మార్చేసి- 2007లో ఎంఎంఆర్‌సీఏ (దీన్నే ఎంఆర్‌సీఏ అని కూడా అంటారు)- అంటే మధ్యశ్రేణి బహుళార్థసాధక యుద్ధవిమానాల కొనుగోలు ప్రతిపాదన తెచ్చారు. ఇందుకు ప్రపంచంలోని ఆరు అగ్రశ్రేణి యుద్ధవిమానాల తయారీ సంస్థలు పోటీ పడ్డాయి. అందులో రెండింటిని చివరకు ఎంపిక చేశారు. ఒకటి- ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ రాఫెల్ కంపెనీ కాగా రెండోది నాటోకు యుద్ధవిమానాలు సరఫరా చేసే యూరోఫైటర్ టైఫూన్. ఈ రెండింటిలో రాఫెల్ తరహా విమానాలు ఖరీదైనవి. ఒక యూరోఫైటర్ కంటే రాఫెల్ యుద్ధవిమానం దాదాపు రూ.453 కోట్లు ఎక్కువ. ఒక యూరోఫైటర్ విలువ 138 మిలియన్ యూరోలైతే, ఒక రాఫెల్ విలువ 197 మిలియన్ యూరోలు పడుతోంది. కానీ ప్రభుత్వం ఈ లెక్కన 36 రాఫెల్ యుద్ధవిమానాల విలువ దాదాపు రూ.58,000 కోట్లు. నిజానికి మరికాస్త ఎక్కువ పెడితే 126 యూరోఫైటర్లు వచ్చేస్తాయి. కాంగ్రెస్ ఈ పాయింటునే లేవనెత్తింది. "అసలు మొదట 126 యుద్ధవిమానాలు కొనాలన్నది ఎప్పటినుంచో ఉన్న ప్రతిపాదన. దానిని ఎందుకు మార్చేసి 36 మాత్రమే కొన్నారు? యూరోఫైటర్ యుద్ధవిమానాల కంపెనీని పక్కన పెట్టడంలో ఆంతర్యమేంటి? 36 యుద్ధవిమానాల కొనుగోలుకు భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ అనుమతి ఎందుకు తీసుకోలేదు? పోనీ.. ఒప్పందం కుదుర్చుకున్నారే అనుకుందాం.. ఒక్కో రాఫెల్ యుద్ధవిమానానికీ అయిన ఖర్చు ఎంత? మేం అధికారంలో ఉన్నపుడు తొలుత కుదిరిన ఒప్పందం ప్రకారం- ఒక్కో యుద్ధవిమానం ఖర్చు సగటున రూ 526 కోట్లు. మరి అది ఇప్పుడు ఎందుకు రూ 1570 కోట్లకు పెరిగింది?" అని గులాంనబీ అజాద్ రాజ్యసభలో ప్రశ్నించారు. ఇంకో ముఖ్యాంశం ఏంటంటే- 58 వేల కోట్ల రూపాయలు కేవలం యుద్ధవిమానాల కొనుగోలుకు మాత్రమే. అవి మోసుకెళ్లే ఆయుధాలకు కాదు. ఈ యుద్ధవిమానాల ద్వారా ప్రయోగించే మిసైళ్ల నిమిత్తం ఫ్రెంచి కంపెనీకి మరో రూ.710 కోట్లు చెల్లించాలి.

దేశీ కోటాను అడ్డుకొంటాం!

ట్రంప్ 'గ్రీన్‌కార్డు'పై ఎంపీల ఆగ్రహం

అమెరికాలోని ఎన్ఆర్ఐలకు మద్దతు

వాషింగ్టన్, ఫిబ్రవరి 6 : గ్రీన్‌కార్డుల జారీపై ట్రంప్ ప్రభుత్వం పెట్టిన కోటాను ఎత్తివేయాలంటూ పోరాడుతున్న అమెరికాలోని భారతీయులకు, అక్కడి ప్రజాప్రతినిధుల మద్దతు లభించింది. 'ఒక దేశానికి ఇన్నే గ్రీన్‌కార్డులు ఇస్తాం' అనే విధానం సరికాదని వారు స్పష్టం చేశారు. దీనివల్ల ప్రతిభావంతులైన భారతీయుల సేవలను అమెరికా కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లెక్కన ఓ నిపుణుడైన భారతీయుడు గ్రీన్‌కార్డును పొందటానికి గానీ, అమెరికాలో స్థిర నివాస హక్కుని దక్కించుకోవడానికి గానీ దాదాపు 70 ఏళ్లపాటు ఎదురుచూడాల్సి వస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఇది అమెరికా వ్యతిరేక నిర్ణయమన్న వారు, కాంగ్రెస్‌లో ఈ విధానం రద్దు కోసం పోరాడతామని.. తమను కలిసిన భారతీయ బృందానికి హామీ ఇచ్చారు. దేశాన్ని బట్టి గ్రీన్‌కార్డుల కోటాను నిర్ణయిస్తూ, ట్రంప్ తీసుకొచ్చిన వలస విధానంతో అమెరికాలోని 15 లక్షలమంది భారతీయుల ఉనికి ఇబ్బందుల్లో పడింది. ఎప్పుడు మనవాళ్లను అమెరికానుంచి గెంటివేస్తారో తెలియని పరిస్థితి! ఈ నేపథ్యంలో, 200మందితో కూడిన ఓ భారతీయ నిపుణుల బృందం 'ఇమిగ్రేషన్ వాయిస్' పేరిట సోమవారం వాషింగ్టన్‌లో పలువురు కాంగ్రెస్ ఎంపీలతో సమావేశమయింది. ఈ సందర్భంగా ఆరుగురు సీనియర్ పార్లమెంటు సభ్యులు ఈ బృందం ఆవేదనతో గొంతు కలిపారు. "భారతీయులు సహా ప్రతి ఒక్కరికీ అమెరికాలో స్థిరపడే అవకాశం ఉండాలి" అని పార్లమెంటు సభ్యుడు కేవిన్ యోదర్ అన్నారు. ఇప్పటిదాకా తమకు స్నేహితుల్లా, ఇరుగుపొరుగుల్లా, సహ ఉద్యోగుల్లా మెలిగినవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోబోమని మరో పార్లమెంటు సభ్యుడు మైక్ డోయిల్ స్పష్టం చేశారు. పుట్టుకని ప్రాతిపదికగా చేసుకొని మనుషులను విభజిస్తామనడం సరికాదని కాంగ్రెస్ సభ్యుడు రోన్ ఇస్టేస్ మండిపడ్డారు. గ్రీన్‌కార్డు, స్థిర నివాస హక్కు విషయంలో కాంగ్రెస్‌లో లోతయిన చర్చ జరిగి, మెరుగైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మరో ప్రజాప్రతినిధి రోగర్ మార్షల్ అభిప్రాయపడ్డారు.

ఒక రోజు.. 185 రోడ్డు ప్రమాదాలు!

మంచు తుఫానుతో ఐవా రాష్ట్రం(అమెరికా) అతలాకుతలమైంది. ఒక్కరోజే 185 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఏడుగురు మరణించారు. దాదాపు 18 సెంటీమీటర్ల మేర మంచు కప్పేసింది.





వెంకయ్యపై విపక్షం గుస్సా

మూకుమ్మడిగా బాయ్‌కాట్

సభా గౌరవం కాపాడడానికే ఎక్కువ సేపు వాయిదా: వెంకయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు తీరుపై ప్రతిపక్షాలు మూకుమ్మడిగా విరుచుకుపడ్డాయి. సభను ఇష్టానుసారం నడుపుతున్నారని మండిపడ్డాయి. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ ఆయనకు ఓ లేఖ రాశాయి. సభ సాగుతున్న వైనాన్ని నిరసిస్తూ మంగళవారం భోజన విరామం తర్వాత సభను ఉమ్మడిగా బహిష్కరించాయి. తృణమూల్ సభ్యుడు డెరిక్ ఒబ్రెయిన్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని సభాపతి తిరస్కరించడంతో గొడవ మొదలయ్యింది. పశ్చిమబెంగాల్ గవర్నర్ కేఎన్ త్రిపాఠీ తన పరిధిని దాటి పాలన వ్యవహారాల్లో కలుగజేసుకుంటున్నారని పేర్కొంటూ ఆయన ఆ నోటీసు ఇచ్చారు. జీరో అవర్‌లో దీనిపై చర్చకు డెరిక్ పట్టుబట్టారు. వెంకయ్యనాయుడు వెంటనే సభను రెండు గంటల వరకు వాయిదావేసేశారు. దీన్ని విపక్షాలు తప్పుపట్టాయి. సభ తిరిగి సమావేశమయ్యాక- కాంగ్రెస్ పక్ష నేత గులాంనబీ ఆజాద్ ఈ అంశాన్ని లేవనెత్తారు. "సభ కొన్ని నియమాలు, నియంత్రణలు, సంప్రదాయాలకు అనుగుణంగా నడుస్తుంది. ఒక వ్యక్తి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రెండు రోజులుగా ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ జరగకపోవడాన్ని తప్పుపట్టారు. ఆయనకు తృణమూల్, లెఫ్ట్, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు మద్దతు పలికారు. ఆ సమయంలో సభాపతి స్థానంలో ఉపసభాపతి పీజే కురియన్ ఉన్నారు. సభాపతి నిర్ణయాలను తప్పుపట్టడం సరికాదనీ, ఏవైనా అభ్యంతరాలుంటే సభాపతి రూమ్‌లోకెళ్లి మాట్లాడండనీ సలహా ఇచ్చారు. కానీ విపక్షాలు వినకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సభ సాగుతున్న తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. దీంతో కురియన్ సభను మరో గంట వాయిదా వేశారు. తమ డిమాండ్‌ను అంగీకరించకపోవడంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి సభను బహిష్కరిస్తున్నట్లు విపక్ష నేత ఆజాద్ సహా మిగిలిన పక్షాల నేతలందరూ ప్రకటించారు. సభ వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. వారం రోజులుగా తమ గొంతు నొక్కే ప్రయత్నం సాగుతోందని ఆరోపించారు. వెంకయ్య మాత్రం సభ గౌరవం కాపాడడానికి ఎక్కువ సేపు వాయిదా వేశానన్నారు.

మరోసారి ఇరకాటంలో బీజేపీ

సొంత పార్టీకి స్వామి షాక్.. ఆర్మీపై హత్యకేసులో సీతారామన్‌ను మందలించాలని రాష్ట్రపతికి వినతి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: బీజేపీ ఎంపీ సుబ్రమణ్యస్వామి మరోసారి సొంత పార్టీని ఇరకాటంలో పడేశారు. జమ్మూ కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో సైనికదళాల కాల్పుల్లో ఇద్దరు పౌరులు చనిపోయిన ఘటనపై ఆర్మీ మేజర్‌పైనా, మరో ఇద్దరు జవాన్లమీద హత్యకేసు నమోదుచేయడాన్ని నిరసిస్తూ ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఓ లేఖ రాశారు. ఆర్మీ మీద కేసు పెట్టడానికి అనుమతిచ్చిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌ను పిలిపించి వివరణ కోరాలని, అవసరమైతే మందలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "షోపియన్‌లోని ఓ గ్రామంలో కొందరు పాక్-అనుకూల పౌరులు ర్యాలీ తీశారు. అటుగా వెళుతున్న ఆర్మీ పెట్రోలింగ్ బృందంపై అకారణంగా రాళ్ల వర్షం కురిపించారు. సైనికులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరపాల్సి వచ్చింది. ఆ కాల్పుల్లో ఇద్దరు పౌరులు మరణించారు. దీనిపై ఆర్మీ మీద కేసు పెట్టారు. ఇది దారుణం. దేశ భద్రత కోసం పోరాడుతున్న వారిపై మర్డర్ కేసులా? రక్షణమంత్రి అనుమతి తీసుకున్నాకే తాము ఆర్మీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి చెప్పారు. దానిపై రక్షణమంత్రి మౌనం దాల్చారు. ఏంటి దీని అర్థం? ఈ అంశం మీద రాష్ట్రపతి జోక్యం అవసరం. రక్షణ మంత్రిని పిలిపించి వివరణ కోరాలి. ఇలాంటి కేసులు మొదలైతే ముందుముందు ఇలాంటివే వందలకొద్దీ కేసులు నమోదవుతాయి.. ఆర్మీ నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతుంది" అని స్వామి తన లేఖలో పేర్కొన్నారు. 'ఆర్టికల్ 77 (1) ప్రకారం ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలూ రాష్ట్రపతి పేరిటే ఉంటాయి. కాబట్టి మీరు రక్షణ మంత్రిని పిలిపించి మాట్లాడవచ్చు' అని స్వామి సూచించారు.



మాల్దీవుల మాజీ అధ్యక్షుడు, విపక్ష నేత గయూమ్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేస్తున్న దృశ్యం.

మాల్దీవుల సుప్రీం సీజే అరెస్ట్

మరో జడ్జి కూడా.. ఎమర్జెన్సీతో ముదిరిన రాజకీయ సంక్షోభం

సైన్యంతో రండి.. మమ్మల్ని రక్షించండి

భారత్‌ను కోరిన మాల్దీవుల మాజీ అధ్యక్షుడు

మాలి, ఫిబ్రవరి 6: మాల్దీవుల్లో ఎమర్జెన్సీ విధించడంతో రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. సుప్రీంకోర్టులోకి సైన్యం చొచ్చుకెళ్లి.. ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా సయీద్, మరో జడ్జి అలీ అహ్మద్‌లను అదుపులోకి తీసుకుంది. వీరిని రహస్య ప్రాంతానికి తరలించింది. వారి వివరాలింకా తెలియరాలేదు. మాల్దీవుల సైన్యం చర్యలను సుప్రీంకోర్టు అధికారిక ట్విట్టర్ అకౌంట్‌లో కూడా పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి లేకపోయినా జుడీషియల్ కౌన్సిల్ పర్యవేక్షణలో కోర్టు పని చేస్తున్నట్లు మరో ట్వీట్‌లో వెల్లడించారు. ఆ దేశ అధ్యక్షుడు అబ్దుల్ యమీన్ అత్యయిక పరిస్థితి ప్రకటించారు. వెంటనే సైన్యం అన్ని ప్రభుత్వ విభాగాలను అధీనంలోకి తెచ్చుకుంది. విపక్ష నేతలందరినీ అరెస్ట్ చేశారు. వీరిలో మాజీ అధ్యక్షుడు మౌమూన్ అబ్దుల్ గయూం కూడా ఉన్నారు. ఈయన దాదాపు 30 ఏళ్లపాటు మల్దీవులకు అధ్యక్షుడి సేవలందించారు. మీడియాపైనా ఆంక్షలు విధించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కొలంబోలో ఉన్న బహిష్కృత మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ సంక్షోభ నివారణకు సాయం చేయాలని భారత్‌ను అభ్యర్థించారు. ప్రత్యేక దూతతోపాటు సైన్యాన్ని పంపించి అరెస్ట్ చేసిన జడ్జిలను, రాజకీయ నేతలను విడిపించాలని కోరారు. ఎమర్జెనీ ప్రకటన రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే అధ్యక్ష పదవి నుంచి అబ్దుల్ యమీన్‌ను దించేయడానికి అమెరికా కూడా సాయపడాలని కోరారు. అటు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు భారత్, అమెరికా ప్రకటించాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని అధ్యక్షుడు అబ్దుల్ యమీన్‌ను కోరాయి. ఎమర్జెనీ విధించడాన్ని అమెరికా తప్పుపట్టింది. అలాగే భారతీయులు ఎవరూ మాల్దీవుల పర్యటనకు వెళ్లొద్దని మన విదేశాంగశాఖ కోరింది. అటు.. రాజధాని మాలీలో విపక్ష ఎండీపీకి చెందిన మద్దతుదార్లు నిరసనలకు దిగుతున్నారు.

తేడా పెద్దగా లేకపోతే నోటీసులివ్వరు

ఆదాయానికీ- రిటర్న్స్‌కీ మధ్య తేడాలపై సీబీడీటీ వివరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆదాయపు పన్ను చెల్లింపుదారులకి ఓ చిన్న ఊరట! ఆదాయపు పన్ను రిటర్న్స్‌కీ- పన్ను క్రెడిట్ డేటాకీ మధ్య పెద్దగా తేడాల్లేకపోతే టాక్స్‌పేయర్లకి ఎలాంటి నోటీసులివ్వరాదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు నిర్ణయించింది. తాజా ఆర్థికబిల్లులో దీన్ని చేర్చారు. ఇది మధ్యతరగతి వేతన జీవులకి చాలా రిలీఫ్ ఇస్తుందని ఆర్థికశాఖ అంటోంది. మనం సమర్పించే ఫార్మ్-16కీ, ఆదాయపు పన్ను శాఖకు పంపే టాక్స్ క్రెడిట్ స్టేట్‌మెంట్- 26 ఏఎస్ కీ మధ్య కొద్ది వందల రూపాయల తేడా ఉన్నా ఇప్పటిదాకా డిమాండ్ నోటీసులు జారీ చేసేవారు. ఒక కేసులో అయితే జస్ట్ 56 రూపాయల తేడాకి కూడా నోటీసులిచ్చేశారు. వీటికి బదులివ్వడానికి ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణం చేయడం, ఆ క్లెయిముల్లో సగానికి సగం సెటిల్ కాకపోవడం పెద్ద తలనొప్పిగా తయారయ్యేది. దాన్ని తీర్చడానికే ఇపుడు ఈ నిర్ణయం తీసుకున్నామని సీబీడీటీ ఛైర్మన్ సుశీల్ చంద్ర తెలిపారు. ఇది 2018-19 ఆర్థిక సంవత్సరంలో సమర్పించే ఏ రిటర్న్‌కైనా వర్తిస్తుందన్నారు

రూ.170 కోట్ల టర్కీ కరెన్సీ స్వాధీనం

కర్ణాటకలో టెకీ అరెస్టు

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): టర్కీ దేశానికి చెందిన రూ.170 కోట్ల విలువైన కరెన్సీని మార్పిడి చేసేందుకు యత్నించిన మైసూరు వాసి దీపేశ్‌ను బెంగళూరు, యశ్వంతపుర పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీపేశ్ హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నారు. యశ్వంతపురలో గోవర్ధన సినిమా టాకీస్ వద్ద వ్యాపారులను కలసి టర్కీ దేశనోట్లు ఇస్తానని, వాటిని మార్చుకుంటే ఒకేసారి ధనవంతులు కావచ్చని చెప్పాడు. గత ఏడాది నుంచి అతను బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులను సంప్రదిస్తున్నట్టు తెలిసింది. రూ.30 లక్షలు చెల్లిస్తే రూ.కోటి టర్కీ కరెన్సీ(లిరా) ఇస్తామని నమ్మబలికినట్లు సమాచారం. ఓ వ్యాపారికి అనుమానం వచ్చి గూగుల్‌లో ఆరా తీయగా టర్కీ ప్రభుత్వం 5 లక్షలు, 10 లక్షల విలువైన కరెన్సీని నిషేధించినట్టు తెలిసింది. ఆ వ్యాపారి ఫిర్యాదుతో యశ్వంతపుర పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దీపేశ్ నుంచి 10 లక్షల ముఖవిలువ కలిగిన 100 నోట్లతోపాటు 5లక్షల విలువ కల్గిన (లిరా కరెన్సీ) నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.170 కోట్లు ఉంటుంది. శివాజీనగర్‌కు చెందిన ఫరూఖ్ 10శాతం కమీషన్ ఇస్తాననడంతో కరెన్సీ మార్పిడికి సిద్ధమైనట్లు దీపేశ్ చెప్పాడు.

అగ్ని-1 ప్రయోగం సఫలం

అణ్వస్త్ర సామర్థ్యం దీని ప్రత్యేకత

బాలాసోర్, ఫిబ్రవరి 6: అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన అగ్ని-1 క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. ఈ క్షిపణి 700 కిలోమీటర్లలోపు స్వల్ప శ్రేణి లక్ష్యాలను విజయవంతంగా ఛేదించగలుగుతుందని భారత రక్షణ శాఖ తెలిపింది. భద్రతా బలగాల సన్నద్ధతను పరీక్షించడంలో భాగంగా ఈ క్షిపణిని ఒడిసా తీరంలోని డాక్టర్ అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మంగళవారం పరీక్షించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితలం మీద ఉన్న లక్ష్యాలను ఛేదిస్తుంది. 12వేల కిలోల బరువుండే అగ్ని-1 క్షిపణి వెయ్యి కిలోల పేలోడ్లను మోసుకెళ్లగలదు. ఈ క్షిపణిని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ(డీఆర్‌డీఎల్), రీసెర్చ్ సెంటర్ ఇమ్రాత్(ఆర్‌సీఐ) సహకారంతో అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ(ఏఎస్ఎల్) అభివృద్ధి చేసింది. క్షిపణి తయారీలో హైదరాబాద్‌లోని భారత డైనమిక్స్ లిమిటెడ్ కూడా కీలక పాత్ర పోషించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



టాటూ ఆర్టిస్ట్ కావాలనే తపనతో ఐదంకెల సంపాదన తెచ్చిపెట్టే ఐటి కెరీర్‌ను వదిలేసింది. 'అయ్యో! బంగారం లాంటి ఉద్యోగం వదిలేసి పచ్చబొట్లు వేస్తానంటావేంటి?' అని ఇంట్లో వాళ్లతో మొదలుపెట్టి అందరూ ఆమెను నిరుత్సాహపరిచారు. కానీ పచ్చబొట్టు మీద మనసు పారేసుకున్న జెస్సీకి ఆ మాటలేవీ చెవికెక్కలేదు. పట్టుదలతో తను అనుకున్న దిశగా అడుగులేసింది. ఇప్పుడు స్థిరమైన ఆదాయం సంపాదించుకుంటోంది. అంతేకాదు 'అంతర్జాతీయ మహిళా టాటూ ఆర్టిస్ట్స్ కన్వెన్షన్'లో పాల్గొన్న మొట్టమొదటి మహిళ తానే అయ్యింది. మరి అంతటి పేరుగాంచిన జెస్సీ... పచ్చబొట్టు ప్రయాణం ఎప్పుడు? ఎక్కడ? మొదలైందో తెలుసుకోకపోతే ఎలా!

పచ్చబొట్టూ.. తిరుగేలేదులే..!

"స్నేహితురాళ్లతో సరదాగా గడపడానికి బెంగళూరు నుంచి గోవా వెళ్లాను. గోవా బీచ్‌లో ఫ్రెండ్స్ అందరూ ఆడుతూ పాడుతూ తెగ ఎంజాయ్ చేస్తున్నారు. కానీ నా దృష్టి మాత్రం అక్కడికి కాస్త దూరంలో కూర్చొన్న ఒక వ్యక్తి మీద పడింది. అతను తాత్కాలికంగా ఉండే పచ్చబొట్లు వేస్తున్నాడు. అతడి దగ్గరకు వెళ్లి, నా కాలు మీద కూడా టాటూ వేయమన్నాను. కానీ... అతని పనితనం నచ్చలేదు. నాకు బొమ్మలు గీయడం వచ్చు. దాంతో నాకు నేనే వేసుకున్నాను. మా ఫ్రెండ్స్‌కి కూడా టాటూలు వేశాను. నా పనితనం అక్కడే ఉన్న బ్రెజిల్ దేశస్తుణ్ణి ఆకర్షించింది. ఆయన పేరు జులియో. ఆయన కూడా టాటూ ఆర్టిస్ట్. నా ప్రతిభను గమనించి టాటూలు వేయమని నన్ను ప్రోత్సహించాడు. బి-ఫార్మసీ చదివిన నేను అప్పటికే ఒక అమెరికన్ ఆన్‌లైన్ కంపెనీలో పనిచేస్తున్నాను. కానీ 'టాటూలు బాగా వేస్తున్నావ'నే జులియో మెచ్చుకోలు, ప్రోత్సాహాలు ఆ ఆర్ట్‌ను సీరియస్‌గా తీసుకోవాలనిపించేలా చేశాయి. అదొక్కటే కాకుండా జులియో సంవత్సరంలో నాలుగు నుంచి ఆరు నెలలు పనిచేసి, మిగతా రోజుల్లో తనకు నచ్చిన ప్రదేశాలకు వెళ్తుంటానని చెప్పడం ఇంకా బాగా నచ్చేసింది. నాక్కూడా ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. నా చేతిలో కళ ఉంది. టాటూలు వేయడంలో సరైన శిక్షణ తీసుకుంటే దాన్నే కెరీర్‌గా మార్చుకోవచ్చనే ఆలోచన వచ్చింది. గోవా నుంచి బెంగళూరు తిరిగి రాగానే, ఆ ఆలోచనలతో బుర్ర నిండిపోయింది.

గంటల తరబడి వెతికా!

ఆకర్షణీయమైన జీవనశైలి, కళ - పర్యటనలతో కూడిన జీవితం నాకూ కావాలనిపించింది. భారత మాజీ రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్ కలాంగారు చెప్పినట్టు నా కలను నిజం చేసుకోవడానికి దాదాపు నెలరోజులు పైగా నిద్రలేని రాత్రులు గడిపాను. నేనీ పనిచెయ్యగలనా లేనా? అని ఆలోచిస్తూ... టాటూ ఆర్టిస్ట్ ఎలా కావాలనే విషయం గురించి ఇంటర్నెట్‌లో గంటల తరబడి బ్రౌజింగ్ చేస్తూ పిచ్చిదానిలా వెతికాను. ఇక లాభం లేదనుకుని ఫేస్‌బుక్ ద్వారా జులియోను సంప్రదించాను. 'టాటూయింగ్ నేర్చుకోవాలని ఉంది. కానీ ఎలా మొదలుపెట్టాలో తెలియడం లేద'ని చెప్పాను. అందుకు ఆయన "నేను గోవాలో మరో పదిహేను రోజులు ఉంటాను. ఇక్కడికి వస్తే బేసిక్స్ నేర్పిస్తా" అన్నాడు. ఆయన ఆ మాట చెప్పడం ఆలస్యం... వెంటనే వెళ్లి పది రోజుల్లో క్రాష్ కోర్సు నేర్చుకున్నాను. అలా ఆ రోజు తీసుకున్న నిర్ణయం నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింద"ని టాటూయిస్ట్‌గా తన ప్రస్థానం మొదలైన విధానాన్ని గుర్తు చేసుకున్నారు జెస్సీ.



ఫోటోనే టాటూగా..

ఆరోగ్య విషయాలు తెలుసుకున్నాకే...

అరకొర జ్ఞానంతో పచ్చబొట్లు వేసే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందీ మధ్య. పచ్చబొట్లపై యువతలో ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకుని వీధికొక స్టూడియో వెలుస్తోంది. చర్మపు పొరల్లోకి రంగులు సరిగ్గా వెళ్లక, డిజైన్ అలికినట్లు వస్తుంది. త్వరగా వెలిసిపోతుంది. మరీ ముఖ్యంగా టాటూ వేయించుకున్న వ్యక్తి ఆరోగ్య విషయాలు ముందుగా తెలుసుకోవాలి. టాటూలు వేశాక చర్మంలో కలిసిపోవడానికి మూడు వారాలు పడుతుంది. టాటూ వేయడం వల్ల అయిన గాయం పూర్తిగా మానేవరకు తప్పనిసరి జాగ్రత్తలు కొన్ని పాటించాలి. వ్యాయామం ఎక్కువగా చేయకూడదు. సముద్రపు నీళ్లలో లేదా క్లోరిన్ కలిసిన నీళ్లలో తడవకూడదు. ఎండకు ఎక్కువగా ఎక్స్‌పోజ్ కాకూడదు. కొందరు నొప్పిని భరించేందుకని టాటూలు వేయించుకునే ముందు మద్యం సేవిస్తుంటారు. ఇలాంటి వాళ్లు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... ఆల్కహాల్ రక్తాన్ని పలుచన చేస్తుంది. దాంతో రక్తస్రావం ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. అలాగే తగు జాగ్రత్తలు పాటించని వారి వద్ద పచ్చబొట్లు వేయించుకుంటే చర్మ క్యాన్సర్లు వచ్చే అవకాశమూ లేకపోలేదు.

రిసెప్షనిస్టుగా చేరి...

టాటూలు వేయడం నేర్చుకున్న పది రోజుల్లో జెస్సీలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. తాను ఈ రంగంలో ప్రతిభ చూపగలనని అర్థమై, బెంగళూరు రాగానే చేస్తున్న ఐటి ఉద్యోగానికి రాజీనామా చేసింది. జయనగర్‌లో ఉన్న ఒక చిన్న టాటూ స్టూడియోలో రిసెప్షనిస్టుగా అతి తక్కువ జీతానికి చేరింది. "ఆర్టిస్టుగా రాణించగలనన్న నమ్మకాన్ని నాకు జులియో ఇచ్చాడు. అయితే నెలకు నలభైవేలు సంపాదించే ఉద్యోగం మానేసి ఈ పని చేస్తే అది ఆర్థికంగా ఎంతవరకు సహకరిస్తుందో తెలుసుకోవాలి కదా! అందుకే రిసెప్షనిస్టు ఉద్యోగంలో చేరాను. అయితే నేను రోజూ లగ్జరీ కారులో ఉద్యోగానికి వెళ్లేదాన్ని. అది చూసి స్టూడియో యజమాని నన్ను అనుమానంగా చూసేవాడు. అదేమో చాలా చిన్న స్టూడియో. పెద్దగా కస్టమర్లు వచ్చేవారు కాదు. అయినా సంపాదన బాగానే ఉండేది. రెండు మూడు నెలల పాటు వారి సంపాదన చూశాక నాకు మరింత ధైర్యం వచ్చింది. దాంతో నేను సరైన నిర్ణయమే తీసుకున్నానని ఊపిరి పీల్చుకున్నాన"ని కెరీర్ మారడం కోసం తను చేసిన ప్రయోగం గురించి ఆమె వివరించారు.

సంపాదనతోనే సమాధానం

రిసెప్షనిస్టుగా చేసిన స్టూడియోలో ఆర్టిస్టుగా పనిచేసే వ్యక్తికి తన నెలసరి ఆదాయంలో యాభైశాతం ఇస్తానని చెప్పి తన వద్ద పనిచేసేందుకు ఒప్పించింది జెస్సీ. కానీ కుటుంబసభ్యులను ఒప్పించడం ఆమెకు కత్తిమీద సామే అయ్యింది. "సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వదిలేసి టాటూలు వేస్తానన్నప్పుడు ఇంట్లో వాళ్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. 'టాటూలు వేసుకోవడాన్ని తప్పుగా చూస్తున్నప్పుడు నువ్వు ఆ రంగంలో కెరీర్ ఎంచుకోవడం ఏంటి? మహిళగా ఈ రంగంలో నీకు గౌరవం ఉండద'ని నన్ను నిరుత్సాహపరిచారు. టాటూలు వేసుకునే వాళ్లంటే ఒక చిన్న చూపు ఉంది. వాళ్లంతా ఒక ప్రత్యేకమైన వాళ్లని, మత్తుమందులు వాడతారని, హిప్పీలని, పనిలేని వాళ్లే ఒళ్లంతా పచ్చబొట్లు పొడిపించుకుంటారని... రకరకాలుగా అనుకుంటారు. నిజానికి 'బాడీ ఆర్ట్' పైన ఆరాధన ఉన్న వాళ్లకి సున్నితమైన మనసు ఉంటుంది. వాళ్లకి ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంటుందనేది నా అభిప్రాయం. అందుకే... ఎవరెన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా, అడ్డు చెప్పినా నేను వినదల్చుకోలేదు. మా ఆయన నడుపుతున్న జిమ్ పైనే ఒక చిన్న గది అద్దెకు తీసుకుని 'వెర్వ్' టాటూ స్టూడియో ప్రారంభించి, ఇంటర్నెట్‌లో పబ్లిసిటీ చేశా. మొదటి నెల నా సంపాదన 75 వేల రూపాయలు. ఇక అప్పటినుంచి వెనుదిరిగి చూసుకోలేదు. నా సంపాదనే అందరికీ సమాధానం చెప్పింద"ని గర్వంగా చెప్పారు జెస్సీ. టాటూలు వేయడమే కాకుండా ఔత్సాహికులకు శిక్షణ కూడా ఇస్తారు. మూడు నెలల శిక్షణా కాలంలో డ్రాయింగ్ బేసిక్స్ నుంచి నేర్పిస్తారు. ఈ కోర్సు ఫీజు 65 వేల రూపాయలు.

ఇది మనసు కళ

"మన దేశంలో పచ్చబొట్లు వేయించుకునే సంప్రదాయం వేల సంవత్సరాల క్రితమే ఉన్నప్పటికీ... అది మరుగున పడిపోయిందనే చెప్పొచ్చు. పల్లెటూళ్లలో ఆకు పసరు అద్దుకుంటూ పచ్చబొట్లు వేసేవాళ్లు. ఈ విధానం ఇప్పుడు ఎక్కడో కాని కనిపించడంలేదు. ఒకప్పుడు ఒంటి మీద పచ్చబొట్టు లేకపోతే స్వర్గంలోకి ప్రవేశం లేదని చెప్పేవారు. అదే ఇప్పుడు పచ్చబొట్లు వేయించుకునే వాళ్లు మంచి వాళ్లు కాదనే అభిప్రాయంలో ఉన్నారు. పాశ్చాత్యదేశాల్లో టాటూలకు, టాటూ ఆర్టిస్టులకు మంచి ఆదరణ ఉంది. అక్కడి యూనివర్శిటీల్లో పచ్చబొట్లు ఎలా వేయాలో శాస్త్రీయంగా నేర్పిస్తారు. వాటి పుట్టుపూర్వోత్తరాల గురించి అధ్యయనం చేసే అవకాశం ఉంటుంది.. కానీ మన దగ్గర పరిస్థితి వేరు. శాస్త్రీయంగా నేర్పించడాన్ని పక్కన పెడితే... దీన్నొక కళగా కూడా చూడటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక మహిళ టాటూ ఆర్టిస్టుగా ఎదగడం అనేది అంత సులభమేమీ కాదు. ఈ రంగంలో నాదంటూ ఒక ముద్ర వేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. టాటూలు వేసేందుకు విదేశాలకు కూడా వెళ్తుంటాను. నేను సింగిల్ పేరెంట్ కావడం వల్ల మా పాప నైనీషియాను అమ్మా వాళ్లు చూసుకుంటారు. నైనీషియా అంటే 'ఆసియా ప్రిన్స్' అని అర్థం. తనకి ఇప్పుడు ఐదేళ్లు. స్కూల్ పూర్తవ్వగానే స్టూడియోకి వచ్చేస్తుంది. నాతో పాటు మరో ఇద్దరు పనిచేస్తున్నారు. ట్రైనీలు ముగ్గురు ఉన్నారు. నేను విదేశాలకు వెళ్లినప్పుడు మా సోదరుడు స్టూడియో బాధ్యతలు చూసుకుంటాడు. ఇప్పుడైతే రోజుకి ఆరు గంటలు పనిచేస్తున్నాను. ప్రారంభంలో మాత్రం అంతకంటే ఎక్కువ కష్టపడ్డాను. పచ్చబొట్లు వేసే వాళ్లకి చేతిలో కళతో పాటు మనసు కూడా ఉండాలి. జీవితాంతం శరీరంపై టాటూని ఉంచుకుని, దాన్ని ప్రేమిస్తూ, అపురూపంగా చూసుకునే వారికి... అచ్చం అలాంటి మనసుతో టాటూ వేస్తేనే అద్భుతంగా వస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది మనసు కళ. ఇంటర్నెట్‌లోంచి డిజైన్లు కాపీ చేయడం నాకు ఇష్టం ఉండదు. సొంతంగా డిజైన్లు సృష్టించడం నాకు ఓ సవాల్‌గా అనిపిస్తుంది" అంటారామె.



రోమ్‌లో 2017లో జరిగిన అంతర్జాతీయ మహిళా టాటూ ఆర్టిస్ట్స్ కన్వెన్షన్‌లో మన దేశం నుంచి పాల్గొన్న మొట్టమొదటి ఆర్టిస్ట్ జెస్సీ. గత సంవత్సరం పుణేలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 'బ్లాక్ అండ్ గ్రే' టాటూ విభాగంలో మొదటి, 'ట్రెడిషనల్' టాటూ విభాగంలో ద్వితీయ బహుమతులను సొంతం చేసుకుంది.

• ఝాన్సీ పాపుదేశి
బెంగళూరు

పర్సనల్ టచ్

మహిళలపై అత్యాచారాలు, గృహహింస, ప్రేమ పేరుతో వంచన... ఇన్నాళ్లు తెర మీద మహిళా సమస్యలంటే ఇలాంటివాటినే చూశాం. కానీ వారి 'పర్సనల్' విషయాలు, ఎవరికీ చెప్పుకోలేని సమస్యలు ఎప్పుడూ చర్చకు రాలేదు. అసలు అలాంటివాటివైపు ఎవరూ కన్నెత్తి కూడా చూడలేదు. అవి చూడడానికి అతి చిన్నగా కనిపించే పెద్ద సమస్యలు. బాలీవుడ్‌లో నవతరం దర్శకులు అలాంటి సున్నితమైన అంశాలను అంతే సున్నితంగా... సూటిగా, ధైర్యంగా తెరకెక్కిస్తున్నారు. సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆలోచింపజేస్తున్నారు. అది మరో రెండు రోజుల్లో విడుదలవుతున్న 'ప్యాడ్‌మ్యాన్' కావొచ్చు... ఇప్పటికే రిలీజై, విజయం సాధించిన 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్‌కథ' కావొచ్చు. ఈ టైపు 'రియలిస్టిక్' కథలు అందర్నీ ఆకట్టుకోవడమేగాక, ఆలోచింపజేస్తున్నాయి కూడా!






'సున్నితంగా'.. సూటిగా...


'ఇక్కడున్నవారిలో ఎవరైనా, ఎప్పుడైనా 'శానిటరీ నాప్కిన్' టచ్ చేశారా?'

'టెడ్ టాక్స్'లో అరుణాచలం మురుగనంథమ్ సభికులను ఉద్దేశించి వేసిన ప్రశ్న ఇది. ఈ ప్రశ్న వినడానికి కొంచెం ఇబ్బందిగా ఉండొచ్చు, కానీ ఆయన అలాంటి ఇబ్బందులను ఎన్నింటినో పట్టించుకోకుండా ముందుకు సాగాడు. మధ్యతరగతి నుంచి వచ్చిన ఆయన వీలైనంత తక్కువ ఖర్చులో శానిటరీ న్యాప్కిన్ల తయారీతో 'ప్యాడ్‌మ్యాన్'గా అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు బాలీవుడ్ సినిమాకు 'హీరో'గా మారారు. అక్షయ్‌కుమార్ తాజా చిత్రం 'ప్యాడ్‌మ్యాన్' మురుగనంథమ్ జీవితం ఆధారంగానే తెరకెక్కింది. ఆయన అప్పుడెప్పుడో సంధించిన ప్రశ్నకు సమాధానంగా 'ప్యాడ్‌మ్యాన్ ఛాలెంజ్'ను స్వీకరించి ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖులు ఆమిర్‌ఖాన్ నుంచి అలియాభట్ దాకా... సోనమ్ కపూర్ నుంచి షబానా ఆజ్మీ దాకా అందరూ శానిటరీ నాప్కిన్స్‌ను బహిరంగంగా ప్రదర్శిస్తున్నారు. స్కూలు పిల్లలకు సైతం అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి ఈ 'సీక్రెట్' సమస్యను అందరూ మాట్లాడుకునేలా చేస్తున్నారు.

గతంలో వచ్చిన మహిళా చిత్రాలకు ఇప్పుడు వస్తున్న ఈ రియలిస్టిక్ సినిమాలకు చాలా తేడా ఉంది. కేవలం చట్టం, న్యాయ పరిధిలోని మహిళా సమస్యలను చర్చించే కథలే కాకుండా... వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన అంశాలను కూడా సినిమాల్లో సున్నితంగా, సూటిగా చర్చించవచ్చని నవతరం దర్శకులు నిరూపిస్తున్నారు. అలాంటి సమస్యలను మెయిన్‌స్ట్రీమ్‌లోకి చాలా తెలివిగా మిళితం చేస్తున్నారు. నిజానికి ఇలాంటి సీరియస్ సమస్యలను తెరకెక్కిస్తే 'ఆర్ట్' సినిమాలుగా ఒకప్పుడు ముద్ర వేసేవారు. పైగా ఆ సినిమాల్లో రెగ్యులర్ స్టార్‌లు ఉండేవారు కాదు. కానీ ప్రస్తుతం వస్తున్న ప్రయోజనాత్మక సినిమాల్లో నటించేందుకు బాలీవుడ్ స్టార్లు (ఈ విషయంలో అక్షయ్‌కుమార్ అందరికన్నా ముందున్నారు) పోటీ పడుతుండటం విశేషం. ఇలాంటి సినిమాల్లో హీరోయిన్ ఎవరనేది కూడా హీరోలు పట్టించుకోవడం లేదు. 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్‌కథ'లో అక్షయ్‌కుమార్ సరసన ఒకటీ అరా సినిమాల్లో మాత్రమే నటించిన భూమి పెడ్నేకర్ నటిస్తే, తాజా 'ప్యాడ్‌మ్యాన్'లో అక్షయ్ భార్యగా రాధికా ఆప్టే కనిపించనుంది. రెగ్యులర్ ఫార్ములాకు దూరంగా పట్టణాలు, పల్లెల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాల్లో సమస్యను వాస్తవికంగా చూపడంపైనే దర్శకులు దృష్టి సారిస్తున్నారు. ఈ కొత్తరకం సినిమాలు కూడా ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని (గౌరవప్రదమైన) అందిస్తూనే, సందేశాన్ని సూటిగా చేరవేసి, ఆ తర్వాత ఆలోచింపజేస్తున్నాయి. అంతేకాదు సమాజంలో ఒక కదలిక వచ్చేంత తీవ్రత ఆ సందేశాల్లో ఉంటోందంటే ఎంతైనా అభినందనీయమే కదా. ఎవరన్నారు... సినిమాలు సమాజాన్ని మార్చలేవని! ఎవరన్నారు... సినిమాలు, సమాజం వేరు వేరని! నిన్న 'టాయ్‌లెట్...', నేడు 'ప్యాడ్‌మ్యాన్'... మరి రేపు...? పిక్చర్ అభీ బాకీ హై మేరే దోస్త్..!

> వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన అంశాలను కూడా మెయిన్‌స్ట్రీమ్ సినిమాల్లో సున్నితంగా, సూటిగా చర్చించవచ్చని నవతరం దర్శకులు నిరూపిస్తున్నారు.






• చల్లా

వైరల్

ఒక తల్లి 'కన్యాదానం'!

వధువు తల్లి ఒడిలో కూర్చుంటే... వరుడు తాళి కడుతున్న ఈ ఫోటో చూస్తుంటే ముచ్చటేస్తోంది కదూ. అందుకే ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ ఫోటో వైరల్ అవుతోంది. వివాహ సమయంలో కూతుర్ని తండ్రి తన ఒళ్లో కూర్చోబెట్టుకుని కన్యాదానం చేయడం తమిళ బ్రాహ్మణ సంప్రదాయం. అయితే చెన్నైకి చెందిన రాజేశ్వరీ శర్మ ఆ సాంప్రదాయానికి భిన్నంగా కూతుర్ని తన ఒళ్లో కూర్చోబెట్టుకుని కన్యాదానం చేశారు. ఇప్పుడదే అందరికీ తెగ నచ్చుతోంది.

చెన్నైలోని సంప్రదాయ తమిళ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రాజేశ్వరి ఇలా ఎందుకు చేశారు? ఆమెకు 21 ఏట పెళ్లయ్యింది. ఆ తర్వాత భర్తతో కలిసి ఆస్ట్రేలియాకు వెళ్లారు. పదిహేడేళ్ల తర్వాత వారి వివాహబంధంలో ఒడుదొడుకులు ఎదురై ఇద్దరూ విడిపోయారు. రాజేశ్వరి కూతురు ఆస్ట్రేలియా అబ్బాయి శామ్‌ను పెళ్లాడాలనుకుంది. అయితే పెళ్లి తంతు చెన్నైలోనే సాంప్రదాయకంగా జరగాలని షరతు పెట్టింది. తండ్రి లేకపోవడంతో రాజేశ్వరి కూతురును తన ఒళ్లో కూర్చోబెట్టుకుని కన్యాదానం చేశారు. వరుణ్ సురేశ్ అనే ఫోటోగ్రాఫర్ తీసిన ఈ ఫోటోలను అరవిందన్ సుదర్శన్ తన ఫేస్‌బుక్‌లో అప్‌డేట్ చేయడంతో వైరల్ అయ్యాయి. "పెళ్లికి హాజరైన అందరూ నన్ను సపోర్ట్ చేశారు. అంతెందుకు... నా చెల్లెలికి సంప్రదాయాలంటే ప్రాణం. ఆమె కూడా నేను చేసిన పనిని చూసి మెచ్చుకుంది. నెట్‌లో వైరల్ అయిన తర్వాత నాపై చాలామంది ప్రశంసల వర్షం కురిపించడం ఆనందాన్నిస్తోంది" అని రాజేశ్వరి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఫోటోలను ఇప్పటికే కొన్ని వేల మంది షేర్ చేయడం విశేషం.



మైక్రో చీటింగ్!

సోషల్ మీడియా పుణ్యమాని 'మనుషులు దూరమైనా మనసులు దగ్గరే'! అనే ప్రవృత్తి పెరుగుతోంది. గతంలో ముగిసిన అధ్యాయాల్ని మళ్లీ తాజాగా మొదలుపెట్టాలనుకుంటున్నారు. ఈ సందేశాలకు సోషల్ మీడియా వారధిగా మారిందని ఇటీవలే ఓ అధ్యయనంలో తేలింది. తమ మాజీ ప్రియులు/ప్రియురాళ్లను ఆకర్షించటానికి సోషల్ మీడియాతో గాలం వేస్తున్న వారు పెరుగుతున్నారు. వారికి సందేశాలను చేరవేసేందుకు మాజీ ల అకౌంట్ల కోసం సోషల్ మీడియాను జల్లెడ పడుతున్నారు. దొరికితే వాళ్ల పాత పోస్టులను పరిశీలిస్తున్నారు. 'హృదయం', 'పువ్వులు' లాంటి గుర్తులున్న ఎమోజీలను పంపుతూ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అపోజిట్ సెక్స్ వ్యక్తుల నంబర్లను మారు పేరుతో సేవ్ చేసుకుంటున్నారు. అంతేకాదు తరచూ మాజీలను స్నాప్‌చాట్ మెసేజింగ్ సైట్‌లో యాడ్ చేసుకోవటం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో పెట్టే పోస్ట్‌లను లైక్ చేయటం, లాంటి పనులు చేస్తున్నారు. ఇలా చేయటాన్ని 'హైలెవల్ ఆఫ్ డిజిటల్ ఇంట్రెస్ట్' అంటారు. పాత పరిచయాలను పునరుద్ధరించుకోవాలనే కారణంతో వారిపై డిజిటల్ ఇంట్రస్ట్ చూపటాన్ని 'మైక్రో చీటింగ్' గా పరిగణిస్తారు. దీనికే మరో పేరు 'ఎమోషనల్ ఎఫెయిర్'. అయితే నిపుణులు మాత్రం ఎదుటివారికి తెలియకుండా ఇలాంటి పనులు చేయటం అనైతికం అంటున్నారు ఇలాంటి వారు తమ తీరు మార్చుకోవాలని సూచిస్తున్నారు.







బాలీవుడ్‌లో ఫ్యాషన్ అప్‌డేట్స్‌లో టాప్ ఎవరంటే సోనమ్ కపూర్ అని చెప్పక తప్పదు! మెగా హిట్ సినిమాలు పెద్దగా లేకపోయినా... అనిల్‌కపూర్ వారసురాలిగానే కాకుండా... కట్టు, బొట్టుతో తన ప్రత్యేకత చాటుతుందీ భామ. సందర్భం చిన్నదైనా... పెద్దదైనా... బ్యూటీ'ఫుల్' లుక్స్‌తో మెస్మరైజ్ చేస్తుంది. కత్రినాకైఫ్, దీపికా పదుకొనే తదితర బాలీవుడ్ స్టార్లు ఎప్పటికప్పుడు ఫ్యాషన్ స్టేట్‌మెంట్లతో ఆకట్టుకుంటున్నా... వారి మధ్యన సోనమ్ కూడా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలుస్తోంది. తాజాగా అక్షయ్‌కుమార్ సరసన

'సోనా'మ్!

'ప్యాడ్‌మ్యాన్'లో నటించిన ఈ ముద్దుగుమ్మ దాని ప్రమోషన్‌లో బిజీగా ఉంది. ఏడాది ఆరంభంలో మోడరన్ టచ్‌తో అదరగొట్టిన సోనమ్... ఇటీవల చిత్ర ప్రచారం కోసం ఓ టీవీ చానల్‌లో సంప్రదాయ దుస్తుల్లో మెరిసి మురిపించింది. ఆఫ్ వైట్, బంగారు వర్ణాల మేలి కలయికల చీర కట్టు... దానికి మ్యాచింగ్‌గా ధరించిన స్లీవ్‌లెస్ మెటాలిక్ చేనేత రవికలో మతిపోగొడుతోంది. ప్రముఖ డిజైనర్ హేమంగ్ అగర్వాల్ ఈ చీరను డిజైన్ చేశారు. సిల్వర్ నెక్‌పీస్, చేతులకు గోల్డెన్ కఫ్స్, లైటర్ ఇయర్ రింగ్స్ పెట్టుకుని కుందనపు బొమ్మలా విద్యుత్ కాంతుల్లో మిలమిలలాడింది. చీరల్లో ప్రయోగాత్మకమైన డిజైన్లు ధరించడమంటే మహా ఇష్టమట సోనమ్‌కి!

సెలబ్ స్టైల్



స్ఫూర్తి

ప్రతి ఒక్కరి జీవితంలో ఓ పోరాటం ఉంటుంది. మనలోని శత్రువుతోనే కొన్నిసార్లు చేయక తప్పదు. అలాగే నిషా గుప్తా జీవితంలోనూ ఉంది. యుద్ధం చేసింది. తన శరీరం తెచ్చిన వైకల్యాలతో పోరాడింది. చివరికి విజేతగా నిలిచింది.

ఇప్పుడు నిషా... ఓ విజయవంతమైన అథ్లెట్... ఓ స్ఫూర్తిదాయక మహిళ!

30 ఏళ్ల వయసులో 12...
నిషాకు ప్రమాదం జరిగినప్పుడు 12వ తరగతి చదువుతోంది. అప్పట్నుంచి చదువుకు బ్రేక్ పడింది. ఇప్పుడామెకు 30 ఏళ్లు. ఈ వయసులో మళ్లీ చదువును కొనసాగించాలన్న పట్టుదలతో 12వ తరగతి ప్రైవేటుగా ఫీజు కట్టి చదువుతోంది.

నాలుగేళ్లు నరకం చూశా...
ఆపరేషన్ తర్వాత నాలుగేళ్లు నరకం చూశాను... ఏం చేయాలో అర్థం కాలేదు. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. ఒకవేళ వచ్చినా వాళ్లు తాము తీర్చిదిద్దుకోవాలి. ఆ నాలుగేళ్ల నా నెగటివ్ ఆలోచనలు, వాటి వల్ల నేను ఎదుర్కొన్న కష్టాలు ఇక ఎవరూ ఎదుర్కోకూడదు. అందుకే నాలాగా బాధపడుతున్న వారికి నేను మాటలతోనే ధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నా!

నిలిచి... గెలిచింది!

"జాగ్రత్త నిషా" అంటూ ఆమెను తండ్రి వారించాడు. అప్పుడు నిషా గుప్తాకు 16 ఏళ్లు. ముంబై నుంచి కుటుంబంతో కలిసి కాశీ పర్యటనకు వెళ్లింది. రోడ్డు పక్కన మామిడి చెట్టు కనబడింది. పక్కనే ఉన్న గోడ ఎక్కి, పండ్లు కోయాలనుకుంది. కానీ పట్టు తప్పి జారి కింద పడింది. బాధతో విలవిల్లాడింది. నొప్పి తట్టుకోలేక గట్టిగా అరుస్తోంది. నిషా ఇద్దరు సోదరులు ప్రయత్నించినా లేపలేకపోయారు. ఆమె కాళ్లు కదలడం లేదు. పాము కాటేయడం వల్ల కదల్లేకపోతోందని అందరూ భావించారు. మరో ఇద్దరి సాయంతో ఆమెను కూర్చోబెట్టి డాక్టర్‌ను పిలిపించారు. మందులు ఇచ్చాడు. కానీ కొంత సేపటికి మళ్లీ పరిస్థితి మామూలే. ఈ సారి ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయాలు తీవ్రమైనవి కావడంతో వేరే హాస్పిటల్‌కు షిఫ్ట్ చేయమన్నాడు లోకల్ డాక్టర్. అసలే పెళ్లిళ్ల సీజన్, కారు దొరకడం చాలా కష్టమైంది. కారులో స్పృహ కోల్పోయింది. ఆమె మళ్లీ కళ్లు తెరిచింది ఆసుపత్రిలోనే!

మామూలు ఫ్రాక్చర్ అనుకున్నారు

తలకు, వెన్నుపూసకు ఎక్స్‌రే తీశారు. నిషా వెన్నుపూసకు ఫ్రాక్చర్ అయిందని నిర్ధరించారు. ఆపరేషన్ చేయాలన్నారు అక్కడి డాక్టర్లు. కానీ ఆమె తండ్రి మాత్రం ముంబాయి వెళ్లడానికి మొగ్గు చూపారు. వెంటనే కారులో ముంబైకి బయలుదేరారు. కారు కుదుపుల్లో నొప్పి తట్టుకోలేక ఆమె బాధతో అరుస్తోంది. అందరిలో ఏమవుతుందోమోనన్న భయం.... ఆ రాత్రి ప్రయాణాన్ని ఇవన్నీ ఆమెకు చేదు జ్ఞాపకంగా మార్చాయి. చేతుల్లో, కాళ్లో ఫ్రాక్చర్ అయ్యాయేమో అనుకుంది నిషా. ముంబై చేరుకున్నాక, వారు వెళ్లని హాస్పిటల్ లేదు. కలవని డాక్టర్ లేడు.

ఆపరేషన్ తప్పలేదు

ఎంత మంది డాక్టర్లను కలిసినా, వెన్నుముకకు శస్త్రచికిత్స చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. కానీ ఇక జీవితంలో ఆమె ఇక నడవలేదన్న కఠోర వాస్తవం ఆ కుటుంబాన్ని అతలాకుతలం చేసింది. 2004లో ఆమెకు ఆపరేషన్ జరిగింది వీల్‌చైర్ ఆమె ఆశలకు సంకెళ్లు వేసింది. నిషా శారీరక స్థితిని అర్థం చేసుకుని మానసికంగా దృఢంగా కావాలన్న ఉద్దేశంతో ఆమెను పునరావాస కేంద్రానికి పంపించారు తల్లిదండ్రులు. అయిదు నెలల పాటు అక్కడే ఉంది. ఆ తర్వాత ఆమెను డిశ్చార్జ్ చేశారు. కానీ కథ మామూలే. తినడం, టీవీ చూడటం, నిద్రోపోవడం... ఇదే రోజూ వారీ జీవితం. నాలుగేళ్లు ఆమె ఇంటికే పరిమితమైంది. ఆమెకు విసుగెత్తిపోయింది. 'ఎవరో రావాలి... సహాయం చేయాలి...! ఏంటీ జీవితం' అనిపించింది. తనకు కాళ్లు లేవన్న సంగతి తలుచుకుని కుమిలిపోయింది. క్రమంగా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. తల్లిదండ్రుల సలహాతో మళ్లీ పునరావాస కేంద్రానికి వెళ్లి అక్కడి వైద్యుల్ని కలిసింది. వెన్నుముక దెబ్బతిన్న రోగులకు చికిత్స చేస్తున్న నినా ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ గురించి వారి మాటల్లో ఆమెకు తెలిసింది.

వీల్ చైర్లో నృత్యం

నైనా ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ కేత్నా మెహతాను నిషా కలిసి తన పరిస్థితిని వివరించింది. ఒక రోజు అక్కడ ఫంక్షన్‌కు రమ్మని ఎన్జీవో నుంచి కబురు వచ్చింది. అక్కడికెళ్లితే, ఆ దృశ్యాలను చూసి నమ్మలేకపోయింది. అందరూ తన లాంటి వాళ్లే... ఎంతో ఆనందంగా ఉన్నారు. తనలా డీలా పడిపోలేదు. జీవితం మీద ఏదో భరోసా, నమ్మకం వాళ్ల కళ్లల్లో మెరుస్తోంది. ఇంతలో స్టేజ్ పైకి వెళ్లి కేత్నాడి అనే పేషంట్ వీల్ చైర్లోనే నృత్యం వేయడం చూసి ఆశ్చర్యపోయింది. అగాధంలోకి వెళిపోతున్న ఆమె ఆలోచనల్నీ వెలుగు వైపు మళ్లించిన సంఘటలివి.

ఆట మార్చిన జీవితం

ఆటలు ఆడతానని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. అనుకోనిది జరిగినప్పుడే జీవితం కొత్త దారుల్లోకి తీసుకెళుతుంది. ఒకసారి ఆ ఫౌండేషన్ నిర్వహించిన ఓ మారథాన్‌ను చూడటానికి వెళ్లింది నిషా. తనలాంటి పరిస్థితులు ఉన్నవాళ్లు జీవితాన్ని ఆస్వాదిసున్నారు. కష్టాలను, బాధలను తట్టుకొని ఎదురీదుతున్నారు. అదే కావాలి. తనూ మారాలి. ప్రపంచంలో ఇలా బాధపడుతున్నది తను మాత్రమే కాదు... ఇంకా చాలా మంది ఉన్నారని ఆమె గ్రహించింది. తన మనసుకు తానే కావాలని వేసుకున్న సంకెళ్లను తెంచుకోవాలనుకుంది. ఈ మానసిక సంఘర్షణలో ఆమెకు తోడుగా నిలిచి, వెన్నుతట్టిన స్నేహితుడు ఆలివర్. అదే మారథాన్‌లోనే పరిచయమయ్యాడు. అమె వ్యక్తిత్వాన్ని దృఢంగా చేసిన స్నేహితుడు అతను. "స్వతంత్రంగా ఎలా ఉండాలి, ఎవరి తోడు లేకుండా ఎలా ప్రయాణించాలి... దేనికీ భయపడకుండా ఎలా జీవించాలి" అనే విషయాలను తనే నేర్పించాడు" అని చెబుతుంది నిషా. అతని ప్రోత్సాహంతోనే స్విమ్మింగ్ నేర్చుకోవాలని నిర్ణయించుకుంది. అలాగే బాస్కెట్‌బాల్ కూడా. ఎందుకంటే అలాంటి ఆరోగ్య స్థితి ఉన్నవారికి వ్యాయామం చాలా అవసరం. ఇంట్లో కూడా సరేనన్నారు. రోజూ కఠోర సాధన, దానికి తగ్గ ఆహారం... ఇవన్నీ ఆమెను అథ్లెట్‌గా మార్చాయి. ఇప్పుడు నిషాకు ఆటలే జీవితం! 2013లో ఆమెకు వివాహమైంది.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు

నిషా తొలి టోర్నమెంట్‌లో ఆడింది మాత్రం 2015లో ఆడింది. వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో రెండో స్థానం సాధించి తన సత్తా చాటింది. ఆ తర్వాత ఇక వెనుదిరిగి చూసుకోలేదు. ఇప్పటివరకూ ఆమె జాతీయస్థాయిలో బాస్కెట్‌బాల్ ఆటలో మూడు బంగారు పతకాలు, స్విమ్మింగ్‌లో మూడు రజత పతకాలు సాధించింది. ఇండోనేసియాలోని బాలిలో జరిగిన ఇంటర్నేషనల్ బాల్ టోర్నమెంట్‌లో ఆమెకి మూడో స్థానం దక్కింది. ప్రస్తుతం మహారాష్ట్ర ఉమెన్స్ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టీమ్‌లో సభ్యురాలు. ఒకప్పుడు 'ఎలా బతకాలి?...', 'ఏం చేయలేనా..' అని ప్రశ్నలతో నిరాశా, నిస్పృహలతో కాలం గడిపేసిన నీతూకూ, ఇప్పటి నిషాకు ఎంతో వ్యత్యాసం ఉంది. 'ఎలాగైనా బతకాలి... సాధించాలి' అన్న కసితో, గుండెల నిండా ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తు వైపు అడుగులు వేస్తోంది.

సేఫ్టీ ఫస్ట్

హెల్మెట్ ఒక్కటే సరిపోదు!

అమర్ శ్రీవాత్సవ ఓ ఐఐటీ గ్రాడ్యుయేట్. తన కెంతో ఇష్టమైన క్యాంపస్‌లో, నచ్చిన కోర్సులో సీటు వచ్చింది. తన సీనియర్లకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలొచ్చాయి. క్యాంపస్ అంతా పండగ వాతావరణం నెలకొంది. ఆ ఆనందం ఎంతో కాలం నిలువలేదు. కొన్ని రోజులకు జరిగిన రోడ్డు ప్రమాదంలో వారిలో కొంత మంది చనిపోయారు. అమర్ షాక్ తిన్నాడు. చిన్న నిర్లక్ష్యం వారి జీవితాలను కాటేసిందన్న నిజం అతణ్ణి మరింత బాధపెట్టింది. ఇలాంటి ఆవేదన ఎవరికీ కలగకూడదన్న ఆలోచనతో రోడ్డు భద్రత గురించి ఏదోకటి చేయాలనుకున్నాడు. ప్రస్తుతం అమర్ 'ఇండియన్ రోడ్ సేఫ్టీ కాంపైన్' విభాగానికి చెందిన ఢిల్లీ విభాగంలో సభ్యుడు. ఇలా ఎంతో మంది చిన్న చిన్న జాగ్రత్తలు పాటించక మృత్యువాత పడుతున్నారు. 'ఇండియన్ రోడ్ సేఫ్టీ క్యాంపైన్', ట్రాన్స్‌పోర్టేషన్ రీసెర్చ్ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్, ఢిల్లీ ఐఐటీలు సంయుక్తంగా ఇదే అంశంపై సర్వే నిర్వహించాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి!



బకెల్ బిగించండి!

దేశ రాజధాని ఢిల్లీలోనే హెల్మెట్‌లు ధరించే వారు 80 శాతం మంది ఉన్నారు. అయితే మిగతా 20 శాతం మంది చలానాలకు భయపడో, ట్రాఫిక్ రూల్స్‌కు భయపడో ఉపయోగిస్తున్నారు. వాటికున్న బకెల్స్ మాత్రం బిగించుకోరట. ఇది కూడా ప్రమాదాలకు దారి తీస్తోంది.

పైసలు కాదు... ప్రాణాలే ముఖ్యం!

బైక్ ప్రమాదాలకు గురైన వారిలో 50 శాతం మంది హెల్మెట్ ధరించలేదట. దీంతో వారు తలకు గాయాలై జీవితాల్నే కోల్పోతున్నారు. ఇక నాసిరకమైన హెల్మెట్లు కూడా వాహనదారుల ప్రాణాలు తీస్తున్నాయి. ఫుట్‌పాత్ మీద అమ్మే హెల్మట్లు తక్కువ ధరకు వస్తున్నాయన్న కారణంతో వాటికి మొగ్గు చూపుతున్నారు. కానీ కేవలం 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' గుర్తించిన ఉత్పత్తులనే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. 20 నుంచి 25 మిల్లీ మీటర్ల మందంతో తయారైన హెల్మెట్లే వాడాలి.

బరువు ఇక భారం కాదు!

'ఇండియన్ రోడ్ సేఫ్టీ క్యాంపైన్' ఢిల్లీ విభాగంలో 150 మంది ఉండగా, 1700 మంది వాలంటీర్లు దేశవ్యాప్తంగా ఈ కాంపైన్‌లో పాలుపంచుకుంటున్నారు. స్నేహితులకు జరిగిన ఘోరం మరెవరికీ జరక్కూడదనే ఉద్దేశంతో అతను తేలికగా ఉంటూనే, ఎంతటి ప్రమాదమైనా తట్టుకోగలిగే లైట్ వెయిట్ హెల్మట్‌ను రూపొందించాడు. అదీ తక్కువ ధరకే నాణ్యమైన హెల్మెట్ ఇప్పుడు టెస్టింగ్ దశలో ఉందనీ, త్వరలోనే మార్కెట్లోకి అందుబాటులోకి వస్తుందని అమర్ తెలిపారు.

ట్రెండింగ్ హిట్



గాంధీ కలల భారతం!

బాపూజీ కలలుగన్న స్వతంత్ర భారతంలోనే ఉన్నామా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఆయన్ని ఓ శిలలా, కేవలం కరెన్సీ నోటు మీద బొమ్మలా మార్చడంలో చూపించిన శ్రద్ధ ఆయన సిద్ధాంతాలను అనుసరించడంలో చూపిస్తున్నామా? సరిగ్గా ఇదే ప్రశ్నలు సంధించింది తాజా లఘుచిత్రం"నెక్ట్ జనరేషన్'.

ప్రేమకథల జడిలో తడిసి ముద్దవుతున్న లఘు చిత్ర ప్రపంచంలో అప్పుడప్పుడూ కొన్ని చిత్రాల కథా వస్తువులు మెరుస్తాయి. మనలో ఎక్కడో నిద్రిస్తున్న సామాజిక బాధ్యతను తట్టిలేపుతాయి. అలాంటి కోవలోకే వస్తుంది 'నెక్ట్ జనరేషన్'. ఇది ఓ బాలల చిత్రంగా చెప్పుకోవచ్చు. ఇక కథ ఏమిటంటే, నందు రోజూ స్కూల్‌కు వెళ్లేటప్పుడు గాంధీ బొమ్మను చూస్తూ ఉంటాడు. అక్కడే ఆ కాలనీలో చెత్త పారేస్తూ ఉంటారు. ఎందుకో గాంధీ తాత చెప్పింది ఎవరూ చేయడం లేదని అతని మనసులో బలమైన ఫీలింగ్. ఇంతలో స్కూల్‌కు వేసవి సెలవులు ఇచ్చేశారు. పిల్లలందరూ ఎవరికి వారు ఊళ్లకు వెళిపోదామనుకుంటారు. కానీ నందు మాత్రం తన కాలనీని శుభ్రం చేయాలనుకుంటాడు. ఫ్రెండ్స్‌ను అడుగుతాడు. ఎవరూ రానంటారు. ఆ తర్వాత ఏమైంది? ఈ లఘుచిత్రం చూసి తెలుసుకోవాల్సిందే! నాని తానెం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి మూడో తేదీన విడుదలైంది. నెటిజన్ల నుంచి మంచి ప్రశంసలు అందుకుంటోంది.

ఢిల్లీలో జరగబోతున్న 'ఆటో ఎక్స్‌పో 2018'లో హోండా అత్యధికంగా 11 నూతన మోడల్స్‌ను ప్రదర్శించబోతుంది. భారత్‌లో మొట్టమొదటిసారి హోండా అత్యాధునిక ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) కాన్సెప్ట్- పీసీఎక్స్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను సైతం ఇక్కడ ఆవిష్కరించబోతుంది. పెరిగిపోతున్న వాయుకాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ పరిస్థితులలో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఇంధన మార్గాల వైపు మళ్లాల్సిందిగా ప్రభుత్వాలు, పర్యావరణవేత్తలు కోరుతున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్, హైబ్రీడ్ వాహనాల జోరు అధికమైంది. దీనికి తోడు త్వరలోనే కాలుష్య కారక వాహనాలను నిషేధిస్తామంటూ జీవవైవిధ్య సదస్సుల్లో వివిధ దేశాలు ప్రతిన పూనుతుండటంతో దాదాపు అన్ని కంపెనీలూ ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి పెట్టాయి. హోండా ఓ అడుగు ముందుకేసి తమ విజయవంతమైన మోడల్ గ్రాజియాకు మరింత అడ్వాన్స్‌డ్‌గా పీసీఎక్స్‌ను తెస్తోంది.

హోండా నుంచి ఎలక్ట్రిక్ స్కూటర్

కొత్త బండి గురూ



విశేషాలెన్నో...

నగర రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని పీసీఎక్స్‌ను హోండా డిజైన్ చేసింది. వేగం కన్నా సౌకర్యం మిన్న అనే కాన్సెప్ట్‌తో పీసీఎక్స్‌లో 1.33 హెచ్‌పీ ఎలక్ట్రిక్ మోటార్ అమర్చింది. దీనిలో బయటకు తీయగలిగిన లిథియం ఐయాన్ మొబైల్ బ్యాటరీ ప్యాక్ ఉంది. ఈ 'మొబైల్ పవర్ ప్యాక్'ను హోండా సొంతంగా తయారు చేసింది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌కు సహాయపడేందుకు ఏసీజీ స్టార్టర్ దీనిలో ఉంది. పీసీఎక్స్‌ను ఎలక్ట్రిక్‌లో మాత్రమే కాకుండా హైబ్రీడ్ వెర్షన్‌లో కూడా విడుదల చేస్తున్నారు. ఈ వెర్షన్‌లో ఎలక్ట్రిక్ మోటార్‌తో పెట్రోల్ ఇంజిన్‌ను కలిపారు. హెడ్‌ల్యాంప్, టైల్ ల్యాంప్‌లను ఎల్ఈడీ యూనిట్లుగా ఉంచడంతో పాటు, ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ సైతం డిజిటల్ ఎల్‌సీడీని పెట్టారు. ఇది ఫ్యూయల్, బ్యాటరీ చార్జ్ లెవల్ చూపడంతో పాటే చార్జ్ అసిస్ట్ ఇండికేటర్‌గా కూడా పనిచేస్తుంది. గత ఏడాది టోక్యో ఎక్స్‌పోలో ప్రదర్శించిన పీసీఎక్స్ ధర భారత్‌లో రూ.85 వేలు ఉండవచ్చని అంచనా.

ఎలా చెప్పను!

తను... నేను!

నగరంలో పెరిగిన ప్రభావమో... పబ్‌ల్లో తిరిగిన అనుభవమో... తెలిసి తెలిసీ అప్పటికే రెండు సార్లు ప్రేమలో విఫలమైన వాడికి దగ్గరయ్యాను. వాడి పేరు అశ్విత్. నేను డిగ్రీ ఫైనల్ ఇయిర్‌లో ఉన్నప్పుడు వాడు ఫస్ట్ ఇయర్‌లో చేరాడు. ఆకట్టుకునే రూపం... ఎవరికైనా నచ్చేసే స్వభావం... నా మనసూ అతడి వైపే లాగేసింది. కాలేజీలో యూనివర్సిటీ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు నాలాగే వాడూ రోజూ చూడటానికి వచ్చేవాడు. అలా చూపులు కలిసి... పరిచయంగా మారి... వయసులు తెలిశాయి. దగ్గరవుదామనుకునే లోపే వాడు నాకన్నా రెండేళ్లు చిన్న అనే ఫీలింగ్ నన్ను దూరం పెట్టింది. వాడు కనిపిస్తే తప్పుకుని తిరగడం... ఫోన్ చేస్తే కట్ చేయడం... వారం రోజులు ముఖం చాటేశాను. మనసు వాడు కావాలని కోరుకుంటున్నా... వయసు వద్దు.. పద్ధతి కాదని హెచ్చరిస్తోంది.

ఓ రోజు పొద్దున్నే ఇంటి కాలింగ్ బెల్ మోగింది. 'నీ కోసం ఎవరో వచ్చారు' అంటూ అమ్మ చెప్పింది. 'ఇంత పొద్దున్నే నా కోసం ఎవరు వస్తారు' అనుకుంటూ వెళితే... హాల్ సోఫాలో అశ్విత్ కూర్చుని ఉన్నాడు. గుండె ఝల్లు మంది. నన్ను చూడగానే వాడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఒక్క ఉదుటున వెళ్లి వాడి ఒడిలో వాలిపోవాలనిపించింది. 'ఎందుకు వచ్చావు' అని అడిగితే... 'నువ్వు కనిపించకపోయేసరికి ఉండలేక ఇలా వచ్చాను' అన్నాడు. ఆ క్షణం నాలోని నెగటివ్ ఫీలింగ్స్ అన్నీ పోయాయి. రాత్రి పబ్‌లో మీటింగ్. ఇద్దరం మైమరిచిపోయి నాట్యం చేశాం. మా పరిచయం రెండు వారాలే! అయినా ఎందుకో ఒకరికి ఒకరం నచ్చేశాం.



ఇక ఆపుకోలేక వాడికి చెప్పేశాను... 'ఐ లవ్యూ'! అశ్విత్ ముఖంలో రంగులు మారిపోయాయి. ఠక్కున చెప్పేశాడు... 'నాకు నువ్వంటే ఇష్టం. కానీ ప్రేమ లేదు' అని! గుండె జారింది. ఊహించని ఆ సమాధానానికి వాడిచ్చిన వివరణ... 'ఇంతకు ముందు ఇద్దర్ని గాఢంగా ప్రేమించాను. కానీ... వాళ్లు నన్ను వాడుకుని వదిలేశారు. అందుకే నా జీవితంలో ఇక ప్రేమకు చోటు లేదు' అని. ఏదో చెప్పబోయా! వాడు వినలేదు. నిజంగా అంత ప్రేమ ఉంటే ఇప్పుడే పెళ్లి చేసుకుందామన్నాడు. లేదంటే ఇలా జీవితాన్ని ఆస్వాదిద్దామన్నాడు. నాకది పెద్ద షాక్. వాడా ఇప్పుడే ఉద్యోగం చేసి పోషించలేడు. నేనూ సంపాదించే పరిస్థితి లేదు. వయసులో నాకంటే చిన్నవాడంటే ఇంట్లో వాళ్లూ ఒప్పుకోరు. అందుకే రెండేళ్లు ఆగి పెళ్లి చేసుకుందామని చెప్పాను. వాడు వినలేదు. నాపై ప్రేమ లేదన్న వాడితో చనువుగా ఉండలేను. అదే సమయంలో నా డిగ్రీ అయిపోయింది. అశ్విత్ పార్టీకి రమ్మన్నాడు. రెండేళ్ల తరువాత పెళ్లి చేసుకుంటానని మాటిస్తే తప్ప రానన్నాను. దీంతో విసిగిన వాడు చెప్పా పెట్టకుండా ఊరు, కాలేజీ మారిపోయాడు. అశ్విత్‌పై నాకు కోపం లేదు... ఎందుకంటే గతంలో ప్రేమ పేరుతో వాడు మోసపోయాడు. కానీ... నేను! అశ్విత్‌పై ఇష్టాన్ని చంపుకోలేక... వాడిని పొందలేక మనో వేదనతో కుంగిపోతున్నాను. నాకే ఎందుకిలా జరిగింది!

● హర్షిత (పేర్లు మార్చాం)

మీ మనసులో మాట మాతో పంచుకోండి: navya@andhrajyothy.com

డైలీ సుడోకు - 99

	4		2					
			3		6	2		1
				4		7		
8					3	4		
7		2	8		4	1		6
		4	1					5
		6		3				
2		8	7		9			
					1		9	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 98 సమాధానం

సంతాన లేమికి 'హోమియో కేర్'



నేడు ఎక్కువ మంది దంపతులను వేధిస్తున్న సమస్య సంతానలేమి. ఈ సమస్యతో బాధపడుతున్నవారు మానసికంగా కుంగిపోతూ, తీవ్ర ఆందోళన చెందుతుంటారు. సంతానలేమికి కారణాలు స్త్రీలలో 33 శాతం, పురుషుల్లో 33 శాతం వరకూ ఉంటుంది. 20 శాతం ఎలాంటి కారణాలూ లేకుండా ఈ సమస్య తలెత్తుతుంది. దీన్ని 'ఇడియోపతిక్ ఇన్‌ఫెర్టిలిటీ' అంటారు. హోమియోపతి చికిత్స ద్వారా సంతానలేమి లోపాలను సరిదిద్దవచ్చు.

సంతానలేమిలో రెండు రకాలు...

1. ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ: స్త్రీలు వివాహానంతరం ఏడాది పాటు సాధారణ లైంగిక జీవితం గడిపినా గర్భం దాల్చకపోవడం.
2. సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ: ఒకసారి గర్భం దాల్చి, పిల్లలు కలిగిన, లేదా గర్భస్రావం జరిగిన తర్వాత సంతానం కలగకపోవడం.

పురుషుల్లో సంతానలేమికి కారణాలు

అజూస్పెర్మియా: శుక్ర కణాలు పూర్తి స్థాయిలో లేకపోవడం

అలిగోస్పెర్మియా: శుక్ర కణాలు తక్కువగా ఉత్పత్తి కావడం

అస్తినోస్పెర్మియా: శుక్రకణాలు ఉత్పత్తి అయినప్పటికీ వాటి కదలికలు సాధారణంగా లేకపోవడం

టెరటోస్పెర్మియా: శుక్ర కణాల నిర్మాణంలో లోపాలు

వెరికోసిల్: వృషణాలలో ఉండే రక్తనాళాలు వాపునకు గురి కావడం వల్ల శుక్రకణాల ఉత్పత్తి తగ్గడం

హైడ్రోసిల్: వృషణాలు ఉండే తిత్తిలో నీరు చేరడం

- వృషణాలు శోధనకు గురి కావడం, అధిక వేడి తగలడం, అంగస్తంభన లోపం, శీఘ్రస్కలనం వంటి లైంగిక సమస్యలు
- పిట్యూటరీ, థైరాయిడ్, టెస్టోస్టీరాన్ హార్మోన్ల అసమతుల్యత
- అధిక బరువు, మధుమేహం, పొగతాగడం, కొన్ని జన్యుపరమైన అంశాలు

స్త్రీలలో సంతానలేమికి కారణాలు

- గర్భసంచి చిన్నదిగా ఉండటం లేదా గర్భసంచి లేకపోవడం
- గర్భ సంచి నిర్మాణంలో లోపాలు, గర్భ సంచిలో కణతులు, ఎండోమెట్రియోసిస్
- ఫెలోపియన్ ట్యూబ్స్ లేకపోవడం, ట్యూబ్స్ మూసుకుపోవడం
- అండాశయంలో త్వరితగతిన అండం విడుదల విఫలం కావడం
- యోని చిన్నదిగా ఉండటం, యోని మార్గం మూసుకుపోవడం
- యోని మార్గంలో ఉండే మ్యూకస్ పొర శుక్ర కణాలు తిరగబడేలా ఉండటం
- యోని అధిక ఆమ్లగుణం కలిగి ఉండటం వల్ల శుక్ర కణాలు చనిపోవడం

హార్మోన్ సమస్యలు: హైపోథైరాయిడిజమ్, హైపర్ థైరాయిడిజమ్, పీసీఓడీ, ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ప్రొలాక్టిన్ హార్మోన్ల అసమతుల్యత వంటి అంశాన్నీ సంతానలేమికి కారణాలు.

నిర్ధారణ పరీక్షలు...

పురుషులకు: కంప్లీట్ సెమెన్ ఎనాలిసిస్, యూఎస్‌జీ అబ్డమిన్, స్క్రోటమ్, సీరమ్ టెస్టోస్టీరాన్, థైరాయిడ్ ప్రొఫైల్, ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, టెస్టిక్యులార్ బయాప్సీ, సీబీపీ, ఈఎస్ఆర్, సీయూఈ.

స్త్రీలకు: ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, సీరమ్ ప్రొలాక్టిన్, థైరాయిడ్ ప్రొఫైల్, యూఎస్‌జీ, అబ్డమిన్, హెచ్ఎస్‌జీ, లాప్రోస్కోపీ, ఫాలిక్యులార్ స్టడీ, సీబీపీ, ఈఎస్ఆర్, సీయూఈ.

హోమియోకేర్ ఇంటర్నేషనల్ వైద్యం:

'హోమియోకేర్ ఇంటర్నేషనల్'లో అందించే అధునాతన జెనెటిక్ కాన్‌స్టిట్యూషనల్ హోమియో వైద్య విధానం ద్వారా చాలా వరకు స్త్రీ, పురుషుల్లో కలిగే సంతానలేమి లోపాలను సరిచేయడం జరుగుతుంది. అత్యంత సమర్థవంతమైన ఈ చికిత్సలో భాగంగా రోగి మానసిక, శారీర లక్షణాలకు అనుగుణంగా వారికి మాత్రమే సరిపడిన చికిత్స అందించడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. తద్వారా సంతాన ప్రాప్తికి మార్గం సుగమం చేయడం జరుగుతుంది.

సోరియాసిస్‌కు హోమియోతో చెక్!

దీర్ఘకాలం పాటు బాధించే మొండి చర్మవ్యాధుల్లో సోరియాసిస్ ముఖ్యమైనది. ప్రపంచ వ్యాప్తంగా 125 మిలియన్ల మంది సోరియాసితో బాధపడుతున్నారని అంచనా. స్త్రీ, పురుష తేడా లేకుండా అందర్నీ బాధించే వ్యాధి సోరియాసిస్.

సోరియాసిస్ బాధితులు శారీరకంగా, మనసికంగా నలిగి పోతున్నారు. అయితే హోమియోపతి వైద్యవిధానం సూచించిన సంపూర్ణ శారీరక, మానసిక తత్వ శాస్త్రాన్ని అనుసరించి ఈ వ్యాధిని నిర్మూలించవచ్చు.

సోరియాసిస్ దీర్ఘకాలిక చర్మవ్యాధి. చర్మంపైన దురదతో కూడిన వెండిరంగు పొలుసులు, పొడలు కనిపిస్తాయి. ఇవి ఎర్రగా, వాపుతో ఉంటాయి. గోళ్ళ, తల, తదితర శారీరక భాగాలకు కూడా రావచ్చు. మొదట్లోమచ్చలు ఎర్రగా కమిలిపోయినట్లు కనిపించినా, సమయం గడిచే కొద్దీ ఈ మచ్చలపైన తెల్లని పొలుసులు మందంగా పేరుకుపోతాయి. పొలుసులను తొలగిస్తే అడుగున రక్తపు చారికలు కనిపిస్తాయి. అయితే చల్లటి వాతావరణం, ఇన్‌ఫెక్షన్లు, తీరుబడిగా ఉన్నప్పుడ దురద ఎక్కువవుతుంది. బాధితుల్లో 10-20 శాతం మందికి తీవ్రమయిన కీళ్లనొప్పులు కూడా ఉంటాయి.

అసలు ఈ వ్యాధి ఎలా వస్తుంది!

ఆరోగ్యవంతుల్లో చర్మం ఉపరితలం కింద కొత్త కణాలు నిరంతరమూ తయారవుతుంటాయి. సుమారు నెలరోజుల్లో ఇవి వెలుపలకు చేరుకుంటాయి. పొరగా ఏర్పడి క్రమంగా నిర్జీవమై ఊడిపోయి కింది కణాలను బహిర్గత పరుస్తాయి. సోరియాసిస్ వ్యాధిలో ఈ ప్రక్రియ అదుపు తప్పుతుంది చర్మపు కణాలు వేగంగా తయారై మూడు, నాలుగు రోజులకే వెలుపలకు చేరుకుంటాయి. అదనపు కణ సముదాయానికి పోషకతత్వాలను అందించే నిమిత్తం రక్తసరఫరా పెరుగుతుంది దీంతో చర్మంపైన ఎర్రని పొడ, పొలుసులు ఏర్పడతాయి.

ఎందుకు వస్తుంది?

వ్యాధి నిరోధక శక్తి వికటించి స్వయం ప్రేరితంగా మారటం వలన సోరియాసిస్ వస్తుందని పరిశోధనలు చెపుతున్నాయి. వైరస్, బ్యాక్టీరియాల దాడి నుంచి రక్షణ పొందటానికి ఏర్పరచిన అపశ్రుతులను సరి చేయటానికి మన శరీరంలో తెల్లరక్త కణాలు పనిచేస్తుంటాయి. ఇవి అవసరమైన ప్రాంతాలకు వెళ్లి ఇన్ఫెక్షన్లను తగ్గించటమే కాక గాయాలను మానేలా చేస్తాయి. దీనినే వ్యాధి నిరోధక శక్తి అంటున్నాం.

ఈ నేపథ్యంలో అనుబంధ అంశంగా ఇన్‌ఫ్లమేషన్(ఎరుపుదనం, వాపు) తయారవుతుంది. సోరియాసిస్‌లో ఈ వ్యాధి నిరోధక శక్తి శరీర కణజాలాన్ని అన్య పదార్థంగా అన్వయించుకొని, దాడి చేసి ఇన్‌ఫ్లమేషన్ కలిగిస్తుంది. ఫలితంగా చర్మకణాలు పెరిగే పొలుసులుగా తయారవుతాయి. అయితే వ్యాధి నిరోధక శక్తిలో ఈ మార్పులు జన్యుపరమైన కారణాలు, మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు వల్ల ఇలా జరుగుతుంది.



సోరియాసిస్ - రకాలు: సోరియాసిస్‌ను స్థూలంగా 1) సోరియాసిస్ వల్గారిన్ 2) గట్టేజ్ సోరియాసిస్ (గట్టా అంటే బిందువు) 3)పుస్టులార్ (పస్ అంటే చీము)4.) ఎరిత్రో డెర్మల్ సోరియాసిస్ (ఎరిత్రో అంటే ఎరుపు) గా వర్గీకరించారు.

చికిత్సా విధానం - హోమియోపతి దృక్పథం

ఏదైతే వ్యాధికి కారణమవుతుందో అదే చికిత్సకు ఉపయోగపడుతుందనే ప్రకృతి సహజ సిద్ధాంతంపై హోమియోపతి వైద్యవిధానం ఆధారపడి ఉంది.

ఒకే రకమయిన ప్రేరణ లేదా ప్రేరకానికి భిన్న వ్యక్తుల భిన్న భిన్న రకాలుగా స్పందిస్తారనే అస్తివాదంపైన హోమియోపతి ఆధారపడి ఉంది.

సోరియాసిస్ విషయంలో వెంటనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం ఉత్తమం. హోమియో వైద్య విధానంలో ప్రతి ఔషధం మానసిక లక్షణాలతో ముడిపడి ఉంటుంది. మానసిక - శారీరక తత్వాన్ని ఆధారంగా చేసుకుని మందులనూ సూచిస్తారు. అయితే చికిత్సా ఫలితాలు ఆహార వ్యవహార, ఔషధాల సమిష్టి ప్రయోగాన్ని బట్టీ, వ్యాధి ఉధృతిని బట్టి ఉంటాయి.

సోరియాసిస్‌కు సాధారణంగా ఆర్సెనికం ఆల్బం (శీతాకాలం ఎక్కువగును), సల్ఫర్, కాలిఆర్స్, సోరినమ్, మెజీరియం, పెట్రోలియం వంటి మందులను వాటి వాటి లక్షణాలనకనుగుణంగా వైద్యులు సూచిస్తుంటారు. అయితే ఇవి వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వాడాలి.

అమ్మాయి దొరికింది!


సల్మాన్‌ఖాన్


వరీనా

బాలీవుడ్‌లో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ ఎవరంటే టక్కున చెప్పే పేరు సల్మాన్‌ఖాన్. ఆయన ఓ ఇంటివాడు ఎప్పుడు అవుతాడోనని అభిమానులే కాదు, సినీ ప్రముఖులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్ అగ్రతారలు 'పెళ్లెప్పుడు చేసుకుంటావ్' అని సల్లూభాయ్‌ని ప్రశ్నించిన సందర్భాలూ ఎన్నో. ఉన్నట్టుండి ఆయన 'ముజే లడ్‌కీ మిల్‌గయీ' అని మంగళవారం ఉదయం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. దాంతో అభిమానులంతా ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యారు. సల్మాన్ పెళ్లి చేసుకోవడానికి అమ్మాయి దొరికిందని ఆనందం వ్యక్తం చేస్తూ మెసేజ్‌ల వర్షం కురిపించారు. అయితే ఆ ట్విట్ చేసిన కాసేపటికి ఆయన మరొక ట్విట్ చేశారు. 'కంగారు పడాల్సింది ఏమీ లేదు. నా నిర్మాణంలో మా బావమరిది అయుష్ శర్మ డెబ్యూ 'లవ్‌రాత్రి' సినిమాకు హీరోయిన్ దొరికింది. ఆమె పేరు వరీనా' అంటూ ఆమె ఫోటోను కూడా పోస్ట్ చేశారు. అది చూసిన వెంటనే ఈ ఏడాది కూడా సల్మాన్‌కు పెళ్లి భాగ్యం లేదనే అభిప్రాయానికి అభిమానులొచ్చారు. సల్మాన్ రొమేనియా మోడల్ లులియా వంతర్‌తో ప్రేమలో ఉన్నాడనీ, ఆమెనే వివాహం చేసుకుంటాడని గత కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. కానీ దానిపై సల్మాన్ ఎప్పుడూ స్పష్టత ఇవ్వలేదు. 'టైగర్ జిందా హై'తో హిట్ అందుకున్న సల్మాన్ 'రేస్ 3' సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు.





యాక్షన్ @ ముంబై



నాగార్జున కథానాయికుడిగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. మైరా సరీన్ కథానాయిక. ఇందులో నాగార్జున పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. ప్రస్తుతం ముంబైలో తాజా షెడ్యూల్ జరుగుతోంది. బాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ ఐజా షేక్ సారథ్యంలో నాగార్జున. అజయ్, సాయాజీషిండే కాంబినేషన్‌లో పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. అనంతరం ముంబైలోని ఎస్సెల్ వరల్డ్ ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో ఛేజ్ సన్నివేశాలను రూపొందించనున్నారు. మార్చి 10వ తేదీ వరకూ అక్కడ జరగబోయే షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలనూ తెరకెక్కిస్తారని చిత్ర యూనిట్ పేర్కొంది.



నేనంటే భయపడతారు

- లావణ్యా త్రిపాఠి

"నిజం చెప్పాలంటే.. హీరోయిన్లకు తమకు నచ్చిన కథలను ఎంపిక చేసుకునే వెసులుబాటు తక్కువే. మా దగ్గరకు ఎక్కువ కథలు రావు. పెద్ద చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయి కనుక చిన్న చిత్రాలు చేయడం లేదని కొందరు అంటున్నారు. విభిన్నమైన చిత్రాలు, చిన్న చిత్రాలు చేయడానికి నేను సిద్ధమే. ఈ ఏడాది మలయాళం, ఇతర భాషల్లో భిన్నమైన చిత్రాలు చేయాలనుకుంటున్నా" అన్నారు లావణ్యా త్రిపాఠి. సాయిధరమ్ తేజ్, లావణ్యా త్రిపాఠి జంటగా వీవీ వినాయక్ దర్శకత్వంలో సి. కల్యాణ్ నిర్మించిన 'ఇంటెలిజెంట్' శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా లావణ్య చెప్పిన విశేషాలు...

❖ మా సినిమా టైటిల్ 'ఇంటిలిజెంట్'. నిజ జీవితంలో నేను కొంచమే ఇంటిలిజెంట్. ఈ చిత్రంలో అమెరికా నుంచి తిరిగొచ్చిన అమ్మాయి సంధ్యగా నటించా. తను వ్యాపారంలో నాన్నకు సహాయం చేస్తుంటుంది. అందరిపై కాస్త అధికారం చలాయించే పాత్ర. నేను చేసిన గత చిత్రాల్లో పాత్రల కంటే లుక్స్ పరంగా, నటన పరంగా సంధ్య పాత్ర విభిన్నంగా ఉంటుంది. ఇప్పటివరకూ ఇటువంటి టిపికల్ కమర్షియల్ సిన్మా నేను చేయలేదు. "ప్రచార చిత్రాల్లో హీరోయిన్‌తో నాలుగేళ్లుగా మీ వెంటపడుతున్నానని హీరో చెబుతాడు. నిజ జీవితంలో ఎవరైనా మీవెంట పడ్డారా?' అనడిగితే.. "లేదు. నేనెప్పుడూ పని తప్ప వేరే విషయం గురించి మాట్లాడను. అందువల్ల, ప్రేమ విషయం నాతో మాట్లాడడానికి భయపడతారు" అని చెప్పారు.

❖ టైటిల్‌కి తగ్గట్టు కథ, హీరో పాత్ర చిత్రణ ఇంటిలిజెంట్‌గా ఉంటాయి. విలన్‌ను చాలా తెలివిగా దెబ్బ కొడతాడు. సాయిధరమ్ తేజ్ మంచి డ్యాన్సర్, యాక్టర్. మేమిద్దరం ఎక్కువగా నవ్వుతాం. మా టేస్టులు కొంచెం దగ్గరగా ఉండడంతో తెరపై కెమిస్ట్రీ బాగా కుదిరింది.

❖ 'ఛమకు ఛమకు ఛాం..' రీమిక్స్ గురించి చెప్పగానే భయపడ్డా. నేను చిరంజీవిగారికి, ఆయన డ్యాన్స్‌కి పెద్ద అభిమానిని. ఆయన స్టెప్పులను మేం మ్యాచ్ చేయలేమని తెలుసు. అందుకని, పాటను ఎంజాయ్ చేస్తూ మా స్టైల్‌లో చేశాం.

❖ తెలుగులో దర్శక నిర్మాతలతో నాకు ఎలాంటి సమస్యలు లేవు. నా వల్ల ఎవరూ ఇబ్బంది పడలేదు. తమిళంలో ఓ చిత్ర బృందంతో సమస్య రావడంతో ఆ చిత్రం నుంచి తప్పుకున్నా. నాపై వచ్చిన విమర్శల్లో నిజం లేదు. ప్రస్తుతం ఒక నెల రోజులు బ్రేక్ తీసుకోవాలనుకుంటున్నా. ఆ తర్వాత తదుపరి తెలుగు చిత్రాల గురించి ఆలోచిస్తా. రెండు మూడు తమిళ చిత్రాలు చేస్తున్నా.

'ఇంటిలిజెంట్' సినిమా ఆఫీసు వరకూ కారులో వచ్చిన లావణ్యా త్రిపాఠి, ఆఫీసు లోపలికి కొంచెం కుంటుకుంటూ వచ్చారు. కాలికి ఏమైంది? అనడిగితే... "మొన్న స్నేహితులతో కలిసి డిన్నర్‌కి వెళ్లాను. అక్కడ కాలు జారడం (స్లిప్ కావడం)తో చిన్న గాయమైంది. కాలు కొంచెం వాచింది!" అని చెప్పారు.

శ్రియకు పెళ్లట!



పదిహేడేళ్లగా అందం, అభినయంతో తనదైన శైలి ముద్రతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తోంది శ్రియశరన్. 35కు పైగా తెలుగు చిత్రాల్లో నటించిన ఆమె.. పరిశ్రమలో అడుగుపెట్టినప్పుడు ఎలా ఉందో ఇప్పటికీ అదే గ్లామర్‌ను మెయిన్‌టెన్ చేస్తోంది. చూడ్డానికి కాస్త శాంతంగా, గ్లామర్‌గా కనిపించినప్పటికీ చాలా యారోగెంట్ అమ్మాయి అని పరిశ్రమ జనాలు చెబుతుంటారు. శ్రియకు కోపం తెప్పించే ప్రశ్న ఒకటుంది. అదేంటనుకుంటున్నారా? 'పెళ్లెప్పుడు చేసుకుంటారు?' అని అడిగితే చాలు.. చెప్పలేనంత కోపం వచ్చేస్తుందామెకి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఇలాగే పెళ్లి ప్రస్తావన తీసుకొస్తే.. 'దట్స్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్' అని ఘాటుగా సమాధానమిచ్చింది. అంతగా కోప్పడిన ఆమె ఇప్పుడు పెళ్లి పీటలెక్కనుందట. రష్యన్ బాయ్‌ఫ్రెండ్‌తో త్వరలోనే దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టనుందనే వార్త సినీవర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. శ్రియ తల్లిదండ్రులు ఇప్పటికే ఆ యువకుడిని కలిసి చర్చలు జరిపారనీ, వీరి పెళ్లికి రాజస్థాన్ వేదికకానుందని వినిపిస్తోంది. ఇందులో వాస్తవమెంతో తెలియాలంటే శ్రియ స్పందించాల్సిందే!

హృతిక్ నహీ... ఆనంద్!


హృతిక్ రోషన్

...ఆనంద్‌కుమార్! లుక్ చూశారా? ఎంత రఫ్‌గా ఉందో! కానీ, అతని మనసు మాత్రం అంత రఫ్ కాదు. చాలా అంటే చాలా సాఫ్ట్! ఎంతంటే... ప్రతి ఏడాది 30మంది పేద విద్యార్థులకు ఉచితంగా ఐఐటీ-జేఈఈ ప్రవేశ పరీక్షలో సఫలీకృతులయ్యేలా శిక్షణ ఇచ్చేంత! గణిత మేధావి, 'సూపర్ 30' ప్రోగ్రామ్ సృష్టికర్త ఆనంద్‌కుమార్ జీవితం ఆధారంగా హిందీలో రూపొందుతోన్న చిత్రం 'సూపర్ 30'. ఇందులో హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆయనే ఈయన. అంటే... ఆనంద్‌కుమార్‌గా హృతిక్ లుక్ ఇదే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వారణాసిలో జరుగుతోంది. ఓ పక్క చిత్రీకరణ చేస్తూనే, మరోపక్క అభిమానులకు స్వీట్ సర్‌ప్రైజ్ ఇచ్చారు హృతిక్. చిత్రంలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. హృతిక్ ఛేంజోవర్‌కి ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. చిత్రీకరణ మొదలైనా ఈ చిత్రంలో హృతిక్ సరసన నటించబోయే కథానాయిక కోసం అన్వేషణ ఇంకా ఓ కొలిక్కి రాలేదు.




హీరోయిన్లకు ఖర్చులెక్కువ!

- రాధికా ఆప్టే

సినిమాలో నటించడానికో రేటు... షాప్ ఓపెనింగ్‌కి మరో రేటు... స్టేజ్ షోలకు ఇంకో రేటు... హీరోయిన్ల చేతిలో చిల్లి గవ్వ పడందే ఏ పనీ చేయరని కొందరు కామెంట్ చేస్తుంటారు. ఈ కామెంట్స్ రాధికా ఆప్టే దృష్టికి వెళ్లినట్టున్నాయి. "మేం చాలా ఎక్కువ డబ్బులు సంపాదించుకుంటామని ప్రేక్షకులు అనుకుంటారు. కానీ, మాకు (హీరోయిన్లకు) ఎన్ని ఖర్చులు ఉంటాయో? మా బాధలు ఏంటో? వాళ్లకు ఏం తెలుసు?" అని ప్రశ్నించారామె. హీరోయిన్‌గా ఉండడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని రాధిక చెబుతున్నారు. ఇంకా ఆమె మాట్లాడుతూ "మేం ఎక్కువ డబ్బులు సంపాదించడంతో పాటు ఎక్కువ డబ్బులు ఖర్చుపెట్టాలి కూడా! నలుగురిలోకీ వచ్చేటప్పుడు... మా లుక్స్ ఎలా ఉన్నాయో చూసుకోవాలి. మేకప్ చెక్ చేసుకోవాలి. మంచి మంచి డిజైనర్ డ్రస్సులు వేసుకోవాలి. ఫిట్‌నెస్‌గా ఉండడం కోసం ట్రయినర్స్‌ను పెట్టుకోవాలి. ఇంకా స్కిన్ పాడవకుండా కాపాడుకోవాలి! ఎన్ని పనులో... ఎన్ని ఖర్చులో... నటనలో ఇవన్నీ భాగమే. నటిగా కొనసాగాలంటే ఇవన్నీ చేయక తప్పదు" అని సెలవిచ్చారు. అదండీ సంగతి!!





పెళ్లంటే పేపర్ వర్క్ కాదు!

గోవా సుందరి ఇలియానాకు పెళ్లయిందా? లేదా? ప్రేక్షకులకు మాత్రమే కాదు... తెలుగు, హిందీ, తమిళ భాషల చలనచిత్ర ప్రముఖులకూ తెలీదు. నోరు తెరచి ఇలియానా చెప్పదు. అప్పుడప్పుడూ సోషల్ మీడియాలో బాయ్‌ఫ్రెండ్ ఆండ్రూ నీబోన్‌ని హజ్బెండ్ అని పేర్కొంటుంది. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అతి కీలకమైన అంశంలో సస్పెన్స్ మెంటైన్ చేస్తుందీ సుందరి. మంగళవారం హిందీ చిత్రం 'రైడ్' ప్రచార కార్యక్రమాల నిమిత్తం ముంబయ్ మీడియా ముందుకొచ్చిన సందర్భంలో ఈ సస్పెన్స్‌కి తెర దించాలనే ప్రయత్నాలు జరిగాయి. 'మీకు పెళ్లయిందా? లేదా?' అని నేరుగా ముంబయ్ మీడియా ప్రశ్నించింది. తను ఆ విషయంపై మాట్లాడదలుచుకోలేదని ఇలియానా చెప్పారు. అంతే కాదు... "నా వ్యక్తిగత విషయాలకు సంబంధించి కొన్నిటిని రహస్యంగా ఉంచాలనుకుంటా. వాటి గురించి ఎక్కువ మాట్లాడను. నా దృష్టిలో పెళ్లంటే పేపర్ వర్క్ కాదు. పెళ్లి, సహ జీవనం అనేవి లీగల్ అంశాలకు దూరమైనవి. నేను ప్రేమలో పూర్తిగా మునిగా" అన్నారు ఇలియానా.



ఇలియానా





